Om



శ్రీ విష్ణుభొట్ల సూర్యనారాయణ, సుందరలక్ష్మి

భాషా పాఠములు

\

విష్ణుభొట్ల సూర్యనారాయణ

భాషాపాఠములు

(ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీవారి ద్రవ్యసహాయమున ముద్రింపబడినది)

గ్రంథకర్త:
విష్ణుభొట్ల సూర్యనారాయణ,
వకీలు, గుంటూరు.

వేంకట్రామ అండ్ కో.,
విజయవాడ - మద్రాసు - హైదరాబాదు
1967

ప్రథమ ముద్రణము
1000 ప్రతులు
మార్చి, 1967

మూల్యము
రు 6-25

ముద్రణ:
వెంకట్రామ్ పవర్ ప్రెస్,
ఏలూరు.

తొలిపలుకు

నేను 1911-12 సంవత్సరములలో మద్రాసు విశ్వవిద్యాలయమున యం. ఏ. పరీక్షకు 6 వ బ్రాంచిగా తెనుగు - అరవము అను విషయమునగూర్చి చదువ ప్రయత్నించినపుడు భాషావిషయమునుగూర్చి చదువవలసిరాగా అప్పటికి వ్రాయబడినట్టి కొన్ని గ్రంథములను చదివి వాటి ననుసరించి కొన్ని నోట్సు వ్రాసికొని యుంటిని. అయితే నాకు 1912 లో జబ్బుచేసినందున కొంతకాలము చదువు మానవలసి వచ్చెను. తరువాత తిరిగి యం. ఏ. పరీక్షకు చదువలేకపోతిని. కాని భాషావిషయముల గురించి క్రొత్తవిషయములను అప్పుడప్పుడు చదివి నోట్సు వ్రాసికొనుచుంటినిగాని ఆ యా పుస్తకముల పేర్లనుగాని, రచయితల పేర్లనుగాని నేను జాగ్రత్తగా వ్రాసికొని యుండలేదు. ఇంతేకాక దినపత్రికలలో వ్యాసములయొక్కయు, వ్యాసకర్తల యొక్కయు వాదనలను అప్పుడప్పుడు చిన్నచిన్న కాగితములమీద సంక్షిప్తముగ వ్రాసికొని యుంటినిగాని ఆ యా దినపత్రికల పేర్లుగాని, రచయితల పేర్లుగాని, పత్రికల తేదీలనుగాని నే నెచటను వ్రాసికొని యుండలేదు. అవి నేను చదివినపుడు ఆ యా విషయములనుగూర్చి నే నొక పుస్తకమును వ్రాయవలెననిగాని, వ్రాయగలననికాని నే ననుకొని యుండకపోవుటయే కారణము. అందువలన నేను అట్టి గ్రంథములయొక్కగాని, రచయితలయొక్కగాని పేర్లు, రచింపబడిన వ్యాసముల పేర్లను విశదముగ కూర్చి యొక ప్రత్యేక జాబితాను తయారుచేయలేని గొప్పలోపము సంభవించెను. అందుకు నే నిపుడు చేయగల్గినదేమియు కనపడలేదు. అందువలన కల్గిన దోషమునకు నన్ను చదువరులు మన్నింతురుగాక యని ప్రార్థించుచున్నాను.

నేను ప్లీడరీవృత్తిని మానివైచి యిప్పటికి దాదాపు పదునారు సంవత్సరము లైనది. అప్పటినుండియు నాకు ఇతరవ్యాసంగములేక కల్గిన యవకాశమువలన మునుపు వ్రాసి యుంచుకొనిన నోట్సునుబట్టి యీ వ్యాసములను వ్రాయగల్గితిని. వ్రాసి నా మేనల్లుడు, హిందూకాలేజి ప్రిన్సిపాలైన కీర్తిశేషులు వల్లభజోశ్యుల సుబ్బారావుగారికి యీ యుపన్యాసములు చూచి సవరించిపెట్టుమని కోరితిని. వారు వీటిని చదివి తన స్నేహితులైన డాక్టరు భద్రిరాజు కృష్ణమూర్తిగారికి ఈ యుపన్యాసముల Synopsis నొకదానిని నాచేత ఇంగ్లీషుభాషలో తయారుచేయించి వారికి అభిప్రాయము నిమిత్తమై పంపియుండిరి. వారు ఆ Synopsis ను చదివి యీ క్రింది ప్రకారము తమఅభిప్రాయమును తెలియజేసి యుండిరి.

"Regarding the enclosures to your letter, I carefully read through the whole Synopsis of the work of Sri Vishnubhotla Suryanarayana. It no doubt gives a good idea of his erudition in Linguistics. The scope, of course, is rather too wide, including in its gamut, prehistoric archaeology, ethnology. history as well as philology and Linguistics; the part actually dealing with linguistics, historical and descriptive is meagre. The book however, when published, will be

of great use to linguists as a brief book of reference on the history of linguistics during the 19th and early 20th century."

ఈ పై అభిప్రాయమును చదివినప్పుడు నాకు కొంత ఉత్సాహము కలిగి యీ యుపన్యాసములను పుస్తకరూపకముగ నచ్చొత్తించవలయునని యూహ కలిగెను. అటుపిమ్మట మే నెల 1962 వ సంవత్సరమున నీ యుపన్యాసములను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీకి ధనసహాయము కోరను పంపియుంటిని. కొంతకాలము వారు ఈ యుపన్యాసముల తమవద్దనుంచుకొని 1963 వ సంవత్సరమున డైరెక్టరాఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షనుకు పంపుమని నాకు సలహానిచ్చిరి. అప్పుడు వీటిని వారికి పంపగా వారు వీటిని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ వారికే పంపుమనిరి. అందుమీద నీ ఉపన్యాసములను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీకే పంపియుంటిని. వారీ యుపన్యాసముల పరీక్షించి వీటిని పుస్తకరూపముగా ప్రచురించుటకు ఆరువందల రూపాయల ద్రవ్యసహాయము చేసియుండిరి. వారి ఔదార్యమునకు వారికి నా వందనముల నర్పించుచున్నాను.

ఇంతటితో నా కష్టమీ తీరలేదు. ఈ పుస్తకము నచ్చొత్తించుటకు అకాడెమీ వారిచ్చిన ద్రవ్యము చాలనందున శ్రీ వేంకట్రామ్ పవర్ ప్రెస్ యజమానులైన శ్రీ ఈదర వేంకట్రామయ్య పంతులుగారి నాశ్రయించగా వారచ్చొత్తించుటకు తత్క్షణమే అంగీకరించిరి. అందుకు వారికి నేనెంతయు కృతజ్ఞుడను. ఈ పుస్తకము నచ్చొత్తించుటలో నాకేలాటి శ్రమయును లేకుండ దీనిని అచ్చొత్తింపించిన పండితులు శ్రీ వేంకటాచార్యులవారికి నా వందనశతముల నర్పించుచున్నాను.

ఈ పుస్తకమును నేనచ్చొత్తింపగలుగుదునని యెన్నడును తలచియుండ లేదు. అయితే అట్టి శుభసమయ మిప్పటికి దైవవశమున కలిగినందుకు ఆనందించు చున్నాను. కాని యీ పుస్తకము అచ్చగుచున్న సమయమున నాకు నవంబరు 22 వ తేదీన భార్యా వియోగదుర్ఘటన సంప్రాప్తించినది. ఇంకేమియు నాచేత చేయజాలక యీ పుస్తకమును నాభార్యయగు కీ. శే. సుందరలక్ష్మికి జ్ఞాపకార్థమై అంకితము చేయు చున్నాను.

ఈ పుస్తకమునందు వ్రాయబడిన కొన్ని యంశములు పురాతనాభిప్రాయములై యున్నవి. ఆంధ్రము సంస్కృత జనితమా, ద్రావిడభాషా జనితమా యను విషయమె యిప్పటికిని పరిశోధన చేయవలసిన యంశమని నాఅభిప్రాయము. కాని యిప్పుడీ విషయమునందు పరిశోధన చేయవలసిన అవసరమే లేదనెడువా రనేకు లున్నందున నా యభిప్రాయము కేవల పురాతనాభిప్రాయముగనే యుండవచ్చును. ఇందు ఇంక ననేకలోపము లుండవచ్చును. అట్టిలోపములను చదువరులు నాకు తెల్పినచో వాటిని సవరించుకొందును.

ఇట్లు,
విధేయుడు,
విష్ణుభొట్ల సూర్యనారాయణ

గుంటూరు,
15—3—67

అనుక్రమణిక

అంకితము

పందొమ్మిదవ శతాబ్ది ఉత్తరార్ధమున బందరులో శ్రీ చిట్టా శేషాచలం - కామేశ్వరమ్మ దంపతుల కూరిమి పట్టియై, 8-వ యేట విష్ణుభొట్ల వంశీయుడనైన నన్ను పరిణయమాడి 1913 నుండి యేబది మూడేండ్లు నన్ను మిక్కిలి అన్యోన్యతతో ఆదరించి యీ పరాభవ సంవత్సర కార్తికమున సువాసినీలోక మలంకరించిన

నా భార్య

సుందరలక్ష్మికి

ఈ గ్రంథమును స్మృతిచిహ్నముగా అంకితము చేయుచున్నాను.

—విష్ణుభొట్ల సూర్యనారాయణ



కీ. శే. విష్ణుభొట్ల సుందరలక్ష్మి

భాషా పాఠములు

మొదటి ఉపన్యాసము

భాష; దాని ఉత్పత్తి

మనమందరము మానవులమనియు, మానవజాతికి జెందినవారమనియు చెప్పుకొనుచున్నాము. మానవులమనగా, మననశక్తి గలవారమని చెప్పనగును. "మనన" మను పదము "మన్" "జ్ఞానే" ఆలోచించుట యను ధాతువునుండి జనించినది. మానవులమనగా జ్ఞానము గలవారమని యర్థము. ఈ జ్ఞానమే మనలను జీవకోటియందు గొప్పగా చేయుచున్నది. ఈ ఆధిక్యతయే మన మనసులోనున్న విషయమును ఇతర మానవకోటిలోని వ్యక్తులకు వ్యక్తపరచుటకు, వ్యక్తపరచుకొనుటకు వీలు కలుగ జేయుచున్నది. మనకుగల యీ మాటయే మనలను ఇతర జంతుకోటినుండి విడదీయుచున్నది.

2. ప్రపంచమున జనించిన ఇతర జంతువులకును, మనుష్యునకు ననేక భేదములు కలవు. అందులో సింహమునకు గల్గిన బలమును, ఆకాశమున విహరించుచున్న గరుడపక్షి సూక్ష్మదృష్టియు, ఆకాశమున నెగురగల పక్షుల శక్తియు, కుక్కలకుగల విశ్వాసమును మానవులకు లేవని చింత నొందవలసిన విషయము లేగాని మనుష్యులకు మాట్లాడగల్గిన ప్రభావము పైన చెప్పబడిన గుణము లన్నిటికి మించినదై యున్నది. పక్షి లెగురుటకు స్వాభావికముగ వాటి అవయవములలో నేర్పాటులున్నట్లు మనుష్యునకు మాట్లాడు శక్తి సహజముగనే యేర్పరుపబడినది. జంతువులకు మనుజులవలెనే స్పర్శ, చూపు, జ్ఞాపకశక్తి, మనోధైర్యము, జ్ఞానము సహజముగ నివ్వబడెను. అయితే మనుజులకువలె ఆలోచనశక్తి జంతువుల కివ్వబడినట్లు కను

పడదు. మనుజులకువలెనే జంతువులకు జీవాత్మ గలదా యను ప్రశ్నను గురించి తత్వజ్ఞులయందు భేదాభిప్రాయము కనుపడుచున్నది. కాని జంతువులకును సుఖదుఃఖములు, బాధ సంతోషములు, ఆగ్రహ నిగ్రహములు సహజముగనే కలవు. పిల్లలు జనించినంతనే తల్లిపాల నెట్లు త్రాగెదరో జంతువులును పుట్టినంతనే పాలను త్రాగును.

3. సుఖదుఃఖముల బహిర్గతము జేయుటకు అనేక మార్గములు గలవు. ముఖవికాసమువలన సుఖమును, ముఖవికారమువలన దుఃఖమును మనము బహిర్గతము చేయుచున్నాము. ఇట్లేగాక కొన్ని ధ్వనులవలనను మనము సుఖదుఃఖములను వ్యక్తపరచుచున్నాము. ఇట్లే జంతువులున్ను వ్యక్తపరచుచున్నవి. ఈ ధ్వనులు కొన్ని జంతువులయందు బొమికెల రాపిడివలనను, మరికొన్నిటియందు ఊపిరితిత్తులనుండి వచ్చెడి ఉచ్ఛ్వాస నిశ్వాసముల వలనను కలుగుచున్నవి. ఈ ఉచ్ఛ్వాస నిశ్వాసములు నాసికనుండి బయలుపడుచున్నవి. ఈ నాసికాంతర్గత వాయువు లోపలినుండి వచ్చునపుడుగాని, బయటనుండి లోపలికి గాలి పోవునపుడుగాని దానికి కలుగు నిరోధక నిర్బంధములవలన ననేక రూపములుగ మారుచున్నది. అట్టి మార్పులలో గల్గిన యొకానొక రూపమే యీ భాష. ఈ భాషయే జంతుకోటినుండి మనలను విడదీయుచున్నది.

4. మనసులోనున్న భావమును చుట్టుప్రక్కలనున్నవారికి బహిర్గతముచేయుటకు ప్రథమసోపానము ముఖవికాసము, అంగవిక్షేపణమునై యున్నవి. ఈ భావములను గ్రహించుటకు ఎక్కువ జాగ్రత్తతో కనిపెట్టుకొని యుండవలయును. ఈ లోపమును పోగొట్టునది ధ్వనిరూపకమగు భావవ్యంజనము. ఈ ధ్వని కొంతవ్యక్తమైనది, మరికొంత అవ్యక్తమైనది. వ్యక్తమగు ధ్వనివలననే మనమనోభావము నితరులకు వ్యక్తపరచుచున్నాము. ఇదియే భాషకు మూలాధారము.

భాషసంపాద్యమేగాని స్వతస్సిద్ధము గాదు

5. ఈ భాష మానవునకు సంపాద్యమేగాని స్వతస్సిద్ధము గాదు. పుట్టినపిల్లలకు భాషలేదు. వారికవసరమగునప్పుడు తమకేద్దియో యవసరమున్నట్లు వారుచేయురోదనమువలన మనకువ్యక్తపడుచున్నది. ఈ రోదనమునుబట్టియే తల్లులు పిల్లలయవసరముల కనుగొని వాటిని సమకూర్చెదరు. ఈ పిల్లలుపెరుగుచు తమచుట్టుపట్లనున్న ధ్వనుల పరిచయమువలన భాషను మెల్లిమెల్లిగా నేర్చుకొందురు. ఇంతేగాని మాటలు స్వతస్సిద్ధముగ రాజాలవు. పుట్టినపిల్లలకు పుట్టినట్లు మానవ భాషాసంపర్కములేకనే ఒకఅడవిలోదింపిన పిల్లలు పెద్దలగువరకు చుట్టుప్రక్కల పరిచయముగల ధ్వనులనే యనుకరించుదురేగాని మరి యేభాషను మాట్లాడజాలరు. దీనిని ప్రత్యక్షముగ కొందరు సంస్కర్తలు పరీక్షించిరి. ఇట్టి పరీక్షలు చరిత్రకు తెలిసినంతవరకు నాల్గుమారులు జరుపబడినట్లును, నాల్గుమారులు కనుపడిన ఫలితముల వలన పైసిద్ధాంతమే ధ్రువపడినట్లును తెలియగలదు. ఈజిప్టుదేశపు రాజగు "శామిట్టికస్"అనువారు ముగ్గురుపిల్లలను గొల్లవాండ్రకప్పగించి మనుష్యులమాటలు వినబడనిచోట వారినుంచి తామున్న మాట్లాడకుండ పెంచవలయునని వారి కనుజ్ఞనీయగా వారట్లే పెంచినట్లును, ఆ పిల్లలు పెద్దవారైనపిదప వారి కెట్టిభాషయు నలవడలేదనియు తెలియవచ్చుచున్నది. కాని కొందరీవిషయమును వ్రాయుటలో నొక పిల్లవాడు "రొట్టె" యనుమాటకు సరియైనపదము నొకదాని నుచ్చరించినట్లును, ఆమాట ఫిర్జియను భాషాపదమైనట్లును కొందరు చెప్పెదురుగాని దీనియందు నిజ మెంతమాత్రము లేదని తెలియుచున్నది. ఇంకొకమారు స్వేభియనురాజగు ఫ్రెడరిక్ II ఇట్లే కొందరుపిల్లల నడవికి పెంచుటకు పంపినట్లును, వారి కెట్టిభాషయు నలవడలేదనియు చెప్పెదురు. స్కాట్లండుదేశపురాజైన నాల్గవజేమ్సున్ను హిందూదేశమున మొగలయిచక్రవర్తియగు అక్బరుపాదుషాయు నిట్టిపరీక్షలే గావించిరికాని పిల్లలకెట్టిభాషయు నలవడియుండలేదు. మీదుమిక్కిలి

చుట్టుప్రక్కలనున్న జంతుజాలముయొక్క కూతలుమాత్రమే యలవడి యున్నట్లున్ను తెలియుచున్నది. దీనినిబట్టి మనకు తెలియవచ్చిన దేమనగా పిల్లలు భాషను సృష్టింపజాలరనియు, దానిని మాటలాడుట కవసరమగు నవయవములున్నందున తమచుట్టు మాట్లాడబడు భాషను మాత్రమే నేర్చుకొందురనియు కనబడుచున్నది. ఇది మనయనుభవమునుబట్టియు మనము కనుగొనగలము. మనము పిల్లలతో సహా పరాయిదేశమునకు వెళ్ళినచో మన యాంధ్రదేశపు పిల్లలకును ఆ దేశమున మాట్లాడబడు భాషయే యలవడునుగాని మన ఆంధ్రభాష అలవడదు. మనభాష పిల్లలకు రావలయునన్నచో మనమింటివద్దనైనను మనభాషను మాట్లాడుచుండవలయును. ఇందువలన, భాష సాధనమువలననే పట్టుబడునుగాని స్వతస్సిద్ధముగ సంభవించునదికాదు.

భాష యెల్లప్పుడు మారుచుండును

6. భాష యెల్లప్పుడు మారుచున్నట్లే కనబడుచున్నది. ఇట్టిమార్పు మానవులచే కల్పింపబడుచున్నది. అయితే యిట్టిమార్పు ఏయొక్క వ్యక్తివలనగాని, ఒక శాసనమువలనగాని కల్పింపబడుట లేదు. వ్యక్తులే మార్పునకు కారణభూతులైనను యేవ్యక్తికిన్ని యీ ప్రత్యేకత లేదు. మార్పు సంఘముచే నంగీకరింపబడిన పిమ్మటనే వాడుకయందు నిల్చుచున్నది. భాషలో నిట్టి మార్పులు కల్గుట కనేక కారణములు కన్పట్టుచున్నవి. అట్టి కారణములలో కొన్నిటి నిచట నిరూపించుచున్నాను.

1. అనుకరణము.
2. స్పష్ట ప్రతిపాదనేచ్ఛ. ఉదాహరణము "క్షామ" యనుటకు బదులు "క్షమ" యనియు, "స్వర్ణ" యనుటకు బదులు "సువర్ణ" యనుటయు.
3. అలసత, లేక లఘూకరణేచ్ఛ.

4. వర్ణసమీకరణము.
5. వర్ణపరివృత్తి "వారణాసి" "బెనారసు" గను, "మహారాష్ట్ర" "మహారట" గను "మరాట" గను మారుట.
6. వర్ణలోపము.

7. "ఇరామ" "లోకము" "ఉలగము" "రామ" ఇట్టి మార్పులు కొన్ని వాడుకలోని ఉచ్చారణ భేదములవలన కలుగుచున్నవి. వీటికే భాషాశాస్త్రజ్ఞులు "ఫోనెటిక్ డికే" యనియు, "డయలెక్టిక్ రీజనరేష"ననియు పేరులిడిరి. ('Phonetic Decay' 'Dialectic Regeneration') సంస్కృతమునందలి "వింశతి" లాటిను "విజంతి" ఇంగ్లీషు "ట్వంటి"యు ఒకటే అర్థము కల్గినవి. ఈ మూటిలో ఇంగ్లీషు పదము వేరుగ నున్నది. ఇంగ్లీషు పదము "ట్వంటి" గాథికు పదము ట్వే. టిగ్ ఫస్ నుండి ఆంగ్లశాక్సనుభాషలో "ట్వేట్విగ్"గా మారి ఇంగ్లీషులో "ట్వంటి"గా మారినది. ఈమార్పును "డయలెక్టిక్ రీజనరేష"నని అందురు. సంస్కృత లాటిను పదములు మాత్రము "వి" తో ప్రారంభమగుచున్నవి. ఈ "వి" యను నక్షరము సంస్కృతపదమైన "ద్వి" యను సంయుక్తాక్షరమునుండి వచ్చియున్నది. సంయుక్తాక్షరము ఉచ్చారణ సులభతకై "ద్వి" లోని "ద" లోపించి "వి" అయినది. "ద్విస్" అను సంస్కృతపదము "ట్వైస"ను నింగ్లీషుపదమే యైయున్నది. ఇదే లాటినుభాషలో "బిస్" అగుచున్నది. "వింశతి" "విజంతి" లోని రెండవపదమగు "శతి" "జంతి" పదములు సంస్కృతపదమగు "దశ" లేక "దశతి" లో నుండి వచ్చినవి. అయితే "ద" యను నక్షరము లోపించి "న" యను నక్షరము క్రొత్తగా వచ్చినది. ఇందువలన "వింశతి" "విజంతి" యను పదము లుద్భవిల్లినవి. "మూడు"+"పది" అను రెండు పదములు కలిసి తెలుగున "ముప్పది" యైనది. ఇది ఫోనెటిక్ డికేకు ఉదాహరణము. ఇట్లే "స్వసృ" (సం) "సిస్టర్" (ఇం) గను.

"దుహితర్" (సం) "డాటరు" (ఇం) గను "పితర్" (సం) ఫాదర్ (ఇం) గను మారినవి. "పా" "ఫా" గా మారినది. "పైర్" "ఫైర్".

భాష : ఉత్పత్తి

7. భాష యెప్పుడు ఎట్లు పుట్టినది, దీనికి మొదలెట్టిది ఎవరిచే ప్రారంభింపబడినది, ఎవరిచే ననుకరింపబడినది, ఎట్లు సంఘమున కలవడినది, శబ్దమునకును అర్థమునకును గల సంబంధమెట్టిది, భాష యందు మాటలప్పటప్పట గల్గుచున్నవా, వీటికి కారణమెట్టిది, అను మొదలయిన ప్రశ్నలు ప్రతిదేశమునందును ఎప్పుడో యొకప్పుడు ఆలోచింపబడినవే. ప్రథమమున నీ విషయమునుగూర్చి చర్చించిన వారందరు వేదాంతులు. తరువాత భాషాశాస్త్రజ్ఞులు. అనేకు లీ ప్రశ్నల కుచితములగు సమాధానములిచ్చుటకు బహుప్రయత్నములు గావించిరి. ఇట్లాలోచించి, అప్పటి కప్పుడు తమకు సమంజసమని తోచిన సమాధానముల నిచ్చియుండిరి. అయితే యిందువిషయమయి చారిత్రకముగ నీ ప్రశ్నల కెట్టి సమాధానముల నిచ్చుటకు సాధ్య పడదు. మనుష్యులు మాట్లాడుట ప్రారంభించిన పిదపనే కొంతకాలము నకు చరిత్ర ప్రారంభించినది. అందువలన అంతకుముందు చరిత్ర యుండ జాలదు. ప్రథమ సృష్టి యెట్లు జరిగినది, భాష యెట్లుత్పన్నమైనది యను రెండు ప్రశ్నలు ఆలోచింపబడినవిగాని తత్త్వజ్ఞులెవ్వరును వీటికి సరియైన సమాధానముల నిచ్చియుండనులేదు. ఈ ప్రశ్నలకు వ్యక్తులెట్టి సమాధానములు జెప్పుటకు యత్నించినను ఈ రెండు ప్రశ్నల కింత వరకు సరియైనసమాధానములు లేవనియే మనమూహింపవలసియున్నది. ఇంతవరకు చెప్పబడిన సమాధానములలో "లాక"ను (Locke) తత్వ శాస్త్రజ్ఞునిచే చెప్పబడి, "ఆడంస్మిత్త"ను నింకొక వేదాంతిచే తన భాషోత్పత్తి వ్యాసమున. చెప్పబడిన సమాధానమే జనాంగీకృతము పొందియున్నది. ఈ అభిప్రాయమునే యిచట పొందుపరచుచున్నాను.

8. మానవులు కొంతకాలము మూగవారుగనేయుండి కేవలము ఇంగితములవలనను, ముఖవికాసవికారములవలనను భావము లను గ్రహించుచుండిరి. కొంతకాలమున కీ యింగితములవలనను, ముఖ వికాసవికారములవలనను తమయందుద్భవించుచున్న అభిప్రాయములను తిప్పిచెప్పజాలక అందరును కలసి ఆలోచించి యేదియో యేర్పాటు లను గావించుకొని తామందరు ఏకీభవించి శబ్దముల కర్థములు నిర్ణయించుకొనిరి. కొందరుపండితులు మాత్రము భాష కేవల మీశ్వర ప్రసాదమనియు, మరికొందరు మానవకల్పితమనియు, మరికొందరు అనుకరణమువలన కలిగినదనియు ఎవరికితోచినట్లు వా రూహాగానము చేసియుండిరి.

అనుకరణము - "బౌవౌ" వాదము

9. ప్రథమమున మానవుడు మూగస్థితియందున్నప్పుడు చుట్టుప్రక్కలనున్న జంతు పక్షిజాలముల యొక్క అరపులను, కూత లను వినియుండి వాటినే తాము అనుకరించియుండిరనియు, నాయా ధ్వనులే ఆయా జంతువులకు నామములుగ నేర్పరచియుండిరనియు, వాటినుండియే భాషఏర్పడియుండెననియు నొకవాదమును "హార్డ"రను పండితుడు ప్రారంభించెను. ఇందు కుదాహరణముగ నొక చక్కని కథ చెప్పబడుచున్నది. ఒకప్పుడు చైనాభాష తెలియని ఇంగ్లీషు బాటసారి యొకరు చైనాదేశమునకు వెళ్ళిరనియు, నాతనికి భోజన సమయమున నొక పళ్ళెరమునం దొక తినువస్తు వుంచబడెననియు, ఈ బాటసారి యీతినువస్తువునందలి మాంస మే జంతువుదో తెలియక అచటనున్న ఇంగ్లీషుభాష తెలియని చైనాదేశస్థుని పిలిచి మాంస మేజంతువుదని యడుగుటకు భాషరానందున "క్వాక్ క్వాకా" యని ప్రశ్నించెను. అందుపైన ఇంగ్లీషుభాష తెలియని చైనాదేశస్థుడు "బౌవౌ" అని జవాబు చెప్పెను. దీనివలన ఇంగ్లీషు బాటసారి కీ మాంసము కుక్కమాంసమనియు, బాతుమాంసముకాదనియు తెలియ

వచ్చెను. ధాతువూలతనుబట్టి "క్వాక్ క్వాకా" యని యడుగగా కుక్క కూతనుబట్టి చైనాదేశస్థుడు "బౌవౌ" యని జవాబుచెప్పెను. ఒకరి భాష యింకొకరికి తెలియకున్నను, వీరిద్దరు మాట్లాడుకొనకున్నను ఒకరి అభిప్రాయము నింకొకరు చక్కగా గ్రహించగల్గిరి. అందువలన నీ వాదమును "బౌవౌ" వాద మనిరి. దీనిని "మాక్సుమూలరు" పండితుడు ఇదే పేరున పిల్చిరి. కొంతకాల మీవాదము భాషాపండితులచే కొనియాడబడెను. ఈ వాదమును కనిపెట్టిన హార్డరు పండితునకు తగు మర్యాదలు గావించి జనులు సన్మానించిరి. బర్లిను ప్రభుత్వము వారున్ను వీరిని తగురీతిని గౌరవించి బహూకరించిరి. అయితే కొద్ది కాలమునకే యీ వాద మంత బలీయమైనదికాదని కనుగొనబడి పండితులచే నాదరింపబడక వదలివేయబడినది. ప్రతి భాషయందు నిట్టి పదములు కొన్ని యుండవచ్చునుగాని భాషయంతయు నిట్లే జనించిన దని చెప్పుటకు వీలులేదని గ్రహింపబడినది. అదియునుగాక కుక్కను "కుక్క" యనుచున్నాముగాని "బౌవౌ" అని పిలుచుటలేదు. హార్డరు పండితుడును తన వాదనయందలి బలహీనతను గ్రహించి తన వాదనను వదలివేసెను. అయితే భాషలయం దనుకరణవలన కల్గిన భాషాపదములు అనేకములు కనుపడుచునేయున్నవి.

ఉదా :

ఇంగ్లీషు	సంస్కృతము	గ్రీకు
కక్కు	కోకిల	కాకిక్సు
కాక్	కుక్కుటము	
క్రో	కారవ	

ఇది "రు" యను ధాతువునుండి గాని, "క్రూ"యను ధాతువునుండి గాని వచ్చియుండ వచ్చును. క్రూ-క్రవ-కర్వ-కరవ-కారవ.

"పూ" "పూ" వాదన

10. మనము మాటలాడునపుడు కలిగెడి భావముల కను గుణములగు ఉశ్వాస నిశ్వాసములయందలి కలిగెడి మార్పులవలన శబ్దతంత్రులకు కలిగెడి అవరోధ నిరోధములే భాషాపదములుగ మారు ననియు కొందరు భాషాపండితు లభిప్రాయపడిరి. సంతోషమువలన కలిగెడి "అహహ" అను శబ్దమును బాధవలన కల్గెడి "అబ్బ" "అయ్యో" అను పదములు సంతోషమును, బాధను ఎట్లు వ్యక్తపరచుచున్నవో అట్లే ప్రతిపనికి ఒక్కొక్క రూపమున పదము లేర్పడు ననియు,అవియే భాషాపదములాయెననియు కొందరూహించుచున్నారు. ఈ వాదమును భాషాశాస్త్రజ్ఞులు "పూ పూ" వాద మనిరి. ఈ వాదమునందును స్వారస్య మేమియును లేదని గ్రహించిన పిమ్మట కొద్దికాలమునకే వదలివేయబడినది.

"డింగ్ డాంగ్" వాదన

11. ఇది యిట్లుండ మరికొందరు భాషావాదులు శబ్దము నకు, దానియొక్క అర్థమునకు ఒక విధమైన అంతరంగిక సంబంధము **(Mystic)** కలదని ప్రపంచమున ప్రతివస్తువును తాకినంతనే అది యొక ధ్వనిని కలుగజేయుననియు, అట్లే ఒక వస్తువు కంటికి కనుపడి నంతనే మన మనసునం దొక అభిప్రాయము కలుగుననియు, దానివలన భాష జనించుననియు ఇంకొక వాదము బయలుదేరదీయబడెను. ఈ వాదమును భాషాశాస్త్రజ్ఞులు "డింగ్ డాంగ్" వాదమని పిలిచిరి. దీనినిగూర్చియు కొంత చర్చించినపిదప నీ వాదమున బలమేమియు లేదని గ్రహించి వారే వదలివేసియుండిరి.

12. ఇట్లే భాషాకోవిదులు అనేకవిధములుగ నాలోచించి, చర్చించి ఎవరికి తోచినరీతిని వారొకవాదమును బయలుదేరదీసిరి. కాని యీ వాదములన్నియు సహేతుకములైనవి కావని, సర్వులు

అంగీకరింప దగినవి గాని, నిక్కముగ భాషోత్పత్తి కారణములుగగాని కన్పించియుండలేదనియు అభిప్రాయపడిరి. అందుచేత నావాదముల నన్నిటిని వదలివేసియుండిరి. గొప్ప తత్త్వశాస్త్రజ్ఞులగు ఆడం స్మిత్తు పండితుడు, లెబినిజు పండితుడు భాషోత్పత్తినిగూర్చి తీవ్రముగచర్చించి విరుద్ధములైనట్టి అభిప్రాయముల నిచ్చిరి. వారివారి అభిప్రాయములకు ప్రత్యేకకారణము లుండవచ్చునుగాని నిశ్చయముగ భాషోత్పత్తిని నిర్ణయించుటకు ఉపయోగకరములుగ నుండలేదు.

భాష - హిందూదేశము : వ్యాకరణములు

13. మనదేశమున "వాక్కు" దేవతగా భావింపబడినది. భాష ప్రథమమున దేవతలకు మాత్రమే తెలిసియుండెననియు, మానవులకు తెలియకుండ దాచిపెట్టబడినదనియు చెప్పుదురు, భాష గోరూపమనియు చెప్పబడెను. భాషాపతియే "బృహస్పతి" లేక "వాచస్పతి"యని వేదమున పదియవ మండలమున నూటయిరువది యైదవ ఋక్కునందు చెప్పబడెను.

14. హిందూదేశమున పండితులు భాషనుగురించి చక్కగ విమర్శించిరి. భాషావిమర్శగ్రంథములే వ్యాకరణములు. క్రీస్తుకు పూర్వ మనేక శతాబ్దముల క్రిందనే యీవ్యాకరణములు వ్రాయబడెను. ఈ వ్యాకరణమునే సంహితయనిరి. సంహితయనగా "కూర్చబడినది" యని యర్థము. ప్రథమమున నీ వ్యాకరణము తొమ్మండుగురు ఋషులచే రచింపబడెనని చెప్పుదురుగాని అందు కెట్టి నిదర్శనము లున్నూ కానరావు. సర్వాధికారియగు పరమేశ్వరుడు తానుపదేశించు శబ్దబ్రహ్మమును నిత్యమని తెల్పుటకు శబ్దాత్మకమగు డమరుకమును తనచేతబట్టి మ్రోగించెను. ఆ ధ్వనియందు పదునాల్గు సూత్రములు గలిగెను. అవియే మాహేశ్వరము లనబడియెను. ఈ పదునాల్గుసూత్రములకును నందికేశ్వరుడువృత్తినొనర్చెను. శబ్దశాస్త్రమును బృహస్పతి దేవేంద్రుని కెరింగింప, నాత డొక వ్యాకరణమును రచించెనని పతంజలి

తన వ్యాకరణభాష్యమున వ్రాసియుండెను. ప్రథమమున దేవేంద్ర వ్యాకరణము, శాకటాయన వ్యాకరణము, సారస్వత వ్యాకరణమనునవి మూడువ్యాకరణము లుండెనని చెప్పుదురు. కాని మనకు లభించినది పాణినీయ వ్యాకరణ మొక్కటియే. పాణిని పణినర్షిపుత్రుడు. తల్లి దాక్షీదేవి. ఇంద్రునియొక్క అంశమున జన్మించి ఇంద్రవ్యాకరణము నుద్ధరించెనని చెప్పబడెను. వ్యాకరణమును సూత్రములుగ రచించెను. ఈ పాణిని రావీనదీతీరముననున్న శాలాతురమున జన్మించెను. ఈ శాలాతురమునే వరుణపురమనియు నందురు. ఈ పురము అట్టాకు జిల్లాలోనున్నది. ఈపురము నిపుడు "ఆరో్మ"సని యందురు. ఈతని కాలనిర్ణయమున భేదాభిప్రాయము హెచ్చుగ నుండెను. రాజేశ్వర కాంత గుప్త యను పండితుడు పాణిని క్రీస్తుకుపూర్వము తొమ్మిదవ శతాబ్దికాలపునాటి వాడనియు, మాక్సుమూలరు క్రీస్తుకుపూర్వము నాల్గవశతాబ్దివాడనియు జెప్పుదురు. భండార్కరు పండితుడు ఈతను క్రీస్తుకుపూర్వ మేడవశతాబ్దివాడనియు చెప్పియుండెను. ఈ పాణిని వ్యాకరణమునకు భాష్యమువ్రాసిన కాత్యాయనుడను నామాంతరము గల్గిన వరరుచికి పూర్వపువాడనియే గట్టినమ్మకముగలదు. ఈ వరరుచి మగధసామ్రాజ్యాధిపతివద్ద మంత్రిగ నుండెను. ప్రాకృత వ్యాకరణము వ్రాసిన వరరుచి యీతడు కాడు. వా రింకొకరు.

యాస్కాచార్యుడు - నిరుక్తము

15. నిరుక్తమనునది యొక వేదాంగము. నిర్వచనమని దీని అర్థము. వ్యాకరణమువలన సాధించలేనట్టి వ్యుత్పత్తులుగల శబ్దములను సంప్రదాయముల ననుసరించి వివరించి నిష్కర్షగ చెప్పుట యని భావము. ఈ నిరుక్తము యాస్కఋషిచే పరిగణింపబడినది. దీనికి మార్గదర్శి శాకపాణి. శాకపాణి వేదమునందలి బ్రాహ్మణమున నుడువబడిన శబ్దనిర్వచనమే ఆధారముగ గైకొని నిర్వచన శాస్త్రము నంతకుపూర్వమే తయారుచేసియుండెను. తరువాత యాస్కాచార్యుడు

నిరుక్తమును వ్రాసెను. కాశ్యపునిచే వ్రాయబడిన వేదనిఘంటువున కిది భాష్యము. ఇందు ప్రథమమున పంద్రెండధ్యాయములు మాత్రమే కలవు. వీటితోబాటు పరిశిష్టాధ్యాయములు రెండు కలుపబడినవి. వీనికి భాష్యగ్రంథములు కొన్ని గలవు. అందులో ముఖ్యములైనవి దుర్గాచార్యకృత ఋజువ్యాఖ్య, దేవరాజ యజ్వకృతమగు ఇంకొక వ్యాఖ్యయు. ఈ యాస్కాచార్యుడు పాణిని కంటె ముందటివాడు. వీరు తమ నిరుక్తగ్రంథమునందు భాషోత్పత్తి క్రమమునుగూర్చి నిశితముగ విమర్శించెను. ఇట్లు విమర్శించి భాషకు మూలము ధాతువులే యని స్పష్టీకరించిరి. ధ్వన్యనుకరణమువలన కొన్ని భాషాపదము లేర్పడినను భాషకు మూలము ధాతువులేయని యాస్కాచార్యునియొక్క అభిప్రాయమై యుండెను. యాస్కాచార్యునికి పూర్వమే కాత్యాయనుడనువారు తన "ప్రాతిశాఖ్య" మను గ్రంథమున భాషకు మూలము ధాతువులే యను వాదమును బయల్పరచియుండిరి. కాత్యాయనుని వాదమును యాస్కాచార్యుడు తమ నిరుక్తమను గ్రంథమున విపులీకరించిరి. ఈ నిరుక్తగ్రంథము బయల్పడక పూర్వమే ధాతువులు క్రియారూపకములా, నామరూపకములా యను వాదమును గార్గ్యుడను నింకొక భాషాపండితుడు ధాతువు లన్నియు నామరూపకములని వాదించెను. కాని శాకటాయనుడు ధాతువులు క్రియారూపకములని వాదించెను. ఇదే విధముగ ననేక దేశములయందు ఈ భాషను గురించియు, దాని యుత్పత్తిని గురించియు ననేకులు నిశితవిమర్శలు గావించిరి. దీనినిబట్టి చూడ యూరపుదేశమున పదునాఱవ శతాబ్దమునకు పిమ్మట ప్రారంభింపబడిన వాదము అనగా భాషకు ధాతువులే ముఖ్యమని చెప్పెడువాదన హిందూదేశమున యిప్పటికి రెండువేల యేండ్లపై కాలమున క్రీస్తుశకమునకు పూర్వమే కొన్నిశతాబ్దముల క్రింద ప్రారంభింపబడి విమర్శింపబడినట్లు స్పష్టపడుచున్నది. ఈ వాదమును యూరపుదేశమున పదునారవశతాబ్దమున ప్రారంభించినది "హెన్రీ యాప్టి" యను పండితుడు.

16. హిబ్రూభాషయందు పదకొండవ శతాబ్దమున "రాబి జోన" యను పండితుడు ఒక వ్యాకరణమును, బైబిలు గ్రంథమున కొక నిఘంటువును వ్రాసియుండెను. ఈతడి పూర్తిపేరు "ఆబుమిా జాలిదు నర్వాన్ ఇబిన్".

గ్రీసుదేశము : భాష

17. గ్రీసుదేశస్థులు భాష దేవప్రసాదమని గట్టిగావాదించ లేదుగాని, భాషనుగురించి చక్కని పరిశీలన గావించి భాష ప్రకృతి సిద్ధమైనదిగ భావించి యుండిరి. వేదాంతములందు జీవమును గూర్చి తర్కించినట్లు భాషయొక్క ఆది, అంత్యములనుగూర్చి నిశితవిమర్శను గావించిరి. ప్రథమమున నీ విమర్శన అలెక్సాండ్రియా దేశమునందు వేదాంతశాస్త్రజ్ఞులచే ప్రారంభింపబడి విమర్శలు చేయబడెను. భాషలోని శబ్దజాలములయందు నామవాచకములు, క్రియలుకూడ కలసి యున్నట్లు భాషావేత్తయు, తత్వశాస్త్రజ్ఞుడునగు ప్లేటో పండితునిచే వాదింపబడెను. ఈ వాదనకు అరిస్టాటిలను ఇంకొక తత్వశాస్త్రజ్ఞుడు మరికొన్ని విషయములను చేర్చియుండెను. ఈ వాదమిట్లు జరుగుచున్న కాలముననే హోమరుపండితుని యితిహాస గ్రంథములగు ఇల్లియడు ఒడిస్సెలు బయల్వెడలెను. ఈ గ్రంథములను పరిశీలించుటకై యొక వ్యాకరణ గ్రంథము ప్రత్యేకముగా వ్రాయబడెను. అందు మాటలు వాటి అర్థములు, ప్రయోగములు, ఉపయోగములు, వాటి భాషా విభాగములు మొదలయిన వివరముల నన్నిటిని వేరువేరుగ వివరించి గ్రీసుదేశమునందు మొదటివ్యాకరణము "డయోనీసను త్రా"క్సను వారిచే తయారుచేయబడెను. ఈ పండితుడు "అరిస్టార్క" సను నింకొక పండితుని శిష్యుడై రోమునగరమున నివసించుచుండెను. అచ్చట వీరిని హెచ్చుగా కొనియాడెడువారు.

18. గ్రీసుదేశస్థు లా కాలమున రోముదేశమున గొప్ప పలుకుబడి గలవారై యుండిరి. క్రేట్సను నింకొక గ్రీకుదేశ పండితుడు

రోముదేశమునకు రాయబారిగా వెళ్లి అచట గ్రీసుభాషనుగూర్చి గొప్ప యుపన్యాసముల నిచ్చిరి. భాషనుగూర్చియు, వ్యాకరణమును గూర్చియు యుపన్యాసముల నా దేశమున క్రీస్తుశకమునకు తరువాత రెండు శతాబ్దములకే యివ్వబడెను. గాలికుయుద్ధ మొకప్రక్క జరుగు చుండ సీజరు మహాప్రభువు లాటిను భాషావ్యాకరణము నొకదానిని తయారుజేసెను. సప్తమీవిభక్తిని ప్రారంభించిన దీప్రభువే.

భాషాధాతువులు - శబ్దము : అర్థము

19. ధాతువులే భాషకు మూలములని పైన వ్రాసియుంటిని. ఈ ధాతువులనుండియే పదజాలమంతయు ననగా భాషయంతయు బయల్పడినది. ఒకరి మనసులోనుండు ఉద్దేశమును యితరులకు తెలియజెప్పుటయే భాషయొక్క ముఖ్యోద్దేశమైయున్నది. మనము మాటలాడు భాషాపదముల కా యా అర్థము ఎట్లు కల్గినదన్న ప్రశ్నకు మనము జవాబు చెప్పజాలముకాని మనకు చక్కగా అర్థమగు చున్నది. అయితే యీ అర్థము మనము ప్రయత్నించి కల్పించినదా, లేక సాంకేతికమాయన్న మనము సృష్టించినది కాదనిమాత్రము చెప్ప వచ్చును. ఇది సాంకేతికమేమైనచో యీ సాంకేతికార్థ మెట్లు జని యించినదని ప్రశ్నించిన నది లోకపువాడుకనుబట్టి యని చెప్పవలసి యున్నది. అందువలననే భాష్యములయందు "లోకతః అర్థప్రయుక్తే శబ్దప్రయోగే" అని వ్రాయబడినది.

20. ఈశబ్దార్థములు పుట్టుటకుపూర్వమే ఒకరికన్న నెక్కువ వ్యక్తులుండవలెను. ఒక్కరేయుండిన భాష ఏర్పడజాలదు. ఒకరికన్న నెక్కువమంది వ్యక్తు లున్నప్పుడే ఒకరిమనసులోని విషయముల నింకొకరికి తెలియజెప్పవలెననెడి అభిలాష కలుగుచున్నది. అట్టి సందర్భమున భావమును తెలియజేయుటకు కొన్ని మూగసంజ్ఞలు చేయుట ప్రారంభింపబడును (**Gestures**). ఆ యింగితములవలన భావ ప్రకటన కొంతకష్టముగ చేయబడుచున్నది. ఈ ప్రకటనలు సులభ

ముగా గ్రాహ్యమగుటకు మాటలుతయారుచేయబడవలెను. ఈ మాటలే భాషకు మూలాధారములై యున్నవి. అందువలననే ప్రథమావస్థ యందు బైబిలు గ్రంథమున "జెనిసిస్" అను భాగమున భూమియందు జీవములు, జంతువులు, పక్షులు మొదలయినవి దేవునిచే సృష్టింపబడిన వనియు, అటుపిమ్మట వీటినన్నిటిని ఆదామువద్దకు తీసికొనివెళ్ళి వాటికి నామముల నేర్పరచుటకు ఆదాముకే అధికార మీయబడెననియు వ్రాయబడియున్నది. జెనిసిసునందు-

> "భూమినుండి ప్రభువైన దేవుడు భూమిమీదనుండు ప్రతి జంతువును ఆకాశమున నెగురు ప్రతిపక్షిని సృష్టించి వాటి నన్నిటిని ఆదామువద్దకు తీసుకొనివచ్చి వాటికేవిధముగా నామమీయవలెనో అట్లుజేయమనెననియు, అట్లు ఆదాము పెట్టిననామమే వాటిపేరులనియు వ్రాయబడినవి."

ఇందువలన భాష దేవప్రసాదము కాదనువాదన ధ్రువపడు చున్నది. అందువలననే భాష మానవసంకల్పమనియుకూడ తెలియు చున్నది. ఈపైనవ్రాసినదాని ననుసరించి ప్రపంచమున కొంతకాలము వరకు భాష లేదనియే యూహించవలసియున్నది. కేవలము మూగతన మునుండి యింగితములు, ఇంగితములునుండి ప్రకటనలు, అటు పిమ్మట మాటలు వరుసగా ఉత్పన్నములై యుండవలయునని తోచుచున్నది. మాట లుత్పన్నమైనప్పుడు ప్రథమ పురుషుడు, ప్రథమస్త్రీయు నుండి యుండువలెనని యూహించుట అసహజము కాజాలదు. వీరి యిద్దరియింగితములే భాషకు మొదటి తప్పటడుగులై యుండవలెను. వీరిలో నొకరి నింకొకరు రంజింపజేయుటకై పాడిన పాటలు. పలికిన పలుకులు భాషకు మూలములు. పక్షిజాతులలో కోకిల యనుపక్షి యొకటి కలదు. ఈ పక్షి చక్కగా శ్రావ్యముగ చెవికింపగు నట్లుగ మనసును రంజింపజేయు నట్లుగ కూయగలదు. ఈ కూతను బట్టియే ఆపక్షి కా పేరు కల్గినది. ఈ పక్షి సంస్కృతమున కోకిల యనియు, గ్రీకుభాషయందు కాకిస్స అనియు, ఆంగ్లభాషయందు

కకుక్కు యనియు పిలువబడుచున్నది. దీనినే ఫ్రెంచి భాషయందు కోకెటందురు. ఈ మాటనుబట్టియే కొకెట్రి యను పదము వాడుక లోనికి వచ్చినది. కొకెట్రి యనగా తనగొప్పతనమును తానే బయలు పరచుకొనుట యని అర్థము. బయలుదేరి అదియే బడాయికోరని సామాన్య భాషయం దర్థమగుచున్నది. ఇట్టి విషయములను తెలిసి కొనుటయే భాషాశాస్త్రములోని కొంత భాగము.

భా షా శా స్త్ర ము

ఇంతటితో భాషోత్పత్తి విషయమును ఆపి ప్రథమమున పదము లెట్లుండెను, యిప్పుడెట్లున్నవి, వీనిలో మార్పు లెట్లు కల్గినవి యను ప్రశ్నలకు సహేతుకముగ జవాబు నివ్వకల్గిన—భాషా శాస్త్రమును—గూర్చియు, భాషాశాస్త్రమునకు సంస్కృతజ్ఞానము వలన కల్గిన లాభములనుగూర్చియు, సంస్కృత భాషను గూర్చిన వివరము లెట్లు బయల్పడిన వను విషయమును గూర్చియు రెండవ ఉపన్యాసమున తెలిసికొందము.

రెండవ ఉపన్యాసము

భాషాశాస్త్రము - సంస్కృత పరిచయము

ఈ భాషాపదములు ప్రథమమున నెట్లున్నవి ? అప్పటప్పట ఎట్లు మారినవి ? ఇప్పు డే రూపమున నున్నవి ? ఏ యే కారణముల వలన నిట్టి మార్పులు కలిగినవి ? మొదలయిన విషయముల నన్నిటిని విమర్శించి, వ్యాకరించి, యిప్పటి భాషయందలి పదములకు ప్రథమ మునను్న బీజములైన ధాతువులను కనుగొనుటయే భాషాశాస్త్ర మనిపించుకొనుచున్నది. ఇట్లే వెనుకకుపోగా ప్రథమదశయందలి ధాతు వులు మనకు స్ఫురించగలవు. ఆ ధాతువు లే సందర్భమున, ఏ యుద్దేశ మున ఉపయోగింపబడినవో కనుగొనినచో అట్టి సందర్భమునుబట్టి వాటి యర్థమును మనము కనుగొనగలము. దీనినే పతంజలి తన భాష్య గ్రంథమునందు "ఔత్పత్తికస్తు శబ్దార్థయోస్సంబంధః" యను సూత్ర మును స్థాపించియుండెను. ఈ సూత్రము ననుసరించి మన మనసులోని యొక భావమును బహిర్గతము చేయుటకు చేయబడిన సాంకేతిక ధ్వనియే ఆ యా భావముయొక్క సంబంధమును తెలియ జేయును. అట్లే ఆ సాంకేతిక ముపయోగింపబడినపుడు ఆ భావమునే మనము గ్రహింప గలుగుదుము. అప్పు డా సాంకేతికమునకు ప్రత్యేక అర్థము కలుగు చున్నది. కోడి "కుక్కురుకోయి" యని కూయు చున్నది. కోడిని చూచినపుడెల్ల "కు క్కు రు కో యి" అను శబ్దము మనకు జ్ఞాపకమునకు వచ్చుచున్నది. దీనినిబట్టి సంస్కృత మున "కుక్కుట" మను సాంకేతిక నామమున కోడిని పిలుచుచుండిరి. ఈ సాంకేతిక నామము మనకు స్ఫురణకు వచ్చినపుడెల్ల కోడికూత యగు "కుక్కురుకో" యనుశబ్దము జ్ఞాపకమునకు వచ్చుచున్నది. ఇంకొక పక్షిని సంస్కృతమున "కోకిల" యని పిలుచుచున్నారు.

దీనినే యింగ్లీషుభాషయందు "కక్కు" అని పిలుచుచున్నారు. గ్రీక్ భాషయందు దీనినే "కాకిక్సు" అని యందురు. ఈ పక్షియొక్క కూత బహు శ్రావ్యముగ నుండును.

2. పూర్వకాలముననే అనగా నిప్పటికి షుమారు మూడు నాల్గువేల సంవత్సరముల పైకాలము క్రిందనే సంస్కృతవైయాకరణులు భాషోత్పత్తినిగూర్చి కనిపెట్టిన విషయముల నన్నిటిని వంశపారంపర్యముగ చెక్కుచెదరక విద్యార్థులచే పఠింపబడి కంఠస్థము గావింపబడి మిక్కిలి జాగరూకతతో ఒకరినుండి యింకొకరికి ఒప్పగింపబడుచు స్థిరత్వము పొంది హిందూదేశమున నిలచియున్నది.

3. ఈ విధముగనే ప్రపంచమునం దనేక దేశములయం దీ భాషనుగూర్చి పరిశ్రమ చేయబడెను. కాని హిందూదేశమున చేయబడిన సమగ్ర పరిశ్రమ యింకెచటను చేయబడి యుండలేదు. గ్రీసు దేశపు వైయాకరణులుగూడ నీ విషయమై హెచ్చుపరిశ్రమను గావించియుండిరి. అయితే వారున్ను గ్రీసుభాషను ఇతర భాషలతో పోల్చి చూచియుండలేదు. వారెంతసేపు ఇతరుల ననాగరికులుగనే యెంచుచుండిరి. వారిచుట్టుప్రక్కలనుండు భాషలనైనను పరీక్షించి యుండిన భాషలయందు కొన్ని సారూప్యసాదృశ్యపదములు కనుపడి యుండెడివి. కాని వారట్లు చేయలేదు. ప్లేటోపండితు డీపద్ధతిని పూర్తిగ నిరాకరించెను.

4. హిందూదేశస్థుల కితరులు మ్లేచ్ఛులు. జ్యూ జాతివారికి యితర సంపర్కమే గిట్టలేదు. మహమ్మదీయుల కితరులు కాఫర్లు. ఒకరి భాష నింకొకరు దగ్గఱకు తీయుటకు వారి మతము లాటంకపరిచెను. అయితే క్రైస్తవమతము వృద్ధిజెందినపిమ్మట నీ యాటంకములు తొలగింపబడెను. వారికెల్లరును సోదరులే యను భావ మేర్పడెను. సర్వమానవ భ్రాతృత్వము మొదటినుండియు క్రైస్తవమతమున నేర్పడెను. వారి మతప్రచారకులు బయలుదేరి పరదేశముల తిరుగ ప్రారంభించిరి.

వారెచటికి పోయినను వారికి మతప్రచారమే ప్రథమ కర్తవ్యముగా భావించిరి. అందుకై వారు వెళ్లిన ప్రతిదేశమునందును జనులతో సహవాసముచేసి, వారి భాషల నేర్చుకొని, వారి భాషల నవగతము గావించుకొన ప్రారంభించిరి. వారికి ప్రథమమున తెలిసిన భాషలు గ్రీకు, లాటిను, హిబ్రూ భాషలు మాత్రమే. బైబిలంతయు హిబ్రూ భాషయందు మాత్రమే వ్రాయబడియుండెను. ఈ భాషనే వారందరు పవిత్రమైన ప్రథమభాషగ తలంచియుండిరి. ఇతర భాషలన్నియు దీనినుండియే జనించినవని భావించియుండిరి. ప్రథమ నివాసులు "ఆదాము అవ్వ"లు. వారు మాట్లాడినభాష హిబ్రూభాష యనియే వారి మతము. మనకు సంస్కృత మెట్లు దేవభాషయో, వారికి నట్లే హిబ్రూ భాష పవిత్రమైన భాష యని తలచిరి. కాత్యాయను డెట్లు సంస్కృతమునుండి యితర భాషలన్నియు నుద్భవించెనని తలచెనో అట్లే వారును హిబ్రూభాషనుండియే యితర భాషలన్నియు జనించినట్లు భావించిరి. బౌద్ధమత గ్రంథము లన్నియు పాలీభాషయందు వ్రాయబడినవి.

లెబినిజు పండితుడు

5. పాశ్చాత్యపండితు లెల్లరును ఇదేవిధముగ రెండవ శతాబ్ద కాలమువరకు హిబ్రూభాషయే ప్రథమ భాషయనియు, యితర భాషలన్నియు హిబ్రూభాషనుండియే జనించినవనియు తలంచుచు వచ్చిరి. ఈ వాదమునకు మొదట అడ్డు కలిగించినవారు "లెబినిజు" పండితుడు. "ఆంద్రా కెం"పను పండితుడు భాషలనుగూర్చి చర్చించుచు స్వర్గమునందు మాట్లాడబడెడు భాష "స్వీడిషు" భాష యనియు, ఆ భాషలోనే దేవతలు "ఆడము"తో ప్రథమమున మాట్లాడిరనియు, "ఆడం" తాను "డచ్చి" భాషతో జవాబు చెప్పెననియు "సైతా"నువారు "యీవు"తో ఫ్రెంచిభాషలో మాట్లాడెననియు చెప్పిరి.

6. ఇట్లే పర్షియను దేశస్థులు "యీావు" తర్కీ-షు భాషను మాట్లాడినట్లును, "సైతాన్" "అరబికు" భాషను "ఆడం" తర్కీ-షు భాషను మాట్లాడినట్లు చెప్పుచువచ్చిరి. "గోరాపయ"సను పండితుకు 1860 వ సంవత్సరమున స్వర్గమున వాడబడెడు భాష "డచ్చి" భాష యని చెప్పెను.

7. ఇట్లే యిచ్చవచ్చిన రీతిని పెద్ద పెద్ద పండితు లూహాగానము చేయుచుండ పదునారవ శతాబ్దమున "లెబినిజ్" అను పండితుడు తనవాదమును ప్రారంభించెను. ఈతడు ప్రఖ్యాతన్యాయవాది. దేశచరిత్రను క్షుణ్ణముగ జదివెను. మతములయందు చక్కని సంస్కృతిని సంపాదించెను. దేశభాషలన్నింటికి నొక తల్లిభాష కలదనియు, ఆ తల్లిభాషనుండియే ఇతర భాషలన్నియు జనించిన వనియు, ప్రథమజాతి మనుజులు ప్రాగ్దేశముననుండి పశ్చిమదేశమునకు వచ్చిరనియు నొక వాదనను ప్రారంభించెను. ఈతడు ప్రారంభించిన వాద మీాతని తదనంతరము చక్కగ వాడుకలోనికి వచ్చెను.

హెర్వాసు పండితుడు

8. ఈతనితరువాత "హెర్వా"సను స్పెయినుదేశపండితు డొకడు భాషలజాబితా నొకదానిని 1800 సంవత్సరమున తయారు జేసెను. పదసాదృశ్యమువలన భాషాసందర్భ మేర్పడదనియు, వ్యాకరణాసంబంధముతే భాషలసంబంధమునకు ముఖ్యకారణమనియు నొక క్రొత్తవాదనను ప్రారంభించెను.

బర్తాలోమియో పండితుడు

9. హిందూదేశమునకు పోయివచ్చిన "బర్తాలోమియో" యను పండితుడు చెప్పినసమాచారమునుబట్టి "గ్రీకు" భాషకును, సంస్కృతభాషకును హెచ్చుసంబంధమున్నట్లు "హర్వాసు" పండి

తుడు గ్రహించెను. ఈ బర్తాలోమియో యనువారు సంస్కృత వ్యాకరణము నొకదానిని రచించిరి. ఈ వ్యాకరణము 1790 వ సంవత్సరమున రోముదేశమున ప్రకటింపబడెను.

గ్రీకు	సంస్కృతము	
థియోస్	దేవ	God
యెస్మి	అస్మి	I am
యిసి	అసి	Thou art
యస్తి	అస్తి	He is .

"అస్" "అ" "అం" అను పదములు రెండుభాషల యందు నొకటే. వీనిని బట్టియు, మరికొన్ని సంబంధములను బట్టియు గ్రీకుభాషకును, సంస్కృతభాషకున్న సంబంధమున్నదనియు, సంస్కృతమునుండి గ్రీకుభాషలోనికి చాలాపదములు వచ్చియుండెననియు కూడ గ్రహింపబడినది.

సంస్కృతభాష : ప్రాకృతము

10. సంస్కృతభాషయు, దానివ్యాకరణము, చరిత్ర, సంస్కృతి బాగుగ తెలిసినపిదప పాశ్చాత్యపండితులకు భాషా విషయములందు గొప్ప చురుకు గలిగెను. భాషాజ్ఞానమునందలి యుత్సాహము ఇనుమడించెను. పాశ్చాత్య పండితులు సంస్కృతమును బాగుగా చదువ ప్రారంభించిరి.

11. వేదమునందలి ఋక్కులు, బ్రాహ్మణములు, సూత్రములు మొదలయినవాటిని వేరువేరుగ విభజించిరి. సూత్రములలోని సంస్కృత మంతయు ఆనాడు జనులు మాట్లాడు సంస్కృతభాషయే యైయుండెను. ఋక్కులు బ్రాహ్మణములలోని భాష మాత్రము కొంచెము భేదముగ నున్నట్లు కనిపించెను. ఋక్కులలోని భాష యొకానొకప్పుడు హిందూదేశమున వాయవ్యమూల పంజాబువద్ద మాట్లాడబడియుండినట్లు కనుపడెను. ఈ ఋక్కులన్నియు నతి జాగరూకతతో కంఠోపాఠము గావింపబడి వంశపారంపర్యా క్రి. పూ.

మూడవ శతాబ్దమువరకు వల్లింపబడుచుండెను. అప్పుడు పాణిని యను పండితుడు వ్యాకరణమును సూత్రములుగ తయారుజేసి భాషకు మార్పులేకుండునట్లు గావించెను. ఇట్లు సంస్కరింపబడిన భాష సంస్కృత భాషయైయుండెను.

వేద భాష

12. అప్పటికున్న భాషలన్నియు ప్రాకృతభాషలు, అపభ్రంశములునైయుండెను. ఈ ప్రాకృతభాషలును వ్యాకరణభూయిష్ఠములే యైయుండెను. పాళి, శౌరసేని, మహారాష్ట్రి, మాగధి మొదలైనవి వ్యాకరణయుక్తములైన ప్రాకృతభాషలు. ఈ ప్రాకృత భాషల వ్యాకరణకర్త "వరరుచి" యను పండితుడు. బౌద్ధగ్రంథములన్నియు పాళీభాషలో వ్రాయబడెను. ఈ పాళీభాషలోనే అశోకుని శాసనములన్నియు వ్రాయబడెను. ఇదిగాక బౌద్ధగాథలు వ్రాయబడిన భాష వేరుగనున్నది. ప్రాకృతమునందును తద్భవములును తత్సమములు దేశభాషయు వేరుగనున్నవి.

అపభ్రంశములు

13. ఆభీరి (సింధి, మార్వారీ) ఆవంతి (రాజపుతానా) ఘూర్జరి (గుజరాతి) బాహ్లిక (పంజాబి) పెప్పలి (నేపాలి) శౌరసేని (పశ్చిమ హింది) ఓఢ్రి (ఒరియా) గౌడి (బెంగాలి) మాగధి (తూర్పు బెంగాలి) దాక్షిణాత్య (మరాటి) మొదలయిన భాషలన్నియు అపభ్రంశములు. వీటికి ప్రత్యేక నిబంధనము లేవియు లేవు.

అప్పటి వ్రాత : గ్రీనారు : కపర్ది

14. అలెగ్జాండరు హిందూదేశమునకు దండెత్తి వచ్చిన కాలముననే హిందూదేశమున వ్రాయుట ప్రారంభింపబడి యుండవచ్చును. ఆ వ్రాత మన హిందూదేశమునకు పాశ్చాత్యదేశముల

నుండియే వచ్చియుండవచ్చును. ఈ వ్రాయుటలో కుడిప్రక్కనుండి యెడమప్రక్కకు వ్రాయుట యొకపద్ధతి. ఎడమప్రక్కనుండి కుడిప్రక్కకు వ్రాయుట యింకొక పద్ధతి. మనము ఎడమప్రక్కనుండి కుడివైపునకు వ్రాయుచున్నాము. దీనిని గ్రీనారుపద్ధతి యందురు. కుడిప్రక్కనుండి యెడమప్రక్కకు వ్రాయుట "ఖరోష్ఠి" యనియు "కపర్ది" యనియు పిలువబడుచున్నది.

లిపి

15. ధ్వనులే అక్షరములుగ మారినవి. అక్షరముల కూడిక వలన మాట లుద్భవించినవి. మాటల సముదాయమే భావములను తెలియజెప్పెడి వాక్యములగుచున్నవి. ఇట్టి వాక్యముల కూటమివలన వాఙ్మయ మేర్పడుచున్నది.

16. ధ్వనులకు గురుతులుగ వ్రాయబడు చిహ్నము లక్షరములు. ధ్వనినే వ్రాసినపు డది అక్షర మగుచున్నది. దానినే మనము లిపి యనుచున్నాము. అక్షరమనగా క్షయము జెందనిది - నశించనిది. ఈ అక్షరమే "వర్ణ"మని చెప్పబడుచున్నది. వర్ణము అను పదము "రంగు"ను కూడ నూహకు తెచ్చుచున్నది. రంగు వ్రాసిన లిపి వర్ణమగును.

17. లిపినే లేఖన మనియు చెప్పుదురు. "లిపి" యను పదము "లిప్" అను ధాతువునుండియు, "లేఖనము" అను పదము "లిఖ్" అను ధాతువునుండియు వచ్చుచున్నవి. "లిప్" ధాతువునకు "రుద్దుట" యనియు, "లిఖ్" అను ధాతువునకు "గీకుట" యనియు నర్థముకలదు. రాగిఫలకముమీద వ్రాయబడినది లేఖనము. ఇదిగాక "లేపన"మను ఇంకొక పదముగలదు. ఇదియు లిప్‌ధాతువునుండియే వచ్చుచున్నది. ఆకుపైన వ్రాయబడినది లేపనము.

దేవనాగరిలిపి

18. తెలిసినంతవరకు మనదేశమునందలి ప్రథమలిపి దేవనాగరిలిపి. దేవతలు నివసించు నగరమైన దేవనగరమను పదమునుండి యీదేవనాగరిలిపి జనించినది. ఇదియే శ్రీచక్రము. ఈ దేవనగరమును గురించి వేదములయందు ప్రశంస గలదు. ఈ దేవనగరమున పరమేశ్వరుడు శక్తికాముడై ప్రవేశించెనని వేదమునందు వ్రాయబడినది. దేవనగర భాషయొక్క లిపి దేవనాగరిలిపి. ఈ లిపిని లోకమునకు బ్రహ్మఉపదేశించి అనుగ్రహించినందున దీనినే బ్రహ్మలిపియనిరి. ఇది భరతదేశమునందు వాడబడినందున దీనినే "భరతలిపి" యనియు పిలిచెడివారు. ఈ లిపినే అప్పుడప్పుడు పేరుమార్చబడినందున దీనికే వేరువేరుపేర్లు కల్గినవి. బుద్ధునికాలమున నీ బ్రాహ్మిలిపియే వాడబడుచుండెను. బుద్ధుని జీవితమంతయు పాళీభాషలో క్రీస్తుపూర్వమే అయిదువందల సంవత్సరముల క్రింద 500 B. C. "లలితవిస్తర"మను పేర "బ్రాహ్మి" లిపియందు వ్రాయబడెను. ఈ గ్రంథమును ప్రథమమున పాటలీపుత్రములో చదివియుండిరి. అచ్చటనే యీ గ్రంథము దొరికినది. అప్పటికే అరువదినాల్గు లిపులు ప్రచారమునం దున్నట్లా గ్రంథమున వ్రాయబడియుండెనట. మనకు దొరకినంతవరకు నీ బ్రాహ్మిలిపియే ప్రథమ లిపి.

19. అశోకచక్రవర్తి కాలమున ఈ లిపియే "అశోక" లిపియనియు, మౌర్యులు రాజ్యము జేసినంతకాలము మౌర్యలిపియనియు చెప్పబడెడిది.

20. అయితే భరతదేశపు వాయవ్యదిక్కున పశ్చిమోత్తర దిశన వాడబడినది "ఖరోష్ఠి" లిపి యనెడివారు. దీనినే కొంతకాలము కపర్ది అనియు చెప్పెడివారు. అయితే యీ లిపి కుడివైపుననుండి యెడమవైపునకు వ్రాయబడెడిది.

దాక్షిణాత్య లిపి

21. అశోక, మౌర్య లిపులనుండి అనేక లిపు లుద్భవించినవి. అందుండి గుప్త గుహాలిపులు జనించినవి. చేర, చాళుక్య, వేంగీ లిపు లీ గుహాలిపిలోనుండి పుట్టినవి. చేరలిపినుండి అరవ, మళయాళ లిపులు జనించినవి. చాళుక్య లిపినుండి తెలుగు, కన్నడ లిపులు జనించినవి.

చేరలిపి

22. మైసూరు, కోయంబత్తూరు, సేలం, దక్షిణ ఉత్తరమలబారు ప్రాంతములు, కొచ్చినదేశము, తొండమండలము కలసి చేరదేశమని పిలిచెడివారు. మూడుమొదలు ఏడవశతాబ్దములమధ్య దక్షిణకొంకణమంతయు నీ చేరదేశమున చేరినది. ఒకప్పుడు కన్యాకుమారినుండి గోవాప్రాంతమువరకునున్న దేశమంతయు కేరళ లేక చేరదేశములో నుండెడిది. అశోకునిశాసనములలో యీదేశమునకు రాజధాని కేరళపురమనియు, స్కంధపురమనియు వ్రాయబడియుండెను. రెండవశతాబ్దమున "టాలమి" యను రాయబారి వ్రాయుటలో "కరోవా" రాజధానియని వ్రాసియుండెను. ఈ "కరోవా" యను పట్టణము కోయంబత్తూరులోని "కరూర" పట్టణముగా తేల్చబడినది. ఈ పట్టణము కావేరీనది ఉపనదియగు అమరావతితీరమున నున్నది. ఈ రాజ్యమును తొమ్మిది పదియవశతాబ్దముల చోళు లేలిరి. వీరినే "హోయిసలులు" అనిరి. అప్పటిరాజధాని మహిసూరురాజ్యములోని ద్వారసముద్రము. తొండమండలము చెన్నపట్టణము సమీపమున నున్నది. ఈ చేరదేశపు లిపియే చేరలిపి. అరవలిపి, గ్రంథాక్షరలిపి, తులులిపి, వట్టెలెత్తులిపి యను నాల్గును చేరలిపిలోని భాగములే. తొండమండల దేశమునందు వాడుకలోనుండియున్న లిపియే చేరలిపిలో ప్రథమలిపి. ఇదియే ప్రస్తుతపు అరవలిపి మాతృక. ఇంకొక అరవలిపి మహిసూరు కూర్గు దేశములయందు 877 వ సంవత్సరము వరకు వాడుకలో నుండెడిది. అది యీదేశముచోళులచే నాక్రమింప

బడిన పిమ్మట అంతరించినది. ఇవిగాక సంస్కృతాక్షరములను వ్రాయుటకు గాను గ్రంథాక్షరలిపియని యింకొక లిపియు నీ యరవదేశమున వాడుకయందుండెడిది. ఈ గ్రంథాక్షర లిపి 1000 A. D. లో వాడుక లోనికి వచ్చినట్లు కనిపించుచున్నది. ఈ గ్రంథాక్షర లిపియందును రెండు విధములైన లిపులుండెడివి. వాటిని బద్దకట్టు లిపియనియు, గుండుకట్టు లిపియనియు చెప్పెడివారు. సంస్కృత గ్రంథములను వ్రాయునట్టిది బద్దకట్టు లిపి. జైనగ్రంథములను వ్రాయునది గుండుకట్టు లిపి. ఇవిగాక యింకొకలిపి "వట్టెలెత్తు" లిపి యని యుండెడిది. ఈ పదము మళయాళభాషలోనిది. దీనిఅర్థము గుండ్రపు లిపి యని అర్థము. ఇది బ్రాహ్మిలిపిలోనుంచి జనించినదే. ఈ లిపి పదునైదవ శతాబ్దమువరకు అరవదేశములో వాడుకలో నుండెడిది. ఈ లిపిని హెచ్చుగా "మాపిళ్లె" లు వాడుచుండెడివారు. పాండ్యరాజ్య[illegible]రముతో నీ లిపియు నంతరించినది. ఈ లిపికిని, గుండుకట్టు లిపికి[illegible] హెచ్చు భేదము లేదు.

చాళుక్య లిపి

23. చళుక వంశనృపతులనుండి "చాళుక్య" శబ్దముత్పన్నమైనది. కళ్యాణనగరము రాజధానిగ, కుంతలమహారాష్ట్రము నేలినవారు చాళుక్యులు. ఈ దేశమునందు వాడుకలోనున్న లిపియే చాళుక్యలిపి. దీనినుండియే తెలుగు కన్నడలిపు లుత్పన్నమైనవి. చాళుక్యదేశమునందు పూర్వపశ్చిమముల రెండువిధములైన లిపులుండెడివి. ఈ రెండు లిపులు కలిసినపిమ్మట "సంధిలిపి" యను పేర నొక క్రొత్త లిపి జనించెను. దీనినుండియే "హళెకన్నడ" లిపి యుద్భవించెను.

వేంగిలిపి

24. అశోకలిపినుండి యుత్పన్నమైన యింకొకలిపి వేంగిలిపి. వేంగిదేశమునందు రాజులేలిన కాలమున నా వేంగిరాజు లీ లిపిని

వాడినందున నీలిపి వేంగిలిపియని పిలువబడెను. ఈ పైన వ్రాయబడిన లిపులవంశావళిని జూపగల్గిన యొక వృక్షమును ప్రక్క పేజీలో పొందుపరచియున్నాను.

25. పైన అపభ్రంశములను గూర్చి వివరించుచు పదమూడవ పేరాయందు ఆయాభాషలు ప్రస్తుతపు దేశభాషలలో వేటివేటికి సంబంధించినవో సూచించియుంటిని. వాటికే కొద్దివివరముల నిచట తెలియ జేయుదును. పూర్తివివరములు మున్ముందు ఆర్య భాషలను శీర్షిక క్రింద వ్రాయబడును. ఇప్పటి ఉత్తర హిందూస్థానములోని భాషలన్నియు నేభాగమున మాట్లాడబడుచున్నవో ఆ ప్రాంతముల యొక్క పేరుననే పిలువబడుచున్నవి. ఉత్తర హిందూస్థానములోని మధ్యభాగమున మాట్లాడబడుచున్న భాషనుమాత్రము హిందీభాష యని పిలుచుచున్నారు. హిందీభాషయందు పశ్చిమహిందీ, తూర్పుహిందీ యని వేరువేరుగ పిలువబడుచున్నది. తూర్పుహిందీ తిరిగి బీహారి, జౌకు, మైథిలి, మాగధి యను నాల్గు విధములుగ నున్నది. అట్లే పశ్చిమహిందీ మార్వారి, జయపురి, బ్రాజి, కనోజి యను నాల్గువిధములుగ నున్నది. ఇదే పండ్రెండవ శతాబ్దమునకు రాజభాషయగు ఉర్దూ. మహమ్మదీయులు రాజ్యమేలినంతకాలము యీ ఉర్దూభాషలో, అరబిక్ పర్షియను భాషా పదములు హెచ్చుగ జేరినవి. అక్బరు చక్రవర్తి రాజ్యము చేసినపుడు ఈ భాష దేశమంతటను వ్యాపించెను. హిందువులు బ్రిటిషువారు రాజ్యము చేసినంతకాలము ఈ యుర్దూభాషలోని పర్షియను భాషాపదము లంతరించినవి. అప్పుడీ భాష హిందీభాష యనియే పిలువబడుచుండెడిది. ఆ కాలమున హిందీకిన్ని, ఉర్దూకున్ను చెప్పదగిన భేదము లంతగా లేవు. ఉర్దూభాషలో పర్షియను పదములు హెచ్చు. హిందీభాషలో తక్కువ. ఈ రెండు భాషలున్ను అపభ్రంశములే యైయున్నవి. ఈ హిందీభాషలో పండ్రెండవ శతాబ్దమునందు "చందూ" యను వారున్ను, పదమూడవశతాబ్దమున "నాముదేవుడు",

పదునాల్గవ శతాబ్దమున "విద్యాపతి", పదునైదవ శతాబ్దమున "కబీరు", పదునారవ శతాబ్దమున "తులసీదాసు"న్ను ప్రఖ్యాత కవులై యుండిరి.

26. లంకాద్వీపమున మాట్లాడబడు భాషయగు "షిన్హా లీసు" భాషయు నొక ప్రాకృతభాషయే యైయున్నది. కాని పాళీభాష మాత్రము ప్రాకృతభాష కాదందురు.

సంస్కృతభాష, ఇతర దేశముల పరిచయము

27. సంస్కృతభాష హిందూదేశపు సరిహద్దులను దాటి ఇతర దేశములకు ప్రాకినదా! అయ్యెన ఎపుడు, ఏ యే దేశములకు అను విషయములను కొంత విచారించి చూచెదము. ఈ ప్రశ్న చాల ముఖ్యమైనదై యున్నది. మొట్టమొదట నీ పాశ్చాత్యమత ప్రచారకులు ఈ భాషను తెలిసికొని దీనిలోని విశేషములను బహిర్గతము గావించి నపుడు పాశ్చాత్య దేశమునందలి ప్రముఖులు కొందరు భ్రాంతిజెంది యిట్టిభాష యుండజాలదనియు, ఇట్టిభాష యెప్పుడు ఎచట వాడుక యందుండుటకు వీలులేదనియు, ఈ 'టక్కరు' బ్రాహ్మణులు గ్రీకు లాటిను భాషలను చదువుకొని వాటిననుకరించి యొకభాషను సృష్టింపు గావించి యుందురనియు చెప్పుచు వచ్చిరి. అట్టివారిలో ప్రముఖుడు "డ్యూగోల్డు స్టూవా"ర్టను వారు. ఇట్టియూహ సరియైనది కాదని నిరూపించుట కీ యంశము మిక్కిలి ప్రాముఖ్యతను వహించుచున్నది.

28. చరిత్రాంశములను పరిశీలించి చూడగా పూర్వకాలమున హిందూ దేశమున కప్పుడపుడు పరాయి దేశస్థులు వచ్చి యీ భాషా సౌరభ్యము నాఘ్రాణించి, ఆనందించి యీ భాషయందలి కొన్నిపదములను తమ తమ భాషలలోనికి చేర్చుకొనిరి. జ్యూ జాతివారు, గ్రీకులు, చైనావారు, అరబులు ఈ భాష నుపయోగించుకొన్నవారే. "సాలమను" రాజు కాలమున

నీ భాష ఇండసునదీముఖ ప్రదేశమువరకు మాట్లాడబడుచున్నట్లు తెలియగలదు. "సాలమను" రాజుగారి నావికులు "ఒఫీరు" దేశమునకు పోయి "అలుగము" వృక్షములు, కోతులు, దంతములు తెచ్చినట్లు బైబిలు న్యూటెస్టమెంటునందు వ్రాయబడియున్నది.

పైనవ్రాయబడిన వస్తువులన్నియు, హిబ్రూభాషలోనికి ఇతరభాషలనుండి వచ్చినవే యైయున్నవి. ఈ పదము లేభాషనుండి వచ్చినవో తెలిసికొన్నయెడల "ఒఫీరు" దేశ మెచ్చటో తెలిసికొనగలము. ఈ వస్తువులన్నియు హిందూదేశమున నుండియే తీసికొని పోబడినయెడల "ఒఫీరు" దేశముకూడ హిందూదేశములోనిదే యని తెలిసికొనగలము. హిబ్రూభాషలో "అలుగ"మన మంచిగంధమని యర్థము. సంస్కృతభాషయందు "వల్గుక"మన్న మంచిగంధమని యర్థము. కాన వల్గుకము, అలుగము ఒకటేపదములై యున్నవి. హిబ్రూభాషయందు కాప్ అన్న కోతియని అర్థము. సంస్కృతమునందు "కపి" యన్న కోతి. కాప్, కపి యను పదములు ఒకటిగనే కనిపించుచున్నవి. మంచిగంధము, కోతులు ఇప్పటికిని హిందూదేశమున నుండియే ఇతరదేశములకు ఎగుమతి చేయబడుచున్నవి. దంతమునకు హిబ్రూభాషలో "షేన్ హిబ్బం" అందురు. "హిబ్బం" పదమునకు పన్ను అను నర్థము కలదు. దంతము సామాన్యముగ యేనుగవద్దనుండి వచ్చుచున్నది. ఏనుగకు సంస్కృతపదము "ఇభము". సంస్కృతభాషయందలి "ఇభము" హిబ్రూభాషయందలి "హిబ్బం" ఒకటేపదములై యుండవచ్చును. ఈ పైనచెప్పిన మూడు వస్తువులు హిందూదేశమున నుండియే వచ్చెడివి.

నెమళ్ళు హిబ్రూభాషలో "తుకై" యనబడుచున్నవి. అరవదేశమున నొకప్పుడు "తోకై" యను పదము నెమళ్ళకు వాడబడుచుండెడిది. ఇప్పుడు తోకను మాత్రమే "తోకై" యందురు. కనుక నెమళ్ళను కూడా హిందూదేశముననుండియే తీసికొని పోబడినట్లు చెప్పవచ్చును. ఈ వస్తువుల నన్నిటిని హిందూదేశమునుండియే

తీసికొనిపోయినట్లైన అందువ్రాయబడిన "ఒఫీరు" దేశమున్ను హిందూ దేశములోనిదే యైయుండవలయును. "ఒఫీ"రను పేరుతో సారూప్యము గల్గిన పేరుగల దేశ మేదైన నుండెనాయని విచారించగ "ఆభీర" దేశ మొకటి కనుబడుచున్నది. "టాలమి"యను బాటసారి హిందూ దేశమునుగూర్చి వ్రాయుచు ఉత్తరహిందూస్థానమున "ఆభీర" దేశ మొకటి కలదని వ్రాసియుండెను. "ఆభీరు" దేశమే "ఒఫీర్" దేశమై యుండవచ్చును. కనుక హిందూ దేశము, సంస్కృతభాషయు జ్యూ దేశస్థులకు క్రీస్తుశకప్రారంభముననే తెలిసియుండవలెనని స్పష్టపడుచున్నది. అప్పటికీ రెండు దేశములమధ్య వ్యాపారము జరుగుచునే యుండెను.

గ్రీసుదేశము : హిందూదేశము

29. పర్షియా యేషియా మైనర్లద్వారా గ్రీకులు హిందూ దేశమును గురించి తెలిసికొనియుండిరి. జెండు అవెస్తాలో "హిందూ" అనియు, "హప్తహిందూ" అనియు మాటలు గలవు. వేదమునందలి "సప్తసింధు"వే "అవెస్తా"లోని "హప్తహిందు" అయి యున్నది. 'నక్షీరుస్తుం' శాసనమున హిందూదేశస్థులు డెరయసుకు కప్పము కట్టినట్లు తెలియుచున్నది. అలెక్సాండరు దండయాత్రకు పూర్వమే "హెరొడోటసు"కు (549 - 486) హిందూదేశ సమాచారమంతయు తెలియును. ఆ కాలమున "గాంధర్వు"లను "గాండేరియో" యని పిలిచెడివారు. చంద్రగుప్తుని రాజధానియగు పాటలీపుత్రమునందు 'మెగస్తనీసు' రాయబారి (295 B. C.) కొంతకాలము నివసించెను. ఈ మెగస్తనీసు హిందూదేశమును గురించియు, సంస్కృతమును గురించియు విశదపరచెను.

చీనాదేశస్థులు : సంస్కృతము

30. చైనాదేశమున బౌద్ధమతము ప్రభుత్వముచే నంగీకరింపబడకపోయినను బౌద్ధమత ప్రచారకులు అనేకులు క్రీస్తుకు

పూర్వమే 217 B. C. చైనాదేశమునకు చేరిరి. చైనాదేశపుసేనాని యొకరు క్రీస్తుపూర్వము 120 B. C. సంవత్సరమునకు హిందూ దేశముననుండి బంగారముతో తయారుచేయబడిన బుద్ధవిగ్రహము నొకదానిని తీసికొనివెళ్ళిరి. చైనాదేశమున బుద్ధుని 'ఫొటో' యని పిలిచిరి. చీనాదేశస్థులు సంస్కృతమును సంపాదించి వారి గ్రంథములను తమభాషలోని కనువదించిరి. ఆ దేశముననుండి అనేకులు హిమాలయ పర్వతములదాటి హిందూదేశమునకు రాదొడంగిరి. 'ఫాహియా'నను బాటసారి(399-414 A.D.) హూయెనిత్సాంగ్ (629-645), పింగ్స్యాంగ్ (579), ఇట్సింగ్ (669-679)అనువారున్ను, మరి యితర బాటసారులును 914 వరకున్ను వచ్చుచునే యుండిరి. ఈ కాలమున సంస్కృతభాషయే మధ్యహిందూస్థానమున వాడుకభాషగా నుండియుండెను.

పర్షియాదేశము : హిందూదేశము

31. పర్షియాదేశపురాజు హిందూదేశపుకథలు కొన్నిటిని తమ భాషలోని కనువదింపజేసెను. ఆరవశతాబ్ది ప్రారంభముననే 'పంచతంత్ర' మను గ్రంథమును పెహ్లెవీభాషలోని కనువదించిరి. ఎనిమిదవ శతాబ్దమునకు పంచతంత్రగ్రంథము ఆరబిక్ భాషలోని కనువదింపబడెను.

ఆరబుదేశము : హిందూదేశము

32. 'కలీప్ అల్మామున్స' అనువారు (773. A. D.) రాజ్యమునకు వచ్చెను. హిందూదేశపు జ్యోతిష్కుడొకరు జ్యోతిషశాస్త్రమును, గ్రహములనుగురించి పుస్తకమును ఆరబుదేశపుప్రభువునకు బహూకరించెను. వాటి నా ప్రభువు ఆరబికుభాషలోనికి అనువదింపజేసెను. దీనినే హిందూసింద్ అనియు, సిందూహిందనియుపిలిచిరి. 'సుశ్రుత'మను సంస్కృత వైద్యగ్రంథము 786-809 మధ్య ఆరబుభాషలోని కనువదింపబడెను. ఆలెబ్రానుగురించిన యింకొకగ్రంథమున్ను అనువదింపబడెను.

ఆల్బరూని : ఇండియా

33. గజనీమహమ్మదు హిందూదేశమునకు వచ్చునపుడు తనవెంట 'ఆల్బరూని'యనువారిని తీసికొనివచ్చెను. ఈతడు హిందూదేశమునకువచ్చి సంస్కృతజ్ఞానమును సంపాదించి 'గ్రహము' లను గూర్చిన గ్రంథమును, మరికొన్ని వేదాంతగ్రంథములను వ్రాసెను. అతడువ్రాసిన గ్రంథములలో 'తాటకీ హిం'దను న్యాయశాస్త్ర గ్రంథ మొకటి. సాంఖ్యయోగమునుగూర్చి యింకొక గ్రంథమును రచించిరి.

అక్బరు : ఇండియా

34. అక్బరుచక్రవర్తి ప్రభుత్వము గావించునపుడు అనేక సంస్కృత పుస్తకములను పర్షియనుభాషలోని కనువదింపజేసిరి. ఆ కాలముననే బైబిలుగ్రంథమును, అథర్వవేదమును పర్షియనుభాషలోని కనువదించిరి.

దారా : ఇండియా

35. తరువాత అక్బరు మనుమడును షాజహానుచక్రవర్తి కుమారుడునైన దారా యనువారు తాము స్వయముగ సంస్కృత పాండిత్యమును సంపాదించి 1657 కు అనేకపుస్తకములను పర్షియనుభాషలోని కనువదించిరి.

యూరపుదేశస్థులు : ఇండియా

36. ఔరంగజేబు చక్రవర్తి రాజ్యమునకు వచ్చినప్పటికే యూరపుదేశమువం దంతయును సంస్కృతభాషనుగూర్చి తెలిసియే యుండెను. కాని ప్రథమమున వారిలో నేదేశస్థులకు తెలిసెనో కనుగొందము.

మతప్రచారకులు : 1559

37. వాస్కోడిగామా హిందూదేశమునకు వచ్చునప్పటికిన్ని, అటుతర్వాత షుమారు డెబ్బది సంవత్సరములవరకున్ను హిందూ

దేశమును గూర్చిగాని, సంస్కృతమును గురించిగాని యూరపుదేశమునకు తెలియనే తెలియదని చెప్పవచ్చును. మనకు తెలిసినంతవరకు 1559 వ సంవత్సరమునకు మతప్రచారకులు గోవాలో నొక బ్రాహ్మణుని తమ మతములోనికి కలుపుకొని అతనిద్వారా సంస్కృతమును, అందుండెడి మత వేదాంతగ్రంథములను కొన్నిటిని జదువుచుండిరి. అటుపిమ్మట బ్రాహ్మణులతో మతసంబంధములైన వాదనలను గావించుచుండెడివారు. హిందూదేశమునకు వచ్చి సంస్కృతజ్ఞానమును సంపాదించి భర్తృహరి సుభాషితమును డచ్చిభాషలోని కనువదించిరి.

ఫెలిప్టా సాల్సెట్టు : ఇటలీ దేశస్థుడు

38. 1581-88 మధ్యకాలమున ఫెలిపా సాల్సెట్టను నిటాలియను పండితు డొకడు గోవాయందు నివసించుచుండెను. ఈతడు సంస్కృతభాషనుగూర్చి వ్రాయుచు "ఇది చక్కగ సంస్కరింపబడిన దివ్యమైన భాషయనియు, దీనిలో పాండిత్యమును సంపాదించుట కేడెనిమిది సంవత్సరములు పట్టుననియు, ఆ భాషకును, ప్రాంతీయ భాషలకును సంబంధములున్నవనియు, ఇటాలియనుభాషలోని దేవుని పేర్లకును, సంస్కృతములోని దేవుని పేర్లకును సంబంధము కలదనియు, 6, 7, 8, 9 అంకెలకు రెండుభాషలలోను సంబంధములు కల" వనియు వ్రాసిరి.

రాబర్టు డి నొబిలి, 1577.1656

39. 'నొబిలి' యను మతప్రచారకుడు హిందూదేశమునకు 1606 వ సంవత్సరమున వచ్చెను. ఈ కాలమున హిందూమతములోని హీనజాతివారు మాత్రమే క్రైస్తవమతములో చేరుచుండిరి. బ్రాహ్మణులు మాత్రము మతమును స్వీకరించుటకు నిరాకరించుచు వచ్చిరి. వారు క్రైస్తవుల సాంగత్యమునైనను చేయరైరి. అందువలన నొబిలి యను ప్రచారకుడు కొన్ని సంవత్సరములు రహస్యజీవనమును గడపి అరవము

సంస్కృతభాషలలో పాండిత్యమును సంపాదించి బ్రాహ్మణవేషమును ధరించి, చక్కని నామములు పెట్టికొని మత నిబంధనల ననుసరించి నడచుకొనుచుండెను. ఈతడు యూరపుదేశపు పండితులలో ప్రథమ సంస్కృతపండితుడు. మనుధర్మశాస్త్రమునుండియు, ఆపస్తంబ సూత్రములనుండియు, పురాణములనుండియు సూత్రములను, శ్లోకములను చక్కగ వల్లించియుండెను. తానొక మఠాధిపతివలె ప్రవర్తించుచుండెను. వేషభాషలయందు, వస్త్రధారణమునందును మఠాధిపతి ననుకరించెను. హిందూమతమునందలి కొన్ని ఘట్టములను క్రైస్తవ మతమునందలి మరికొన్ని ఘట్టములను కలిపి యొక పురాణమువలె గ్రంథము నొకదానిని తయారుచేసెను. ఈ గ్రంథము సంస్కృతభాషయందు వ్రాయబడెను. దీనినే 'యజుర్వేద' మను నామమున జనులకు బోధింప ప్రారంభించెను. ఈ గ్రంథముయొక్క అసలు పుదుచ్చేరియం దుంచబడెనని చెప్పుదురు. ఈ వేదాంతమునే ఈతని అనుచరులు ఈతని తదనంతరమును బోధించుచు వచ్చిరి. ఈ గ్రంథమును ఫ్రెంచి భాషలోని కనువదించి 'వాల్టైరు'కు పంపిరి.

రాథ్

40\. 'నాబిలి' తరువాత పేరెన్నికపొందిన పండితుడు 'రాథ్'. ఈతడు బ్రాహ్మణగురువువద్ద ఆరు సంవత్సరములు సంస్కృతమును చదివెను. 1666 వ సంవత్సరమున సంస్కృతాక్షరములను గూర్చి వ్యాసము నొకదానిని వ్రాసెను.

జెసూటు మతప్రచారులు

41\. పదునెనిమిదవ శతాబ్దమధ్యకాలమునకు జెసూటు మత ప్రచారకులు హిందూదేశమునకు వచ్చిరి. వారిలో కొందరు మిక్కిలి పట్టుదలతో నాల్గువేదములను జదివిరి. వీరందరు ఓరియంటలు గ్రంథాలయము నొకదానిని స్థాపించి ప్రాదేశభాషలయందలి గ్రంథ

ములను బ్రాహ్మణ కులస్థులగు క్రైస్తవమతస్థులచే జదువు చెప్పించుకొని పాండిత్యమును సంపాదించిరి. 'పెర్రికాల్మెటు' 'పెర్రిపాన్సు' అనువారు వారిలో కొందరు మతప్రచారకులు. వీరిలో 'బర్తాలోమియో' యనువా రింకొక పండితుడు. అతడు 1790-91 లో వ్యాకరణమును తయారు గావించెను.

42\. భారతదేశమునకు గవర్నరు జనరలుగా వచ్చిన 'వారన్ హేస్టింగ్సు' అను వారు కొంతమంది పండితులచే హిందుదేశపు ఆచార వ్యవహారములను, న్యాయపద్ధతులను ఇంగ్లీషుభాషలోనికి అనువదింప జేసిరి.

43\. 'వారన్ హేస్టింగ్సు' చే ప్రోత్సహింపబడి, 'చార్లెసు విల్కిన్సు' అను వారు కాశీకి వెళ్లి సంస్కృతభాష నభ్యసించిరి. 1785 లో భగవద్గీతా గ్రంథమును ఇంగ్లీషుభాషలోని కనువదింపించి ప్రచురించిరి.

సర్ విల్లియం జోన్సు

44\. తరువాత 'సర్ విల్లియంజోన్సు' అను వారు పండ్రెండు సంవత్సరముల కాలము సంస్కృతము జదివి పాండిత్యమును సంపాదించి కాళిదాస విరచితమైన శాకుంతల నాటకమును ఇంగ్లీషు భాషలోని కనువదించెను. ఇది చదివినంతనే పాశ్చాత్యులు సంస్కృత భాషను జదువ నుద్యుక్తులైరి. జర్మనుకవి 'గీటె' యీ గ్రంథమును చదివి ముగ్ధుడాయెను. మాక్సుమూలరు పండితు డీవిధమున వ్రాసెను.

> "భారతీయ నాటకకళయొక్క లక్ష్య లక్షణాలను అద్భుతముగ ప్రతిఫలింపజేసిన యీ నాటకరాజము యూరపులో అపూర్వమైన సంచలనము కలిగించినది. పాండితీనిధులైన రసికాగ్రేసరుల ప్రశంసల నందుకొన్నది. భారతదేశములో సమగ్రమైన ఉత్తమసాహిత్యము కలదా యని అనుమా

> నించు యూరపుదేశ చరిత్రకారులను, భాషావేత్తలను, వేదాంతులను బాగుగ ఆకర్షించుటయేగాక వారి కుశంకలను నివారించి భారత సంస్కృతిపట్ల వారి గౌరవమును ఇనుమడింప జేసినది. ఇది ప్రాచీన మానవచరిత్రలకు నాందిగ పరిణమించినది.''

తరువాత జోన్సుపండితుడు 'ఋతు సంహారమును', మానవ ధర్మశాస్త్రమును అనువదించెను. గీతగోవిందమను గ్రంథమును కూడ అనువదించెను. 1885 వ సంవత్సరమున విల్లియం జోన్సు పండితుని ఆధ్వర్యమున ఇంగ్లాండు దేశమునందు సంస్కృతవిద్య విద్యాలయములందు ప్రారంభింపబడినది. అప్పుడు ఆక్స్‌ఫర్డు విద్యాలయమున ప్రత్యేక సంస్కృత పీఠము స్థాపింపబడెను. ఈతడు సంస్కృత - ఇంగ్లీషు, ఇంగ్లీషు - సంస్కృత నిఘంటువును ప్రచురించెను. విష్ణుపురాణమును అనువదించెను. ప్రస్తుతము కామన్‌వెల్తువారి అధీనమున నున్న గ్రంథాలయము వీరు స్థాపించినదే.

హెన్రీ థామసు కోల్బ్రూకు పండితుడు - 1755-1837

45. ఈ కోల్బ్రూకు పండితుడు అనేక సంస్కృత గ్రంథముల ననువదించెను. గొప్పవ్యాసములను రచించెను. 1805 వ సంవత్సరమున వేదములనుగూర్చి పెద్దవ్యాసము నొకదానిని రచించెను. ఇంగ్లాండు దేశమున 'రాయలేషియాటిక్' సంఘము నొకదానిని స్థాపించెను.

అలెక్సాండర్ హమిల్టను

46. హమిల్టనను విద్వాంసుడు సంస్కృతమును చక్కగా చదువుకొని ఇండియానుండి తనదేశమునకు పోవుచు మార్గమధ్యమున దిగకూడని పట్టణమునందు దిగినందున అప్పటిచట్టముల ననుస

రించి ప్యారీసునగరమున శిక్షింపబడి జైలునందుంచబడెను. ఆ సమయమున ఫ్రెంచిపండితులు వారివద్ద సంస్కృతమును చదువుకొనిరి. ఫ్రెడరిక్ ఘాగెలను జర్మనుపండితుడు వీరివద్ద సంస్కృతమును జదువుకొని భారతీయభాషావివేకమును గూర్చి పెద్దగ్రంథము నొకదానిని వ్రాసిరి. దీనివలన జర్మనీవారికి భారతదేశసంస్కృతమును పఠించుటకవకాశము కల్గినది.

యఫ్. రోజర్సు

47. అటుపిమ్మట 'యఫ్. రోజ'ర్సను వారు ఈస్టిండియా కంపెనీలోని వైదికగ్రంథములను వ్రాతప్రతులను, చదువుకొని 1838 లో ఋగ్వేదమునందలి యెనిమిదవ మండలము ననువదించిరి.

ఇ త రు లు

48. సంస్కృతభాషయందు ఆసక్తిగలిగి బాగుగా పాండిత్యమును సంపాదించినవారిలో 'బూలెరు' 'కీల్హారను' 'విల్సను' 'వీబరు' 'మాక్సు మూలరు' మొదలయినవా రనేకు లుండిరి. వీరిలో మాక్సు మూలరు ప్రఖ్యాతభాషాశాస్త్ర తత్త్వజ్ఞుడు, సంస్కృత విద్వాంసుడును. ఆక్స్‌ఫర్డువిద్యాలయమున సంస్కృతవిద్యా బోధకుడుగనుండెను. వీ రనేకపుస్తకములను వ్రాయుటయేగాక ఆంగ్ల సంస్కృత నిఘంటువులను వ్యాకరణమును, ప్రచురించిరి. విష్ణుపురాణమును సంస్కృతముననుండి అనువదించిరి. అనేక సంస్కృత వైదిక గ్రంథములను 'సేక్రెడ్ బుక్సాఫ్ ది యీస్ట్' అనుపేర ప్రచురించిరి. భాషాశాస్త్రమునుగూర్చి అనేకవ్యాసములను ప్రచురించిరి.

సర్ మానీయరు విల్లియంస్

49. 'మానీయరు విల్లియం'సను వారు సంస్కృత నిఘంటువు నొకదానిని ప్రచురించిరి. ఏ. బి. కీతనువారు సంస్కృతభాషాచరిత్రనుగురించియు, సంస్కృత నాటకములనుగురించియు వ్రాసియుండిరి.

50. బ్రిటను దేశమున సంస్కృతవిద్య ప్రథమమున ప్రారంభింపబడినను జర్మనీయే ముందంగవేసినది. జర్మనీవారు సంస్కృత సాహిత్యమును సాధించిరి. హిందువుల ఆధ్యాత్మికవాదము జర్మనీ వారికి సన్నిహితముగ నున్నందున వారికి సంస్కృతజ్ఞానముపట్ల ఔత్సుక్యము గల్గెను. ఎవరోచెప్పినట్లు జర్మనివారు హిందూదేశపు శర్మలేమో; శర్మలనగ బ్రాహ్మణులు.

51. కొందరు పాశ్చాత్యభాషాపండితులు దురహంకారముచే హిందూదేశమునందు సంస్కృతభాషయున్నట్లుగాని, హిందువులకు సంస్కృతిగలదనిగాని నమ్మక యిచటిబ్రాహ్మణులు ఈ రెంటిని గ్రీకు లాటిను భాషావ్యాప్తిని తెలిసికొన్నపిదప తమ తెలివి చమత్కృతులచేత సృష్టించియుందురను నపవాదము వేసినందున నీ విషయమై యింతవిపులముగ వ్రాయవలసివచ్చినది. పైన వ్రాసినదానినిబట్టి పాశ్చాత్యపండితులలో కొందరు దురహంకారతవలన నిట్టి వాదనను లేవదీసిరేగాని అట్టివాదనయం దెట్టి నిజము కన్పించదు. అట్టివాదన తుచ్ఛమైనదనియు, అనవసర రోషపూరితమైనదనియు స్పష్టముగ రుజువుపర్చుటకు పై విషయములు చాలును. ఇది యింతటితో కట్టిపెట్టి భాషాచరిత్రనుగురించి వ్రాయుదును.

భా షా చ రి త్ర

52. యూరపుదేశస్థులకు సంస్కృతభాషనుగురించి కొంత కాలము తెలిసియున్నను, ఈ భాషకును, గ్రీకు లాటిను భాషలకును గల సంబంధములగూర్చి తెలిసికొనుటకు చాలకాలమువరకు నెవ్వరును ప్రయత్నములు చేసియుండలేదు.

53. 1784 వ సంవత్సరమున ఏషియాటిక్ సొసయిటీ కలకత్తాలో స్థాపింపబడినది. దీనితో భాషాతత్త్వశాస్త్ర విచారము ప్రారంభింపబడినది. కొంత కాలమువరకు భాషలయందలి సారూప్య

Nouns

దేవ	ద్యేవ్	God
మృత్యు	మోర్ట్	Death
గణితం	జెనితం	
విధవ	విధ్వ	widow
జాను	జేను	Knee
న	నాట్	not
మధ్య	మీడియం	middle
దత్తం	డేటం	given
దానం	డోనం	gift
త్రిపద	ట్రిపాడ్	Tripod
హోర	హవర్	hour
కేంద్ర	సెంటర్	Centre
అప్	అక్వ	aqua

Pronouns

అహం	యూగో
మే	మే
మహ్యం	మిహా
కస్	క్విస్
కం	క్వెం
స్వ	సన్
త్వం	తు
తుభ్యం	తిభి
కి	క్వి

Verbs

అస్మి	సం
అసి	యస్
అస్తి	యస్ట్
స్మస్	సమస్
స్థ	యస్టిస్
సంతి	స్నట్
స్యాం	సింసిస్
స్యాత్	సిట్

పదము లనేకములను ప్రత్యేకించుటకు ప్రథమమున ప్రారంభించిరి. అందులో కొన్నింటి నీ ప్రక్క నుదాహరించుచున్నాను. ఇట్టి సారూప్యపదములను సంస్కృతము లాటిన్ గ్రీకు పర్షియను భాషల యందు పండితులు కనిపెట్టిరి. ఏషియా యూరపు దేశముల యుత్తరభాగమంతయు సిథియనను పేర బరగుచుండెను. అట్టి పండితులలో ముఖ్యమగువారు 'హాల్హేడ్' 'సర్ విల్లియం జోన్సు' 'లార్డు మొనుబోడో' 'డ్యూగాల్డు స్ట్యువార్టు' 'ఫ్రెడరిక్ షిలెల్' అనువారు. ఈ భాషయొక్క ప్రాచీనత యెట్లున్నను పురాతనమైనను కాకున్నను గ్రీసుభాషకన్న పరిపక్వమై, లాటిను భాషకంటె సంపూర్ణమైనదనియు, రెండిటికంటె దివ్యముగ పరిష్కృతము చేయబడినదియు యద్భుతమగు పొందికతో కూర్చబడినదియునై యున్నదని సర్విల్లియం జోన్సు పండితుడు, సంస్కృత భాషను కొంతవరకు చదివినపుడే స్పష్టపరచెను. సంస్కృతమునందు కొంతయైనను కృషి సల్పిన వా

సంతు	సియంత్
స్యామ	సిమస్
స్యాత్	సిఅత్

రెవ్వరున్ను ఈ భాషయు లాటిన్ గ్రీకు భాషలును ఏదేని యొక భాషనుండి జనియించి యుండునని చెప్పకతీరదు. వీటి మాతృభాషమాత్రమిపుడు వాడుకలో లేదనియే చెప్పవలసియున్నది. ఈ భాషలతోపాటు 'గాథిక్' 'కెల్టిక్' 'పర్షియన్' భాషలున్ను చేర్చవచ్చును. ఈ విషయములను గూర్చియే వ్రాయుచు బ్రాహ్మణులవలన నిప్పటికిని నిలచియున్న సంస్కృతభాష యితరభాషల కన్నిటికంటెను హోమరు పండితుడు వ్రాసిన గ్రీకుభాష కంటెను విపులమైనట్టియు, చక్కగ పరిష్కరింపబడినట్టియు భాషయని 1792 వ సంవత్సరమున లార్డు మొన్బొడో వ్రాసియుండెను. హిందూ దేశములోని అన్ని యితర భాషలకు యీ సంస్కృతభాషతో సారూప్యసాదృశ్యము లున్నవనియు జెప్పుచుండిరి.

54. పాశ్చాత్యు లీ సంస్కృతభాషను కనుగొన్ననాడే ఆశ్చర్యనిమగ్నులై భ్రమను జెందిరి. అందులో కొందరా భ్రమవలన కల్గిన యుద్రేకమునం దిట్టి భాష యుండజాలదని, గ్రీకు లాటిను భాష ననుకరించి యింకొక భాషను 'టక్కరులగు బ్రాహ్మణులు' సృష్టి గావించిరనియు 'న్యూగోల్డుస్ట్యూయూరు' వంటి పండితు లనియుండిరి. పాశ్చాత్యపండితు లీ భాషావిషయమునుగూర్చి కొంతకాలము నమ్మ రైరిగాని 1808 వ సంవత్సరమున 'హిందూదేశ భాషయు, బుద్ధి వికాసమును', అను గ్రంథము నొక పండితుడు వ్రాసెను. ఆ గ్రంథమే భాషాతత్త్వశాస్త్రమునకు పునాది యాయెను.

భాషాతత్త్వ శాస్త్రము : 'ఫ్రాన్సిసు బాపు'

55. సంస్కృతముతో గ్రీకు లాటిను పర్షియను భాషలను పరిపోల్చి వీటియందలి సామాన్య సంబంధములను జూచి పాండిత్య మును కనుపర్చినది, మార్గదర్శిత్వము సంపాదించినదియు జర్మను

దేశస్థుడును బహుభాషావేదియు, నిరంతర పరిశ్రమాసక్తుడు నగు 'ఫ్రాన్సిస్సుబాపు' పండితుడు. ఈ పండితుడు 1832 వ సంవత్సరమున వ్యాకరణము నొకదానిని ప్రారంభించెను. ఈగ్రంథము 1852వ సంవత్స రమున పూర్తిజేయబడెను. ఈ పుస్తకమే భాషాతత్త్వశాస్త్రమునకు మూలగ్రంథము. 'ఆగస్టువాన్' 'విల్లియంషెగెలు' 'హంబోల్టు' 'పాట్' 'గ్రిం' 'పైన్‌రాకుస్' మొదలయినవారు తరువాత భాషా సేవ చేసినవారు. వీరిలో 'రాస్క్' పండితుడు 'జెండు అవెస్టా' వ్రాయబడిన భాషయు సంస్కృతభాషకు సంబంధించినదే యని నిర్ధారణ గావించెను.

56. 1854 వ సంవత్సరమున పరస్పర భాషాసంబంధము లను తెలియజెప్పెడి పత్రికయొకటి స్థాపింపబడెను. లండనుపట్టణము నందు భాషాతత్త్వశాస్త్రసంఘ మొకటి యేర్పరుపబడెను. యూరపు ఖండమునందు ప్రతి విశ్వవిద్యాలయమునందు భాషాతత్త్వశాస్త్రమును బోధించు నొక సంస్కృత భాషాపండితుని ఏర్పాటుగావించిరి.

భాషాకుటుంబములు

57. 'లాటిన్' 'గ్రీకు' 'ఫ్రెంచి' 'ట్యూటానిక్' 'కెల్టిక్' 'స్లవానిక్' భాషలు సంస్కృతభాషనుండి జనించిన వనియు, వాటికది మాతృభాషయనియు మనము నిర్ధారణచేసి చెప్ప జాలముగాని యీ భాషలన్నిటికి సంస్కృతభాష అగ్రసోదరియని మాత్రము చెప్పనగును. ఇట్టి నిర్ణయమున ఒకటి ముఖ్యావసర మనియు తోచుచున్నది. ఈ భాషలన్నియు నింకొక అనాదిభాష నుండి జనించియుండవలె నని చెప్పుటకును అవకాశములు గలవు. ఇప్పటినుండియే పైనచెప్పిన భాషలలోని వ్యాకరణరూపములను సరి పోల్చుట ప్రారంభింపబడి ఏయే భాషలు ఏయే కుటుంబములకు జెందినవను విషయమును సాధించుటకు ప్రారంభింపబడెను. ఇట్టి పరి శోధనల గావించి, లాక్షణికులు యూరపు ఏషియా ఖండములందలి

భాషలు కొన్ని కుటుంబములకు జెందినవనియు, ప్రతికుటుంబమునకు కొన్ని శాఖలున్నవనియు, అట్టిశాఖలలో కొన్నిభాషలయందలి మాటల సరణియందు ప్రత్యేకత కలదనియుకూడ కనుగొనిరి.

58. అట్లు కుటుంబముల నేర్పరచుటలో నేయే దేశములందలి భాషలను కలిపి ఒక కుటుంబముగా నేర్పరుపవచ్చునో యని సమగ్రముగ నాలోచింప ప్రారంభించిరి. ప్రపంచమున నొకజాతివారిలో కుటుంబము లెట్లుండునో అట్లే భాషలయందును కుటుంబము లేర్పరుపబడినవి. ఏ భాష యే కుటుంబమునకు జేరినది తెలిసికొనుటకు మార్గముల నన్వేషించి వాటియందలి పదములలోని సారూప్య సాదృశ్యములనుబట్టియు, పదపరికరములబట్టియు (material), పదముల సంఘటనాపద్ధతి బట్టియు (method of expression), వ్యాకరణాంశములను బట్టియు కుటుంబముల నేర్పరచిరి.

59. పదసారూప్య సాదృశ్యములనుబట్టియు, పదపరికరములను బట్టియు చేయబడిన భాషాకుటుంబములు 'జీనియోలాజికల్' విభాగములనియు, పదముల సంఘటనాపద్ధతినిబట్టియు, వ్యాకరణాంశములనుబట్టియు చేయబడిన భాషాకుటుంబములు 'మార్ఫొలాజికల్' అనియు పేరుపెట్టబడినది.

60. మార్ఫొలాజికలు విభాగమునందు తిరిగి మూడు విభాగములు జేయబడినవి. అందు మొదటిది శబ్దము మార్పు జెందక శబ్దరూపముగనే భాషయందుండునది. ఇట్టి భాషలకు 'మానోసిలబికు' భాషలని పేరుపెట్టిరి. ఈ భాషలలో ఏపదమున కాపదము రెండవపదముతో కలియక తన ప్రత్యేకతను నిలుపుకొనును. ఇట్టి భాషలు 'చైనీసు' 'బర్మను' భాషలై యున్నవి. మాటకు మాటను కల్పి సంబంధమును చెప్పవలయునేగాని శబ్దముమాత్రము మార్పును చెందదు.

61. ఒక పదమున కింకొక ప్రత్యయమును కలిపి మొదటి మాటను మార్చుటవలన బాంధవ్యమును వ్యక్తపరచుపద్ధతి యింకొకటి కలదు. ఈపద్ధతియందు మొదటిపదములో మార్పుగలుగుచున్నది. ఈ మార్పువలన మనకు కొంత సంబంధమును తెలియుచున్నది. అయితే యీమాటయు, ప్రత్యయమును కలసిపోయినను ఈ రెంటిని విడదీయవలెనన్న విడదీయగలము. 'రాముడు' అను శబ్దమువలన మన మొక మగవానిని తెలిసికొనుచున్నాము. అయితే 'అందు' అను ప్రత్యయమును 'రాము'డు అను పదమునకు కల్పినచో ఈ రాముడు అను పదమును 'అందు' అను ప్రత్యయమును కలసి 'రామునియందు' అగుచున్నది. ఇప్పుడీమార్పువలన మనకు గల్గెడు భావమునందు కొంతమార్పువచ్చినది. 'రామునియందు'అను పద మిపుడు ఒకటే పదముగ కలసిపోయినది. ఈ రెండుపదములను విడదీయవలెనన్నను విడదీయగలము. ఈ రెండుపదములను విడదీయ గల్గుటయే రెండవవిభాగము. వీనికే భాషాశాస్త్రజ్ఞులు 'అగ్లూటినేటివ్' అని ప్రత్యేకమైన పేరుపెట్టిరి. దీని అర్థము ఒకదాని కింకొకటి యతికించు పద్ధతి.

62. ఇందులో మూడవవిభాగ మింకొకటి కలదు. దానినే 'ఇన్ఫ్లెక్షనల్' అని శాస్త్రజ్ఞు లందురు. ఈ మూడవ విభాగములో మొదటి పదముతో కల్పిన ప్రత్యయము అందే చేరిపోయి విడదీయుటకు వీలులేకుండునట్లుగ మొదటిపదములో సంపూర్ణమయిన మార్పును కలుగజేయును. 'రామః' అనుపదము ప్రథమావిభక్తి యేకవచనము. ద్వివచనముగా మారుటకు 'ఔ' అను ప్రత్యయము కలియును. ఈ 'ఔ' అను ప్రత్యయమున కెట్టి యర్థమును లేదు. కాని యిది ద్వివచనమును సూచించుచున్నది. అప్పుడు మొదటి పదము 'రామౌ' యగును. 'ఔ' అనునది విడదీయుటకు వీలులేకున్నది. ఈ పైన వ్రాయబడిన మూడుభాగములున్న 'మానోసిలబిక్'

'అగ్లుటినేటివ్' 'ఇన్ఫ్లెక్షనల్' - ప్రథమభాగమగు 'మార్ఫొలాజికల్' అనుదానిలోని విభాగములు.

63. సారూప్య సాదృశ్యములనుబట్టియు, పదపరికరములను బట్టియు చేయబడిన విభజన 'జీనియొలాజికల్' అని యిదివరకే వ్రాసియుంటిని. 'జీనియొలాజికల్' వంశపారంపర్యముగ నొకదానినుండి రెండవది వచ్చుట యని యర్థము. ఒక భాషనుండి యింకొక భాష జననము స్ఫురించుట. ఈ రెండువిభజనలవలన భాషలను శాస్త్రజ్ఞులు విభజించిరి. ఈ విభజనల వివరముల చెప్పకపూర్వము గమనింపబడినట్టియు, గమనింపబడవలసినట్టియు కొన్ని ముఖ్య సూత్రములను గూర్చి యిచట వివరించెదను.

64. భాషలన్నియు నొకేభాషనుండి యుత్పన్నమయినవా? లేక వేరు వేరు భాషలనుండి యుత్పన్నమయినవా? యనునది వివాదాంశము. ప్రస్తుత భాషల పరిస్థితినిబట్టియు, అవి పొందుచున్న మార్పులనుబట్టియు భాషకు మార్పు సహజమని స్థిరపడుచున్నది. మన భాషయందే యిట్టిమార్పుల ననేకములను మనము జూచుచున్నాము. ఈ భాషలను మాట్లాడువారి స్థితిగతులనుబట్టియు, వారి ప్రకృతులనుబట్టియు, వారికిగల యితరుల సంబంధములనుబట్టియు భాష వేరువేరు రూపముల ధరించుట మనము చూచుచునేయున్నాము. ఒకేపదము పిల్లలచే నుచ్చరింపబడినపు డొకరీతిగను, ముసలివారిచే నుచ్చరింపబడినపు డింకొక రీతిగను, చదువుకొన్నవారిచే మరియొక్క రీతిగను, చదువురానివారిచే మరియొక విధమునను ఉచ్చరింపబడుచున్నది. ఈ భాషలో నిట్టిమార్పు లెన్నివచ్చినను భాషాశాస్త్రవేత్తలీ భాష ప్రథమమున నేకుటుంబమునకు చెందినదో యను విషయము నన్వేషించి వాటికుటుంబముల నేర్పరచి యున్నారు.

65. ఈ భాషాచరిత్ర దేశచరిత్రను బట్టియు కొంత మారుచున్నది. అయితే అట్టిమార్పులన్నియు దేశచరిత్రవలన తేలికగా

కనుగొనబడగలవు. పాశ్చాత్య దేశమునందలి 'స్పానిష్' 'ఫ్రెంచి' 'యిటాలియన్' 'పోర్చుగీసు' భాషలన్నియు మొదట 'లాటిను' భాషనుండియే వచ్చినవని చెప్పవచ్చును. అట్లే ఉత్తర హిందూస్థానములో నున్నభాషలన్నియు సంస్కృతభాషకు సంబంధించినవియే యనియు, ఈ భాషలన్నియును, జెండెవెస్టా భాషయు నొకే భాషనుండి జనించిన వనియు కనబడుచున్నది. అట్లే ఇంగ్లీషుభాష 'ట్యూటానికు' భాషాకుటుంబమునకు చెందినదనియు, జర్మనులలోనివారగు 'అంగలు' 'శాక్సనులు' ప్రథమమున ఇంగ్లాండునకు వచ్చి పరిపాలన గావించినందున యీ సంబంధము చక్కగా నిలబడినదనియు చరిత్రవలన తెలియుచున్నది. ఉత్తర హిందూస్థానములోని భాషలన్నియు ఇండో ఆర్యను భాషాకుటుంబమునకు జెందినవై యున్నవి. అయితే ఒకప్పుడు మనకును, ఇంకొక జాతివారికినిగల రాజ్యాధికార సంపర్కమువలన రెండవవారి భాషలలోని పదములను మనము మనభాషలో చేర్చుకొనవచ్చును. కాని అట్టిమాటలు మన భాషలోలేనపుడు తెచ్చుకొందుముగాని, ఉన్నవాటిని వదలివేసి క్రొత్తమాటలను మనము సహజముగ మనభాషలో చేర్చుకొనము. అట్టిక్రొత్తమాటలను కొన్నిటిని తెచ్చికొన్నను అరువుమాటలు అరువుమాటలుగనే కనబడును. కనుక మనభాషయందుండు దేశీయపదములవలన భాషాకుటుంబము లేర్పాటుచేయబడుచున్నవి. ఒక్కొక్కప్పుడు భాషలకు గల్గిన సంపర్కమువలన ప్రస్తుతము వాడుకలోనున్న భాషలు పూర్తిగా మారిపోయి ప్రథమమున నుత్పన్నమయిన భాషలనుండి వ్యతిరేకింపబడుటయు కలదు. జండెవెస్టా వ్రాయబడిన పార్సీభాషయు మనవైదిక భాషయగు సంస్కృతము నొకే భాషాకుటుంబంలోనివే యైయున్నను ఇప్పటి పార్సీభాషయందు 'అరబికు' పదము లతి హెచ్చుగనుండి యీ భాషతో ఎక్కువ సంబంధ ముండుటచేత ఆ భాషను సెమిటికు భాషాకుటుంబములో చేర్చినను చేర్చవచ్చును. అట్లే ఇంగ్లీషుభాష ప్రథమమున జర్మన్ ట్యూటానికు కుటుంబ భాషలలోనిదే యైనను తరువాత నార్మను

లింగ్లాండుపై దండెత్తి వారి లాటినుభాషను సంపూర్ణముగ జొప్పించి నందున ఇపు డీ యింగ్లీషుభాషను ఇండోయూరపియను భాషా కుటుంబములో చేర్చినను తప్పేమియు కనబడదు.

66. "జనని సమస్తభాషలకు సంస్కృతభాష ధరాతలంబునన్" అని మన పండితుల అభిప్రాయమై యుండెను. ఒకప్పుడు పాశ్చాత్యులును సంస్కృతభాష ఇండో యూరపియను భాషలన్నిటికి తల్లియని తలంచిన కాలమున్న ఉండియుండెను. ఇప్పు డీ యభిప్రాయమునందు కొంతమార్పు కలుగజేసి శబ్దశాస్త్రవేత్త లందరు నీ సంస్కృతభాష యిండోయూరపియను భాషాకుటుంబమునకు జెందిన భాషా వాఙ్మయములలో నతి ప్రాచీనమై ప్రాచీనభాషా లక్షణముల నధికముగ జూపుచున్నను, గ్రీసు లాటిను జర్మానికు మరికొన్ని ప్రాచీనతరమగు లక్షణముల జూపుచున్నవనియు వీటికిని సంస్కృతభాషకును సోదరభావమేయనియు, అనగా ఈ భాషలన్నియు నింకొక ఇండో జర్మానికు భాషాకుటుంబముననుండి వచ్చిన వనియు నేర్పరచియుండిరి.

67. సారూప్య సాదృశ్యముల వలననే భాషాసాన్నిహిత్యమును మన మేర్పరుపజాలము. ఒకప్పు డీ సారూప్య సాదృశ్యములు యాదృచ్ఛికముగ నుండవచ్చును. కాన నీ విషయమును గూర్చి చర్చించునపుడు భాషావేత్తలు బహుజాగ్రత్తగ నుండవలెను. నిత్యజీవితమునందు మనము 'మాట్లాడుమాటలు, మాటలవరుసలు పదముల సంఘటనలు మొదలైన విషయములందు సారూప్య సాదృశ్యములు జూడవలయును. నిత్యపరిచితములగు వస్తువులు, అవయవములు బాంధవ్యములు గూర్చిన పదముల నుదాహరణముగ తీసికొనవలయును. అట్టివి తల, నోరు, ముక్కు, కాలు, చెయ్యి మొదలయిన అవయవములు, తల్లి, తండ్రి, అన్న, అక్క మొదలయిన బంధుత్వములును తెలియజేయు పదములు, ప్రతి దినము కనబడు

జంతుజాలము మొదలయిన వాటియొక్క పద సమూహమునందలి సారూప్యము, సాదృశ్యములను ఉదాహరణముగ గైకొనవలెను.

68. నిఘంటువులయం దిట్టి మాటలను తీసికొనినచో ఇంగ్లీషుభాషయందు నలువది మూడువేల పైచిల్లర పదములలో దాదాపు ముప్పదివేలమాటలు లాటినుభాషకు సంబంధించినట్లు చెప్పబడినవి. కాని అంతమాత్రమున ఇంగ్లీషుభాష లాటినుభాషకు సన్నిహితమైనదని చెప్పుటకు వీలులేదు. అట్లే మన తెనుగుభాషయందు పన్నెండువేల పైచిల్లర దేశిపదములును, పదునేనువేల సంస్కృతపదములు ఉన్నట్లు కనుపడుచున్నవి. దీనివలన మాత్రమే మన మేదియు నిర్ధారణ చేయజాలము.

69. భాష మారుచుండుటయే సహజస్థితియని యిదివరలో చెప్పియుంటిని. పూర్వమున్న అర్థములు మారి కొంతకాలమునకు పదములకు క్రొత్తఅర్థములును కలుగుచున్నవి. పూర్వము 'విందు' అను పదమునకు 'అతిథి' యను నర్థముండెడిది. ఇప్పు డట్టి అర్థము లేదు. భారతమునందు 'విందవైతివి నాకు' యని యున్నది. ఇట్లే మనుచరిత్రమునందు 'మాయింట విందువైతివి' యని వ్రాయబడెను. ఇప్పుడు 'అతిథి' యందుముగాని 'విందు' అని యుపయోగించము. సంస్కృతపదము 'కక్ష' తెనుగున 'చంక' యైనది.

70. అక్షరములయందు మార్పు లీ క్రింది పదములలో కనబడుచున్నవి.

"య"కు బదులు "జ"		"శ" బదులు "స"		"క"కు బదులు "చ"		"హ"కు బదులు "ప"	
యజ్ఞము	జన్నము	శాణము	సాన	కివి	చెవి	పాలు	హాలు
యత్నము	జతనము	శవము	సబము	కిళి	చిలుక	పొన్న	హొన్న
యంత్రము	జంత్రము	యశము	అసము	కెయి	చెయ్యి	పళము	హళము
యముడు	జముడు	దోషము	దోసము	కెంబోను	చెంబు	పది	హది
యోధ	జోదు			కక్షుళి	చెక్కుళి		
					చంకుళి		
					చంక		

71. భాషాకుటుంబముల నేర్పరచుటలో పదముకన్న పద సంఘటనారీతి, వ్యాకరణాంశములు ముఖ్యములు. భాషాసంపర్కము వలన కొన్ని వ్యాకరణాంశములు భాషలో లోపించవచ్చుగాని వ్యాకరణములో మాత్రము మార్పు లసంభవము. వైదికభాషలో తుమున్నంతములు అనేకములుండినట్లు పాణిని వ్యాకరణమున కనబడుచున్నది. ఇప్పుడు ఒక తుమున్నంతము మాత్రమే కనబడుచున్నది. తుమున్నంతము (Infinitive Mood) లేడాది (Subjunctive Mood) లోపించినది. ఈ విషయమును గూర్చి 'టక్కర'ను భాషాశాస్త్రజ్ఞుడు 'భాషయొక్క నైజచరిత్ర' యను (Natural History of Language) గ్రంథమున నిట్లు వ్రాసియుండెను.

> "జీవించియున్న భాషలో ఇతర భాషలలోని మాటలు ఎన్నియైనను అరువుతెచ్చుకొని యుండవచ్చును కాని పరాయిభాషా వ్యాకరణాంశములను అరువు తెచ్చుకొన్నట్లుగా నిరూపించగల్గిన సాక్ష్యమెచటను కనబడనట్లే భాషాశాస్త్రజ్ఞులు ఏకాభిప్రాయమును కనబర్చి యున్నారు."

> "ధ్వనివికారమన భాషాశాస్త్రమునందు (Phonetic Law) (ఫొనెటిక్ లా) అందురు. ఈ క్రింది పదములయందు సాదృశ్యము కలదు. కాని అది కేవలము యాదృచ్ఛికమై యున్నది (Accidental) : ప్రాప్ (Prop) ప్రాపు. మౌత్ (mouth) మూతి. సారో (sarrow) విచారము."

72. ఈపైన వ్రాయబడిన సూత్రములను మిక్కిలి జాగరూకతతో కనిపెట్టి వాటిననుసరించి భాషాశాస్త్రజ్ఞులు కొన్ని తీర్మానములను గావించిరి. యూరపుదేశమునందలియు, హిందూదేశమునందలియు భాషలన్నియు నొకకుటుంబములో చేరియుండుటచే యీరెంటిని కలిపి 'ఇండోజర్మానిక్' భాషాకుటుంబమని పేరుపెట్టిరి. జర్మనీదేశమునకు పశ్చిమమునందుండు దేశమునందలి భాషలుగాని, హిందూదేశమునకు తూర్పుననుండు భాషలుగాని యీ కుటుంబములో లేనట్లుగా నుద్దేశింపబడెను. దీనినే యొకప్పుడు 'ఇండో ఆర్య'నని కూడ పిలచియుండిరి. అయితే జర్మనీకి పశ్చిమముననుండు 'కెల్టిక్' భాషయు నీ కుటుంబమునకే జేరినదిగ తరువాత కనుగొనబడినందున యీ కుటుంబమును 'ఇండో కెల్టిక్' కుటుంబమనియు పిలిచిన బాగుండుననని భాషాపండితు లభిప్రాయబడిరి. కాని పేరును మాత్రము మార్చి యుండలేదు. అప్పటినుండియు నీ కుటుంబమును 'ఇండోయూరపియ' ననిమాత్రమే పిలుచుచుండిరి.

73. ఈ కుటుంబమునకు ఎనిమిది శాఖ లేర్పరుపబడినవి. అవి 1. ఆర్యను, 2. ఆర్మీనియను, 3. ఆల్బేనియను, 4. బాల్టో స్లవానిక్, 5. గ్రీక్ లేక హెల్లెనిక్, 6. ఇటాలిక్, 7. కెల్టిక్, 8. జర్మానిక్. పైశాఖలలో ఆర్యనుశాఖమాత్రము ముఖ్యశాఖగా పరిగణింపబడెను.

74. ఈ పైశాఖభాషలలో మొదటి నాలుగు శాఖలున్ను 'శాతం' భాషలనియు మిగిలిన నాల్గు భాషలున్ను 'సెంటం' భాషలనియు పిలువబడుచున్నవి. నూరు అను అంకెను శతమనియు సెంటమనియు పదములు తెలుపును. ఈపదముల భేదములనుబట్టి ఈ 'శాతం' 'సెంటం' అను సాంకేతిక నామములు గల్గినవి. 'సెంటం' శాఖవారు నూటిని 'సెంటం' అనియు, 'శాతం' శాఖవారు నూటిని 'శతం' అనియు పిలుచుచున్నారు. లాటిన్ భాష ఇటాలియన్ శాఖలోనిది. ఆంగ్లోశాక్సను, ఐరిషు భాషలు కెల్టిక్ శాఖలోనివి.

75. ఆర్యను శాఖలోని ఆర్యులనుగూర్చి ముందురాబోవు ఉపన్యాసమునందు వివరముగ వ్రాయుదును. ఈ ఆర్యనులు ప్రథమమున ఆర్మీనియాదేశమున నుండిరని హెచ్చుమంది శాస్త్రజ్ఞుల అభిప్రాయమని తోచుచున్నది. ప్రళయము సంభవించినపుడు వారిలో కొందరు పశ్చిమప్రాంతములకును, మరికొందరు తూర్పునకును బోయిరి.

వీరే 'సెంటం' జాతివారు. సెంటంవారు పడమరకును, శాతంవారు తూర్పునకును పోయిరి. పడమరకు వెళ్ళిన సెంటంవారే 'కెల్టిక్' 'గ్రీక్' 'లాటిన్' 'ట్యూటను' జాతివారి పూర్వికులు. ఈ తూర్పుకు వెళ్ళినవారు ఇండియన్ ఇరేనియన్‌ల పూర్వికులు. ఈ తూర్పునకు పోయినవారిలో కొందరు ప్రళయానంతరము తిరిగి కలుసుకొని, కొంతకాలము సహజీవనము జేసి మరికొంతకాలము తమలోతాము పోరాడుకొని ఒక శాఖవారు పర్షియా ఇరాను దేశములకు, రెండవ వారు హిందూదేశమునకుపోయిరి. ఇట్లు పోయినవారిలో హిందూ దేశమునకు పోయినవారు మొదట హిందూదేశమునకు పోయినవారి తరువాత చాలా కాలమునకు అనగా కొన్ని శతాబ్దములకు పోయి యుందురు. అయితే యిట్లు ఒకరి వెనుక నింకొకరు రెండుమారులు వెళ్ళిరా, అంతకన్న హెచ్చుమారులు వెళ్ళిరాయని చెప్పుట సాధ్యము కాదు. కాని మొదటివారు వెళ్ళిన కొన్ని శతాబ్దములకు రెండవ వారు వెళ్ళినందున మొదటివారి ఆర్యభాషకును, రెండవమారు వెళ్ళినవారి ఆర్యభాషకును హెచ్చుభేదములు కనిపించుచున్నవి. ఈ ఆర్యులను గురించియు, వారి వారి భాషలను గురించియు ముందు ఉపన్యాసమున కొంత విశదముగా జెప్పబడును.

ఐరేనియను శాఖవారు

76. ఇట్లు ఆర్యులలో చీలిపోయినవారు కొంద రుత్తరదిశకును, మరికొందరు దక్షిణదిశకును వెళ్లిరి. కొంతకాలమునకు వీరి భాషయు మారిపోయెను. వీరు మాట్లాడుభాషలు 1. పర్షిక్ 2. మెడిక్. పర్షిక్ భాష పర్షియా దేశమునందును, బెలూచీ స్థానమునందును మాట్లాడబడుచుండెను. ఈ భాషయే ఆఫ్ఘనిసానమునందును మాట్లాడబడుచుండెను. ఈ పర్షియనుభాషయే 1వ డెరయసు ప్రభువు రాజ్యము చేయు కాలమున క్రి. పూ. 522–486 సంవత్సరములలో మాట్లాడబడు భాష అయియున్నది. ఈ భాషయే కొంతకాలమునకు పర్షియను

భాష యనిగాని. 'పెహ్ల్వి' (Pelhvi) భాషయనిగాని పిలువబడెను. ఇదియే తరువాత పర్షియనుభాషగా విజృంభించి కొంతకాలమునకు హిందూదేశభాషలలోనికి ప్రవేశించెను. రెండవభాషయగు మెడిక్ భాషలో జెండు ఎవెస్టా యను గ్రంథము వ్రాయబడినది. ఈ భాష హెచ్చుగ పర్షియాదేశపు ఉత్తర పడమర భాగములయందును తూర్పు యిరాను దేశమునందును మాట్లాడబడెను. ఈ మెడిక్ భాషనుండియే హిందూస్థానములోని ఆఫ్ఘనుస్థానములో మాట్లాడబడు పుష్టుభాషయు, బెలూచిస్థానములోని బెలూచి భాషయు జనించినవి. ఈ రెండును గాక యింకా మరికొన్ని యితర భాషలును జనించినవి. పైన వ్రాసిన పుష్టూభాషను మాట్లాడువారే 'పుష్టానులు'. వీరినే 'పుక్తాను' లనియు, 'ప్రథాను' లనియు కూడ పిలుచుచున్నారు. వేదమునందు వ్రాయబడిన పుక్తాజాతివారు వీరేయని తెలియుచున్నది.

77. పైన వ్రాయబడిన ఇండోయూరపియను భాషా కుటుంబముగాక భాషాశాస్త్రజ్ఞులు విభజించిన భాషా కుటుంబములు మరి కొన్ని గలవు. వాటిపేర్లను మాత్రము యీక్రింద వివరించుచున్నాను.

ఇతర భాషాకుటుంబములు

78. 1. సెమిటిక్
2. యూరల్ అల్టారిక్
3. మలయొ పాలినీషియన్
4. దక్షిణఆఫ్రికాయందలి బాంటియన్
5. ద్రవిడియన్.

ఈ పై కుటుంబములలో మనకు సంబంధించినంతవరకు ద్రవిడియను భాషాకుటుంబ మొకటి గలదు. ఈ ద్రవిడియనులను గురించియు, వారి భాషలను గురించియు మున్ముందు వ్రాయబడును.

కొన్ని ఇంగ్లీషు భాషలోని పదములను తెనుగు భాషలోని పదములు అనుకరించుచున్నవి

ఇంగ్లీషు	తెనుగు	ఇంగ్లీషు	తెనుగు
అబ్బ (అబ్ వాహన్)	అబ్బ	యూన్	యూని
అడెలా (మధ్య ఇంగ్లీషు)	అడలు (హడలు)	కేడ	చెడుగు
అడ్డి (మడిల్)	అడుసు	కాక	కాకి
అటిక్	అటక	కెన్	కను
బార్క్	బెరడు	కిల్	కూలు
బేబ్	బొబ్బ	మమ	అమ్మ
బెల్ల	పిల్ల	మాన్ (ఆంగ్లోమేగన్)	మొగ
బోన్	బొమికె	మైడ్ (ఆంగ్లోశాక్సను)	మెగ్గ, మగువ
ఛీక్	చెక్కిలి	మైట్	మొటి
ఛిల్	చలి	నీట్	నీటు
ఛింక్	చినుగు	ఒన్	ఒకటి
చిట్	చిట్టి	ఊంజ్	ఊరు
చిట్టర్	చిత్తరు(వణుకులు)	అదర్	ఇతర
ఛోక్	చొక్కు	పప	అప్ప
ఛక్కిల్	పకిలించు	పేల్	పేలవము
కోర్స్	కొర, కొరికము	మొరింగ (లాటిన్)	మురగ, మునగ
	క్రేవు, క్రొవ్వన	పాత్	బాట
డిం	దిమ్మ	పాక్స్	పొక్కు
డిప్	దింపు	త్రో	త్రోయు
రీల్	ఊరలు	పాంప్ (గ్రీకు)	పంపు
శాక్	సంచి	రేసు	రేచు
శాగ్	సాగు	టెల్	తెలుపుట

మూడవ ఉపన్యాసము

ఆర్యులు

1. ప్రపంచమునందు ప్రథమమున సృష్టి యెట్లుజరిగినది యను ప్రశ్న బహుసులభముగ నడుగవచ్చును గాని అట్టి ప్రశ్నకు జవాబు చెప్పుట మాత్రము బహుకష్టము. ప్రథమమున ఎచట ఎప్పుడు ఏది సృష్టింపబడినది ? మొదట సృష్టింపబడిన దేది ? ఈ ఆర్యులనువా రెవరు ? వీ రెచటివారు ? మన హిందూదేశమున కెపుడు వచ్చిరి ? అను నీ ప్రశ్నలు ప్రథమముననుండి విజ్ఞులైన శాస్త్రజ్ఞులచే నాలోచింప బడినవి. అట్టిప్రశ్నలకు వారిలో పండితులు వారికి తోచిన సమాధాన ములను చెప్పియుండిరి. ఈ విషయముల నొక్కొ-క దానినే జాగరూక తతో పరిశీలించి తగిన సమాధానములకై ప్రయత్నించెదను. ప్రథమ మున నీ సృష్టిని గురించి యాలోచించెదము.

ప్రథమ సృష్టి

2. మన హిందూదేశ సాహిత్యమునకు సంబంధించినంతవరకు మనకు తెలిసినంతవరకు వేదములే ప్రథమమున సృజింపబడినవై యున్నవి. వేదవాఙ్మయమునందును ఋగ్వేదమే మొదటిది. అటుపిమ్మటనే ఇతరవేదములు, బ్రాహ్మణములు, ఆరణ్యకములు, ఉపనిషత్తులు, పురాణములు వ్రాయబడినవి. ఈ వాఙ్మయము నంతను పరిశీలించిన నీ క్రిందివిషయములు తెలియవచ్చుచున్నవి.

3. మను వను నామాంతరము గల్గిన స్వాయంభువ ప్రజాపతి బ్రహ్మమానసపుత్రుడుగా ప్రథమమున సృజింపబడి సృష్టిని వెలువ రించెను. ఈతడు స్వర్గలోకవాసి. ప్రజాపతి యనబడు మనువు ప్రథమ మున మానవజాతినిసృష్టించి వారికొక రూపమును, ఆకారమునుకల్గించు

టకు ప్రయత్నించెను. ఇదంతయు బ్రహ్మప్రేరేపణయే. ఆసమయమున భూమియంతయు నీటియందు మునిగియుండెను. మనువుయొక్క ప్రయత్నము ఫలించుటకు భూమి నీటినుండి బయల్పడుట అవసరమైనందున, అందులకై దేవునిప్రార్థించెను. ఇట్టి ప్రార్థనల ఫలితముగా భూమి నీటినుండి బయల్పడెను. అప్పుడు మనువు స్వర్గలోకమునుండి దిగి సరస్వతీ, దృషద్వతీనదులమధ్యనున్న 'బ్రహ్మావర్త'మను దేశమున తన స్థానము నేర్పరచుకొనెను. మనువు ఈ ప్రదేశమున నున్నందున నీ దేశమే మనుక్షేత్రమనియు పిలువబడుచుండెను. ఈ మనువుతో పాటు మరి పదునార్గురుకూడ వచ్చియుండిరి. వారినే ఆర్యులనియు, భరతులనియు పిలుచుచుండిరి. దీనినిబట్టి ఆర్యులు ఈశ్వరుని పుత్రులై యున్నారు. మానవజాతి స్వాయంభువమనువువలన కల్గినవారే. స్వాయంభువ మనువు భరతుడై యుండెను. ఈ భరతుని సంతతివారే భారతీయులు. వీరు నివసించు ప్రదేశమే భరతవర్షము. దీనినే ఆర్యావర్తమనియు పిలుచుచుండిరి. అప్పటినుండియే వైవస్వతమన్వంతర కాలము ప్రారంభించెను. ఇప్పుడీ క్రింద వ్రాయబడిన విషయములను చదువుదము. ఇవి తైత్తిరీయ ఉపనిషత్తునందును, ఋగ్వేదమునందును వ్రాయబడియున్నవి.

ఆపోవా ఇద మగ్రే సలిల మాసీత్
తేన ప్రజాపతి రశ్రామ్యత్
కథ మిదం స్యా దితి
సోఽపశ్యత్ పుష్కరపర్ణం తిష్ఠత్.

ప్రథమమున అంతయు జలమయము. మానవజాతి నిర్మించుటకై ప్రజాపతి తపస్సుగావించెను. అప్పుడు జలమునందు పుష్కరపర్ణము చూచెను.

సో అమన్యత అస్తి వైతత్
యస్మి న్నిదం అధితిష్ఠతి ఇతి
సో వరాహరూపం కృత్వోపన్యమజ్జత్

సా పృథ్వీం అధ అర్చత్
తస్య ఉపహత్యాథ మజ్జత్
తత్ పుష్కరపర్ణే అప్రథయత్
య దప్రథయత్ తత్ పృథ్వ్యై పృథ్వీత్వమ్.

పుష్కరపత్రమునుచూచి దాని కెద్దియో ఆధార ముండవలెనని తలచెను. వెంటనే వరాహరూపము ధరించి నీళ్ళలో మునిగెను. క్రింద నున్న భూమిని చేరెను. ఆ క్రింద నున్న కొంతమట్టిని తెచ్చి ఆ పత్రమునం దుంచెను. ఆ పత్రమునం దుంచిన భాగమే భూమి ఆయెను.

మహిక్షేత్రం పురుశ్చంద్రం
వివిద్వాది త్సస్విభ్య శ్చరథన్ సమైరత్
ఇంద్రో నృభి రజనత్ దీద్యాన శాఖం
సూర్యం ఉషాసం గాతు మగ్నిమ్.

తన స్నేహితుడు నివసించుటకై భూమిని సృజించెను. అంత సూర్యుని, ఉషస్సును, అగ్నిని మనుష్యులకై యింద్రుడు నిర్మించెను.

'అవసృజత్ సర్తవే సప్తసింధుః.'
'ద్రోనిం దేవకృతమ్.'
'ఇంద్రాః ఆపో మనవే సస్రుతాస్కహాః.'
'అహం భూమిం ప్రదదా మార్యాయ.'

సప్త సముద్రములను నిర్మించెను. దేవుల జన్మస్థానమును నిర్మించెను. మానవులకు నీరును నిర్మించెను. భూమిని ఆర్యుల కిచ్చితిని.

'ఉదదా ఆర్యా యూహం వృష్టిం.'
'అపవృణో జ్యోతి రార్యాయ.'
'అజనయన్ సూర్యం ద్యాఉషాసమ్.'
'ఆర్యాః అత్ర ఆవర్తంతే పునః పునః'
'ఉద్భవంతి ఇతి ఆర్యావర్తః.'

ఆర్యులకు వానను కురిపించితిని. ఆర్యులకు వెలుగునిచ్చితిని. సూర్యుని, ఉషస్సును ఆకాశమున నిర్మించితిని. ఆర్యు లిచట తిరిగి తిరిగి వచ్చుచుందురు గనుక ఆర్యావర్తము.

దృషద్వత్యాం మానుష ఆప్యాయన్
సరస్వత్యాం రేవ దగ్నే దిదీవా.

ఓ అగ్నీ ! దృషద్వతీ సరస్వతీ నదుల మధ్య చక్కగా ప్రజ్వరిల్లుము.

— ఋగ్వేదము

"అధో దేవలోకం దేవ మనుష్యలోకే ప్రతిష్ఠిత"

ఈ భూలోకమున నుండుటకై మనుష్యులు దేవలోకమున పుట్టిరి.

— తైత్తిరీయము

4. ఈ పైన వ్రాయబడిన వాక్యములన్నియు ఋగ్వేదము నుండియు, తైత్తిరీయోపనిషత్తునుండియు సంగ్రహింపబడినవి. వీటిని బట్టి స్వయంభుమనువు ప్రథమ ఆర్యు డని స్పష్టము. ఆతడు దేవుడు. మానవులలో ప్రథముడు. ఆతని సంతతివారే మనుష్యజాతివారు. ఆతడే భరతుడు. ఇది మానవజాతికి జన్మస్థలము. ఇది దేవులచే సృజింపబడినది. ఇంద్రుడు ప్రథమ ఆర్యుడైన మనువుకు నీరు నిచ్చెను. ఈ భూమి ఆతని కీయబడెను. ఆతనికి వెల్తురు కల్పించబడెను. సూర్యుడు, ఆకాశము, ఉషస్సు ఆతని కొరకే కల్పింపబడినవి. ఈ భూమి ఆర్యావర్తము. ఆర్యు లీ ప్రాంతమున పునః పునః వచ్చి నివసింతురు గనుక నిది ఆర్యావర్తము. దృషద్వతి సరస్వతినదీ ప్రాంతముల నగ్ని ప్రతిభావంతముగ ప్రజ్వరిల్ల వలయునని ప్రార్థింపబడినది. మానవజాతి యీ భూభాగమున నివసించుటకై దేవలోకమున సృష్టింపబడుచున్నది.

'తం దేవనిర్మితం దేశం బ్రహ్మావర్తం ప్రచక్షతే'

అమర్త్యులు, మానవులు మన సంతతివారే. వీ రిద్దరు దగ్గర బంధువులే. దేవులకై నిర్మింపబడిన దృషద్వతి సరస్వతీ భూభాగమంతయు బ్రహ్మావర్తమని పిలువబడుచున్నది.

5. ఈ ప్రపంచ మెట్లు సృజింపబడినదో వేదములయందు పై రీతిగా వ్రాయబడినది. ఇదే విధముగ పురాణములయందును వివరింపబడియున్నది. ఇందువలన ప్రథమమున దేశమంతయు నీటిమయముగ నుండెననియు, అట్టి నీటినుండి భూభాగ ముద్భవించిన దనియు స్పష్టపడుచున్నది. హిమాలయ పర్వతములును నీటినుండియే పైకి ఉద్భవించినవి. ఇదే ప్రకారముగ సీనాయి పర్వతములును, ఆల్టాయి పర్వతములును నీటినుండియే యుద్భవించినవి. సీనాయి పర్వతములు అరేబియా దేశమున నున్నవి. అచటినుండియే సెమిటికు జాతివా రుద్భవించిరి. ఆల్టాపర్వత శ్రేణులు మంగోలియా, సైబీరియా దేశముల మధ్య నున్నవి. దేవతలు, దానవులు ఈ ప్రాంతముల నుద్భవించినట్లు చెప్పబడుచున్నవి. వీరే ఆర్యులు అని చెప్పెదరు. పురాణములందు ఈ విషయములు కనుపడుచున్నవి. ఈ విషయములే వాల్మీకి రామాయణములోని ఉత్తరకాండయందును కనుపడుచున్నవి. మంగోలియా జాతులవారు చైనా, జపాను దేశములకు వలస పోయిరి. మాలి, సుమాలి, జాంబవంతు డీ జాతులవారే.

6. మన పూర్వపుగ్రంథములను జాగ్రత్తతో పరిశీలించినచో ప్రస్తుతపు భరతదేశము పూర్వపు భరతఖండములో కొంత భాగమే అయియున్నది. ఇప్పటి భరతవర్షము పూర్వపు జంబూద్వీపములోని కొంతభాగమే. పూర్వపు భరతవర్షములో ప్రస్తుతపు మధ్యఆసియాలోని కొన్ని భాగములు కలసి యుండెను.

వాయువ్యదిశనున్న ఆఫగనిస్థానము ఇరాను దేశములు పడమరనున్న అరేబియాయు, ఆఫ్రికాలోని కొన్నిభాగములున్ను పూర్వపు భరతదేశములో నుండెడివి. ఆఫ్రికా బర్బరదేశమనియు అరేబియా మరుదేశమనియు నపుడు పిలువబడెడివి. ఇప్పటి అరేబియా సముద్రమును, హిందూమహాసముద్రము నొకప్పుడు భూభాగములుగ నుండెను. ప్రస్తుత హిందూదేశమునకు పడమటగనున్న దేశమంతయు గాండ్వానా దేశము. ఇండియాకు దక్షిణముగనున్న భూభాగమంతయు

యిమూరియాఖండము. పూర్వపు సరస్వతీనది అరేబియా ఆఫ్రికా దేశముల పారుచుండెడిది. ఇప్పు డీ సరస్వతీనది అంతర్గామిని అయినది. కనబడదు.

7. క్రైస్తవుల మతగ్రంథమగు 'హోలీబైబిలు'ను పరిశీలించినచో సృష్టినిగురించి ప్రథమమున వ్రాయుచు మనగ్రంథములయందువలెనే సృష్టి వర్ణింపబడినది. ప్రథమమున దేశమంతటను జలముండెననియు, జలమునుండియే భూమి యుద్భవించెననియు వ్రాయబడినది. అటుపిమ్మటనే మనుష్యుడు నిర్మింపబడెను. ఆతడే ఆడమ్. ఈవు అనునాపె ఆతని భార్యస్థురాలు. బ్రహ్మసంకల్పమువలన మానసికముగా నుద్భవించిన స్వాయంభువమనువే, తిరిగి బ్రహ్మమహా సంకల్పమువలన నొకభాగము పురుషుడుగను, రెండవభాగము స్త్రీరూపమును ధరించి అర్ధనారీశ్వరుడయ్యెను. ఆ అర్ధనారీశ్వర రూపముననే భూమియందవతరించెను. అటుపిమ్మట జను లుద్భవించిరి. ఈ వివరమును కీ. శే. కోట వెంకటచలంగారు తమ మానవసృష్టి యను గ్రంథమున వ్రాసియుండెను.(29 వ పేజి)

ఆర్యులు : 'ఆర్య'యనుపదము.

8. ఆర్యులను గురించి తెలిసికొనుటకు పూర్వము 'ఆర్య' యను పద మెట్లుద్భవించిన దని ఆలోచించెదము. 'ఆర్య' యను పద మొక సంస్కృత పదము అయియున్నది. దీనియర్థము 'ఘనమైన' లేక మర్యాదగలయని చెప్పబడుచున్నది. ప్రథమమున నిది యొక సాంకేతిక పదమైయున్నది. మనుధర్మశాస్త్రమున నీ దేశము 'ఆర్యావర్త' మనియు, 'ఆర్యభూమి' యనియు, 'ఆర్యదేశ' మనియు వ్రాయబడియున్నది. వేదకాలమున నిది యొక జాతిపరముగ వాడబడెను. అటుపిమ్మట దేవుని పూజించువారందరు ఆర్యులనియు, దేవునికి వ్యతిరేకులందరు 'అనార్యుల'నియు 'దస్యుల'నియు పిలువబడిరి. రాను రాను వాఙ్మయమున బ్రహ్మ, క్షత్రియ, వైశ్యులు 'ఆర్యులు'గను,

శూద్రులు 'దస్యులు'గను చెప్పబడిరి. పాణిని తన వ్యాకరణసూత్రములందు 'వైశ్య' 'లార్యు'లని వ్రాసియుండిరి. 'ఆర్య' శబ్దమే దీర్ఘములేకుండగనే 'అర్య'యనియు వాడబడెను. 'ఆర్య' శబ్దము 'అర్' అను ధాతువునుండిగాని, 'అర్చ' అను ధాతువునుండి జనించినదని 'బాప్' పండితుడు వాదించెను. 'అర్' అనగా వెళ్ళుటయనియు, 'అర్చ' అనగా మర్యాద చేయుటయనియు నర్థము. అందువలన ఆర్యులు అర్చించదగినవారనియు మర్యాదగలవారనియు చెప్పబడినది. రెండవది 'ఋ' 'గతౌ' అను ధాతువు. 'అర్' అను ధాతువునకు దున్నిన భూమియను నర్థమును గలదు. అయితే యీ అర్థ మిప్పుడు సంస్కృతభాషయందు లేదు. కాని గ్రీకుభాషయందున్నది. అట్లైనచో ఆర్యులు భూఖామందులని చెప్పనగును.

9. జెండు భాషలో 'ఆర్య' పదము ఐర్యగా నుండి యున్నది. ప్రస్తుతపు పర్షియా దేశమును 'ఐరాను' దేశమని యందురు. ఇందార్య పదము గలదు. అరియానా దేశమునకు బాక్ట్రియా రాజధాని. ఈ పట్టణము మధ్యదేశముననున్నట్లు 'స్ట్రాబో' నిరూపించియుండెను. 'జెండెవెస్ట'లో నీ అరియానా 'వెరియాన్వజ'గ వ్రాయబడినది. దీనికి సంస్కృతము 'ఆర్యవిజయము'. ఈ గ్రామము హిమాలయపర్వతములవద్ద నుండెడిది. తెహరాన్ పర్షియాదేశపు రాజధాని. 'తెహరాన్' అంటే 'త్రైయిరా'నని అర్థము. ఈ రెండు పదములను కలిపి ఇంగ్లీషువారు 'తెహరా' ననిరి. ఇం'దార్య'యను పద మున్నది. పర్షియన్లు, మీడియన్లు బాక్ట్రియన్లందరు ఆర్యులే. 'డెరయ్యస్ ది గ్రేట్' అనువారు తానార్యుననియే చెప్పుకొనెను. తనను 'ఆర్యకృతుడు' గా భావించెను. తానార్య జాతికి చెందినవాడని దాని యర్థము.

10. ఆర్యులు రష్యా జర్మనీ దేశములకు వెళ్లియుండిరి. అచటకూడ ఆర్య యనుపదము వాడుకయందున్నది. ఆర్యులు ఇంకను

పడమర దిశకు ప్రయాణము చేసియుండిరి. 'ఐర్లెండు' దేశపదము నందుకూడ నీ 'యార్య' యనుపదము కనబడుచునే యున్నది.

ఆర్య యను పదమునకు 'ఈశ్వరకుమారు' డని నిరుక్త గ్రంథకర్తయగు యాస్కాచార్యులవారు వ్రాసియుండిరి. 'ఆర్య' యను పదమునకు 'నెమ్మది గలవా' డనియు, 'సంస్కారము' గలవాడనియు 'నలుగురికి అందుబాటులో నుండువా'డనియు ఋగ్వేదమునకు మహాభాష్యమును వ్రాసిన సాయణమహాశయుడు నిర్వచించెను. వారే ఈశ్వరుని కుమారుడనియు, మంచిగుణములకు గని యనియు వ్రాసియుండిరి. ఋగ్వేదమునందీ ఆర్యపద ముపయోగింపబడియున్నది. ఆర్యుడన ఉత్తమ వర్గమునకు చెందినవాడని అర్థము. ఆర్యుడు చదువుకున్నది అనుసరించెడివాడనియు చెప్పబడెను. 'విదుషీ అనువ్రతన్' యజ్ఞాదివేద క్రతువుల నాచరించినవానిని 'ఆర్యాయ' యనెడివారు. 'యజ్ఞాది కర్మకృతే' అనియు, 'యజ్ఞ మానయ' యనియు చెప్పబడెను. ప్రాచీనగ్రంథములయం దార్యులు ఇట్లు వర్ణింపబడిరి.

ఆర్య శబ్దము

11. ఈ ఆర్యులు ఏ దేశమున జనించి యేయే దేశముల సంచారముగావించి యేయే దేశముల కెప్పుడెపుడు ఎట్లు వచ్చిరని చెప్పుటకు దేశదేశములందలి పండితులు ప్రయత్నములు గావించి వాదోపవాదముల బయలుదేరదీసిరి. ఇట్టివాదము లనేకములు కలవు. అందనేక వాదములు కేవల మూహాజనితములై యున్నవి. మరికొన్ని వాదములు కేవల పక్షపాతబుద్ధితో లేవదీయబడినవై యున్నవి. మరి కొన్ని వాదములు కేవల అహంభావ భూయిష్ఠములై యున్నవి. మొత్తముమీద ఆలోచింపగ ముఖ్యముగ తేలునట్టి అంశ మొకటి వ్యక్తమగుచున్నది. 'ఆర్య' యను శబ్దము మిక్కిలి గౌరవపదమని యెల్లరు నంగీకరించుచునే యున్నారు. ఇందెట్టి అనుమానముగాని,

అభిప్రాయభేదముగాని లేదు. అందువలన నీ యార్యులు ప్రథమమున నుండిన దేశము గౌరవాస్పదమైన దేశముగ పరిగణింపబడుచున్నది. అందువలననే ఈ విషయమునుగూర్చి విచారించు ప్రతివారు నీ గౌరవమును పొందుట కతి ఆసక్తులై యెట్లైన నాగౌరవమును తమకు దక్కించుకొనవలయునని పక్షపాతబుద్ధితో తమవాదమును జేయుచు నితరుల వాదముల ఖండించుచున్నారు. ఈ చర్చ చేసెడివారిలో హెచ్చుమందికీ గౌరవము దక్కవలయుననియు నట్లు వీలుగానిచో నెట్లైనను భారతీయులకుమాత్రము దక్కగూడదనియు నభిప్రాయులై యుండినట్లును గనిపించుచున్నది. అందువలననే వీరి వాదములంత సమంజసముగగాని సహేతుకముగగాని కనిపించుటలేదు. ఈ చర్చలలో పాల్గొనినవారు చాలమందీ గౌరవమును తమకే దక్కించుకొనవలెనని ప్రయత్నించిరి. అట్టివారినిగూర్చిగాని, వారి వాదనలను గూర్చిగాని హెచ్చుగ తరచి వ్రాయదలచుకొనలేదు. కాని 'ది ఆర్యన్ క్రేడిల్' యను గ్రంథముననుండి యెవరెవరా గౌరవమును తమ దేశమునకు జెందజేయవలెనని ప్రయత్నించిరో ఆ యా దేశస్థుల పేర్లను వివరించిన యీ క్రిందిభాగమునుమాత్ర మిచట నుదాహరించుచున్నాను:

> "తొమాషెక్ ప్రభృతులు తూర్పుయూరపు దేశమునకును వాన్‌లోహరు మొదలయినవారు జర్మనీ దేశమునకును ప్రెడరిక్ మూలరు, కూనో యనువారు మధ్యయూరపునకును, విండెల్‌స్మిత్ వగైరాలు పడమట యూరపు దేశమునకును, పెంకూ యనువారు స్కాండినేవియా దేశమే ఆర్యుల నివాస స్థలమనియు, పోషీయనువారు రాక్సినో బురదస్థలముల (**Raxino Swamps**) యం దుద్భవించిరనియు వ్రాసియుండిరి."

12. పైదానిని బట్టి చూడ యూరపు ప్రాగ్భాగమునకు కొందరు, మధ్యభాగమునకు మరికొందరు, జర్మనీదేశమునకు కొంత

మంది, స్కాండినేవియాకు మరికొందరు ఈ గౌరవమును కట్టబెట్ట వలయునని ప్రయత్నించినట్లు కనబడుచున్నది. ఇంతేకాక వీరిలో నొక పండితుడు హిందూదేశములోని ఆర్యులు దేశద్రిమ్మరులనియు, స్థావరము లేనివారనియుకూడ దూషించిరి. ఈ పై వాదములు చేయువారందరు నీ గౌరవమును యూరపు దేశమునకు సంపాదించవలెనని కోరిరి.

13. మరికొంద రీ గౌరవమును మధ్యఆశియాకు కట్టిపెట్టవలెననెడివా రున్నారు. అట్టివారిలో ప్రథమ పండితుడు 'లాసెన్' మధ్యఆసియాలోని 'ఆక్ససు' 'జక్సార్టె'సను నదుల మధ్యనుండు పచ్చికబయళ్లలో నీ యార్యులు ప్రథమమున నివసించియుండిరని వీరివాదన. ఈ వాదమునకు ముఖ్యముగ జెప్పబడిన కారణములు కొంత హాస్యాస్పదముగ నున్నవి. అటు యూరపులోను, ఇటు ఈరాన్ భారతదేశములలోను నీ యార్యులు వ్యాపించియున్నందున నీ యార్యు లీ రెండు భూభాగములకు మధ్యనున్న ప్రదేశమయిన మధ్యఆశియాలో నుండియుండుట సమంజసముగా నున్నదన్న కారణమే ముఖ్యకారణము. ఈ కారణ మంత బలవంతమైనది కాకపోవుటయే గాక నవ్వును పుట్టించుచున్నది. దీనినిగూర్చి నేను ప్రత్యేకముగ విమర్శించుటకన్న లార్డెల్ఫిన్స్టన్ (Lord Elphinstone) అను చరిత్రకారుడు తన హిందూదేశచరిత్రయను గ్రంథమున చేసిన విమర్శనిందు పొందుపరచుచున్నాను. (పేజి 95)

> "వలసక్రమ మొక ప్రదేశముననుండి వ్యాపించి యుండెననెడి యూహ నిరాధారమైనదేగాని వేరు కాదు. ఇదిగాక యిట్టి యూహ సహజ విరుద్ధమైనదికూడ. వలస విధానమును నాగరికతా వ్యాప్తియు వలయాకారముగ నడచియుండ లేదు. తూర్పుననుండి పశ్చిమమునకు వ్యాపించియుండెను."

14. ఇండో యూరపియను భాషకు యూరపుదేశ భాషలకంటె ఇరాను భారతదేశభాషలే సన్నిహితముగ నున్నందున ఇండో

యూరపియను ఆర్యభాష మధ్యఆసియాయం దుండియుండె ననుటకు రెండవకారణము. ఈ కారణ మసలే సరియైనదికాదు. ఇండో యూరపియను భాష, యూరపియను భాషలకంటె ఇరాను సంస్కృతభాషలే సన్నిహితములైనందున ఈ రెంటియందు సంస్కృతభాషకే హెచ్చు సంబంధము కల్గినదని అందరు నంగీకరించినందున నీభాష మాట్లాడువారు భారతదేశముననే యుండియుండిరనుట యెక్కువ సమంజసము.

15. ఈవాదన యిట్లుండ మరికొందరు పండితులు ఆర్యులు ఉత్తరధ్రువమున నుండిరని చెప్పుచున్నారు. ఈ వాదమును ప్రథమమున సపోర్టా యను పండితుడు ప్రారంభించెను: "శేషించిన ఉత్తర భూగోళభాగము మానవ నివాసమున కత్యుష్ణమై యున్నకాలమున మానవజాతి యంతయు ధ్రువ సముద్రతీరమున ఉత్పత్తియాయెను."

16. ఈ భావమునే లోకమాన్య బాలగంగాధర తిలకు మహాశయుడు తన ఆర్టిక్ హోమను గ్రంథమున నిట్లువ్రాసెను.

> "ప్రళయమునకు పూర్వము వైదికమానవుల పూర్వికుల నివాసము ఉత్తరధ్రువమున కెచటనో దాపుననై యుండవలెను."

17. ఈ వాదనయు సరియైనది కాదనియే తోచుచున్నది. లోకమాన్య తిలకుగా రీవిషయమై నిశ్చితాభిప్రాయము నేమియు చెప్పియుండలేదు. వారి పుస్తకమునందు ఆర్యుల నివాసమునుగూర్చి చెప్పబడిన సిద్ధాంతములన్నియు నూహాజనితములేగాని అప్రతిహతమైన సత్యములు కావని మాత్రమే వారు స్పష్టపరచి యుండిరి.

18. చూడజూడ పైవాదము లన్నియు కేవల మూహాజనితములేగాని నిర్ధరింపబడినట్టియు సహేతుకములైనట్టియు అభిప్రాయములు కావు.

19. పైన వ్రాసిన సిద్ధాంతము లిట్లుండ నీవిషయమై పరిశోధనలు గావించిన పాశ్చాత్యపండితులు కొందరు ఆర్యులనివాసస్థలము హిందూదేశమేయని చెప్పినవారు లేకపోలేదు. అట్టి అభిప్రాయములు కల్గినవారిలో 'లార్డెల్ఫిన్స్టన్' నను (Lord Elphinstone) చరిత్ర కర్తయు 'కర్జను' (Curzon) పండితుడు నుండియుండిరి.

"మనుధర్మశాస్త్రమునందు గాని లేక నాకు తెలిసినంతవరకు వేదములయందుగాని లేక మనుధర్మశాస్త్రముకంటె నిశ్చితములుగ ప్రాచీనములగు మరియే యితర గ్రంథములయందు గాని హిందువుల పూర్వపు నివాసస్థలముగాని, భరతఖండము లేక యే యితర దేశముయొక్క పేరుగాని చెప్పబడియుండలేదు. అట్టిదేశమును దేనినిగు ర్తెరిగియున్నట్లును చెప్పియుండలేదు. అట్లు చెప్పియుండకపోవుటచేత వీరు పరదేశీయులని చెప్పుటకును ప్రతిబంధకముగ నున్నది. వీరి పురాణగాథలుసయితము దేవతలనివాసములు హిమాలయపర్వతములు దాటిపోలేదు."

20. ఆర్యులు హిందూదేశమునకు వలసవచ్చిరా యను విషయమునుగూర్చి వ్రాయుచు 'కర్జను' పండితు డిట్లు వ్రాసెను.

> "ఈ ప్రదేశము దండయాత్రలవలనగాని, జయించిగాని పాలింపబడి యుండలేదు. అట్టిసందర్భమే నిజమైయుండినను లేక అట్టి సందర్భమేదియైనను జరిగియుండినట్లున్నను లేక సంప్రదాయసిద్ధముగ చెప్పుకొనబడినను అట్టివిషయమును జాతీయపరాక్రమగర్వముతో నెచ్చటైనను ఏదోవిధముగ, సహజముగ చెప్పికొనియుందురు. ప్రాచీనాధునిక సంస్కృత వాఙ్మయమునందెచటను ఇట్టివృత్తాంతము కానరాదు."

21. మ్యూరను నింకొక పాశ్చాత్యపండితుడు ఈ విషయమునుగూర్చి వ్రాయుచు నిట్లు వ్రాసియుండిరి:

> "నాకు తెలిసినంతవరకు నేగ్రంథమునందుగాని పురాతనమగు నేయితరగ్రంథమునగాని హిందూదేశస్థులకు పరదేశ జన్మత్వము ఆరోపింపగలిగిన సంబంధములుగాని, గాథలుగాని కాన్పించుటలేదని యథార్థముగ చెప్పుకొనుచునే ప్రారంభించవలయును."

22. ఇటీవల ముప్ఫయి నలభయి సంవత్సరములలోపల భారతీయ పరిశోధకులలో ముగ్గురుపండితులు ఆర్యులనివాసము ప్రథమముననుండియు హిందూదేశమేయని నిరూపించుచు కొన్ని గ్రంథములను రచించి ప్రచురించిరి. 'పానగి' యను మహారాష్ట్ర పండితుడు 1915 వ సంవత్సరమున 'ఆర్యావర్తిక్ హోము' (Aryavartic Home) అను గ్రంథమును, 1931 వ సంవత్సరమున డెల్హి విశ్వవిద్యాలయ ఆచార్యులు 'లక్ష్మీధరకల్లా' యనువారు 'ది హోమ్ ఆఫ్ ది ఆర్యన్స్' (The Home of the Aryans) అను గ్రంథమును, కలకత్తా విశ్వవిద్యాలయాచార్యులు 'అవినాశచంద్రదాస్' (Avinasa Chandra Das) అనువారు 1931 లో 'ఋగ్వేదిక్ ఇండియా' (Rigvedic India) అను గ్రంథమును భారతదేశవాదము నతిదక్షతతో సమర్థించిరి. కాని యీ గ్రంథములయందు వ్రాయబడిన యంశములను పలుకరింపకయే చరిత్రకారులు పాశ్చాత్యపండితులను సమర్థించుటకు ప్రయత్నించుట బహుచిత్రముగను కనిపించుచున్నది. ఈ క్లిష్టమైన విషయమునుగూర్చి నిర్వివాదమైనట్టియు, సమగ్రమయినట్టియు అభిప్రాయము స్థిరపరుపబడునంతవరకు పెక్కుచరిత్రకారులచే సమంజసముగ నున్నదని యంగీకరింపబడుచున్న యీ క్రింది వాదమునే మనమంగీకరించుట క్షేమకరమనియు అవసరమనియు తోచుచున్నది.

23. పైన నిరూపింపబడిన కొన్ని విషయములవలన స్వాయంభువ మనువే ప్రథమ ఆర్యుడుగ సృష్టింపబడెననియు, తరువాత వీరే హెచ్చుగా జొచ్చిరనియు, వీరునివసించుటకు దృషద్వతీ సరస్వతీ నదులమధ్య నుండు ప్రదేశ మాక్రమింపబడెననియు, ఆ ప్రాంతమే

ఆర్యావర్తమని పిలువబడెననియు స్పష్టపడుచున్నది. ఆర్యావర్తమే భారతవర్షమని చెప్పబడెను. మనపురాతన గ్రంథముల బట్టి మనదేశమే ఆర్యనుల జన్మభూమియని కనుపడుచున్నది. వారిజన్మభూమి హిందూదేశమే.

24. పండితులచే నంగీకరింపబడినవాద మెట్టిదో, ఆర్యుల ప్రథమ నివాస మెచ్చటిదో మనమిపు డాలోచించెదము.

25. కొన్నివందలో లేక వేలో సంవత్సరములక్రింద హిందూదేశమునకు ఉత్తరము పడమటి భాగమున పచ్చిక బయళ్ళుండెడివి. అచటనే కాస్పియనుసముద్ర ముండెడిది. ఈ పచ్చిక బయళ్ళు చక్కగా పెరుగుట కచటనే 'యూఫ్రెటీస్' 'టైగ్రీసు' (The **Euphrates and the Tigris**) అను రెండు నదు లుండెడివి. ఆబయళ్ళ యందనేకులు గుడిసెలలోగాని, గుడారములలోగాని నివసించుచు తమ పశువుల మందలను పచ్చిక బయళ్ళలో మేపుకొనుచు జీవ యాత్రను గడపుకొనుచుండిరి. కొంతకాల మిచట వీరు సుఖజీవనము జరుపుకొనుచుండ నొక పెద్ద ప్రళయము సంభవించెను. అప్పుడు పెద్ద పెనుగాలి వీచియుండెను. ఆ ప్రళయము వచ్చుటవలన దేశమంతయు నీటితోనిండిపోయి అప్పుడు వీచిన పెనుగాలికి గొప్పసంక్షోభము కలిగి అచటనుండిన జనులందరు నొకరితో నింకొకరికి సంబంధము లేకుండ చెల్లాచెదరయిపోయి యుండిరి. వారి గుడిసెలు,గుడారములు కొట్టుకొని పోయియుండును. వారిపశువులును ఎటుపోయినది అప్పటికి తెలిసి కొనుటకు నసాధ్యమైయుండెను. ఈ ప్రళయమువలన దేశమంతయు కొంతకాలమువరకు నాశనమైయుండెను.

కొంతకాలమున కీ ప్రళయము తగ్గి తిరిగి సామాన్య వాతావరణ మేర్పడుటకు కొన్ని సంవత్సరములు పదులో వందలో పట్టియుండును. తిరిగి సామాన్యవాతావరణ మేర్పడిన పిమ్మట, వీరిలో కొందరు, వారి సంతతివారు కొందరు తిరిగి పశుగణములతో కలసి

యుండుట జరిగియుండును. ఇట్లు కలుసుకొనినవారు వారిలో వారు సంతసించి ఒకరినొకరాలింగనము చేసికొని స్నేహభావమును వ్యక్తపరచికొనియుండిరి. ఇట్లు కలసికొనినవారినే చరిత్రలో ఆర్యులని చెప్పుదురు. ఇదియె ప్రళయముయొక్క చరిత్ర. వీరి సమాగమమే చరిత్రయం దుగ్గడింప బడినది. ఇట్టి ప్రళయగాథలు ప్రపంచమునందలి పురాతన గ్రంథములయందును కనుపడుచునేయున్నవి. హిందూదేశము నందలి పురాతనగ్రంథములలో నొకటియగు శతపథ బ్రాహ్మణమునందు చూడనగును. ఈ గ్రంథము క్రీస్తుశకమునకు కొన్నివేల సంవత్సరముల క్రింద వ్రాయబడిన ప్రాచీన గ్రంథముగ పాశ్చాత్య పండితులచేత నంగీకరింపబడినది. ఇట్టిప్రళయము తరువాత సమాగమమునుగూర్చిన గాథ మహాభారతమునందు కనిపించుచున్నది. భాగవతమునందును చూడనగును. హిబ్రు మతస్థుల పురాతన గ్రంథములందు నిట్టిప్రళయమును గూర్చి వ్రాయబడియున్నది. ఇట్టిప్రళయము బాబిలన్ దేశమునందు జరిగెనని వ్రాయబడెను. ఇట్టి అపూర్వమైన సంఘటనజరిగినపుడు జనులు, పశువులు చెల్లాచెదరై తమ తమ జీవితములను రక్షించు కొనుటకు అటు నిటు పారిపోవుటలో అసహజమైన దెట్టిదియు నుండజాలదు. అట్టి సమయములలో కొందరు పడమర దిశకు,మరికొందరు తూర్పుదిశకు,దక్షిణ దిశకు చెదరిపోయియుందురు. పడమరదిశగా పోయినవారు యూరపు దేశమునకు పోయియుందురు. తూర్పుగ దక్షిణమునకు పోయినవారు హిందూకుష్ పర్వతప్రాంతములదాటి హిందూదేశమునకు పడమట నున్న పంజాబుదేశ ప్రాంతములకు చేరియుందురు.

26. ఈ ప్రళయమునందు కలిగిన గందరగోళమువలన పడమటదిశకు పోయినవారు, తమ జీవనాధారము నేర్పరచుకొనుటకై క్రొత్తప్రదేశముల నన్వేషించుచు తమకు నివాసమును, తమ పశువులకు తగు పచ్చికబయళ్లను వెదకుచు పోయినవారిలో కొందరు గ్రీకు, లాటిన్, కెల్టిక్, ట్యూటను దేశస్థుల పూర్వీకులై యుండవలెను. వీరందరు సిథియనులే. కొందరు రష్యా భూభాగమునకు, మరికొందరు

జర్మనీదేశమునకు, గెలీషియా, పోలెండు దేశములకు పోయి ట్యూటను జాతికి చెందినవారై యుందురు. మరికొందరు డాన్యూబునదివద్దకు చేరిన కెల్టికుజాతివారై యుందురు. ఈ కెల్టికుజాతివారే రైనులాండు దేశము ప్రవేశించియుందురు. ఇట్లే వీరిలో వీరు సంచారము చేయుచు తమ తమ వీళ్ల ననుసరించి యూరపుదేశమున తమ తమ నెలవుల నేర్పరచుకొని యుందురు. వీరిలో కొందరు శాక్సన్సు అనుపేర సంచారము చేయుచుపోయి బ్రిటన్ దేశములోని బ్రిటన్సుతో పోరి వారిని వెళ్లగొట్టి అచటికి చేరియుందురు.

27. ఇట్లు దేశసంచారము చేయుచు పోయి వారివారి స్థలముల నేర్పరచుకొని ఆయాస్థలములకు తమ పేర్లను పెట్టికొని యుందురు. ఈ పేర్ల నిపుడు తరచిచూచిన తమ పూర్వీకులైన వారి భాషకు సంబంధము కనుపడుచున్నది. సంస్కృతభాషా పదమగు 'విష్'కు యేర్పరచుకొనుట యను నర్థముకలదు. దీనినే రోము దేశస్థులు 'విట్' అనిరి. గ్రీకుదేశస్థులు 'విల్' అనిరి. దీనినే యింగ్లీషువారు 'విక్' లేక 'విచ్' అనిరి. ఇంగ్లీషుమాట 'విలేజి' విడదీసినపుడు విక్+లేజి అనునది యేర్పాటుచేయబడిన స్థలమై యున్నది. దీనినే సంస్కృతమున విషయమనిరి. ఇంగ్లాండునందలి సాడ్విచ్ గ్రీన్విచ్ వీటికి ఉదాహరణములు. ఇట్లే ఆర్వేలనాడు 'షట్సహస్రవిషయ' మని శాసనములయందు వ్రాయబడినది. ఇదియే పూర్వము మండలమనియు, తురకలు రాజ్యము చేయుకాలమున జిల్లాగను మారినది.

28. ప్రళయకాలమున నీ యార్యులలో కలిగిన భాగముల వలననే వీరిలో 'సెంటం' 'శాతం' అను వేర్వేరు పేర్లను కలిగినవి. రెండవ యుపన్యాసమున నీ విభాగమునుగూర్చి కొంత సూచింపబడినది (Para 63). దానినే యిచట కొద్దిగా విపులీకరించి వ్రాయుదును. పైన వ్రాయబడిన 25 వ పేరాలో వీరిలో కొందరు పశ్చిమదేశమునకుపోయి యూరపుదేశములోని కొన్నిభాగముల నాక్రమించు

కొనిరని వ్రాసియుంటిని. రెండవ యుపన్యాసమునందలి అరువది మూడవ పేరాలో ఇండోయూరపియను భాషా కుటుంబములలో యెనిమిది విభాగము లుండెననియు, అందులో నాల్గు భాగములు సెంటం భాగములనియు, మిగిలిన నాల్గు భాగములు శాతం భాగములనియు వ్రాసియుంటిని. నిజమున కీ భేదమునం దెట్టి ప్రత్యేకతయు కనుపించదు. ప్రళయానంతరము పశ్చిమదేశమునకు పోయినవారిని సెంటములని పిల్చుటలో ప్రత్యేకతయేమియు లేదు. 'నూరు' అను అంకెను పశ్చిమదేశమునకు పోయినవారు సెంటం మనిరి. ఇదియే కారణము. తూర్పునకు పోయినవారు నూరును 'శతం' అనుటవలన వీరిని శాతం ముఠాయనిరి. ఇట్లు యీ ముఠాలను 'సెంటం' 'శాతం' ముఠాలని పిల్చుటకు నిదియే కారణముగాని మరి వేరు కారణము కనుపించదు.

29. ప్రళయానంతరము చీలిపోయినవారిలో రెండవ ముఠావారు కొంత దక్షిణమునకు పోయి తూర్పుదిశకు తిరిగివెళ్లి హిందూకుష్ పర్వత గుహలద్వారా హిందూదేశములోని వాయువ్యభాగమున నున్న ఆఫ్గనిస్థానము, బెలూచిస్థానము, పంజాబుదేశము ప్రవేశించియుందురు. వీరినిగూర్చి మున్ముందు వివరములు వ్రాయుదును.

ప్రళయానంతరము చీలిపోయిన వారిలో మిగిలినవారు అప్పటి కష్టములను తప్పించుకొనుటకై అటునిటు కొంతకాలము విడివిడిగా సంచారము గావించి యెప్పుడో ఒకప్పుడు మనకు తెలియనట్టియు, తెలసికొనజాలనట్టియు సందర్భములలో నెచటనో ఆ పర్వత ప్రదేశమునందే ఆక్ససు (Oxus), జక్సార్టిసు (Jaxartes) నదులు ప్రవహించెడి స్థలప్రాంతములయందు తిరిగి కలుసుకొని అచటనే తమ నివాసము నేర్పరచుకొనియుండిరి. బహుశః అట్టిస్థలమే ఖివా (Khiva) పచ్చికబయళ్లయి యుండవచ్చునని పండితులు అభిప్రాయపడిరి. అక్కడ కలుసుకొన్నపిదప కొంతకాల మచటనే నివసించి వారివారి అవసరములను బట్టి ఆ నదీప్రాంత స్థలములనే ఆక్రమించుచు వచ్చిరి. అటుపిమ్మట వారివారి అవసరములనుబట్టి యీ నదులు ప్రవహించెడి

ప్రదేశమున కొకండు (Kokhand) బడక్షామ్ (Badaksham) ప్రదేశముల నాక్రమించిరి.

30. ఇండోయూరపియను ఆర్యులను పేర యూరపుదేశమును పశ్చిమ దక్షిణ ఆశియా దేశములను ఆక్రమించిన వారియొక్క ప్రధాన నివాసస్థాన మెచటనను విషయమునుగూర్చి చాలకాలము వివాదాంశముగ చర్చింపబడుచునేయున్నది. వీరి ప్రథమనివాసమెచటనో ఏషియా దేశమునందై యుండవచ్చునని మాక్సుమూల (Maxmuller) రభిప్రాయపడియుండిరి. ప్రథమమున నీ విషయమై పరిశోధించినవారు భాషా శాస్త్రముపై ఆధారపడి యుండిరి. అంతకంటె పూర్వపువారు కాస్పియను సముద్రమునకు పడమర భాగముననున్న కకెసియను (Cacasian) పర్వతములలోగాని లేక అచటికి కొంత దక్షిణముగానుండిన హిందూకుష్ (Hindu kush) పర్వతములలోగాని యుండియుండవచ్చునని దృఢఅభియప్రాయమై యుండెను. ఇటీవల పరిశోధనలు తిరిగి గావించి ఆర్మీనియా (Armenia) దేశముగాని అచటనే ప్రహించుచున్న ఆక్ససు జక్సార్టసు నదుల ప్రాంతములగాని, వీరి మొదటియునికి యుండవచ్చునని తలచిరి. నవీనముగ తిరిగి పరిశోధనలుగావించి ఆటో ప్రడ్డరను (Otto Shradder) అను వారన్ని విషయములను చర్చించి యూరపు, ఆశియా దేశముల సరిహద్దుస్థలములలో దక్షిణరష్యాలోని స్టెప్పిసులోనెచటనైనను వీరి ప్రథమనివాసమై యుండవచ్చునని నిర్ధారణగావించిరి. మరియు వీరందరును ప్రథమమున పసులకాపరులుగనుండి తరువాత మెల్లిగ వ్యావసాయికులుగ మారియుండవచ్చు ననియు గ్రియర్సన్ పండితుడు (Grierson) వ్రాసియుండెను.

31. ప్రళయానంతరము కలుసుకొన్న ఆర్యులు చాల కాలము కలసియుండి యొకేప్రదేశమున నొకేజాతివారుగనే యొకే భాషనుమాట్లాడుచు యొకే దేవతలనారాధించుచు ఒకే విధములైన వ్రతముల నాచరించుచు ఒకే విధములైన ఆచారములకు కట్టుబడుచు ఒకే కుటుంబములోనివారివలె సహజీవనమును జరుపుచుండిరి.

వీరపుడు పశుపోషణ గావించుచుండిరి. అగ్ని వరుణ వాయు మిత్రులు వీరి ముఖ్య దేవతులు. వీరినే ఆకాలమున పూజించుచుండిరి. ఆ కాలమున వీరిలో కొందరు సురులనియు మరికొంద రసురులనియు పిలువబడుచు వచ్చిరి. ఈ సురులు, అసురులు దితి, అదితి యను ఇద్దరు తోడికోడండ్ర పుత్రులు. వీరిలో సురాపానము చేయువారు సురులనియు, సురాపానము చేయనివా రసురులనియు బహుశః పిలువబడియుండిరి. ఈ సురాపానీయమే అమృతమనియుకూడ చెప్పబడినది. సముద్రమును మథనము గావించి యీ సుర సంపాదించబడిన కథ ప్రతి హిందువునకును తెలిసిన విషయమే. ఈ సుర అమృతమైనను కాకున్నను మత్తు పదార్థమైయున్నది. ఇది యెట్లున్నను ఈ సురలు అసురులు స్నేహభావములోనే సుఖజీవనము గావించుచుండిరి. మొత్తముమీద కాలము గతించినకొలదియు నీ సురాపానమువలన నైతేనేమి మరియే యితర ఆర్థిక కారణములవలన నైతేనేమి వీరిలో వీరికి మనస్పర్థలు ప్రారంభించెను. ఈ మనస్పర్థలే కొంతకాలమునకు విరోధముల క్రింద మారెను. పార్సీవారి మతగ్రంథములయం దీయసురులలో కొందరు దక్షిణదిక్కునకు పోయి గొప్పధనవంతులైనట్లు వ్రాయబడినది. ఈ అసురులనే పార్సీగ్రంథములలో 'అహురు'లని వ్రాసియుండిరి. సురులకును అసురులకును మధ్య ఏ కారణముచేతనైనను విరోధములు హెచ్చెను. వీరిలో వీరికి గల్గిన విరోధములవలన ఒకరినొకరు తిట్టుకొన ప్రారంభించిరి. సురలు అసురుల రాక్షసులనియు, రాక్షస కృత్యముల చేయువారనియు చెప్పమొదలిడిరి. అసురులు సురులనిటె తిట్ట మొదలిడిరి. 'యజ్ఞవహ_త్త'యను పార్సీగ్రంథమున నీ సురులు దురాత్మర్గులనియు, మాంత్రికులనియు, తాంత్రికులనియు వ్రాసియుండిరి. వారి దురాత్మర్గచర్యలవలనను, దుష్టకార్యముల వలనను 'అహురులు' హురలను వదలి యితర ప్రాంతములకు పోవలసివచ్చెనని వ్రాసికొనియుండిరి. ఈ అహురులు వీరితో సంబంధమును వదలుకొని వీరివద్ద నుండి విడిపోయి యితర ప్రాంతములకు పోయియుండిరి.

32. పైనచెప్పిన సురులు అసురులు సోదరులే. వీరందరును దేవతలే. అగ్ని అసురుడు. ఇంద్రుడసురుడు. సూర్యుడసురుడు. అయితే వీరందరు దేవతలుగనే భావింపబడిరి. ఋగ్వేదమునందలి కొన్ని ఋక్కులు అసుర దేవతలను గురించియే వ్రాయబడినవి. ఈ అసురులు పార్శీవారికిన్ని దేవతలై యుండిరి. వీరిలో వీరికి విరోధములు పెరిగిన పిమ్మట అసురులందరు 'పూర్వదేవత' లయిరి. అమరకోశమునందు వీరు పూర్వదేవతలనియే వ్రాయబడెను. 'శుక్రశిష్యా దితిసుతాః పూర్వదేవాః సురద్విషః.' అమర్ద అథర్వవేదమునం దీ అసురులను మంత్ర ప్రభావముచే నణచివేసిరనియు, వారి దురంతము లంతరింపబడినట్లును వ్రాయబడెను.

33. పార్శీవారి పుస్తకములయందు వీరినిగూర్చి వ్రాయుచు 'అహురు' లనియు, 'ఇరేనియిను'లనియు వ్రాసియుండిరి. వీరి నిపుడు పార్శీవారని చెప్పుచున్నారు. వీరి మతపుస్తకములను జాగ్రత్తతో జదివిన వారికిని యజ్ఞయాగాదులున్నట్లు కనబడును. వారికిని ఇంద్రుడు, వరుణుడు, మిత్రుడు మొదలయిన వారందరు దేవతలుగనే పరిగణింపబడుచున్నారు. వారందరు నొకపుడు హిందూ ఆర్యులతో కలసియున్నట్లు వారి గ్రంథములయందు కనుపడుచున్నది. వారి దేవతలు మనదేవతలే. వారి ఆచారములు, సంప్రదాయములు మన ఆర్యుల ఆచారములు, సంప్రదాయములే. వారి భాషయు నార్య భాషయే. ఈ విషయముల జాగ్రత్తతో నాలోచించినచో ఆర్యులును పార్శీవారు నొకపుడొకజాతికి చెందినవారేయని స్పష్టపడుచున్నది. పార్శీవారి మత గ్రంథమగు 'వెండినాడు' నందు యమునిగూర్చి వ్రాయబడియున్నది. మన యముడు 'మరణము'ను కల్పించువాడు. ఈతడు దక్షిణ దిశన నుండునని చెప్పుదురు. ఈతడు సూర్యకుమారుడైన వివస్వంతుని కుమారుడు. పార్శీలును మరణమును కల్పించువానిని యముడనియే చెప్పుదురు. యముని తండ్రిని 'వివం ఘట్ట' యందురు. 'వివం

ఘట్ట' యనునదియు, 'వివస్వంత' యనునదియు సాదృశ్య రూపములుగనే కనుపడుచున్నవి.

34. పురాణములయందు వ్రాయబడిన దేవదానవుల యుద్ధమునిజమైనదియేయనియు, చరిత్రాత్మకమైనదనియుకూడ చెప్పుటకు వీలుకలుగుచున్నది. ఈ యుద్ధచరిత్ర పురాణములయందేగాక క్రీ. పూ. పండ్రెండు శతాబ్దముల క్రింద వ్రాయబడినదని చెప్పబడెడి ఐతరేయ బ్రాహ్మణమునందును వ్రాయబడియున్నది. ఈ చరిత్రయే పార్శీవారి మతగ్రంథమందును వ్రాయబడియున్నది. ఇదే కథ 'పెహ్లవి' భాషయందు వ్రాయబడిన 'బుందహిశ' యను గ్రంథమున వ్రాయబడియున్నది. కథయందలి కథనమంతయు నొకటె. రెండు గ్రంథములయందు నీ కథ యొకే విధముగ వ్రాయబడినను మన గ్రంథములయందసురులు దుష్టులనియు, దేవతలు మంచివారనియు, అధర్మము నణచి ధర్మము సంరక్షింపబడెననియు వ్రాయగా వారి మత గ్రంథములయందు తామే మంచివారనియు, దేవతలు దుష్టులనియు దుర్మార్గులనియు వ్రాసి వారినణచుటవలన అధర్మము అణచివేయబడినట్లు, ధర్మము సంరక్షింపబడినట్లును వ్రాయబడియుండెను. ఈ గ్రంథము లన్నింటిని పోల్చిచూచిన వీరిద్దరొకప్పుడు ఆర్యజాతికి చెందినవారేననియు, చివర చివరకు వీరిద్దరేదో విరోధకారణమున తగువులాడి వేరుపడి ఒకరి నొకరు దూషించుకొనుచు యెవరి జీవనములను వారు ప్రత్యేకముగ జరుపుకొనునట్లు కనుబడును.

35. వీరందరు నొకరితో నొకరు సహకరించి సుఖజీవనమును గావించిన ప్రదేశము కొకండ్ బడాక్షానను పర్వతప్రదేశమని యిదివరలో వ్రాసియుంటిని. ఈ ప్రదేశమునకు దక్షిణ సరిహద్దునకు ఆక్సస నదియు, హిందూకుష్ పర్వతపంక్తులును ఎల్లలు. ఇది ఆఫ్ఘనిస్థానమునకు దగ్గరలోనుండియుండెనని తోచుచున్నది. వీరు అచటినుండి తూర్పు పశ్చిమములుగా పోయియుందురు. తూర్పున సింధూనది ప్రాంతమైయున్నది. అటుపోయి ప్రస్తుతపు పర్షియా, టర్కీ-

స్థాను, అరేబియా దేశములుండు ప్రాంతముల పార్సిపోలీసను (Persipolis) పట్టణమును చేరి యా ప్రదేశము నాక్రమించుకొనియుండిరి. అటుపిమ్మట వీరే యిరేనియనులని, పార్శీలనియు పిలువబడిరి. వీరి భాష పర్శిక్ అనియు, మెడిక్ అనియు, రెండు విధములుగ మారి యుండెను.

36. ఇప్పటికి మనకు తెలిసినంతవరకు పర్శిక్ భాషలో పురాతనపు భాషారూపము బీహస్తాను ప్రదేశమున మాట్లాడబడెడు భాషయై యున్నది. ఇదియే అప్పటి ప్రభుత్వభాష. ఆ భాషయందే మన కిపుడు దొరికిన ఒకటవ డెరయస్‌గారి క్రీ. పూ. 522-486 సం. శాసనమునందు వ్రాయబడినది. ఇదియే అప్పటి ప్రభుత్వ భాషయు, జనుల భాషయునై యున్నది. అటుపిమ్మట ఈభాషయే మారి పర్షియను భాషయనియు లేక 'పెహ్లావీ' (Phelhavi) భాషయనియు, పార్థియను భాషయనియు క్రీ. త. మూడవ శతాబ్దముననుండి యేడవ శతాబ్దమువరకు మాట్లాడబడు భాషయైనది. ఈ భాషనుండియే ప్రస్తుతపు వాఙ్మయమునందును, గ్రంథములయందును వ్రాయబడెడు పర్షియను భాష జనించినది. మహమ్మదీయ సుల్తానులు హిందూదేశమున రాజ్యముచేయు కాలమున నుత్తరహిందూస్థానమున నుపయోగింపబడిన భాషయు నీపర్షియను భాషయే యైయున్నది.

37. 'మెడిక్' భాష మిగతా యిరాన్ దేశమున వాడబడెడు భాష. పూర్వమీభాషయందే 'అవెస్తా' గ్రంథము వ్రాయబడె నందురు. అయితే యీగ్రంథము మెడిక్ దేశమున వ్రాయబడి యుండలేదు. ఈ గ్రంథము తూర్పు ఇరాన్ దేశమున వ్రాయబడినది. ఈ గ్రంథము క్రీస్తుకు పూర్వ మూరు శతాబ్దములక్రింద వ్రాయబడినట్లు చెప్పుచున్నారు.

జెండు అవెష్టా

38. అవెష్టా యను గ్రంథము 'జూరాష్ట్రియ'న్సను వారి పవిత్రమత గ్రంథము. 'అవెస్తా' యను పదము సంస్కృత భాషా పదమగు వేదముననుండి జనించినది. ఈ గ్రంథమునందు అసలున్న అందుకు భాష్యమును వ్రాయబడినవి. ఈ గ్రంథమునందు ఇరవై లక్షల నీతివాక్యములు శ్లోకరూపమున వ్రాయబడియుండెను. ఈ నీతి వాక్యములు ప్రథమమున పన్నెండువేల తోలుముక్కలపై వ్రాయబడెను. ఇవి యిరువదియొక భాగములుగ నుండెను. కాని అందులో యిరువది యొకటవ భాగముతప్ప మిగిలిన భాగములన్నియు నశించినవి. ఇది జూరాస్థరు తయారుచేసెను. వీటిలో 'వెండిడాడ్' యిరవై రెండు ప్రకరణములు. యజ్ఞ 72, వసరాట్ 23, యస్తు 44 ప్రకరణములు ఉండియున్నవి. ఇదియే అవెష్టాగ్రంథము - పార్శీవారిమత గ్రంథము. పార్శీవారు ఆర్యులు, హెర్బరాజ మేరుపర్వతములవద్ద కొంతకాలము కలసియుండినట్లు ఇందువ్రాయబడియున్నది. ఆర్యుల నుండి చీలిపోయి ఆఘ్నను స్థానములోని గాంధారదేశము మీాదుగను ఆపగా దేశముపోయి పర్సిపోలిసు అనుదేశమునకు చేరినపిమ్మట వీరు పార్శీలను పేరపిలువబడిరి. తరువాత కొంతకాలమువ కా దేశమంతయు మహమ్మదీయ మతములోనికి మారినది. ఈ పార్శీవారు మాత్రం తురకమతమును స్వీకరించుట కంగీకరింపక యేడవ శతాబ్దమున 640 A. D.లో తిరిగి హిందూదేశము ప్రవేశించిరి. అసలు అవెష్టాగ్రంథము అలెక్సాండరు రాజ్యకాలమున 'యిస్కందరు' (Iskandar) అను వానిచే తగులబెట్టబడినందున తిరిగి వ్రాయబడెను. ఇప్పటి అవెష్టా గ్రంథమున వెండిడాడ్, వసరాట్, వసన అను మూడుభాగములు మాత్రమే కనబడుచున్నవి. వెండిడాడు వసనలయందు కథలు గాథలును, వసరాటునందు మంత్రములును యున్నది. కథలలో కొన్ని స్తోత్రపాఠములును కలవు. ఈ స్తోత్రములు, మంత్రములు మాత్రము ప్రత్యేకావసర సమయములందు చదువబడుచున్నవి.

ప్రార్థనలు ప్రతిదినము చేయబడును. వీరాక్రమించిన దేశమంతయు అరియానా యనియు, యిరేనియా యనియు, వెరియాన్వజా యనియు వ్రాయబడెను. వెరియాన్వజా యనగా ఆర్యవిజయ మని పేరు.

ఇండో ఆర్యనులు

39. ఇరేనియన్లతో చీలినపిమ్మట మిగతా ఆర్యులు పర్యటన గావించుచు దక్షిణదిక్కుగపోయి యుందురనియు అట్లుపోయి తూర్పు ఆఫ్గనిస్థానములోని కొంతభాగము 'హర్హావతి' యను ప్రదేశము వరకు ఆక్రమించుకొనియుందురనియు ఊహింపబడుచున్నది. ఈ హర్హావతియను పట్టణము ప్రస్తుతపు కాంధహారు చుట్టుప్రక్కల నుండి యుండెను. అచట కొంతకాలముండి వారి పరిస్థితుల చక్కబెట్టుకొని యొకే జాతికి చెందినవారివలె తగిన యేర్పాటులు గావించుకొని పంజాబుదేశమును తమస్థానముగ నేర్పరచుకొని యుండిరని యూహింపనగును. అప్పుడు వీరు మాట్లాడుభాష పాత సంస్కృత భాషయై యుండవచ్చును. వారపుడు మాటలాడు భాషనుండియే యిప్పుడు ఇండో ఆర్యనుల భాష లుద్భవించియుండెననియు మన మూహింపవచ్చును.

40. ఇంతేకాక వీరిలో కొందరు ఆక్ససు నదీజలముల దరినుండి బయలుదేరి పైవారు వచ్చిన మార్గముకంటె కష్టతరమైన మార్గముద్వారా ప్రయాణము గావించి చిత్రాలు గిల్గిటు పర్వత మార్గముల ద్వారా పర్వతములను దాటి పంజాబులోనికి ప్రవేశించి యుందురు.

41. వారందరు ఎటువచ్చినను పంజాబులోనే ప్రవేశించి యుందురని స్పష్టముగ నూహించనగును. ఇట్లు వీరందరును పంజాబులోని కొకేమారుగ నొకే ముఠాగా వచ్చియుందురని చెప్పుటకును వీలుకనుబడదు. వీరందరు నిచటకి చేరుటకు ముఠాలు ముఠాలుగ దాదాపు కొన్ని శతవర్షములు పట్టియుండును. ఇందుకు వేదముల

యందును మనకు కొంత ఆధారము లేకపోలేదు. 'హిల్బ్రాం'డను పండితుడు చెప్పిన విషయములే నిజములైనచో 'దివోదాస' యను రాజున్ను వారి జనమున్ను ఆరోకోషియా దేశమున నివసించుచు వీరు పరిపాలన జేసిరని చెప్పువిషయము లన్నియు వీరి సంతతివారైన 'సూడాసు' అనువారు రాజ్యముచేయు కాలముననే అవి గాథలుగా చెప్పుకొనబడుచుండెను. జరిగినసంగతులు గాథలుగా మారుటకు ఒకటి రెండు తరములై యుండవలయును. పంజాబు విషయమై మనకు బాగా తెలిసినంతవరకు ఆ కాలమున ఈ ఆర్యులలో ననేక ముఠాలవారు ఒకరితో నింకొకరికి సరిపడక అనేకవిధములుగ ప్రవర్తించుచుండినట్లు కనుపడుచున్నది. అప్పుడు జీవించుచున్నవారిలో సామరస్య మంతగా నున్నట్లును కనుపించదు. అప్పటికే వీరందరు ఏకభాషనే మాట్లాడక వేర్వేరుగా అనేక రూపములు గల్గినభాషను మాట్లాడుచున్నట్లును కనుపించుచున్నది. పడమరనుంచిగాని, ఉత్తరమునుంచిగాని యొకొక్క ముఠావారు క్రొత్తగావచ్చి అదివరకే ఆ ప్రదేశమున నివసించుచున్న ముఠావారిని వారు ఆక్రమించియున్న స్థలముననుండి వెడలగొట్టుచుండిరి.

42. ఇట్లు వేర్వేరుగ వచ్చినవారు మాటలాడు భాషలలో కొన్ని కొన్ని మాండలికవిభేదములుండుట స్పష్టముగ కనుబడుచునే యున్నది. ఇట్టిభేదములు వేదములయందే కొంతవరకు కాననగును. వేదములలోని ఋక్కులన్నియు నొకేభాషలో వ్రాయబడి యుండెనని చెప్పుటకును వీలులేదు. అవి ఒకేసారి వ్రాసినవియు కాజాలవు. అయితే యిందలి భేదము లంతగా చెప్పుకొనదగినవి కావు.

43. ఆర్యులరాకను గురించి వ్రాయుచు "వీరు ముఠాలు ముఠాలుగా వేర్వేరుగ వచ్చుటనుగూర్చి యెవరెవరు ఎప్పుడెపుడు వచ్చిరో పరిశీలనగా చెప్పజాలముగాని ప్రథమమున వచ్చినవారికిని, చివరకు వచ్చినవారికినిగల తారతమ్యములను విశదముగ తెలిసికొనగలము. ప్రస్తుతము మాట్లాడబడెడి భాషలనుబట్టి యిండో ఆర్యనులు

రెండుమారులైనను. హిందూదేశముపై దండెత్తివచ్చి యుందురని వారు వారు మాట్లాడెడు భాషలయందుండిన మాండలిక భేదముల వలన చెప్పుటకు వీలుగలుగుచున్నదని యొకశతాబ్దము క్రింద డాక్టరు హారన్లీగారు సమర్థించి యుండిరి. వీరు చెప్పిన ప్రకారము రెండు మార్లుగా వచ్చియుండిరో లేక ఒకరి తరువాత కొంతకాలమునకు ఇంకొకరు, వారితరువాత మరికొందరు ఇట్లే వరుసలుగా అనేక శతాబ్దములలో అనేకముఠాలుగా వచ్చినను వచ్చియుండ వచ్చును. రెండుమార్లు వచ్చినను, అనేకమార్లు వచ్చినను ఫలిత మొకటియే. మొదటిసారి వచ్చినవా రొక భాషమాట్లాడగా వారితరువాత కొంత కాలమునకు మొదటి భాషతో సంబంధించి కొన్ని మాండలిక భాషా భేదములుగల భాషను మాట్లాడుచుండిరి. డాక్టరు హారన్లీగారు ఇంకను ముందంగ వైచిరి. తరువాత వచ్చినవారు మొదట వచ్చినవారి మధ్యగా పంజాబుదేశములోనికి ప్రవేశించి వీరికంటె ముందువచ్చిన స్థలము నాక్రమించినవారిని తమ తమ ఆక్రమిత ప్రదేశములనుండి కొంతమందిని తూర్పునకును, మరికొందరిని దక్షిణమునకును, ఇంకా కొందరిని వెనుకకు పడమటికి తరిమియుండిరి. ఈ ఇండో ఆర్యను భాషా భేదాలనుబట్టి యీ హార్నలీగారి అభిప్రాయము సమర్థింపబడు చున్నది. ఇటీవల జరిగిన నూతన పరిశోధనలున్ను ఈ అభిప్రాయ మును బలపరచినవి.

45. ఇట్లు వేర్వేరుగా ముఠాలలోవచ్చినారని చెప్పబడిన ఆర్యు లేమార్గమున పంజాబుదేశములోనికి ప్రవేశించిరో ఆలోచించుట అసందర్భ ప్రశంసయని చెప్పుటకు వీలులేదు. కాని అప్పటి మార్గము లెట్లుండునో తెలియకను, వారనుసరించిన మార్గముల సూచనలైనను లేకను వారువచ్చిన మార్గములను స్పష్టముగ తెలిసికొనుట సులభసాధ్య మైన పనికాదు. ఈ మార్గమును స్థూలముగను పొందవచ్చును. ప్రథ మమున వచ్చిన ఆర్యులు కాబూలు దేశముమీదుగా సింధూనదీ ప్రాంతములద్వారా పంజాబులోనికి చేరియుందురని చెప్పుటలో

అసహజ మేమియు నుండజాలదు. తరువాత వచ్చినవా రీ మార్గమున నున్న ప్రదేశ మంతయు నిదివరకు వచ్చినవారిచే నాక్రమింపబడి యుండుటవలన వీరామార్గమున వచ్చియుండరని యూహింపవచ్చును. అదే కారణమువలన జీలంనదీప్రాంతములద్వారా కూడ వచ్చియుండ జాలరు. వీరు బహుశః చిత్రాలు ప్రదేశమార్గమున గిల్గిటుదేశము ద్వారా వచ్చి స్వాట్ బజ్రోరుద్వారా పంజాబుదేశమును ప్రవేశించియుందు రనుటయే సమంజసమని తోచుచున్నది. ఈ దేశమును అప్పటికే వారికంటె ముందువచ్చినవారిచే ఆక్రమింపబడి యుండు ననుటలో ఆశ్చర్యమేమియు నుండజాలదు.

46. ప్రథమమున వచ్చినవారును తరువాతవచ్చినవారును ఒకేజాతివారే యైయుండినను, వారిభాష లొకేజాతికి చెందినవేయై యున్నను ఒకరిభాషకు రెండవవారిభాషకు కాలపరిమితి హెచ్చుగ నున్నందున భాషాభేదము లుండకతప్పదు. అదియుగాక పంజాబు దేశము నాక్రమించినది ఆర్యజాతివారేయైనను వీరిలోకొందరు కొన్ని శతాబ్దముల క్రిందనే యిచటికి వచ్చి దేశము నాక్రమించియున్నందున తరువాత వచ్చి క్రొత్తగ దేశము నాక్రమించుటకు ప్రయత్నించువారి కిని పాతవారికిని తగవు లుండక తప్పదు. జాతి యొకటేయైనను వైషమ్యములుండకపోవు. క్రొత్తగావచ్చినవారికిని,పాతవారికిని సంబంధ బాంధవ్యములుండవు. వీరిజాతియొకటేనని మనమిపుడు చెప్పుచున్నను అప్పటికి వీరెవరో మొదటివారికిని, మొదటివారెవ్వరో తరువాత వారికిని తెలిసియుండుట అసంభవము. అట్టిస్థితిలో తండోపతండము లుగ వచ్చుచున్న క్రొత్తవారికిని, స్థానబలిమియున్న పాతవారికిని సంఘర్షణము లేర్పడక తప్పదు. అట్టి సంఘర్షణలలో బలవంతులైన వారు బలహీనులైనవారిని ముందుకో ప్రక్కలకో వెనుకకో వెడల గొట్టి తామా స్థలముల నాక్రమించియుందురు. అప్పటికి పాతవారి కిని క్రొత్తవారికిని తామొకేజాతివారనికాని, వారిభాషలకు సంబంధ ముండెననికాని వారి కెవ్వరికిని తెలిసియుండజాలదు.

47. తరువాత వచ్చినవారు పూర్వముననుండియు నిచటనే నివసించువారిని 'దస్యు' లనియు 'మ్లేచ్ఛ' లనియు దూషించి వారితో కలహించి కొంతబలవంతులైనందున పాతవారి నచటనుండి తరిమివైచి తాము మెల్లిగా మధ్యదేశమునందు ప్రవేశించియుందురు. ఒకానొకప్పుడు వ్రాయబడిన సంస్కృతభూగోళమున మధ్యదేశమంతయు నార్యదేశమని వ్రాసియుండిరి. క్రొత్తగావచ్చినవారు హిమాలయ పర్వతములనుండి దక్షిణముననున్న వింధ్యపర్వతములవరకును పడమర సర్హిండ్ (Sarhind or Sahrind) అను దేశముననుండి గంగా యమునానదీ జలప్రదేశముల వరకును నాక్రమించిరి. ఇదియే మధ్యదేశము. ఈ మధ్యదేశమంతయు సరస్వతీనది అంతర్వాహినిగా జనులకు దృశ్యముకాకనే ప్రవహించుచున్నది. ఇదియే హిందూసానము. హిమాలయ పర్వతములకును, దక్షిణముననున్న హిందూమహాసముద్రమునకును మధ్యనున్న ప్రదేశమంతయు పూర్వముననుండియు భరతవర్షమని పిలువబడుచుండెను. ఇందు నివసించువారు భారతవంశీయులు. 'శబ్ద కల్పద్రుమము' నందిట్లే వ్రాయబడి యున్నది. విష్ణుపురాణమున

"హిమాహ్వాం దక్షిణంవర్షం భరతాయ దదౌ పితా
తస్మాచ్చ భారతం వర్షం తస్యనామ్నా మహాత్మనః
ఉత్తరం యత్సముద్రస్య హిమాద్రేశ్చైవ దక్షిణమ్
వర్షం తద్భారతం నామ భారతీయా చ సంతతిః.

వ్రాయబడియున్నది. దీనినే మత్స్యపురాణమునందిట్లు

"ఇదంతు మధ్యమం వర్షం శుభాశుభఫలోదయమ్
దక్షిణస్య సముద్రస్య హిమవతోపి చోత్తరమ్
వర్షం తద్భారతం నామ యత్రేమా భారతీ ప్రజాః
భరణాత్తు ప్రజానాం వై నామ భారత ముచ్యతే
నిరుక్తవచనాచ్చైవ వర్షం తద్భారతం స్మృతమ్.

అని వ్రాయబడియున్నది. దీనినే వాయుపురాణమునందు

ఇదంతు మధ్యమం చిత్రం శుభాశుభ ఫలోదయం।
ఉత్తరంయత్సముద్రస్య హిమవత్ దక్షిణస్య యత్॥

అని యున్నది.

పై శ్లోకములనుబట్టి హిమాలయములకు దక్షిణమునను, దక్షిణ సముద్రమునకు ఉత్తరమునను భరతవర్ష మున్నది.

48. హిందూదేశమున ఉత్తర దక్షిణ ఖండములని రెండు ఖండము లున్నట్లును, వాటినే ఉత్తరాపథమనియు, దక్షిణాపథమనియు పిలుచుచున్నట్లును మహాభారతమున వ్రాయబడియున్నది. ఈ రెండు పథములను వింధ్యపర్వతములు సరిహద్దుగనుండి రెంటిని విడదీయుచున్నవి.

"దక్షిణపథజన్మానః నరవరాంధ్రకాః
గుహాః పులిందాః శబరాచ్చుచుకాః మద్రకైస్సహ।
ఉత్తరపథ జన్మానః కీర్తయిష్యామి తానపి।
యేన కాంభోజ గాంధారాః కిరాతకా ఖర్జురైస్సహ॥

మహాభారతం : శాంతిపర్వం

49. ఉత్తర పథమునందు సింధూ గంగా పవిత్రనదులు ప్రవహించు చున్నవి. సింధూనదినే హిందూనది యనియు పిలిచెదరు. "స" బదులు "హ" యుచ్చరింపబడును. సింధూనది ప్రవహించెడి దేశమే హిందూస్థానమని పిలువబడుచున్నది. ఇదియే "ఉత్తరపథము".

50. ఈ క్రొత్తగా వచ్చిన ఆర్యులు పాతవా రాక్రమించిన దేశమును వారివద్దనుండి స్వాధీనపరచుకొనుట అంత సులభమయిన పనికాదు. ఇదివరలో కొన్నివందల సంవత్సరముల క్రింద జలప్రళయ సమయమున చెల్లాచెదరై తప్పివచ్చిన కొన్ని గుంపుల ఆర్యులిచటికి చేరి తమ స్థానముల నేర్పరచుకొని యుండిరి. వా రిదివరలో స్థానముల

(భా - 6)

నేర్పరచుకొని యున్నందున వారు తమ స్థావరముల వదలి వెళ్లుటకును యిష్టపడి యుండరు. పూర్వపువారును కొండలోయల ద్వారా వచ్చియుండి యిచట అప్పటికున్నవారి తరిమి కొట్టియో, లేక వారితో సమాధానపడియో తమ తమ స్థానముల నేర్పరచుకొని యుందురు. ఆ స్థానములనే కట్టుదిట్టమును చేసికొని యుందురు. క్రొత్తవారు వచ్చునప్పటికి సుస్థిరరాజ్యము నేర్పరచుకొని, మంచి పట్టణములు కట్టుకొని, గొప్ప సంస్కృతిని సంపాదించి జీవనము జరుపుకొనుచున్నట్లు వేదములయందే వ్రాయబడి యుండెను. పాతవారును, క్రొత్తవారును పూర్వ మొకేజాతికి జెందినవారే యైనను ఒకప్పుడు వీరిద్దరు మాట్లాడిన భాష యొకటేయై యుండినను క్రొత్తగా వచ్చినవా రీ సంగతులుగాని, సందర్భములుగాని పాతవారికి తెలిసి యుండవు. వారి వారి భాషలయందును సాదృశ్యములు ప్రత్యక్షముగ కనుపించకపోవుటవలన వీరిని వారు, వారిని వీరు తెలిసికొని యుండరు. అందువలన పాతవారు క్రొత్తవారి దేశమునకు వచ్చి యిచట స్థావరముల నేర్పరచుకొనుటకు పాతవా రంగీకరించి యుండరు. ఈ దేశము నాక్రమించుటలో క్రొత్తవారికిని, పాతవారికిని కొంత పోరాటమున్ను జరిగియుండవచ్చును. ఇట్టి పోరాటములో కొందరు దేశముననుండి వెళ్లగొట్టబడియుందురు. వారి స్థానములను వీరాక్రమించుకొని యుందురు. మరికొందరు పారిపోవక చుట్టుప్రక్కలనే సర్దుకొనియుందురు. మరికొందరు క్రొత్తవారితో పాతవారు రాజీపడి యుందురు. ఇదియెట్లు జరిగినదో మనమిపుడు స్పష్టముగ జెప్పజాలము గాని యిప్పటి పరిస్థితులనుబట్టి ఉత్తరాపథదేశమునందలి మధ్యభాగము నంతను క్రొత్తగావచ్చిన ఆర్యులు స్వాధీనపరచుకొన్నట్లున్ను, పాతవారైన ఆర్యులు మధ్యప్రదేశమునకు చుట్టుప్రక్కల తమ స్థానముల నాక్రమించియున్నట్లున్ను యిపుడచట మాట్లాడబడు భాషలవలన యూహించ గలుగుచున్నాము. మధ్యప్రదేశము హిందూస్థానము. దీనిచుట్టు కాశ్మీరు, పశ్చిమ పంజాబు, మహారాష్ట్రదేశము, మధ్య

యిండియా, ఒరిస్సా, బీహారు, బెంగాలు, అస్సాము, గుజరాట్ దేశము లుండినట్లు శాస్త్రజ్ఞు లూహించియుండిరి.

51. పాతవారికిన్ని, క్రొత్తవారికిన్ని మధ్య జరిగినపోరాటము యొక్క ఫలితమువలన వీరిలోవీరికి సామరస్యమేర్పరుపబడి పరిస్థితులు చక్కబడినను వీరి మధ్యజరిగిన పోరాటము మాత్రము కొద్దిదై యుండదు. క్రొత్తగా వచ్చినవారు పాతవారిని చీదరించుకొని వారితో తగవులు పెట్టుకొని వారిని దూషించి వారిని విరోధులుగ భావించి వారిని మ్లేచ్ఛులనియు, వృషలులనియు, వాత్స్యులనియు, దస్యులనియు పిలిచియుందురు. వీరు పిశాచులనియు, వీరు మాట్లాడు భాష పైశాచి భాషయనియుకూడ చెప్పియుందురు. ఈ విషయములే మన వేదముల యందలి కొన్ని ఋక్కులలో చూచాయిగా వ్రాయబడియున్నది. ఈ యిరుపక్షములమధ్య కొంత పోరాటము జరిగియుండుట అసంభవము గాని అసహజముగాని కాజాలదు. పాతవారిలో కొందరు క్రొత్తవారితో పోరాడజాలక పారిపోయియుందురు. అట్లుపోయినవారే ద్రావిడులేమో? వీరితో కొంతవరకు పోరాడి పారిపోవుట కిష్టపడక యిరుపక్షములవారు రాజీపడగ పాతవారలలో మిగిలినవారు వింధ్యపర్వతములకు ఉత్తర భాగముననే నిలిచిపోయిరేమో? మరికొందరు యీ క్రొత్తవారితో యెదురు తిరిగిపోరాడి వారినే వెనుకకు త్రోసి అచటనే యుండిపోయిరేమో? ఈ విషయములనుగురించి ముందు రాబోవు యుపన్యాసములలో చర్చించి తెలిసికొందుముగాక. ఇప్పటి కీపాతవారికిని, క్రొత్తవారికిని మధ్యజరిగిన పోరాటమువలన క్రొత్తవారితో పోరాడజాలక వింధ్యపర్వతములదాటి పారిపోయినవారు కొందరును వారితో పోరాడి రాజీగా పరిష్కరించుకొనియో లేక యెదురుతిరిగి వారి నివతలకు రానీయక తామున్న చోటుననో వారు ఆక్రమించిన మధ్యప్రదేశములకు చుట్టునుండు భాగములయందో కొందరు పాతఆర్యులు నిలిచియుందురనియు గ్రహించెదము. ఇప్పటికీవిషయములు సహేతుకరములుగనున్నవనియు శాస్త్రజ్ఞు లంగీకరించిన విషయములై యున్నవి.

52. పైన వ్రాయుటలో క్రొత్తగావచ్చిన ఆర్యులు యిచట అదివరకే స్థావరముగనుండినవారిని కసిచేత వృషలులనియు, వ్రాత్స్యలనియు, దస్యులనియు, పిశాచులనియు దూషించినట్లుగ వ్రాయబడినది. అట్లు వ్రాసినంతమాత్రమున మన మెట్టి దురభిప్రాయమును చెందవలసిన యవసరములేదు. తమ కెదురు తిరిగి తమ కాటంకములు కలిగించి నందున ఆర్యులు అట్టివారిని కోపముచేత దూషించి యుందురని మన మూహింప వచ్చును. మరియు మనుధర్మశాస్త్రమున సకాలములో ద్విజులలో నుపనయనము గావింపబడనివారిని "వృషలు" లని పిలువ బడెడువారని వ్రాసియున్నది.

> "బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా స్స్వావధే తూర్ధ్వత మబ్దతః
> అకృతోపనయా స్సర్వే వృషలో యేవస్మృతాః.

యాజ్ఞవల్క్య ధర్మశాస్త్రమునందు వీరినే "వ్రాత్స్య"లందురని వ్రాయబడినది. మరియు నీవ్రాత్స్యలు "శైవసన్యాసు" లని అధర్వవేదమున నున్నది. ఈ సన్యాసులు గౌరవింపబడుచుండిరి.

ద స్యు లు

53. క్రొత్తగావచ్చిన ఆర్యులకు పూర్వము యీ దేశము నందు నివసించుచున్న జనమును దస్యులనియు, అసురులనియు నామకరణముచేసి యీ ఆర్యులు పిలుచుచూ వచ్చినట్లు కనుబడుచున్నది. ఈ యుపన్యాస ప్రారంభముననే యీ దేశమున ప్రథమముననుండిన జను లార్యులని వ్రాసియుంటిని. అదిన్నిగాక యీ దేశమునకు ఆర్యులు ముఠాలు ముఠాలుగా నొకరి తరువాత కొన్నివందల సంవత్సరములకు మరియొకముఠా ఆర్యులు వచ్చినట్లున్ను చెప్పియుంటిని. ఈవిషయము శాస్త్రజ్ఞు లంగీకరించిన విషయమే యైయున్నది. అందువలన చివర వచ్చిన ముఠా ఆర్యులు తమకంటె పూర్వమే యిచటికివచ్చి స్థావరముల నేర్పరచుకొని జీవయాత్ర గడుపుకొనుచున్న ఆర్యులముఠాలను

కోపముచేత దస్యులని పిలచినట్లు కనుబడుచున్నది. అంతేకాని వారున్నూ ఆర్యులే.

54. ఈ విషయమునుగూర్చి వ్రాయుచు నొక చరిత్రకారుడగు "మ్యూర్" అనువారు తన ఓ. యస్. టి. గ్రంథమునందలి రెండవ భాగమున 387 వ పేజీలో నిట్లు వ్రాసియుండెను :

> "ఋగ్వేదమున 'దస్యులనియు, అసురులనియు' నిరూపింపబడిన వారినిగురించి చదువుచు వీరున్న ఆర్యజాతికిచెందినవారగునా కాదాయని తెలిసికొనుటకు హెచ్చుగ ప్రయత్నించితిని. ఎంత ప్రయత్నించినను వారు ఆర్యజాతికి చెందనివారని చెప్పుట కవకాశము కలుగలేదు."

పైన చెప్పిన ప్రకారం మీ ఆర్యులు ముఠాలు ముఠాలుగా హిందూదేశమునకు ఒకరివెనుక నింకొకరు కొన్నివందల సంవత్సరముల పిదప తమకంటె పూర్వమే వచ్చిన వా రాక్రమించిన స్థలములనుండి వారిని వెళ్ళగొట్టి తామాక్రమించుటకు ప్రయత్నించు చుండిరనియు నిదివరలో వ్రాసియుంటిని. అయితే వీరందరు నార్యులే.

55. "దస్యులు, అసురులు" అను దూషణవాక్యములు ఋగ్వేదమునందు వేదగ్రంథములను పురస్కరించుకొని వ్రాయబడిన యితరగ్రంథములయందును హెచ్చుగ కానవచ్చుచున్నది. ఈ పదమునకు ఋగ్వేదమునందే చెప్పబడిన అర్థమిట్లున్నది: "అకర్మ దస్యులు అన్యవ్రతః అమానుషః" వైదిక ధర్మముల ననుసరించక యితర ధర్మముల ననుసరించుచు మనుష్యులకు వ్యతిరేకముగ వర్తించువారు దస్యులని తెలియనగును. ఈ అర్థమునుబట్టి దస్యులజాతిని గురించి యేమిన్ని చెప్పబడియుండలేదు. కనుక దస్యులు ఆర్యులు కారనుటకు ఆధారమేమియు కనుపించదు. తరువాత తరువాత "దస్యు"లను పదము చెడ్డవారికి యుపయోగింపబడుచువచ్చినది. ప్రపంచము సృష్టింప

బడి నప్పటినుండియు న్యాయాన్యాయములు, ధర్మాధర్మములు, తప్పొప్పులు, మంచిచెడుగులు, నిజానిజములు ప్రక్క ప్రక్కనే పెరుగు చుండుట లోకవిదితమైన విషయమే.

"విజ్ఞానంచ అవిజ్ఞానంచ సత్యంచ అనృతంచ సత్యమభవత్" మనిషిని దూషించినంత మాత్రమున అతడు తనజాతికి చెందనివాడని చెప్పుటకు వీలులేదు. దూషించినవారు, దూషింపబడినవారు నొకే జాతికి చెందినవారే మైయుందురు. పాతవారు, క్రొత్తవారును ఆర్యులే. పార్శీభాషయందు "దస్యులను దహ్యు" లని వ్రాసియుండిరి. వీరే వ్రాత్యులు వృషలులు. వీరినే చెడ్డవారనియు, శత్రులు పన్నువారనియు దూషించియుండిరి.

పైన వ్రాయుటలో క్రొత్తగావచ్చిన ఆర్యులందరు మధ్యదేశము నాక్రమించిరని వ్రాసియుంటిని. వీరందరును తూర్పున నుదయించు సూర్యదేవుని ఉపాసకులు. వీరు సూర్యునికెదురుగనుండి తమ కుడివైపు భాగమును దక్షిణమనియు, దక్షిణాపథమనియు, యెడమచేతి వైపుననున్న దేశము ఉత్తరదేశమనియు, యుత్తరపథమనియు పిలిచెడివారు. దక్షిదేశమే దక్షిణాత్య దేశము "దక్కను" దేశము నయినది. ఉత్తరదేశము ఉత్తర హిందూస్థానమైనది.

ఆర్యుల భాషలు

56. క్రొత్తగావచ్చిన ఆర్యులు ఆక్రమించిన ప్రదేశమే హిందూస్థానమనియు, పాత ఆర్యులు నివాసము చేయునట్టి ప్రదేశముల పేర్లన్నియు నిదివరలో పేరాలో వ్రాసియుంటిని. ఆయా దేశములలో మాట్లాడబడెడు భాషలను గురించి కొద్దిగా నిచట వివరించెదను. ఈ భాషలన్నియు పూర్వపు సంస్కృతభాషకుగాని, ప్రాకృతభాషకుగాని చెందిన వాడుకభాషలేమైయున్నవి. వీటిలో కొన్నిటిని పైశాచి భాషలనియు, మరికొన్నిటిని అపభ్రంశములనియు పిలిచెడివారు.

57. ఇప్పటికి తెలిసినంతవరకు ఆర్యులభాషలోని ప్రథమ స్వరూపము ఋగ్వేదమునందు కనబడుచున్నది. ఋగ్వేదములోని ఋక్కులన్నియు నాయాకాలమునందు వాడుకలోనుండెడి ప్రమాణ భాషలోనే వ్రాయబడియుండెనని యూహింపబడుచున్నది. వేదములు స్వరయుక్తముగ నేర్చుకొనుటకై కంఠతః వల్లించబడినను నాఋక్కులలో నే కొద్దిపాటివో వాడుకభాషాపదములు కలిసియున్నను మొత్తముమీద అప్పటి ఆర్యభాషలోనే వ్రాయబడియుండెనని గట్టిగా చెప్పనగును. ఈ ఋక్కులన్నియు క్రీస్తుకుపూర్వము పదిహేనువందల సంవత్సరములపై కాలమున రచింపబడియుండవచ్చునని పరిశోధకు లభిప్రాయబడుచున్నారు. మనమిపుడు కాలనిర్ణయము సరిగా చేయజాలము. కాని అంతకు పూర్వమే వ్రాయబడి యుండవలెనని తోచుచున్నది. వేదములు వ్రాయబడిన భాషయే మనకిప్పటికి తెలిసినంతవరకు ప్రథమ ఆర్యభాషమై యుండవచ్చును.

58. దేవభాష వ్రాయబడిన కాలమునకు తరువాత వాడుకలోనికి వచ్చిన వేదభాషలే హిందూదేశమునందలి పాకృతభాషలై యుండవచ్చును. క్రైస్తుకు పూర్వము మూడు నాల్గు శతాబ్దములకు పూర్వమే అశోకుని శాసనములలో యీ ప్రాకృతభాషలను చూడగలము. ఈ ప్రాకృతభాషలు పతంజలి వ్రాసిన సూత్రముల నాటికే వాడుకయందుండెను. ఈ వేర్వేరు ప్రాకృతభాషల పరిశీలించిన భాషా పండితులు ప్రథమమున వాడుకయందుండెడి ప్రాకృతభాషయందు సంయుక్తాక్షరములు హెచ్చుగ నుండెననియు కనుగొనిరి. బౌద్ధుని కాలమున వాడుకయందున్న 'పాళీ'లో వారి పవిత్రగ్రంథములన్నియు వ్రాయబడి యుండెను. ఇదిగాక శౌరసేనియను ప్రాకృతభాష గంగానదీతీరప్రాంతమగు శూరసేనదేశములో వాడుకయం దుండెడిది. మగధదేశమున మాగధీభాషయు వాడబడుచుండెడిది. ఇదియే ప్రస్తుత బీహారుదేశము. ఈ పై రెండుదేశములమధ్య అర్ధమాగధీ భాష మాట్లాడబడుచుండెడిది. ఈ అర్ధమాగధి తూర్పున అలహా

బాదునుండియు మాట్లాడబడుచుండెడిది. జైనుల పవిత్ర గ్రంథములన్నియు నీ అర్ధమాగధి యను ప్రాకృతభాషయందు వ్రాయబడినవి. జైన ప్రవర్తయగు మహావీరుడును వారి భాషలోనే తన మత ప్రచారమును గావించెను, మహారాష్ట్రీయను నింకొక భాష అప్పటి మహారాష్ట్రమునందు వాడబడుచుండెను. ప్రస్తుత బీరారు దేశమున్ను, పరిసర ప్రాంతములున్ను అప్పటి మహారాష్ట్రదేశమై యుండెను. భాషాపండితులచే నీభాషలు పశ్చిమ ప్రాకృతము లనియు, తూర్పు ప్రాకృతము లనియు రెండుగ విభజింపబడెను. శౌరసేని పశ్చిమ ప్రాకృతమునకు జెందినది. మాగధి తూర్పుప్రాకృతమునకు జెందినది. అర్ధమాగధి రెండింటియందును కలియును. మహారాష్ట్రి హెచ్చు భాగము తూర్పుప్రాకృతమునకే చెందుచున్నది.

59. ఈప్రాకృతభాషలుగాక కొన్ని అపభ్రంశభాషలుండెడివి. పశ్చిమ హిందూదేశమున "వాచడ" యను అపభ్రంశభాషవాడుకలో నుండెడిది. ఈ అపభ్రంశముననుండియే యిప్పటి "సింధి" "లాండ" భాషలు జనించినవి. ఈ లాండాభాష కేకయదేశములోని కైకేయులు మాట్లాడుచుండెడివారు. నర్మదానదికి దక్షిణముగ అరేబియను మహాసముద్రమున నుండి ఒరిస్సాదేశమువరకు కొన్ని అపభ్రంశభాషలు మాట్లాడబడు చుండెడివి. విదర్భదేశమున వైదర్భియును, దక్షిణాత్య భాష మాట్లాడబడుచుండెడివి. మహారాష్ట్రిభాషయే మరాటిగ మారినది. ఇంకను తూర్పుగా ఉత్కలదేశమునకు పోయిన "ఉత్కలి" లేక "ఓడ్రి" యను భాష యుండెడిది. ఈ ఓడ్రీభాషనుండియే ప్రస్తుతపు "ఉరియా"భాష జనించినది. ఓఢ్రదేశమునకు ఉత్తరమున "మాగధి" "గౌడ" భాషలు వాడుకయందుండెను. ఇప్పటి "బెంగాలీ" భాష గౌడభాషా జనితమే. ఢక్కాదేశ ప్రాంతమున "ఢక్కి" యను నపభ్రంశ భాషవాడుకలో నుండెడిది. "గౌడీ" భాష "మాల్దా" మండలమున మాట్లాడబడెడిది. గౌడిభాష అస్సాంప్రాంతములలోని కిన్ని చొచ్చుకొని పోయినది. ఇదిగాక ఉత్తరమున కొంతసంస్కారము

చెందిన అపభ్రంశభాషలు వాడుకయందుండెడివి. అవి నాగర అపభ్రంశభాషలు. "అవంతి" యనుభాష ఉజ్జయిని దేశప్రాంతముల వాడుకయందుండెను. ఈ భాషనుండియే ప్రస్తుత రాజస్థాన భాష యుద్భవించినది. "ఘూర్జరీ" భాష పూర్వపుఘూర్జరీదేశమున వాడుకయందుండెను. ఈ ఘూర్జరీనుండియే యిప్పటి "గుజరాతీ" భాష జనించినది. పైనవ్రాసిన అర్ధమాగధీనుండి యిప్పటి తూర్పు హిందీ భాషయు, శౌరసేనినుండి పశ్చిమ హిందీభాషయు, పంజాబీభాషయు జనించినవి. అపభ్రంశమన్న క్షీణించిన లేక చెడిపోయిన యను అర్థము స్ఫురించుచున్నది. భాషాశాస్త్రమున అపభ్రంశమన్న సంస్కారమే సూచించును.

60. ఈ పైనవ్రాయబడినప్రాకృత, అపభ్రంశభాషలనుండియే యిప్పటి ఉత్తరదేశపు ఆర్యభాషలన్నియు జనించినవి. పాఠకుల యుపయోగార్థమై నీ ప్రస్తుత ఆర్యభాషల వివరములను కొద్దిగ నిచట పొందుపరచెదను.

61. కాష్మీరుభాష: కాష్మీరీభాష కాష్మీరుకొండలోయల యందు మాట్లాడబడు భాషయైయున్నది. ఇది పూర్తిసంస్కృత భాషాజనితమే. ఇచటివారు కొందరు పంజాబుదేశమునందు నివసించుచున్నారు. వారున్ను యీ భాషనే మాట్లాడుచున్నారు. మరికొందరు కాష్మీరుపండితులు తమనివాసము నిచటనుండి మార్చుకొని ఖాయముగ (సంయుక్త) యునైటెడ్ ప్రావిన్సుయందు నివసించుచున్నారు. కాష్మీరుదేశములోని మహమ్మదీయులు కాష్మీరుభాషనే మాట్లాడుదురు గాని వారుమాట్లాడు భాషయందు హెచ్చు పర్షియాదేశపు మాటలు కలియుచున్నవి. ఆ పర్షియాదేశపుమాటలను కలవనీయకనే హిందువులు కాష్మీరీభాషను మాట్లాడుదురు. ఇచట వాడుకయందు రెండు లిపులు కలవు. ఒకటి "శారదా" లిపి. ఇది దేవనాగరిలిపి. రెండవది మహమ్మదీయులచే వాడబడెడు "పర్షియను"లిపి. ఈకాష్మీరీ భాషయందు వాఙ్మయమున్ను చాల కలదు. దానిలో చాల

భాగము జర్మనులచే ప్రకటింపబడినది. శిరంపూరులోని క్రైస్తవమతస్థులు కొందరు బైబిలుగ్రంథమును శారదాలిపిలో నచ్చొత్తించిరి. ఈ దేశమునే పూర్వము కేకయదేశమని పిలిచెడివారు. అప్పుడిచట మాట్లాడబడెడు భాష "లాండా". గొప్పపండితకవియగు "గుణాఢ్యుడు" యిచటివాడే. బృహత్కథ యను గ్రంథము నీ పండితుడే వ్రాసి యుండెను. ఇది ఆ కాలమున "చులికిపైశాచి" భాషయందు వ్రాయబడెను. ఈ గ్రంథమును వ్రాయుకాలమున గుణాఢ్యు డరణ్యజీవనము చేయుచున్నందున, అచట వ్రాయుటకు సరియైనపరికరములు లేనందున తననెత్తురునే సిరాగానుపయోగించి అరణ్యమున వృక్షముల యందలి పత్రములపైన యేడు లక్షల కథలు గల గ్రంథము నొక దానినితయారుచేసి దానిని అప్పటి రాజైన శాతవాహనునికి అంకితము జేయుచు పంపెనట. కాని రాజు యొక్క శిక్ష ననుభవించుచు నరణ్యమునం దుంచబడిన గుణాఢ్యుని గ్రంథమును రా జంకితముచేసికొనుట కంగీకరించక త్రిప్పి పుస్తకమును పంపెనట. అందుపైన గుణాఢ్యుడు మిక్కిలి విసువుజెంది, యీ గ్రంథమును తగులపెట్టుటకు నిశ్చయించెనట. అయితే అట్లుతగులపెట్టుటకు పూర్వ మీ గ్రంథమును అరణ్యవాసులకు జదువనారంభించెను. ఇట్లు ప్రారంభించగా అరణ్యమునందు నివసించెడి జనులతోపాటు అరణ్యమునందలి పక్షులు, సామాన్య జంతువులు, క్రూరమృగములు యీ కథలను వినుటకు జేరెడివి. మిక్కిలి శ్రద్ధతో వినుచుండెడివట. ఆరు లక్షల కథలను పూర్తిగా చదివి వాటి నన్నిటిని దహనము గావించెను. చివర లక్షకథల గ్రంథము జదువబడుచున్న సమయమున శాతవాహన చక్రవర్తికి ఆవుమాంసము వైద్యమునకు కావలసిరాగా పరిచారకుల బంపెనట. పరిచారకు లరణ్యమునకు వచ్చి యిచట జరుగుచున్న వింతవిషయమును చక్రవర్తికి తెలిపిరి. అందుపైన నీ చిత్రమును స్వంతముగ వీక్షించుటకు వచ్చి మిక్కిలి శ్రద్ధతో శ్రవణము గావించుచున్న జంతుసాముదాయమును చూచి తాను గ్రంథమును పంపివేసి

నందులకు విచారపడి ఖిన్నుడై సిగ్గుపడి గ్రంథకర్తయగు గుణాఢ్యుని సమీపించి క్షమాపణరూపముగ తన కా పుస్తకము నంకితము గావింపుమని కోరియుండెనట. అప్పటికి ఆరులక్షల కథలు దహనమైనందున మిగిలినకథలు మాత్రమే చక్రవర్తి కంకితము చేయబడెను. ఈ విషయము లన్నియు నా గ్రంథముననే వ్రాయబడి యున్నవి. ఈ గ్రంథకర్త దక్షిణదేశపునివాసి యని తోచుచున్నది. చులికిపైశాచిభాష ఆ కాలమున దక్షిణదేశముననే వాడుకయం దుండెడిది. ఈ కథ లత్యంత ప్రఖ్యాతిని పొందెను. ఈ గ్రంథమునుగూర్చి "మాల్కొం" అను నొక ప్రఖ్యాత పాశ్చాత్య చరిత్రకారు డిట్లు వ్రాసి యుండెను :

> "అత్యద్భుత ప్రతిభకై ప్రఖ్యాతి వడసినవారిలో హెచ్చు ప్రఖ్యాతి గల్గినవారు తమ అద్భుతప్రతిభను వారు వ్రాసిన నవలయందు నీతివిషయముల నతి చమత్కృతితో రచించి, అతి చతురతతో చక్కని పాండితి నిందు గనుబర్చెను. అందువలననే నీ గ్రంథము ప్రతి దేశము నందు ను ప్రచారమునం దున్నది. కథాసరిత్సాగరము, బృహత్ కథ, బేతాళ పంచశతి, సింహాసేన, ద్వాత్రింశతి శుకసప్తతి యను నైదు గ్రంథములు ప్రతిదేశమునందు మిక్కిలి కొనియాడబడినవి. వీటిలో మొదటిది పైశాచీభాషలో వ్రాయబడిన బృహత్కథ కనువాదము. ఈ గ్రంథము కాశ్మీరదేశపు చక్రవర్తి యగు శ్రీహర్షుని కొరకై సంస్కృతములోని కనువదింపబడినది. ఈ గ్రంథము తమ ముత్తవతల్లి యగు సూర్యవతీదేవిగారి ఆదేశమున 1093 వ సం॥మున అనువదింపబడినది."

పైన వ్రాసిన గుణాఢ్యుడేగాక అనేక గొప్పపండితులు కాష్మీరుదేశమున జన్మించిరి. బిల్హణుడు, కల్హణుడు, క్షేమేంద్రుడు,

సోమదేవుడు మొదలయినవారు అట్టి ప్రఖ్యాత పండితులలో కొందరు. బిల్హణు డంధుడు. ఈతడు రాజుగారి కుమార్తెకు విద్యజెప్పుట కేర్పడి తన పాండితీప్రభావముచే నామెచే ప్రేమింపబడి చివర కామెను వివాహమాడెను. ఈ చరిత్రయంతయు బిల్హణీయమను గ్రంథమున వ్రాయబడెను. కల్హణుడను పండితుడు రాజతరంగిణి యను గ్రంథమును రచించియుండెను. ఆనాటి దేశచరిత్ర తనగ్రంథమున విరివిగా వ్రాయబడెను.

సింధి భాష

62. సింధిభాష సింధ్ దేశములో మాట్లాడబడు భాష. ఈ భాషను మాట్లాడువారు చాలమంది మహమ్మదీయులై యున్నారు. సింధ్ దేశమునకు దక్షిణమున గుజరాతిభాషయు, ఉత్తరమున లాండా భాషయు మాట్లాడబడుచున్నవి. తూర్పుభాగమున రాజస్థానీ భాషయు, పడమట భాగమున బెలూచీభాషయు మాట్లాడబడుచున్నది.

మరాటి భాష

63. మహారాష్ట్రీయను నపభ్రంశ భాషనుండి యీ మరాటీ భాష జనించినది. ఈ భాష బొంబాయిరాజధానిలో ననేకభాగముల యందు మాట్లాడబడుచున్నది. పూనా పరిసరగ్రామములలో చక్కని భాష మాట్లాడబడుచున్నది. ఈ భాషయందలి ప్రథమకవి "నామదేవ" యనువారు. ఆనాటివారే "జ్ఞానోబా" యను కవి. వీరు పదమూడవ శతాబ్దమునం దుండిరి. వైష్ణవమతసిద్ధాంతముల కనుయాయినులు. పదునారవశతాబ్ద చివరకాలమున నుండిన శ్రీధరుడను కవి సంస్కృత పురాణములను మరాటీభాషలోని కనువదించెను. తుకోబా యను పేరుచే పిలువబడెడు తుకారాం భక్తుడు మరాటాదేశ కవులలో నగ్రగణ్యుడు. వీరు పదునేడవ శతాబ్దప్రారంభమున జీవించియుండెను. వీరు శివాజీమహారాజుకు సమకాలికులు. వీరు రచించిన "విఠోబా స్తోత్రములగు అభంగములు" మిక్కిలి ప్రఖ్యాతివడసినవి. ఆ దేశమున

ప్రతిగృహమున నీ స్తోత్రములు ప్రతిదినము పఠింపబడు చున్నవి. వీరితరువాత పదునెనిమిదవ శతాబ్దమున "మోరోపంతు" అను కవి యుండెను. ఈ మరాటీ భాషయం దనేకవాడుకభాషలున్నవి. బరోడా, పూనా, సాగరు ప్రాంతముల మాట్లాడబడు భాష అకల్మషమయిన భాష. కోంకిని యను వాడుకభాష కోంకను ప్రాంతముల భాష. గోవానీసు భాషయు కోంకను భాషయే. గోవా ప్రాంతములయందు వాడుకలో నున్నది. నాగ్పురియను వాడుకభాష నాగపూరుప్రాంతము లందును బస్తరీ లేక మలబి యను వాడుకభాష బస్తరు ప్రాంతములయందును వాడుకలో నున్నది. బస్తరీయందు ఉరియాపదములు, హిందీపదములు యెక్కువగా కలసినవి. వీరిలిపి దేవనాగరి లిపియే.

ఉరియా భాష

64. ఉత్కలి లేక ఓడ్రీయను అపభ్రంశభాషనుండిజనించిన భాష యీ "ఉరియా" భాష. ఈ భాషయు, దీనికి ఉత్తరభాగమున మాట్లాడబడెడు "బెంగాలీ" భాషయు మాగధీభాషకు సంబంధించినవే గాని పోలికలు చాలా తక్కువగనున్నవి. ఈ ఉరియాదేశము చాల కాల మాంధ్రదేశముతో సంబంధము కల్గియుండెను. అందువలన తెలుగుభాషా సంపర్కమున్ను కలిగియున్నది. అర్ధశతాబ్దకాలము నాడు భాంస్లే యాధిపత్యమున నీ యురియాదేశ మున్నందున కొంత మరాటీభాషా సంపర్కమున్ను కలిగెను. ఉరియాలిపి దేవనాగరిలిపిలో నుండి యేర్పడినను యీ లిపి మిక్కిలి చిందర వందరగ నుండును. ఈ భాషయందు చాల వాఙ్మయమున్ను కలదు. శ్రీకృష్ణునిగూర్చి వ్రాయబడిన మతకావ్యములు హెచ్చుగ నున్నవి.

బీహారీ భాష

65. బెంగాలీ ఉరియా భాషల వలననే బీహారీభాషయును మాగధీయను నపభ్రంశభాషా జనితమే. ఇది బెంగాలీభాషకు సోదరిని

జోలియున్నది. అయితే బీహారీదేశస్థుల కెపుడు సంయుక్తరాష్ట్రముల మీదనే చూపు గలదు. వారి సహాయమంత వా రాదర్శములన్నియు నచటివే. బీహారు రాజ్యములోని మిథిలరాజ్యపు కన్యయగు సీతా మహాదేవిని శ్రీరామచంద్రుడు వివాహమాడి యుండెను. ఈ బెంగాలీ వారికిన్ని, ఉరియావారికిన్ని యుచ్చారణయందు చాలభేదము లున్నవి. సంయుక్తరాష్ట్రములలో తూర్పుజిల్లాలలోని బీహారీభాషయే మాట్లాడబడుచున్నది. అయోధ్యయందు నీభాషయే మాట్లాడబడుచున్నది. విద్యాపతియను కవి మతమునుగురించి యనేక గ్రంథములను వ్రాసెను. ఈతడు గొప్ప సంగీతవిద్వాంసుడు. ఈతడు వ్రాసిన శ్లోకములన్నియు బహుజనరంజకముగ నుండెడివి. ప్రతివారును వారికవిత్వము ననుకరించి శ్లోకము లనుకరించిరి. ఇతరులువ్రాసిన శ్లోకములున్ను వారే వ్రాసినట్లు దేశమున ప్రచారము చేయబడెడివి. విద్యాపతి వ్రాసిన దంతయు రాధాకృష్ణుని గూర్చియే వ్రాయబడెను. బీహారుదేశమున ననేక నాటకములు సంస్కృత భాషయందే వ్రాయబడెను. అయితే నా నాటకములయందు పాటలుమాత్రము మైథిలిభాషలో వ్రాయబడెడివి. బీహారుదేశమున దేవనాగరి లిపితోపాటు కైతి యను లిపిన్ని వాడబడెడిది.

బెంగాలీ భాష

66. బెంగాలీభాషయు మాగధీ అపభ్రంశమునుండియే జనించినది. కాని వీరి శబ్దఉచ్చారణ బహుచిత్రముగ నుండును. వీరు సంస్కృతభాష వ్రాసియు ప్రాకృతమువలెనే చదువుదురు. ఒత్తు అక్షరముల నుచ్చరించజాలరు. లక్ష్మియను పదమును లక్కియనియు, భక్త యను పదమును బట్ట యనియు, సాగ రనుపదమును షాగరనియు నుచ్చరించెదరు. వీరు వ్రాసెడు లిపి దేవనాగరి లిపిలోనిదే. వీరికి హెచ్చు వాఙ్మయమున్ను కలదు. వీరిలో ప్రథమకవులు చండీదాసు, ముకుందరాం అనువారలు.

67. బెంగాలీ వాఙ్మయము చర్యగేయములతో ప్రారంభించినది. మహానయ బుద్ధమతకాలములో యోగశాస్త్రపాఠముల నేర్చుకొనుచున్న విద్యార్థుల కివ్వబడిన ఆదేశములే యీ చర్యగేయములు. ప్రథమమున వంగదేశీయులు బౌద్ధమతము నవలంబించిన వారేయైనను పదియవశతాబ్దమునకు వీరందరు హిందూమతమునే అవలంబించిరి. వీరి వాఙ్మయము “చండిమంగ”నను కావ్యముతో ప్రారంభించుచున్నది. ఈ గ్రంథమును కవి కంకణ ముకుందరే చక్రవర్తి వ్రాసియుండెను. ఈ పుస్తకము ఆరవశతాబ్దమున వ్రాయబడినది. దీనితరువాత వ్రాయబడిన గ్రంథము వైష్ణవపదావళి. తరువాత తరువాత రాధాకృష్ణులు భక్తిపూరితమగు ప్రేమనుగూర్చిన కవిత్వము హెచ్చుగనుండెను. ఇట్టి కవిత్వమంతయు విద్యాపతి, చండీదాసు, గోవిందదాసు, గోవర్ధనదాసు అను కవులచే వ్రాయబడెను. చైతన్య ప్రభువు ప్రబోధములు గావింప ప్రారంభించినపిమ్మట వారి ప్రబోధములను జనులకు వ్యాఖ్యానము గావించెడి కవిత్వము ప్రజ్వరిల్లినది. తరువాత వ్రాయబడిన గ్రంథములలో పేర్కొనదగినవి కృత్తివాసుకృతరామాయణ గ్రంథమున్ను, కాశీరామదాసుకృత మహాభారతము నయి యున్నవి. ఈ పైనపేర్కొనబడినవారందరు పూర్వపుకవులు. పదునెనిమిదవ శతాబ్దమున కాళీశక్తినిగురించి వ్రాయబడిన కవిత్వము హెచ్చుగ నుండెను. ఈ శక్తిని గూర్చి వ్రాయబడిన వాఙ్మయమంతయు సామాన్యజనుల హెచ్చుగ నాకర్షించినది. పిమ్మటిదంతయు నవీన వాఙ్మయము.

68. పందొమ్మిదవ శతాబ్దమున రాజారామమోహనరాయి యుద్భవించెను. ఈతడు గొప్ప సంఘసంస్కర్త. అక్షయ చంద్ర కుమారదత్తు, ఈశ్వరచంద్ర విద్యాసాగరుడు, దేవేంద్రనాథఠాకూరు యను వారలు రామమోహనరాయిగారి అనుచరులు. వీరందరు గద్య వాఙ్మయమును హెచ్చుగ పోషించిరి. బంకించంద్ర ఛటర్జీ యను వారు నవలారచనయందు ప్రఖ్యాతిగాంచెను. వీరు వ్రాసిన నవల లతి

ఆకర్షణీయముగ నుండుటచే అన్ని దేశ విదేశభాషలలోనికి యనువదింపబడెను. వీరిపిమ్మట రమేషుచంద్రదత్తు అనేక నవలలను వ్రాసెను కాని వారు హెచ్చుగ సర్థశాస్త్రవేత్తగా గొప్ప ప్రఖ్యాతిగాంచెను. వీరి పిమ్మట రవీంద్రనాథటాగురుగారు గీతాంజలి యను ఆధ్యాత్మిక గ్రంథము వలనను అనేకనవలలు, నాటకములవలనను అన్ని దేశముల యందును ప్రఖ్యాతిగాంచెను. వీరు నోబులు బహుమానము పొందిరి. వీరి తరువాత చెప్పదగినవారు శరత్ చంద్రబాబు, నవీనచంద్రసేను గుప్త మొదలయినవారు. ప్రఖ్యాతనాటకకర్తలలో. రవీంద్రనాథ టాగురు తరువాత నవీన్ చంద్రబోసు, ద్విజేంద్రలాలురాయి పేర్లు చెప్పదగియున్నది. వీరిలిపియు దేవనాగరిలిపినుండియే జనించినది.

అస్సామీసు భాష

69. అస్సామీసు భాష హెచ్చుగ అస్సాంలోయుల యందు వాడబడుచున్నది. ఈ భాష బెంగాలీభాషకు సోదరీ భాషయైయున్నది. మణిపురములోవాడబడెడు భాషను మీా యాంగ్ల భాషయనియు లేక బిష్ణుపురీయభాష యనియు పిలువబడుచున్నది. ఈ మణిపురమున మాట్లాడబడెడుభాష హెచ్చుగ బెంగాలీ భాషను పోలియున్నది. అస్సాముదేశమునందలి జనులలో తమకాలమున జరిగెడు విషయములను ప్రతికుటుంబమువారున్ను చరిత్రరూపముగ వ్రాయునాచార మొకటి యుండెడిది. ఇట్టి చరిత్రవలన దేశచరిత్ర బాగుగ తెలియుచున్నది. అయితే యీా ఆచారమును జను లంతగా నిపుడు పాటించుటలేదు. ఈ దేశమున పురాతనపు కవి శ్రీ శంకరదేవు అనువారు. వారు చాల ప్రఖ్యాతకవియై యుండెను. ఈతని కవిత్వ మంతయు మతప్రచారమే యైయున్నది. ఈ మత ప్రచారమునకై యనేక నాటకములున్ను వ్రాయబడెను.

తూర్పు హిందీ

70. ఇప్పటికి శ్రీరామచంద్రభగవానుని జన్మచే ప్రఖ్యాతిగాంచిన దేశరాజమునకు వచ్చియుంటిమి. ఇచట కొంతకాలముగ అర్థమాగధియనుభాష మాట్లాడబడుచుండెను. ఈ అర్థమాగధినుండియే ప్రస్తుతపు తూర్పుహిందీభాష జనించినది. ఇప్పుడు అర్థమాగధీ భాషను గురించి కొన్నివివరములు వ్రాయుట యవసరమని తోచుచున్నది.

71. పూర్వము పంజాబుదేశప్రాంతమున వాడబడుచుండెడు ప్రాంతీయ భాషలలో సంస్కృతభాష చాల ముఖ్యమైన భాషగ నుండెను. ఈ భాషయందు గొప్ప గొప్ప కవులు, పండితులు నుద్భవించినకొలదియు నీ భాషయొక్క ప్రాముఖ్యత హెచ్చుచూ వచ్చెను. వేదములు వ్రాయబడిన ప్రాచీనసంస్కృతమునకు వేదములు వ్రాయుటవలననే మిక్కిలి ప్రాముఖ్యత గల్గియుండెను. ఈ భాషయే యొకప్పుడు అఫ్గనిస్థానమున నుండియు, పవిత్రగంగానది ప్రవహించు ప్రదేశమువరకును మాట్లాడబడుచుండెను. ఈ భాషయొక్క ప్రాముఖ్యత వలనగాని, ప్రాబల్యమువలనగాని ప్రాంతీయభాషల ప్రత్యేకత నశించి యుండలేదు. కాని ప్రాచీన వేదభాషాపదములు అనేకము ప్రాంతీయ భాషలలోనికిచేరి ప్రాంతీయభాషయందలి పదజాలము నభివృద్ధి జేసెను. అంతేగాక ప్రాంతీయభాషలున్ను ఒకప్పుడు వేదభాషయొక్క వాడుక భాషలే యైయుండెను. ఇది యిట్లు జరుగుచుండగ కోసలదేశమున బుద్ధుడు జనించి తన మతమును, తన సిద్ధాంతములను తన దేశభాష యగు కోసలదేశభాషయందు ప్రబోధించుటకు ప్రారంభించెను. ఈ కోసలదేశము కొద్దికాలమునకే మగధసామ్రాజ్యములోని భాగమాయెను. ఇచట సంస్కృతభాష రాజభాషగా చంద్రగుప్తుని కాలమున నుండెను. అయితే అశోకునికాలమున శాసనములన్నియు నిచటి ప్రాంతీయ భాషయగు మాగధి భాషయందు లిఖింపబడుచుండెను. కోసలదేశము మగధ

రాజ్యములోని భాగమగుటవలన బుద్ధుని మత ప్రచారమంతయు మాగధీభాషయందే జరుపబడెను. బుద్ధుని గ్రంథము లన్నియు నీ మాగధీభాషయందే వ్రాయబడెను. పూర్వాచారపరాయణులందరు వేదభాషయగు సంస్కృతభాషనే ప్రచారము చేయుచుండ బుద్ధమత ప్రచారమంతయు నా కాలమున మాగధీభాషయందే జరుపబడెను. ఈ మాగధీ భాషయే“పాళీ” భాషయనియు పిలువబడెను.

72. పాళీభాషకును, సంస్కృతభాషకును చాల భేదములు కలవు. పాళీభాషయందు ఒత్తుఅక్షరములుగాని, సంయుక్తాక్షరములు గాని లేవు. సంస్కృతమునందలి “స ప్త” యనుపదము పాళీభాషయందు “స త్త”యనియు, “ధర్మ” “దమ్మ”యనియు, “అష్ట”“అ త్త”యనియు, “సూత్ర” “సు త్త” యనియు మారిపోవుచున్నవి. భాషలయం దిట్టి మార్పు లెప్పుడును జరుగుచునే యున్నవి. ఈ కాలమున “గర్లస్” ఇంగ్లీషుపదము “గల్స” నియు, “లండన్” అనుపదము “లన్నన్” అనియు మారుట మనమిపుడు గమనించుచునే యున్నాము.

73. బౌద్ధమత ప్రాబల్యము దేశమున తగ్గుచుండగా తిరిగి సంస్కృతభాషకు ప్రాబల్యము రాజొచ్చెను. అయితే జనులప్పటికి ప్రాంతీయభాషలనే వాడుచుండిరి. ఈ ప్రాంతీయభాషలే ప్రాకృతభాషలు, ఈ ప్రాకృతభాషలే జనామోదమును పొందినవి. ఆయాప్రాంతములందు మాటలాడుభాషలే ప్రాకృతభాషలు. ఈ భాషలే జనులచే ప్రచారము చేయబడుచుండెను. ఈ భాషలే జాతీయభాషలుగ పరిగణింపబడెడివి. రాజులు ఆయాభాషలయం దంతగా ఐక్యము కలుగజేసుకొనలేదు. కాని దేశమునందలి వైయ్యాకరుణులుమాత్రము యీ ప్రాంతీయ భాషలనన్నిటిని చక్కగ పరీక్షించి వాటిని సంస్కరించి వాటినుండి యొక సంస్కరింపబడినభాషను దయారుచేయ యత్నించిరి. అదియే సంస్కరింపబడిన సంస్కృతభాష. ఈ భాషకు సూత్రములను వైయ్యాకరుణులేర్పరచిరి. అట్టి వైయ్యాకరుణి “పాణిని”. ఈతడు

“సలాత్ పుర” మను నొక గ్రామ నివాసి. ఈ గ్రామము రావీనది ఒడ్డున నుండెడిది. ఈతని పూర్తిపేరు శశాంకభూషణుడు. మనకు తెలిసినంత వర కిదియే ప్రథమవ్యాకరణము. ఈతడు సంస్కరించి తయారుచేసిన భాషయే సంస్కృతభాష. ఈ భాషయందే ప్రపంచమునందలి ముఖ్యముగ మన హిందూదేశమునందలి గొప్పగ్రంథములన్నియు వ్రాయబడినవి. ఈ భాషయే రాజులసభలయం దుపయోగింపబడెడిది. పండితులు సభలయం దీభాషనే నుపయోగించెడివారు. మహాకవి కాళిదాసు పరిష్కరింపబడిన భాషయందే తన ప్రఖ్యాతనాటకములను రచించెను. మహారాజైన శ్రీహర్షుడు, కవి బాణుడు, యితర గొప్ప కవులు తమ రచనలను యీ పరిష్కరింపబడిన భాషయందే రచించిరి. ఈ భాష కొంతకాలము జనులచే మాట్లాడబడి యుండెను. ఈ సంస్కృతభాషతోపాటు ప్రాంతీయభాషలున్ను వాడబడుచుండెడివి. ప్రాకృతము, అపభ్రంశము, పైశాచి భాషలున్ను వాడుకయందుండెను. 557 సంవత్సరపు శాసనమున ధర్మసేన మహారాజు తన తండ్రియగు గుహశేనుడు సంస్కృత, ప్రాకృత, అపభ్రంశ భాషలలో గొప్ప పండితుడని వ్రాసి యుండెను. ఈ అపభ్రంశ భాషలనే అపభ్రష్టము లనియు వాడెడువారు. ఈ అపభ్రంశ భాషలయం దనేక గ్రంథములు 1450 వ సంవత్సరమువరకు వ్రాయబడుచునేయుండెను. ఈ అపభ్రంశ భాషలనుండియే సౌరసేని, మహారాష్ట్రి, మాగధి, అర్ధమాగధి, పైశాచి యను నైదు వాడుకభాష లుద్భవించెను. వీటినిగురించి యిదివరకే వ్రాసియుంటిని. ఈ శౌరసేనిభాష నుండియే ‘హిందీ’ భాష జనించి నది. ఈ భాష పదునొకండవ శతాబ్దమున జనించినట్లు కనుపించు చున్నది. ఇది హిందూస్థానమున వాడుకలోనికి వచ్చెను.

74. ఈ సమయమునకు తురకలు హిందూదేశము ప్రవేశించిరి. అప్పటికే హిందూదేశమున రాజ్యము చేయుటకును ప్రారంభించిరి. వారు రాజ్యముచేయుట ప్రారంభించినంతనే హిందూమత సంస్థల నాశనముచేయుటకు మొదలిడిరి. అచట వారి మతసంస్థల నెలకొల్పిరి.

ఇంతేగాక యిచట వాడుకలోనున్న భాషలకు బదులుగ తమ దేశభాషల జొప్పింప ప్రయత్నించిరి.

75. పదమూడవ శతాబ్ద ప్రారంభమున ఢిల్లీ ప్రాంతములకు దండయాత్ర సలిపి తమ రాజ్యమును స్థాపించిరి. వీరికి పిమ్మట ఉత్తర హిందూస్థానమునకు తార్తారులు దండయాత్ర సల్పిరి. ఈ తార్తారులు హూను (Hun) జాతివారు. వీరిలో మిక్కిలి పౌరుషవంతుడైనవాడు చెంగిస్ఖానుడు. అదే సమయమున నింకొక మంగోలు జాతివారు దేశమున దండెత్తసాగిరి. ఈ రెండు జాతులవారు (Hun + Mongol) కలసి తైమూరనువానిని అధిపతిగా చేసికొని పర్షియా దేశమును దండయాత్ర గావించి స్వాధీనపరచుకొని దేశము నిష్టము వచ్చినట్లు ధ్వంసము జేసిరి. పర్షియను దేశమునః నాశనము జేసిన పిమ్మట హిందూదేశముపై దండెత్తిరి. ఢిల్లీపట్టణము ప్రవేశించి రాజ్యస్థాపనము గావించి మొగలు ప్రభుత్వము ప్రారంభించిరి. ఇది పదిహేనవ శతాబ్దము. మొగలువారిభాష అప్పటికి పర్షియను భాష. దీనినే యిచట రాజభాషగా నేర్పరచిరి. ఏనాడు పర్షియను భాష రాజభాష చేయబడెనో ఆనాడే అప్పటివరకు తాము ప్రతిదినము వాడుచు ప్రచారము చేయుచున్న హిందీభాష నలక్ష్యముజేసి రాజభాషయగు పర్షియను భాషవైపు తమ దృష్టిని మరల్చిరి. ఉత్తర హిందూస్థానమునందలి పండితులు, కవులు, రాజకీయవేత్తలు రాజభాషయగు పర్షియను భాషను నేర్చుకొని, ప్రావీణ్యతను సంపాదించి తమ గ్రంథములనీ పర్షియను భాషయందు వ్రాయ మొదలిడిరి. వీరే పర్షియను కవులను, పండితులను స్తుతింపప్రారంభించిరి. పర్షియను దేశపు కవులగు 'ఫిరదౌషి' 'సాదీ' లను మెచ్చుకొనిరి. వారి గ్రంథములను మిక్కిలి పొగడిరి. ఉత్తర హిందూస్థానమున ప్రచారముననున్న హిందీభాషయందు పర్షియనుభాషాపదములను కుప్పలు కుప్పలుగా జొప్పించిరి. రాజభాష ఆ కాలమున పర్షియనుభాషయే యైనను పర్షియను భాషతో మిళితమైన హిందీభాషను మొగలుప్రభుత్వమువారు మిక్కిలి స్తుతించిరి.

పర్షియను భాషాపదములతో సమ్మిళితమైన హిందీభాషకు ప్రత్యేకము 'ఉర్దూ' భాష యని ప్రభువులచేతను, ప్రజలచేతను పిలువబడెడిది. దీనినే ఒకప్పుడు 'హిందూస్థానీ' యనియు పిలుచుచుండిరి. 'ఉర్దూ' అయినను, 'హిందూస్థానీ' యైనను ఆ భాష ఆ కాలమున హిందూస్థానీ దేశభాష ఆయెను.

తూర్పు హిందీ

76. ఒకప్పుడు భగవానుడు శ్రీరామ చంద్రమూర్తి రాజ్యముచేసిన దేశమునందు తూర్పు హిందీభాష వ్యాపకమున నుండెను. ఈభాష ఔడ్ అనబడెడు అయోధ్యయందు, ఆగ్ర భండెల్ఖండ్, భాగేల్ఖండ్, ఛోటానాగపూరు మధ్య పరగణాలలో వాడుకయందుండెను. ఈ భాషయందు అవధి, భాగేలి, ఛతిస్గ్రిహి యను మూడు వాడుకభాష లుండెడివి. పైన చెప్పిన వాడుకభాషలలో మొదటి రెండున్ను అవధి, భాగేలి భాషలు గొప్ప సంస్కృతి కల్గిన భాషలు. అయితే యీ రెండు వాడుకభాషలయందు హెచ్చు భేదములున్ను లేవు. ఈ అవధిభాషలో ప్రథమకవులలో ప్రఖ్యాతిగాంచినవారు 'మల్లికు మహమ్మ'దను వారు. వీరు 1540 వ సంవత్సర ప్రాంతమునుండి యుండిరి. వీరు ముసల్మానుజాతికి చెందినవారు. వీరు 'పదుమావతి' యని తత్వశాస్త్ర గ్రంథమును వ్రాసియుండెను. ఈ గ్రంథమునందు పద్మావతీ రత్నసేనుల ప్రేమగాథ వివరింపబడినది. అయితే యీ కథ విషాదాంతము. తరువాత వచ్చిన కవులలో గొప్ప ప్రఖ్యాతిగాంచిన కవి తులసీదాసు. ఈతడు పాశ్చాత్య దేశ ప్రఖ్యాత నాటకకర్తయగు షేక్స్పియరు కవికి సమకాలికుడు. ఈతడువ్రాసిన గ్రంథము దేశదేశముల ప్రఖ్యాతిపొందెను. ఇది 'తులసీ రామాయణము'. ఇది పదునేడవ శతాబ్ద ప్రథమకాలమునందు వ్రాయబడెను. ఈ పుస్తకముతో సరితూగు పుస్తక మింకొకటిలేదని కోటానుకోట్ల జనులచే స్తుతింపబడినది. మిక్కిలి ప్రఖ్యాతిగాంచిన పుస్తక మిదియే. ఒక విమర్శకు డీ గ్రంథమును విమర్శించుచు నిట్లు వ్రాసెను :

"కొన్ని శతాబ్దముల కాలము వెనుకకు తిరిగి చూడగా హిందూస్థాని దేశమున నీ పేరుగనిన ప్రఖ్యాతపురుషుని జ్యోతి ప్రజ్వరించు చున్నట్లు కనుపించుచున్నది. 'జార్జీ' యను నాంగ్ల పండితు డింకొకరు తులసీరామాయణము నింగ్లీషులో కనువదించుచు నిట్లు వ్రాసియుండెను : పెద్ద పెద్ద కబీరులనుండి చిన్న చిన్న నివాస గృహములవరకు నీ పుస్తకము ప్రతివారి చేతను కనుబడుచున్నది. హిందువులలో పండితులుగాని, పామరులు గాని, గొప్పవారుగాని, చిన్నవారుగాని, ఉద్యోగస్థులుగాని విద్యార్థులుగాని, పెద్దవారుగాని, చిన్నవారుగాని వీరు వారననేల ప్రతివారు నీ పుస్తకమును చదువుటయో, వినుటయో, ఆనందించుటయో జరుగుచునే యున్నది."

77. భాగేలి : ఈ భాగేలీ యను వాడుకభాషయందును తగుమైన వాంగ్మయ ముండి యున్నది. ఈ వాంగ్మయమును రీవా ప్రభువులు యెక్కువగ నాదరించిరి. ఈ భాషయందు హెచ్చుమంది విమర్శకులు విమర్శగ్రంథములను వ్రాసిరి.

ప డ మ టి హి ం దీ

78. ఈ పడమటి హిందీభాష పంజాబు దేశములోని సర్హిందు ప్రాంతముననుండి అలహాబాదు (ప్రయాగ) ప్రాంతమువరకు మాటలాడబడుచున్నది. ఉత్తరమున హిమాలయపర్వతములవరకు నిదియేభాష. ఇందులో 1. హిందూస్థాని 2. బ్రాజీ 3. కనోజి 4. బండేలి 5. బంగార యను నైదుభాషలుకలవు. ఇందులో హిందూస్థానీ భాషయే నెక్కువ ప్రఖ్యాతిగాంచిన భాష.

హి ం దూ స్థా ని

79. హిందూస్థానీభాష పంజాబీభాషనే యెక్కువగ ననుకరించుచున్నది. ఈ భాషకు పడమటి హిందీవ్యాకరణము ప్రధాన

గ్రంథము. ఈ భాషయందలి అంత్యములున్ను, పంజాబీభాషయందలి అంత్యములున్ను నొకేపోలిక నున్నవి. గ్రంథములన్నియు నీ భాషయందే వ్రాయబడినవి. హిందూస్థానీభాషయే హిందూదేశమున నెక్కువమంది జనులచే మాట్లాడబడెడుభాష. ఈ భాషయే హిందూదేశమునకు సామాన్యరాజకీయభాషగా చేయతగిన భాషయైయున్నది. నిర్మాలిన్యమైన హిందూస్థానీభాష మీరటుదేశప్రాంతముల వాడబడుచున్నది. ఈ భాషయే రోహిల్కండు, అంబాలా జిల్లాలయందు మాట్లాడబడుచున్నది. రోహిల్కండువద్ద కనోజిభాషతో సంకలితమగుచున్నది. అంబాలావద్ద పంజాబీభాషతో కలియుచున్నది. ఈ భాషయే పూర్వము డెల్హీలోని రాజ్యసభలలోను, ప్రజలచేతను వాడబడి దేశమంతటను వ్యాపించినది. మొగలాయీల రాజ్యమున నీభాషయే దేశభాషగ నుండెడిది. హిందూస్థానీయు ననేకవిధములుగ వాడుకలోనుండెడిది. అందొక ముఖ్యమైన వాడుకభాష 'ఉర్దూభాష'.

ఉ ర్దూ

80. ఉర్దూభాష పర్షియాదేశపులిపిలో వ్రాయబడుచున్నది. ఉర్దూవందు హెచ్చుగ పర్షియాదేశపు పదములున్ను, అరేబియాదేశపు పదములున్ను ఉండియున్నవి. ఈ కలయిక మొగలాయీరాజులు రాజ్యముచేసిన సమయమున నా ప్రభువులుచేసిన బలవంతమువలన జరిగినది కాదని స్పష్టముగా చెప్పవచ్చును. మొగలాయి ప్రభువులవద్ద తాబేదార్లుగ పనిజేయుచున్న హిందూయుద్యోగస్థులే తమకు రాజుల భాషయగు పర్షియనుభాషయందుగల అభిమానమును ప్రకటించుటకై వారిచే చేయబడిన కృత్యమైయున్నది. 'గ్రియర్స' నను భాషాపండితుడీ విషయమై వ్రాయుచూ, యిట్లు వ్రాసియుండెను :

"హిందూస్థానితో పర్షియనుభాష నింత విరివిగా మిళితము చేయుట సర్. చార్లెసు లయల్ అను చరిత్రకారుడు చెప్పినట్లు దండెత్తి దేశమును పరిపాలించినట్టియు, నీభాషను తెలియ

నట్టియు ప్రభువులపనికాదు. ప్రభువులభాషను తాము స్వీకరించి తమకు ప్రభువులయందుగల మితిలేనిభక్తిని వెల్లడించుకొనవలయునన్న ప్రజలయొక్క కృషివలననే నీ ఉర్దూభాష ప్రబలమయినది. దీనికి కారకులు ప్రభుత్వముచే నుద్యోగమునందు ప్రవేశింపబెట్టిన కాయస్థులు, క్షత్రియులదిన్ని అయియున్నది.''

ఉర్దూభాషలోనికి పర్షియా దేశపు పదములను కలుపు పద్ధతికి ప్రత్యేకముగ 'రోక్త' యను పేరు పెట్టబడినది. 'రోక్తా' యనుపదమునకు ప్రత్యేక కలయిక యను నర్థము కలదు. దక్షిణ దేశమున మాట్లాడబడు హిందూస్థానీయందు యింతపర్షియను పదసమ్మేళనము లేదు. దీనిని 'దఖని' యని పిలిచెడివారు.

హిందీ

హిందూస్థానీలోని యింకొక వాడుకభాషయే హిందీ. పశ్చిమ హిందీయే యిపుడు హిందీయని చెప్పబడుచున్నది. హిందూదేశమున దేశభాషగా నుపయోగింపవలయునని ప్రచారముచేయబడెడు భాషయే యీ హిందీ. దీనిప్రచారమునకే దక్షిణహిందీ ప్రచారక సభలు మనదేశమున స్థాపించబడినవి. 'హిందు' అనుపదము 'సిందు' నుండి వచ్చినది. ఇరేనియను భాషలలో 'స' యను నక్షరమునకు బదులు 'హ' యను నక్షర ముపయోగింపబడుచున్నది. మనదేశపు 'అసురులే' అచటి 'అహురులు'. అందువలన సింధునదీప్రాంతమున నున్న జనులు హిందువు లనబడిరి. హిందూమతస్థు లందరును హిందువు లనబడిరి. మొగలు రాజులు రాజ్యముచేయు కాలమున నీ హిందూయను పదము మొగలాయి రాజులచే ప్రచారమునకు తేబడెను. అప్పుడు ఇండియాదేశస్థు లందరిని హిందువులనిరి.

హిందూకాని ఇండియనును ప్రత్యేకించుటకై యీ 'హిందీ' యను పదము వాడుకలోనికి తేబడెను. దీనినిగూర్చి వ్రాయునపు డీ

యుదాహరణ మీయబడినది. 'బ్రతికియున్న హిందు వెవరు చేజిక్కినను యేనుగులచే త్రొక్కించి పిండిచేసి చంపవలయును. 'హిందీ' లైన ముసల్మానులను రక్షించవలెనని అమీరుఖుస్రూ చెప్పెడివారట. ప్రథమ దశయందు 'హిందీ' యను పదము హిందువుకాని ఇండియనును ప్రత్యేకింపబడినది. ఈ విషయమును గ్రియర్సనను పండితుడు వ్రాసియుండెను. అయితే ఆంగ్లేయులు రాజ్యముచేయుట ప్రారంభించిన తోడనే నీ 'హిందీ' యను పదమును పర్షియను భాషాపదములు తక్కువగా నుపయోగింపబడి, సంస్కృతభాషా పదములు హెచ్చుగ నుండి దేవనాగరిలిపిలో వ్రాయబడిన 'ఉర్దూ' ను తెలియజేయుటకై యుపయోగింపబడెను. ఇంతేకాన ఉత్తరహిందూస్థానము మరికొన్ని వాడుకభాషలను కలిపి యీ 'హిందీ' యను పదమును ఆంగ్లేయులుపయోగించుచూ వచ్చిరి. ఈ 'హిందీ' యను పదమును మనము సక్రమముగా నర్థముచేసికొనగలందులకు దీని విషయమై గ్రియర్సను భాషా పండితుడు 'ఇంపీరియల్ గెజెటు ఆఫ్ ఇండియా' (Imperial Gazette of India) యను గ్రంథములో 361 వ పేజీలో 4 మొదలు 29 పంక్తులవరకు నిట్లు వ్రాసియుండిరి :

"ఉర్దూభాష దానియొక్క ప్రథమదశయందు పూర్తిగ కావ్యరూపకమగు గద్యము ఇంగ్లీషువారు హిందూదేశము నాక్రమించినపిమ్మట ఫోర్టువిల్లియం కాలేజిలో (Fort William College) నేర్పరచు సందర్భములో యీ యుర్దూను కనిపెట్టిరి. ఆ కాలేజీలోనిపండితు లా సమయముననే హిందూస్థానీలోని హిందీనికూడ కనిపెట్టిరి. హిందువుల యుపయోగము కొరకు హిందూస్థాని నేర్పరచుచు ఉర్దూభాషలోని అరబిక్ పర్షియను భాషాపదములను తీసివైచి వాటిబదులు సంస్కృత భాషలోని పదముల నుపయోగించి దానిని (హిందీని) వాడుటకై యుద్దేశింపబడినది. ఇందులో హిందీలో వ్రాయబడిన ప్రథమగ్రంథమునకుగల్గిన జనఆదరణవలనను, హిందువుల

మతమునకు విరోధకరముగ నుండునట్లును, హిందువులచే దేశ భాషగ నుపయోగించుటకు వీలుకలుగునట్లును దీనిని (హిందీని) వాడుకలోనికి దెచ్చిరి. ఈ భాష యిప్పుడు ఉత్తరయిండియా లోని ఉర్దూభాష నుపయోగించని హిందువులు ధారాళముగ నీ భాషను గద్యమునం దుపయోగించుటకు సర్వసామాన్యముగ నంగీకరించిరి. మొట్ట మొదట వాడబడిన భాషాపదముల వ్యత్యాసము కొంత ఉర్దూతో కలిగియున్నను ఒక శతాబ్ద కాలము వాడుకలోనున్నందున నీ హిందీలో కొన్ని ప్రత్యేక మాట లుద్భవించినవి. అప్పటికి యీ రెండు భాషలలోను పుస్తకములను వ్రాయుట ఒకేభాష తెలిసినవారి కసాధ్యమైనది. అయితే ఒక మహమ్మదీయుడు పర్షియనుభాషాపదమును గాని, అరబిక్ భాషాపదమును గాని యుపయోగించకనే ఉర్దూ భాషలో పుస్తకమును వ్రాసినను హిందువు లాపుస్తకమునం దుండు ప్రత్యేకవాడుకపదములనుబట్టి ఉర్దూపుస్తకముగనే భావించిరిగాని హిందీపుస్తకముగ గణించి యుండలేదు."

82. దీనినిబట్టి చూడగ, హిందీభాష యిటీవలనే అనగా యిప్పటికి ఆరుశతాబ్దముల క్రింద నుత్పన్నమయినట్లు కనుపించుచున్నది. కాని యీ హిందీభాషయం దుపయోగింపబడిన వాడుకభాషలు పూర్వపు ఇండో ఆర్యను భాషాసంబంధములే యైయున్నవి. అంతకు పూర్వము కవులు తమపుస్తకములను యిచటి ప్రాంతీయభాషలలో వ్రాయుచుండిరి. 'లల్లూలా'లను కవి తన 'ప్రేమసాగర'మను గ్రంథమును ఉర్దూభాషలో వ్రాసెనుగాని, పర్షియను అరబికు భాషాపదముల రానివ్వక వాటిబదులు సంస్కృతభాషాపదములనే వ్రాసియుండెను. ఈతడు వ్రాసిన ప్రేమసాగర మను గ్రంథము బహుజన ఆదరణమును పొందుటయేగాక భాషాగ్రంథముల వ్రాయుటలో నొక నూతనశక మారంభింపబడినట్లుగ యెంచబడినది. ఇతరులు నీ పద్ధతినే యవలంబించిరి. కావ్యములు వ్రాసినపుడు ప్రాంతీయభాషలయందు వ్రాయుచు

గద్యగ్రంథముల వ్రాయునపుడు హిందీభాషలో వ్రాయుచుండిరి. పందొమ్మిదివందల శతాబ్ది చివరిభాగమునందు పద్యరూపకమైన గ్రంథములున్ను హిందీభాషలో వ్రాయుటకు ప్రారంభించిరి. కాని అట్టి గ్రంథములు జనులచే హెచ్చుగ నామోదింపబడలేదు. అందుచేత పద్యకావ్యముల వ్రాయువారు తులసీరామాయణమును వ్రాసిన అవధి ప్రాంతీయభాషయందుగాని, బ్రాజభాషయందుగాని, మరి యితర వాడుక భాషలయందుగాని వ్రాయుచువచ్చిరి. వీటినిబట్టి చూడగ, ఉర్దూ హిందీభాషలు హిందూస్థానిభాషలోని రెండు పిల్లభాషలుగ నున్నవి. ఉర్దూభాషలో పర్షియను అరబికు పదములు హెచ్చుగనుండును. హిందీ దేవనాగరిలిపిలో వ్రాయబడగ, ఉర్దు పర్షియను లిపిలో వ్రాయబడు చున్నది. సంస్కృతపదములను వాడుటవలన భాషాశైలికి ప్రత్యేకత కలదని కొంద రభిప్రాయపడుచున్నారు. అయితే సంస్కృతపదముల నుపయోగించినందులకు చులకనగా మాట్లాడి హేళనచేసిన పండితు లుత్తరహిందూస్థానమున లేకపోలేదు. వారిలో నొకరు దీనిని హేళన చేయుచు నిట్లు వ్రాసియుండిరి :

> "పదునెనిమిది సంవత్సరములవయసులోనున్న యువరాలికి ఆపె ముసలమ్మయొక్క దుస్తులను, నగలను పెట్టి అలంకరించిన ట్లయినది."

83. ఉర్దూభాషలో గొప్పకవులలో నొకరు ఔరంగబాదు వాస్తవ్యుడగు 'వాలి' యనువారు. వీరితరువాత డెల్హీయందు యనువారొకరు (1780) మీరు త్యాగి. (1810) యను మరియిద్దరు గొప్ప కవు లుండిరి. గద్యరచనల రచించినవారిలో 'బాగో బహో'రను గ్రంథమును రచించిన 'మీ రమ్మనన్' అనువారును, 'ఖరోజులఫ్రోజు' అను గ్రంథమును రచించిన 'హాఫిజుద్దీను అహ్మ' దనువారు, 'మహమ్మదు హుస్సైనహమ్మ'దను వారు, 'పండిత రతన్నాథ్' అనువారు పేరు ప్రఖ్యాతలు గణించినవారు. పందొమ్మిదవ శతాబ్దమునందు హిందీ గద్యరచనలలో ప్రఖ్యాతిగడించినవారు 'ప్రేమసాగ'రను గ్రంథమును

వ్రాసిన 'లల్లూలా'లున్ను, వారణాసి వాస్తవ్యుడగు హరిశ్చంద్రుడు నయి యున్నారు.

84. పశ్చిమహిందీభాషలో నింకొక వాడుకభాష కలదు. ఇది వ్రజభాష. ఇదియే పూర్వపు శౌరసేనిభాష. ఇది కేవల ప్రాకృత భాష. 'వ్రజ' యన ఆవులమంద యను నర్థము గలదు. ఆవులమంద లున్న దేశములో వాడుకలోనున్న భాష. ఆవధిభాషలో శ్రీరాముని చరిత మెట్లు తులసీదాసుచే తులసీరామాయణ మనుపేర వ్రాయబడెనో అట్లే వ్రజభాషయందు శ్రీకృష్ణునిచరితము, కృష్ణలీలలు అట్లే వర్ణింపబడినవి. శ్రీకృష్ణుడు జీవించినట్లు చెప్పబడెడు మధుర బృందావన దేశము లీ భాగముననే యుండియున్నవి. రామాయణము తులసీదాసు వ్రాసియుండ సూరదాసు కృష్ణునిచరితము వ్రాసియుండెను. తులసీదాసెంత ప్రఖ్యాతకవియో, సూరదాసు నంతకవియే. సూరదాసు పాట లతిమనోహరముగ నుండును. తులసీదాసు సంఘసంస్కర్తయై, సంఘసంస్కరణకు దారిజూపగా సూరదాసు మతప్రాబల్యమునకై పాటుబడెను. తులసీదాసు పదునారవ శతాబ్దప్రారంభమున నుండ, సూరదాసు పదునారవశతాబ్ద మధ్యకాలమున ప్రాబల్యమునకు వచ్చెను. ఒకరికొకరు తీసిపోవువారు కారు. వ్రజభాషయందే జైనమత గ్రంథములు వ్రాయబడెను.

రాజస్థానీ భాష

85. 'రాజస్థాని'యను భాష రాజపుటానాయను దేశమున మాట్లాడబడెడు భాష. ఈ భాషయే మధ్యరాష్ట్రములలోని కొన్ని ప్రాంతములయందు సింధుదేశమునను, పంజాబుదేశమునను మాట్లాడబడుచున్నది. ఈ భాషయం దనేక వాడుకభాష లుండియున్నవి. కాని వాటిలో మేవాటి, మార్వి, జయపురి, మార్వారి యను నాలుగున్ను పేర్లు చెప్పదగినవి. మేవాటిభాష ఆల్వారు సంస్థానమునందలి ప్రాంతములందును, మాల్వీ భాష మాల్వా ప్రాంతములందును వాడుకలోనున్న భాషలు. జయపురీభాష తూర్పు రాజపుటానాలో మాట్లాడబడుచున్నది. మిగిలిన మార్వారీభాష మిక్కిలి ముఖ్యమైన భాష. ఈ భాష యెక్కువమంది జనులచే మాట్లాడబడెడు భాష. ఈ భాష యెక్కువగా ఉదయపూరు, బికనీరు సంస్థానములయందు మాట్లాడబడుచున్నది. ఈ మార్వారీభాషయందు కొంతచెప్పదగు వాంగ్మయమున్ను కలదు. రాజస్థానమే పూర్వపు పాంచాలదేశము. మహాభారతమున ప్రత్యేక ప్రఖ్యాతివహించిన దేశ మిదియే. ఈ భాషలో గ్రంథములు వ్రాయుటకు దేవనాగరిలిపియే వాడబడుచున్నది. అయితే సామాన్యజనులు మాత్రము 'మహాజని' యను నింకొక లిపిని వాడుచుందురు. ఈ మార్వారీలు ద్రవ్యమునాకర్షించుటయందు బహునేర్పరులు. హిందూదేశమున నన్నిప్రాంతములయందును ద్రవ్య సంపాదనకై జేరియున్నారు. ఈ కాలమున నీ మార్వారీలచే అడుగు బెట్టని ప్రదేశము లేదు.

ఘూర్జరి లేక గుజరాటిభాష

86. ఘూర్జరులు దేశసంచారులు. ఇట్లేసంచారముచేయుచు నుత్తరహిందూస్థానమునకు చేరిరి. వీరినుండియే దేశమునకు ఘూర్జర దేశమని పేరు వచ్చినది. వీరు మాట్లాడెడుభాష రాజస్థానీభాషకు సన్నిహితమైన భాష. ఈ భాషయందు చాలవాంగ్మయ మున్నది. మనకు తెలిసినంతవరకు నీ భాషలోని ప్రథమగ్రంథము పదునైదవ శతాబ్దమున 'నరసింగమేతా' యనువారిచే వ్రాయబడినది. పూర్వమీ భాష దేవనాగరిలిపిలో వ్రాయబడెడిది. ఇపుడు వారిభాషకు వేరే లిపిని వారే యేర్పాటుచేసికొని యుండిరి.

పంజాబి

87. పూర్వమీ పంజాబుదేశమున ప్రభుత్వమునందుగాని, వేదమునందుగాని హెచ్చునమ్మక ముండెడిదికాదు. ఈ దేశమున వర్ణభేదమున్ను లేదు. ఇప్పుడు కొంతమారినది. సిక్కు లిపుడు పంజాబీ భాషను వాడుచున్నారు. పంజాబీభాష అనేకభాషల కలయికవలన

కూడిన పశ్చిమహిందీభాషయందు హెచ్చుగ కలసియున్నది. సిక్కుల పవిత్రగ్రంథము పశ్చిమ హిందీలో వ్రాయబడి యున్నది. అయితే లిపి మాత్రము గురుముఖలిపి. నిర్మాలిన్యమైన పంజాబిభాష అమృతసరములో మాట్లాడబడుచున్నది. పశ్చిమ పంజాబు దేశమున లాండాభాష వాడుకలోనున్నది. దానివ్రాత కనుగొనుట బహుకష్టము. గురుముఖలిపి కొంతవరకు కనుగొనవచ్చును. ఈ లిపియు నిప్పటికి నాలుగువందల సంవత్సరముల క్రిందనే వాడుకలోనికి వచ్చినది.

88. ప్రస్తుతము నుత్తర హిందూస్థానమున వాడుక భాషలను గూర్చిన వివరములను, ప్రథమమున నీ భాష లన్నియు నే ప్రాకృత అపభ్రంశ పైశాచీ భాషలనుండి జనించినవో వాటిని గురించియు కొంతవరకు పైన వ్రాసియుంటిని. పై విషయములనుబట్టి ప్రథమమున వేదములు వ్రాయబడినభాషయే వేదభాష. అదియు ఆర్యుల భాషయేయై యున్నది. దీనికి పిమ్మట ప్రాకృత భాషలు, అపభ్రంశములు, పైశాచీభాషలును జనించినవి. ఈ భాషలన్నియు రెండవ గుంపు ఆర్యులు హిందూదేశమునకు ప్రవేశించునప్పటికి వాడుకలోనుండి యుండెను. ఈ రెండవ గుంపు ఆర్యులు హిందూదేశమునకు వచ్చినపిదప వాడుకభాషల నన్నిటిని సమన్వయపరచి వాటిని సంస్కరించి వాటినుండి యొకముఖ్యమైన సంస్కారభాషను వైయ్యాకరుణులు సృష్టింపు గావించియుండిరి. ఆ సంస్కరింపబడిన భాషయే సంస్కృతభాష. ఈ భాషయందే గొప్ప గొప్ప కవులు ప్రఖ్యాతమైనగ్రంథములను వ్రాసి దేశమును ప్రథమస్థానమునకు తీసికొనివచ్చిరి. ఈ సంస్కృతభాషయు కొంతకాలము దేశమున వాడబడెననుట స్పష్టము. తక్కిన ప్రాంతీయభాషలకువలెనే నీభాషయు కొన్ని ప్రాంతములయందు మాట్లాడబడుటయేగాక గొప్పరాజసభల యందు ప్రధానభాషగ నుండెడిది. ఈ భాషనుగురించి వ్రాయుచు 'గ్రియర్స'నను పండితుడు 'ఇంపీరియల్ గజెటీరు ఆఫ్ ఇండియా' లో 357 పేజీలో

"సంస్కృతభాష పూర్వపు ఆర్యభాషయే. పాణిని యను వైయ్యాకరుణునిచే పరిష్కరింపబడి కొన్నిరాజకీయ కారణములవలనను, పెక్కు గ్రంథము లీభాషయందే వ్రాయుటవలనను నొక ప్రాంతీయభాషగా నుండక దేశమునందు ముఖ్యభాషగా మారి పండిత పామరులచే నుపయోగింపబడుచు యిప్పటివరకును గ్రంథభాషగనే నిలిచియున్నది" అని వ్రాసియుండిరి.

ఈ సంస్కృతభాష అప్పటినుండి రాష్ట్రభాషగా చాలకాలము ఉపయోగింపబడినది. ఆంధ్రులు రాజ్యముచేయుకాలమున సంస్కృత భాష రాజభాషగ నుండెను. శాసనములున్ను సంస్కృతముననే వ్రాయబడెను.

89. అంతకుపూర్వమే సంస్కృతము ఉత్తర హిందూస్థానమున వాడుకభాషగ నుండియుండవలెననుట శ్రీమద్వాల్మీకి రామాయణమువలనను స్పష్టపడుచున్నది. సుందరకాండమున ఆంజనేయులవారు అశోకవనమున సీతాదేవిని రావణుడు తనను వివాహమాడుమని బలవంతముచేసి నాపెచే వివాహమున కంగీకరింప బలవంతపరుపుమని చెప్పినపిమ్మట సీతామహాదేవితో మాట్లాడుట కుద్యుక్తుడై ఆమెతో నేభాషయందు మాట్లాడవలెనని వితర్కించుకొనుచు నిట్లు తలపోయసాగెను. అతని స్వగతమునందు బ్రాహ్మణులు, పండితులు మాట్లాడు సంస్కృత మొకటియును, సామాన్యజనులు మాట్లాడు సంస్కృత మొకటియు నున్నట్లు చెప్పియున్నాడు. 'ద్విజాతిరివ సంస్కృతా' మనియు, 'మానుషీమిహ సంస్కృతం' అనియు రెండువిధములుగ చెప్పి తానాలోచించి చిట్టచివరకు సీతామహాదేవితో సామాన్యజనులు మాట్లాడు సంస్కృతములో మాట్లాడుటకు 'మానుషంవాక్యమర్థవత్' అని నిశ్చయించుకొనెను.

బ్రూహి భాష

90. ఈ భాషావివరములను వదలిపెట్టకపూర్వము బ్రూహి భాషనుగూర్చి కొద్దిగ ముచ్చటించవలసి యున్నది. ఈ భాషను

కొందరు భాషాపండితులు ద్రవిడభాషగ నిరూపించియుండిరి. ఈ భాష
రెండు యిరేనియన్ భాషాప్రాంతములమధ్య వాడుకలోనుండి యున్నది.
బ్రూహి మాట్లాడబడు ప్రాంతములనే బెలూచిభాష యొకవైపు, పుష్టు
భాష యింకొకవైపు మాట్లాడబడుచున్నది. బెలూచిభాష బెలూచి
స్థానమునందును, పుష్టుభాష ఆఫ్ఘనిస్థానమునందును మాట్లాడబడు
చున్నది. పుష్టుభాషయే వేదములయందు చెప్పబడిన 'ఫక్తు' భాష
యని కనుగొనబడినది. ఈ రెండుభాషలున్ను యిరేనియను భాషలై
యున్నవి. అనగా ఆర్యభాషలనుండి యుద్భవించినవే. బ్రూహిభాష
యిచటనే వాడుకయం దున్నది. ఎట్లు ద్రావిడభాషను మాట్లాడెడి
ద్రావిడు లీ ప్రాంతమునకు అనగా హిందూదేశపశ్చిమోత్తరభాగమునకు
చేరియుండిరో చెప్పియుండలేదు. ప్రత్యేక ద్రవిడచిహ్నము లెవ్వియు
వీరియందున్నట్లున్ను కనబడదు. ఈ బ్రూహి లనువా రెవరో యిప్ప
టికిని నిర్ధారణచేయబడి యుండలేదు. వీరు సిథియనుజాతివారని
కొందరు, కొండజాతివారని కొందరు, అరబుదేశస్థులని మరికొందరు,
ద్రావిడులని మరికొందరు చెప్పుచున్నారు. వీరుమాట్లాడు భాషయందు
కొన్ని ద్రావిడభాషా చిహ్నములున్నట్లు భాషాకోవిదులు చెప్పు
చున్నారు. అయితే యెట్లుద్రావిడభాషను మాట్లాడువారు యిరేనియను
భాషల మాట్లాడువారిమధ్య, ద్రావిడప్రాంతములకు చాలా దూరమున
నున్న యీ ప్రాంతములకు చేరియుండిరో యను విషయమున
కెట్టిసమాధానమున్ను కనుపించుటలేదు. ఈ బ్రూహియను పదమును
విడదీసినచో 'బ్ర', 'రోహి' యను రెండుపదములు కనుపించు
చున్నవి. వీటివలన కొండల నవరోహించువారని కనుబడుచున్నది.
దీనినిబట్టి వీరు కొండజాతివారేమో? డాక్టరు' ఒప్పర్టు పండితుడు
(Dr. Oppert) వీరిని 'యిరేనీయనులే'ననియు, 'పరటా' గాని 'పరదా'
జాతివారై యుండురని యూహించియుండిరి. వారు వ్రాయుటలో 'బ్ర'
'బర' అయినదనియు, 'బర' యే 'బరహా' గా మారినదనియు, 'బరహా'
'బరట' అయినదనియు, ఈ 'బరట' లే మహాభారతమునందలి

యోధులగు 'భారత' జాతివారనియు వ్రాసియుండిరి. వారు వ్రాసినదే
సరియగుచో వీ రార్యులే ననియు స్పష్టపడుచున్నది. అప్పుడీవిషయము
బహు తేలికలో ముగించవచ్చును. దీని నిర్ధరించుటకంటె కొంత గట్టి
పరిశీలన చేసిన బాగుండునని తోచుచున్నది.

91. రెండవమారు గుంపుగవచ్చిన ఆర్యులు హిందూదేశ
మును ప్రవేశించినపిదప నచట నిదివరకే నివసించియున్నవారిని పార
ద్రోలి తాము పంజాబు మొదలు గంగాయమునానదికలిసెడి దేశము
వరకు నాక్రమించుకొని దానినే మధ్యదేశమని పిలిచినట్లు వ్రాసి
యుంటిని. ఈ ప్రాంతమంతయు సంస్కృతభాష మాట్లాడబడుచుండె
ననియుకూడ వ్రాసియుంటిని. అయితే వీరు వచ్చునప్పటికిని నివాసము
చేయుచు వీరి నడ్డుపెట్టజాలక కొందరీమధ్యదేశమునకు చుట్టునున్న
దేశములనే తమ నివాసముగ నేర్పరచుకొనిరనియుకూడ వ్రాసి
యుంటిని. అట్టివారు మాట్లాడుభాషలు ప్రాకృత అపభ్రంశ పైశాచి
భాషలనియు వ్రాసియుంటిని. కనుక నీ రెండవగుంపు ఆర్యులు
మాట్లాడు సంస్కృతభాషకును, అప్పటికేవుండియున్న ప్రాకృత భాష
లకును యెట్టిసంబంధము నుండి యుండజాలదు. అదిగాక ఆ భాషల
కును, సంస్కృతభాషలకును జన్య జనక సంబంధ ముండజాలదు.
అట్లయినచో వీటిసంబంధ మెట్టిదని ఆలోచింపదగినది. ఈ స్థితిలో
వేదభాషయగు ఆర్షేయసంస్కృతము మనకు కొంతసహాయకారిగ
నుండగలదు.

92. సర్వసామాన్యముగ మనము మాట్లాడునపుడు వేద
భాషనుకూడ సంస్కృతభాషయే నని పిలుచుచున్నాము. కాని
సంస్కృతభాష పాణిని మొదలగు వైయ్యాకరణులచే పరిష్కరింపబడి
సంస్కరింపబడిన భాషయే నిజమైన సంస్కృతభాషమైయున్నది. ప్రథ
మమునందున్న వేదభాషకున్ను, సంస్కరింపబడినభాషయగు సంస్కృత
మునకున్ను చాలభేదములు గలవు. వేదభాష చదివినవారికి
సంస్కృతభాష యర్థమగునుగాని సంస్కృతము చదువుకొన్నవారికి

సులభముగా వేదభాష అర్థముకాదనుటలో నాశ్చర్యములేదు. ఇది యిట్లుండ నీ రెండుభాషలమధ్య ప్రాకృతభాష లుండియున్నవి.

93. వేదభాషయందును ఋగ్వేదభాష ప్రాచీనమైనది. ఆరణ్యకములు, బ్రాహ్మణములు వ్రాసిన భాషయు నొకటేగాని నీరెంటి మధ్య కొన్ని భేదములు కలవు. పాణినిచే సంస్కరింపబడినభాష వేద భాషను, ఆరణ్యకబ్రాహ్మణములభాషను ప్రాకృతఅపభ్రంశభాషలను సంస్కరించగ వచ్చిన భాషయైయున్నది. వీటిలో ననేక పరస్పర భేదములు కలవు. భాషలు మారిపోయి పోల్చుటకున్న వీలులేకుండ నుండెను. ఈ మార్పు పదజాలమునందును, ప్రత్యయములయందును హెచ్చుగ నుండియున్నది. వేదభాషయందు రేఫ లేదు. ప్రాకృతము నందు లకారము లేదు. సంస్కృతమునందు రేఫ, లకార మున్ను కలవు. ప్రాకృతభాషలు వేదభాషనుండియే వచ్చెననుట సమంజసము కావచ్చును. కాని సంస్కరింపబడినభాషనుండి ప్రాకృతము వచ్చెననుట సబబు కాదు. అయితే నిటీవలపండితు లనేకులు అనాలోచితముగ ప్రాకృతముసంస్కృతజనకమనివ్రాసియుండిరి. ఇది సరిగాదు. సహజముగ ప్రాకృతమే ప్రకృతిజనక మైనది. దానినుండి సంస్కరింపబడినభాష సంస్కృతమై యుండవచ్చును. మనపండితులు కొంద రిందుకు భిన్నముగ

> "ప్రకృతిః సంస్కృతం, తత్రభవం ప్రాకృతముచ్యతే।
> శేషంతు సంస్కృతాత్స్యాత్."

అని వ్రాసియుండిరి. ఇందువ్రాయబడిన సంస్కృతపదము సంస్కరింపబడిన సంస్కృతమునకు గాక ఆర్షేయవేదభాషనే యర్థముచేసి కొన్నచో సమర్థింపనగును. వేదభాషయే ప్రాచీనసంస్కృతము. ఆ ప్రాచీన వేదభాషనుండియే ప్రాకృతభాషయున్ను, ఈ వేదభాషను ప్రాకృత అపభ్రంశ పైశాచీభాషలను సంస్కరించి సంస్కృతము వచ్చినదని చెప్పుట సమంజసమై యున్నది.

నాల్గవ ఉపన్యాసము

ద్రావిడులు - ద్రావిడ భాషలు

రమెశెసు II అను పేరు గల్గిన సిసాస్ట్రెసు పెద్దరాజు మోసెసుకాలమునకు పూర్వమే ఎర్రసముద్రముద్వారా నాలుగు వందల నావికులను పంపినట్లును, వారు ఆశియా దేశమును జయించి గంగానదివరకు వచ్చి అక్కడనుండి సముద్రముచే చుట్టబడియున్న హిందూదేశమునంతను పర్యటనగావించినట్లును సిసీలియ సను చరిత్ర కారుడు వ్రాసియుండెను.

2. సెమిరామి సను దేవిరాజ్యము చేయునపుడు రెండువేల పడవలతోను, ముప్పదిలక్షల కాల్బలముతోడను, రెండువేల అశ్వదళములతోను యిండసునదిని దాటి స్ట్రాబొబేటిను ప్రభువుతో యుద్ధము గావించి వారిని జయింపజాలక క్రీ. పూ. రెండువేల సంవత్సరముల క్రింద తిరిగి వచ్చెననియు డియోడోర సను చరిత్రకారుడు వ్రాసియుండెను.

3. పైన వ్రాసిన విషయములు నిజమైనచో యింత సైన్యము నోడించగల్గిన శక్తిగల ఒక జాతివారుగాని, కొన్ని జాతులవారుగాని ఇండసునదీతీరమునసుండి యుండవలెను. ఇప్పటికి దాదాపు నాల్గు వేల సంవత్సరముల క్రింద యింతటి ప్రఖ్యాతిగల్గినవారు ఇండసునదీ తీరమున నుండియుండవలెననుట స్పష్టము. అట్లైన వా రెవరు? వారి జాతి యెద్ది? వీరు ఆ కాలమున హిందూదేశమున నివసించు జాతులకు జెందినవారా? యను విషయముల నాలోచించి సరియైనసమాధానము జెప్పవలసియున్నది.

4. సర్ విలియం హంటరను చరిత్రకారుడు హిందూ దేశమున ననేక జాతులవారు అనేక కాలములయం దుండియుందురని వ్రాసి యుండెను. అట్టివారిలో కొందరు సంస్కృతి గలవారనియుకూడ వ్రాసియుండిరి. ఇట్టివారందరు "తురేనియన్లు, ఆర్యజాతులవారు" నైయుందురని తోచుచున్నది.

5. ఈ తురేనియను లనువారు వేదమునందు చెప్పబడిన తురవాసుని సంతతివారై యుందురని తోచుచున్నది. వీరందరున్ను తురాను దేశముననుండి అనగా చీకటిప్రదేశముననుండి వచ్చినవారై యుండవలెను. ఒక జర్మనుచరిత్రకారుడు చెప్పినట్లు యీ తురేనియన్లు ఆర్యజాతికిగాని, సెమిటికుజాతికిగాని జెందినవారు కారు. యూరపు దేశమునందు ఆర్యులకు పూర్వపువారిని యెట్లు తురేనియనులని పేరు పెట్టిరో అట్లే హిందూ దేశమునందును వీరి నందరిని తురేనియనులే ననిరి.

6. ఆర్యులు హిందూ దేశమునకు రాకపూర్వమున్నవారి విషయమై మనకు ఋగ్వేదమునుండి కొంతవరకు తెలిసికొనుటకు వీలు కలదు. ఋగ్వేదమునందలి ఆర్యు లిచటికి చేరునప్పటికి యిచట దట్టమైనఅరణ్యము లుండెననియు, అచట నచట కొన్నిగ్రామములు, పట్టణములు నుండెననియు, అచటి జనులు యేదోయొక అర్థముగాని భాషను మాటలాడుచుండిరనియు వ్రాయబడెను. ఈ వచ్చినవా రుత్తర దేశమునందుండివచ్చినందున, తాము తెల్ల నిరూపమును గల్గియున్నందున నిచట నివసించువారి నల్లనిశరీరమునుజూచి అసహ్యించుకొని తాము గొప్పవారలమనితలచి గర్వపడినట్లునుకూడ ఋగ్వేదమున వ్రాయబడి యుండెను. అందువలననే యిచటివారిని దయ్యములనియు, పిశాచము లనియుకూడ పిలచియుండిరి.

7. తమకుపూర్వమే యీ దేశమున నివాసముగనుండిన వారిని ఋగ్వేదమున దస్యులనుపేర పిలిచి యుండిరి. ప్రథమమున

దస్యులనగా పరాయివారనిమాత్రమే అర్థముండెడిది. కొంత కాలము నకు కొత్తగావచ్చినవారు నివసించుటకు హెచ్చుస్థలము కావలసి వచ్చినందున అట్టిస్థలమునకై పాతవారితో తగవులు సందర్భపడినపు డీ దస్యులే విరోధులైరి. మరికొంతకాలమునకు ఈ రెండు తెగల వారిమధ్య పోరాటము హెచ్చుకాగా కత్తులు దూయవలసివచ్చెను. ఈ పోరాటమునందు పూర్వముననుండియు నివసించువారు క్రొత్తగా వచ్చిన ఆర్యులధాటి కోర్వజాలక వారికి లొంగిపోయిరి. ఇట్లు లొంగి పోయినదస్యులే బానిసలైరి. కనుకదస్యులు మూడువిధములుగమారిరి.

8. ఈ దస్యులతో క్రొత్తగావచ్చిన ఆర్యులకు జరిగిన పోరాటమునుగూర్చి ఋగ్వేదమునందు హెచ్చుగ వ్రాయబడెను. దస్యులవద్ద చాలసంపదగలదు. ఈ సంపదనంత నీ ఆర్యులు లాగికొనిరి. ఈ దస్యుల కనేక కోట లున్నట్లును, అనేక పట్టణము లున్నట్లును, ఈ కోటలను పట్టణములను తాము జయించినట్లును ఋగ్వేదమునందు వ్రాయబడియుండెను. ఈ ఋక్కులనుబట్టి ఆర్యులకున్న సంస్కృతికన్న దస్యులకుగల సంస్కృతి చాలహెచ్చుగనుండెనని తెలియుచున్నది.

9. ఇట్టి దస్యులతో పోరాడి, వారినోడించి ఆర్యులు వారిని దేశమునుండి పారదోలిరి. ఈ పోరాటము కొన్ని సంవత్సరములు పట్టియుండును. ఇది బహుశః కొన్ని దశాబ్దములు లేక శతాబ్దములు పట్టియుండును.

10. ఈ దస్యులేగాక నీ దేశమున నితర అనాగరిక జాతుల వారునుండి యున్నట్లు నదీతీరమున కనుబడిన రాతిపనిముట్లు, బొమికెలు, కొన్ని రోమనునాణెములవలన నూహింపబడుచున్నవి. ఈ అనా గరిక జాతివారున్ను పారదోలబడి కొండప్రదేశముల ప్రవేశించియుండి నట్లు నూహింపబడుచున్నది. దీనినిబట్టి ఆర్యు లీదేశము ప్రవేశించు నప్పటికే యిచటయుండినవా రొక జాతివారుగాక యనేక జాతులవా రుండినట్లును తెలిసికొనబడుచున్నది. ఈ జాతులవారెవరై యుందురని

మనము తెలిసికొనవలసియున్నది. అయితే మన మిదివరలో వీరందరిని కలిపి తురేనియను జాతివారేమోనని చెప్పియుంటిమి. ఈ యూహ సరియైనదగునో కాదోకూడ తేల్చుకొనవలసియున్నది. ఇట్లు కనుబడిన వారిలో నాగరికజాతివారు, అనాగరికజాతివారు నుండి యుండిరి. ఈ అనాగరికజాతివారు బహుశః కొలేరియన్లై యుండవచ్చును. వీరి సంతతివా రిప్పటికిని కొండలయందు నివసించుచునే యున్నారు. ఇట్లు నివసించువారు కోల్సు, శంటాల్సు మొదలయినవారు. ఈ కొలేరియన్లు మధ్యయాసియాయం దుండెడివారే. వీరు బహుశః టార్టారిమెడారుల ద్వారా టిబెటుదేశముద్వారా హిందూదేశమునకు యీశాన్య మార్గమున కొండగుహలద్వారా ప్రవేశించి యుండవచ్చును. వీరే నిజమైన తురేనియన్లు. వీరికి సంస్కృతిగాని, నాగరికతగాని లేదు. వీరు గాక కేవల అనాగరికులుకానివారున్ను మరికొంద రుండి యుండిరి. వారే బహుశః పాశ్చాత్యపండితులచే ద్రవిడులనుపేర పిలువబడి యుండిరా ? ఈ పైనజెప్పిన అనాగరిక నాగరికజాతివా రొకేపర్యాయము హిందూదేశము ప్రవేశించియుండిరా ? లేక వేర్వేరుగవచ్చి వారి వారి అవసరములనుబట్టి కొన్నిశతాబ్దములుగవచ్చి తమ తమ స్థావరముల నేర్పరచుకొని యుండిరా ? ఇందు ద్రవిడులనుపేర పిలువబడెడివారిని గూర్చియు వా రెట్లు హిందూదేశమునకు నెపుడు యేమార్గమున ప్రవేశించిరను నదియు వివాదాంశములుగ నున్నవి. ఈ విషయముల గూర్చి యనేకసిద్ధాంతములున్ను కలవు. ఈ విషయములనుగూర్చి మున్ముందు విపులముగవ్రాయబడును. ఆయాసిద్ధాంతములును విమర్శింపబడగలవు. కాని ప్రస్తుతమునకు వీరు ప్రథమమున ప్రళయకాలమున ఆర్యులలో చీలిపోయి దేశాటనముగావించి కొంతకాలమునకు హిందూదేశమునకు వాయవ్యమార్గమున ప్రవేశించినవారై యుందురని యూహించుట సమంజసమేమోనని సూచించుచున్నాను.

11. 'ద్రవిడ' యను పదము ఒకశాఖ కుపయోగింపబడెనా? దేశమున కుపయోగింపబడెనా ? లేక దేశభాష కుపయోగింపబడెనా ?

యనునవియు వివాదాంశములే యై యున్నవి. ఈ పదములన్నిటికి యుపయోగింపబడినట్లే కనబడుచున్నవి. శాఖనుగూర్చి వ్రాయుచు సంస్కృతమున నీ పదము 'పంచద్రావిడు'లని వ్రాయబడినది. అరవదేశమును గూర్చి వ్రాయుచు నీ పద ముపయోగించి 'ద్రావిడ' దేశమనియే వ్రాసియుండిరి. అదేవిధముగ తమిళభాషనుగూర్చి వ్రాయుచు ద్రవిడ భాష యనిరి. కాల్డ్వెలు పండితుడు ద్రవిడభాషావ్యాకరణమను పుస్తకమునుగూర్చి వ్రాయుచు నీ ద్రావిడశబ్దము దక్షిణదేశ భాషలయిన అరవము, తెలుగు, కన్నడము, మళయాళము మొదలగు భాషలనన్నిటినికలిపి ద్రవిడభాష లనెను. మన మిచట దాక్షిణాత్య దేశమున నివసించుచున్న అరవ, కన్నడ, తెలుగు, మళయాళభాషల మాట్లాడు వారి నందరిని ద్రావిడులనియే చెప్పవచ్చును. ఈ విషయములను గూర్చియు మున్ముందు విపులముగ వ్రాయబడును.

ద్రా వి డు లు

12. ఆర్యులలో తగవు లారంభించకపూర్వమే ప్రళయకాలాంతమున సంస్కృతభాష మాట్లాడబడునపుడు ఐరేనియన్లు వీరిని వెళ్ళకపూర్వము ఆర్యులలో నొకగుంపు విడబడి హిందూకుష్ పర్వతమార్గములద్వారా కాష్మీరుదేశము చేరియుండునని యిదివరలో ఆర్యులచరిత్రలో వ్రాసియుంటిని. ఆ ఆర్యనుజాతికి చెంది ఆ గుంపులోనుండి ప్రథమమున వీడిపోయి హిందూదేశమును ప్రవేశించినవారే యీ ద్రావిడు లనబడువారు. వీరు రెండవసారి వచ్చిన ఆర్యులకన్న కొన్నిశతాబ్దముల క్రింద వచ్చియుందురు. వా రా యా దేశముల పర్యటించి యిచటికి పర్వతమార్గమున చేరియుందురు. వీరిలోనివారే బెలూచిస్థానములోని బ్రూహిలున్ను అయి యుందురు. వీ రిచటికి చేరినపిమ్మట అదివరలో నిచట వుండియున్న కొలేరియన్లను పారదోలి యీ భాగమునంతను తామాక్రమించి యిచటనే నివాస మేర్పరచుకొని యుందురు. ఇచటనే నివసించుచు అవసరములైన

కోటలనుకట్టి పట్టణముల వృద్ధిజేసి గొప్పసంస్కృతిని సంపాదించి యుందురు. ఋగ్వేదమునందు ఋక్కులలో తొంబది తొమ్మిది కోటలను, తొంభై పట్టణములను పట్టుకొన్నట్లు వ్రాయబడిన కోటలు, పట్టణములు వీరివే యైయుండును. వీరికిని, క్రొత్తగావచ్చిన ఆర్యులకును జరిగినకలహములలో పూర్వమునుండియు నున్నవారిని పిశాచులనియు, దస్యులనియు దూషించియుందురు. వారు మాట్లాడుభాషలనే పైశాచీ భాష లనిరి. వారివద్దనున్న సంపదనంతను లాగికొనిరి. వారిస్థానము లన్నియు వా రాక్రమించిరి. వీరిధాటి కోర్వలేక పారిపోయినవారిలో కొందరు వింధ్యపర్వతముల దాటిపోయిరి. మరికొందరు వీరి నెదిరించి వీరితోపోరాడి తమవ్యక్తిత్వమును కాపాడి ఉత్తరహిందూస్థానముననే నిలిచియుండి మెల్ల మెల్లగ పెద్దపెద్ద రాజ్యముల నేర్పరచుకొనిరి. వీరిధాటికోర్వజాలక తరుమగొట్టబడినవారి నందరను 'దృ' తరుమ గొట్టబడుట యను ధాతువునుంచి 'ద్రావిడు' లనబడిరి. అట్లు పారిపోక యెదురుతిరిగి నిలిచిపోయినవారు 'ఆంధ్రు'లని పిలువబడియుందురు. 'ఆంధ్ర' యను శబ్దమును పదవిభాగము జేసినచో 'ఆం+ధ్ర' యగును. 'ద్ర' యనునది 'దృ' యను ధాతువునుండియే వచ్చినది. దానికి 'అ' యను పదమునుకలిపిన పారిపోనివారని అర్థము కల్గును. అందువలన పారిపోయినవారు ద్రావిడులును, పారిపోక నిలువబడినవారు 'ఆంధ్రులు' అనబడిరా ? యనుశంక కలుగుచున్నది. ఇదియేనిజమైనచో ఆంధ్రులు ద్రావిడులు కాజాలరు. వీ రిద్దరును ప్రథమమున హిందూదేశమునకు ఆర్యులతో చీలివచ్చిన ఆర్యగుంపే యయి యుండును. ఆంధ్ర ద్రావిడ పదములకు పైనజెప్పబడిన యుత్పత్తి అసమర్థనీయమైనది కాజాలదు. ఈ యూహను సమర్థించుటకు సంస్కృతగ్రంథములయందు ఆధార ములు లేకపోలేదు. ఇది యెట్లున్నను వేదమునందు చెప్పబడిన ఆర్యులువచ్చి వారిఅవసరములనిమిత్తమై అదివరలో నివసించుచున్న వారిని పారదోలగా వారందరు వింధ్యపర్వతములుదాటి యెవరికి వీలయినచోట వారు స్థావరముల నేర్పరచుకొనిరనియు, అట్టివారు

ఆర్యులువచ్చునాటికి మాట్లాడుభాషపైశాచీభాష యనబడెననియు, వా రందరు పిశాచులనబడిరనియు స్పష్టముగా కనబడుచునే యున్నది. వీరినే తరువాత ద్రావిడులని పిలిచియుందురు. ఈ ద్రావిడు లెవరు ? వీ రెచటి నుండి ప్రథమమున హిందూదేశమునకు వచ్చియుండిరి ? యను విషయ ములనుగూర్చియే పాశ్చాత్యపండితులు పరిశోధింపసాగిరి. అట్లు పరిశోధించి తమకుతోచినట్లు వేర్వేరభిప్రాయములను బయల్పరచిరి. అట్టిఅభిప్రాయములలో కొన్నిముఖ్యములైనట్టివాటి నిచట క్లుప్తముగా వివరించి వాటిలో నేది మనము గ్రహింపనగునో ఆలోచింతము.

13. 'ద్రవిడ' యను పదము సంస్కృతపదమైనట్లును, 'దృ' పరుగెత్తుటయను ధాతువునుండి వచ్చెననియు చాలమందిచే నంగీకరింప బడినది. 'దృ+విద్' ఒక భూభాగముననుండి రక్షణకొర కింకొక భాగ మునకు వచ్చినవారుగాన ద్రావిడులని పిలువబడిరని కొంద రందురు. ఇది నిజమే యైయుండవచ్చును. కాని దీనివలన క్రొత్తవిషయమేమియు మనకు తెలియుటలేదు.

14. మరికొందరు పండితులు ద్రవిడ యను సంస్కృతశబ్ద మునుండియే 'తమిళ' శబ్ద ముత్పన్నమైనదనియు చెప్పుచున్నారు. దీనిని అరవపండితులెవరు నంగీకరించరు. ఈ విషయమై యింకొకచోట విమర్శింపబడును.

15. రుగ్గేరి యను నొక పండితుడు ద్రావిడులనుగూర్చి యీ క్రిందివిధముగ వ్రాసియుండెను. "అన్నిసంగతులనుబట్టియు చూడ కొద్ది మంది ద్రావిడులు దండయాత్రలుచేయుచు పరాయిదేశముననుండివచ్చి వారి భాష నీ (హిందూ) దేశమున కొన్నిప్రదేశముల ప్రవేశపెట్టినట్లు కనబడుచున్నది." ఈ అభిప్రాయమునందు చెప్పుకొనవలసినదేమియు కనుపించదు.

16. భాషాపండితుడగు గ్రియర్స నునువారు, మానవునికి తెలిసినంతవరకు దక్షిణాదిన మొదటినుండియు నుండినవారు ద్రవిడులే

ననిరి. కాని వీరు ఆదిమనివాసులని గాని లేక యింకొక ప్రదేశమున నుండివచ్చినవారనికాని వ్రాసియుండలేదు. రిస్లీ పండితుడు నీయభిప్రాయమునే అంగీకరించిరి. కాని యీ అభిప్రాయమున కెట్టి ఆధారములను చెప్పియుండలేదు. ఈ వాదము నంగీకరించుటకు తగిన ఆధారము కనుపించదు.

లిమూరియను లేక స్లేటరు పండితుని అభిప్రాయము

17. ఒకానొకప్పుడు అనగా హిమాలయ పర్వతములుద్భవించనపుడు హిందూదేశమునకు దక్షిణముగనున్న హిందూ మహాసముద్రమంతయు భూప్రదేశముగనుండి ఆ ప్రదేశమున 'లిమూరియా' యను ఖండముగా నుండెననియు, ఆ లిమూరియాఖండమునందు నివసించెడువారే ద్రావిడులనియు, వారచటనుండి ఉత్తరముగ హిందూదేశము ప్రవేశించియుండిరనియు కొందరు పండితులొక వాదమును బయలుదేరదీసిరి. అప్పటికాలమున నీ ఖండము పడమరనున్న మెడగాస్కరు దేశమును, తూర్పుననున్న మలయాదేశమును కలిపియుండెడిదనియు, ఆ కాలమునకే హిందూదేశమునుండి పడమర దిశనున్న ఆఫ్రికాఖండమునకును, తూర్పుననున్న ఆస్ట్రేలియాఖండమునకును రహదారిమార్గము లుండెడివనియు నీశాస్త్రజ్ఞుని వాదనయై యుండెను. ఈ వాదనకు చెప్పబడిన ఆధారములున్ను సరియైనవిగ కనుపించుటలేదు.

18. ఈ వాదమునందు ముఖ్యభాగమైన లిమూరియాఖండస్థితిని గూర్చి స్లేటరుపండితు డొకప్పుడు వ్రాసినమాట వాస్తమేమైయున్నది. కాని వారు వ్రాసిన విషయమునకు హిందూదేశమున ద్రావిడులు ప్రవేశించుటకు నెట్టిసంబంధమున్ను లేదు. సముద్రమువందలి నీటిచే విడదీయబడిన దీవులలోను,విడదీయబడిన భూమియందు నొకేమోస్తరు జంతువు లున్నచో ఒకానొకపు డీ రెండుప్రదేశములును అనగా దీవులును, భూమిభాగములును కలసి యుండెడివని

యూహించుట కవకాశము కలదని మాత్రమే స్లేటరు పండితుని వాదనయై యుండెను. దీనినిగూర్చి వ్రాయుచూ, దక్షిణఆశియాయు, మలయా దీవులున్ను యొకప్పుడు కలసియుండెననియు, ఆ భూభాగమే లిమూరియా ఖండమై యుండవచ్చుననియు మాత్రము స్లేటరు పండితుడు వ్రాసియుండెను. సుమిత్రాదీవులలోని యేనుగులు, జావా దీవులయందలి ఖడ్గమృగములు దక్షిణ ఆశియాలో నున్నందున నీ రెండు దేశము లొకప్పుడు కలసియుండెనని వారు వ్రాసియుండిరే గాని అచటి జనము ఉత్తర దిక్కుగా బయలుదేరి హిందూదేశములోనికి ప్రవేశించిరని స్లేటరుపండితుడు వ్రాసియుండలేదు. వారొక విషయమును ఋజువుపరచుటకై వ్రాసిన విషయమును యింకొక విషయమునకై యింకొకరు ముడిపెట్టుటకు ప్రయత్నించుట సరికాదు. అందువలన నీ యూహ నంతగా చర్చించ నవసరములేదు. అయితే ఆస్ట్రేలియా దేశమునందలి వాడుకలోనున్న 'ఒకటి' 'రెండు' మొదలుగాగల అంకెలకున్ను,• ద్రావిడభాషలోని అంకెలకును కొంత సామరస్య మున్నదనియు, ఆస్ట్రేలియాదేశమున కొంద రుపయోగించు బాణమునకును, దక్షిణహిందూదేశమున వేటాడునపు డుపయోగింపబడెడు బాణమునకును సంబంధము గలదనియు వారుదహరించి అచటి జనులు లిమూరియాఖండముద్వారా దక్షిణ హిందూదేశములోనికి ప్రవేశించి యుండవచ్చునని నిరూపింప ప్రయత్నించిరి. కాని వారి వాదన హేతుకరమైనది కాజాలదు. అందుకు తగిన ఆధారములున్ను కనుపింపవు. అందుచే నీ వాదనను భాషాశాస్త్రజ్ఞు లంగీకరించరైరి.

సర్ విల్లియం హంటరు సిద్ధాంతము

సర్ విల్లియం హంటరను నింకొక సుప్రసిద్ధ చరిత్రకారుడు ద్రావిడుల గూర్చి వ్రాయుచు వీరిలో కొలేరియనులు, ద్రావిడులు అని రెండు తెగలవా రుండిరనియు, వీరిలో కొలేరియన్లు యీ దేశమునకు ఈశాన్యమార్గమున (N. E.) హిమాలయపర్వతముల దాటి వింధ్యా

పర్వతమునకు ఉత్తరదిశన నివసించు చుండిరనియు, ద్రవిడియన్లు హిందూదేశమునకు వాయవ్యదిశన (N. W.) పంజాబుదేశము ద్వారా ప్రవేశించి తూర్పునకు రాగా, ద్రవిడియన్లకున్ను, కొలేరియన్లకున్ను సంఘర్షణ జరుగగా నా సంఘర్షణ ఫలితముగ వీరిద్దరిలో ప్రథమమున కొలేరియన్లు దక్షిణహిందూస్థానము జేరిరి. వీరే అనగా నీ కొలేరియనులే శ్రీరాములవారికి రావణాసురునితో జేయబడిన యుద్ధమునందు వానరులరూపమున సహాయము జేసియుండిరనియు హంటరు చరిత్రకారుడు వ్రాసియుండెను. మరియు ఆర్యులు రాక పూర్వము హిందూదేశమున నుండినవారు 1. టిబెటో జర్మను జాతివారు 2. కొలేరియన్లు 3. ద్రవిడియనులు. పైవారిలో మొదటివారు హిందూదేశమునకు యీశాన్యదిశనుండి వచ్చిరి. వీరిప్పటికిని హిమాలయ పర్వతములయందే యుండియున్నారు. రెండవవారు కొలేరియన్లు. వీరున్ను యీశాన్యదిశగ (N. E.) హిందూదేశమునకు వచ్చి వంగదేశము నాక్రమించిరి. అచటినుండి మెల్లమెల్లగా దక్షిణదేశమునందలి పీఠభూములకు చేరి అచటనే నివసించుచుండిరి. మూడవవారైన ద్రవిడియనులు హిందూదేశమునకు వాయవ్య (N. W.) మూలనుండి ప్రవేశించి అటుపిమ్మట దక్షిణదేశమున నివసించు చున్నారనియు హంటరుగారి సిద్ధాంతమై యున్నది.

20. వాయవ్యమూలనుండి వచ్చిన ద్రవిడియనులకును, యీశాన్యమూలనుండి వచ్చిన కొలేరియన్లకున్ను జరిగిన సంఘర్షణలో ద్రావిడులే బలవంతులైనందున కొలేరియనుల నోడించి తూర్పుదక్షిణ భాగములకు తరిమివేసిరి. కొలేరియన్లకును, ద్రవిడియన్లకును కొంత సంఘర్షణ జరిగినదని చెప్పుటకు హంటరుపండితునకు కారణము లేకపోలేదు. అప్పటికి కాల్డ్వెలు పండితుడు తన వ్యాకరణమున ద్రవిడ భాషనుగూర్చి వ్రాయుచు సదరు భాష సిథియనుభాషను పోలియున్నదనియు, అందుచే ద్రవిడభాష సిథియనుభాషాజనితమై యుండవచ్చుననియు, కొన్ని ద్రావిడభాషాపదములు కొలేరియను భాషాజనితములు

గాని, ఆ భాష యొక్క సంపర్కము వలనగాని కలిగియుండ వచ్చుననియు అభిప్రాయపడి యుండిరి. ఈ అభిప్రాయమును సమన్వయము చేయుటకై హంటరుపండితు డీసంఘర్షణ నేర్పరచెనని తోచుచున్నది. అయితే జాతిని నిర్ణయముచేయునపుడు భాషానిర్ణయము లాధారములుగా జేయుట యెంతమాత్రము సరిగాదని శాస్త్రజ్ఞులు నిర్వచించియున్నారు. ఒకేజాతివా రొకేభాషను మాట్లాడుదురనుట సమంజసము గాదు. ఈ జాతి విషయమునుగూర్చి వ్రాయుచు కాల్డ్వెలు పండితు డిట్లు వ్రాసెను :

> "దేహసంబంధమును బట్టి నిశితపరీక్ష గావించినందున దక్షిణహిందూదేశమునందలి ద్రవిడియన్లును, అనాగరికులగు తోడాజాతివారున్ను ఆర్యజాతికి చెందినవారేయని ధృవపడు చున్న"దని కాల్డ్వెలు పండితుడు తన అభిప్రాయమును తెలియ జెప్పిరి.

కనకసభాపతిపిళ్లె

21. కనకసభాపతిపిళ్లె యనువారు 'తమిళులు - పదునెనిమిది వందల సంవత్సరముల క్రింద' యను పుస్తకమును వ్రాయుచు తామొక క్రొత్తవాదమును బయల్పెట్టిరి. ద్రావిడియనులు ప్రథమమున హిందూదేశమునకున్న టిబెటుమంగోలియను దేశస్థులనియు, వారు హిమాలయపర్వతముల దాటి ఉత్తరహిందూస్థానమునకు వచ్చి అచటినుండి దక్షిణహిందూస్థానమునకు నాలుగుతండాలుగ ప్రవేశించిరనియు, వారిలో మొదటి తండావారైన మారార్లు పాండ్యరాజ్యమును, రెండవ తండావారైన తిరయార్లు చోళరాజ్యమును, మూడవ తండావారైన వనవార్లనువారు చేరరాజ్యమును, నాల్గవ తండావారైన కొలార్లు కొంగురాజ్యమను నాల్గురాజ్యముల నేర్పరచిరనియు వ్రాసిరి. దక్షిణదేశమున ఆదికాలమున నున్నవారు 'విల్లువలు' 'మీనులు' అను జాతివారనియు, వారిని మధ్యఆసియానుంచి వచ్చినవారైన

'నాగులు' అనువారు జయించిరనియు, ఈ 'నాగులే' తరువాత వచ్చిన 'ఆర్యులకు' దేవనాగరీభాష నిచ్చిరనియుకూడ వ్రాసెను. అయితే ఈ నాగజాతివారు పైనుంచి వచ్చినట్టియు, మంగోలియాదేశ స్థులైనట్టియు తామ్ర లిటులచే నోడింపబడిరనియు, నీతామ్రలిటులే తమిళులనియు కూడ వ్రాసిరి. అయితే ఈ వాదన యెవరిచేతను సరియైనదిగ నంగీకరింపబడి యుండలేదు.

22. 'హెక్కె' లను నింకొక పండితుడు శాకససులు, ద్రావిడులు, బాస్కులు, యిండో జర్మానికువారు నను నల్గురి భాష యందును సాదృశ్యము లనేకములున్నట్లు వ్రాసియుండిరి. అందును ద్రావిడులు మిగిలిన జాతివారిలోనివారనియుకూడ అభిప్రాయపడిరి. మరికొందరు పండితులు ద్రావిడులకును, ఆస్ట్రేలియా జాతివారికిని సాదృశ్యము లున్నవనిరి.

23. ద్రావిడులు దక్షిణ హిందూదేశమునందున్నవారిలో ఆదిమనివాసులుగారనియు, ద్రావిడులు ఆర్యజాతికి చెందినవారేననియు, వీరికన్న పూర్వమే నల్లటివర్ణముకలిగిన నింకొకజాతివారుండిరనియు డాక్టరు కీనుపండితు డభిప్రాయపడిరి.

24. కాల్డ్వెలు పండితుడు వ్రాయుటలో నీ విషయమయి కొంత అసందర్భమును వ్రాసియుండిరనుటతప్పదు. వారు వ్రాయుటలో దక్షిణదేశముననున్న ప్రథములు వీరేననియు, వీరినే ఆర్యులు తరుముకొని వచ్చి, జయించిరనియు వ్రాయుచూ ద్రావిడులు హిందూదేశమునకు వాయువ్యమూలనుండి వచ్చి ప్రవేశించిరని వ్రాయుటలో కొంత అసందర్భము కనుబడుచున్నది. ద్రావిడులు ప్రథమమునుండియు నిచటనే నున్నవారైనను వాయవ్య మూలనుండి ప్రవేశించుట అసంగతము. అట్లుగాక వీరు వాయవ్య మూలనుండి ప్రవేశించిన హిందూదేశముననుండినవారిలో ప్రథములైన వీరు ప్రవేశించునాటికి హిందూదేశము నిర్మానుష్యమై యుండవలెను. కాని వారట్లు స్థిరపరచి

చెప్పుటలేదు. కాన యెటుచూచినను ద్రావిడులు హిందూదేశమునకు ఆదినివాసులు కారు.

25. ద్రావిడులవిషయమై నింకొక యూహాయు కలదు. పడమటిఆసియాయందు నివసించువారు కొంతకాలము అశ్శీరియా యేశియా మైనరు దేశములందు నివసించి అకేడియను, తురేనియను జాతులవారితో మిళితమై పిమ్మట హింద్దూదేశమునకు పడమటి పర్వతములద్వారా ప్రవేశించి యుండవచ్చుననియు, అట్టిరాక ఆర్యులతో కలియకపూర్వమే జరిగియుండవలెననియు నూహింపబడినది. ఈ యూహాయందు కొంతఅర్థమును, కొంతసందర్భమునుకూడ కలదు. దీనినే నాధారపరచుకొని దీనికే దోహదమిచ్చుచు తనసిద్ధాంతమును కాల్డ్వెలుపండితుడు తయారుచేసిరి. ఈ యూహానే వారు విపులీకరించిరి. అయితే ద్రావిడులు మధ్యఆశియాయం దున్నపుడు వీరికిని, ఆర్యులకును సహజీవనముకలదనియు, వీరిని క్రీస్తుకుపూర్వము దాదాపు పది పండ్రెండుశతాబ్దములకు పూర్వమే వారిని వదలియుండిరనియు అభిప్రాయమును వెలిబుచ్చిరి. అదియునుగాక వారు హిందూదేశమును ప్రవేశించకపూర్వము వారిలో కొంతమందిని బెలూచిస్థానమునందు దిగవిడిచిరనియు, యీ దిగవిడిచినవారే బ్రూహిజాతివారనియు కూడ నభిప్రాయపడిరి. అదిన్నీగాక కొన్ని ముఖ్యమైనమాటలు 'అప్ప' 'అన్న' మొదలయినవి అకేడియను భాషలయందును, అరవ భాషయందును ఒకటే ననియుకూడ నిరూపించిరి. కేవల సారూప్యసాదృశ్యములనుబట్టి భాషాసంబంధము నిర్ణయింపకూడదను సిద్ధాంతమును మనసునందుంచుకొనియే వారట్లు తీర్మానించియుండిరి. మరియు నీబిమపు కాల్డ్వెలు గారి సిద్ధాంతమున ద్రవిడియన్లును, ఆర్యనులును మధ్య ఆసియాదేశముననున్నపుడే వారికి ఆర్యుల భాషాసంపర్కముకలదనియు, ద్రావిడులకు ఆర్యభాషా సంపర్కముండుట తథ్యమనియు కూడ వారభిప్రాయపడిరి.

26. పైన వ్రాసిన వాంశములవలన తేలినట్టి విషయములను క్రింద వ్రాయుచున్నాను.

(1) హిందూదేశమున అందును ముఖ్యముగ దక్షిణ హిందూదేశమున నల్లవర్ణముగల నీగ్రోలను వారు ఆదిమ నివాసులనియు

(2) అటుపిమ్మట ఆస్ట్రేలియా దేశములోని అనాగరిక జాతివారిని పోలినజాతివా రుండెడివారనియు, వారే నాగజాతి వారనియు

ఈ పై రెండు జాతులవారు లిమూరియా యను ఖండ మున్నపుడు వచ్చిన వచ్చియుండవచ్చుననియు

(3) వీరితరువాత మధ్య ఆశియానుండి ఆర్యులను వీడి ఒక గుంపువారు హిందూదేశమునకు పడమరభాగమున కొండల ద్వారా పంజాబుదేశము ప్రవేశించి కొంతకాలము ఉత్తర హిందూస్థానమున నివసించి ఆర్యులచే తరుమగొట్టబడి దక్షిణ హిందూస్థానమున ప్రవేసించి యుండవచ్చును. ఈ తరుమగొట్ట బడిన ఆర్యనుగుంపే రెండవ ఆర్యనుగుంపు హిందూదేశమునకు రాకపూర్వము పది పండ్రెండు శతాబ్దముల క్రింద వచ్చి యుందు రనియు, వారే ద్రవిడులనుపేర దక్షిణ హిందూస్థానమున నుండిరి.

27. దక్షిణదేశముననున్న అన్నిజాతులవారిని ద్రవిడియను లనుపేర మన మిదివరలో పల్కరించుచున్నాము. ఈ ద్రవిడియను లనుమాట క్రొత్తమాట యెంతమాత్రము కాదు. ద్రవిడులనియు, వారు మాట్లాడు భాష ద్రవిడభాషయనియు నిదివర కనేక శతాబ్దముల నుండియు వాంగ్మయమునందుండియే యున్నది. అయితే దక్షిణ హిందూస్థానముననున్న జాతులవారిని కలిపి ద్రవిడియను జాతివారనియు, వారు మాటలాడు భాషలన్నియు ద్రవిడభాషలనియు ప్రథమమున

నుపయోగించినది బిషపుకాల్డ్వేలను భాషాపండితుడే. అంతకుపూర్వము పాశ్చాత్య భాషాపండితు లందరును యీ భాషలను తమిలియనుభాష లనిరి. కాని కాల్డ్వేలు పండితుని తరువాత భాషాపండితులందరును కాల్డ్వేలుగారి పరిభాషనే అంగీకరించి వాడుచున్నందున మనము నిచట ఆ పదమునేవాడిన బాగుండునని తోచి దానినే వాడుదుము.

28. అయితే ఈ ద్రావిడశబ్ద మిదివరలో సంస్కృతభాష యందుగాని, వేదభాషయందుగాని యేఅర్థమున నే సందర్భమున వాడ బడినదో ఆలోచింతము.

29. వేదభాషయం దెచటను గాని వేదభాషా గ్రంథముల యందుగాని ఈ ద్రావిడపద ముపయోగింపబడినట్లు యెవ్వరును చెప్పి యుండలేదు. 'ఆంధ' యను శబ్దము మాత్రము అయిత్తిరేయ బ్రాహ్మణమునం దుపయోగింపబడినది. అయితే యితర సంస్కృత గ్రంథములందు మాత్ర మీపదము ఆంధ్రయను పదముతో కలిపి 'ఆంధ్రద్రావిడ' భాషలనియు, 'సంస్కృతాంధ్ర ద్రవిడ' భాషలనియు వాడబడినట్లు కనుబడుచున్నది.

30. కుమారిలభట్టను పండితుడు దక్షిణహిందూస్థానమున వాడబడెడు భాషలనుగూర్చి వ్రాయుచు 'ఆంధ్రద్రవిడభాష' లని వ్రాసియుండిరి. వారి అభిప్రాయమున నీ ఆంధ్రద్రవిడభాషలే నీదక్షిణా దిన వాడబడుచున్నట్లు కనుబడుచున్నది. బహుశః కన్నడమును తెలుగులోకలిపి, మళయాళమును ద్రవిడభాషలోకలిపి అరవభాషను ద్రవిడభాషయని వ్రాసియుండునని పండితులు సమర్థించుచున్నారు. ఇది సరియైనదిగనే మన మంగీకరింపవచ్చును. కుమారిలభట్టు యనువారు క్రీస్తుశకమున రెండవ శతాబ్దినాటి పండితుడై యుండెను.

31. మను ధర్మశాస్త్రమున ద్రావిడు లార్య క్షత్రియ జాతికి చెందినవారై ఆర్యసాంప్రదాయముల ననుసరించుచున్నందున వెలివేయబడి యితర పుండ్రక, ఓఢ్ర, కంబోది, యవనశకపరద,

పల్లవ, కిరాట, దరదలతోపాటు వృషలలుగ నెంచబడుచుండిరి. ఇట్లే ఆంధ్రులును అయిత్తిరేయి బ్రాహ్మణమున శపింపబడినట్లు వ్రాయబడియున్నది. ఇచటద్రావిడశబ్దము జాతిపరముగ వ్రాయబడినది. ఇట్లే మహాభారతమునందును ద్రవిడ శబ్దము జాతిపరముగ నుపయోగింపబడినది. సామాన్యముగ మాటలాడునపుడు జనులను విభాగము చేయుచు పంచగౌడులనియు, పంచద్రావిడులనుటయు మనకు తెలిసియే యున్నది. అయితే నీ విభజనయందు పంచద్రావిడులను వివరించుచు ద్రవిడులు, ఆంధ్రులు, కర్ణాటులేగాక దక్షిణదేశమునందు నివసించుచున్న మహారాష్ట్రులను, ఘూర్జరులనుకూడ కలిపిరి. మహారాష్ట్రులును, ఘూర్జరులును ఆర్యులుగాని ద్రావిడులుకారు. ఇట్లే శబ్దకల్పద్రుమ మను నిఘంటువునందును భాషల వివరించుచు ద్రావిడము, ఆంధ్రము, మహారాష్ట్రము, గుజరాతి, కర్ణాటమును పేర్కొనబడినవి. అయితే మహారాష్ట్రము, గుజరాతియు ఆర్యభాషలై యున్నవి. బాణకవి (క్రీ. పూ. 500) చంద్రపీడ రాజును వర్ణించుచు "ఆంధ్ర ద్రవిడ సింహళ ప్రమోద సేవక జనేన" అని వ్రాసియుండెను. ఇట్లే ఆంధ్ర ద్రవిడ పదములు జనపరముగను, భాషాపరముగను వాడబడినవి.

32. భాషా శాస్త్రవేత్తయగు బాబురాజేంద్రలాల్మిత్రీ యనువారు 1854 వ సంవత్సరమున వ్రాయుచు "ద్రావిడయనునది ప్రసిద్ధ ప్రకృత భాష" యని పేర్కొనెను. ద్రావిడయను పదమున 'ద్రా' యను సంయుక్తాక్షరము సంస్కృతజనితమేగాని తమిళము గాజాలదు.

33. హేమచంద్రుడును, మఱి యితరసంస్కృత వైయాకరణులున్ను 'ద్రావిడి' యను భాష పైశాచిభాషగా పేర్కొనిరి. దక్షిణాత్య పైశాచి భాషలలో 'ద్రావిడి' యనునది యొక పైశాచి భాషయని వ్రాయబడినది. అదేవిధముగా ఆంధ్రమున్ను దక్షిణాత్య భాషలలోని 'చులికి పైశాచి భాష' యని చెప్పియుండిరి.

34. తారానాథు డను బౌద్ధశాస్త్రజ్ఞుడు తాను వ్రాసిన గ్రంథమునందు 'దమిళ' యను పదము నుపయోగించెను. కాని ద్రావిడలోని 'డ' యను నక్షరమునకు బదులు 'ల' యను నక్షరము నుపయోగించెను. మళయాళభాషా పరిశోధకుడైన 'గుండార్ట'ను పాశ్చాత్యపండితుడు మళయాళ పురాణములందు 'ద్రమిళ' యని వాడబడినట్లు వ్రాసియుండెను. పాళీభాషయందు వ్రాయబడిన 'మహామనస' యను గ్రంథమున 'దమిల' యను పదము వాడబడియున్నది. కాలమునుబట్టి 'ద్రవిడ' యను పదము అనేకమార్పులు చెందుచు 'ద్రవిడ' 'ద్రమిడ'మై 'ద్రవిళ' 'ద్రమిళ' 'దమిల' గ మారి చివరకు 'తమిల' యని రూపొందినట్లు కనుపించుచున్నది. దీనినిబట్టి చూడగ ద్రవిడశబ్దము తమిళకు మాత్రము వాడబడిన బాగుండునని తోచుచున్నది.

35. ద్రవిడయనుపదము దేశపరముగను వాడబడియుండెను. ద్రవిడదేశము తిరుపతికొండలు హద్దుగ కన్యాకుమారీ అగ్రమువరకు నుండు దేశమని 'తొల్కప్పియ' మను గ్రంథమున వ్రాయబడెను. తూర్పు పడమరలుగ సముద్రతీరముననుండి నరువదిమైళ్ళవరకు వ్యాపించియుండెను. అచటి జనులు ద్రవిడదేశస్థులు. అచటి ఆచారములు, సాంప్రదాయము ద్రవిడఆచారములు, సాంప్రదాయములునై యున్నవి. ఈ పరిభాషను పాశ్చాత్యపండితులును అంగీకరించిరి. అరవ పండితులు మాత్రము ద్రవిడశబ్దము అరవపండితులకు మాత్రమే వర్తించు ననిరి. మిగిలినవారు 'తమిళులు'. కాని యిది సరియైన నిర్వచనము కాదని గ్రహించిరి. ఇప్పుడు బ్రాహ్మణులను ఆర్యులనుచున్నారు.

36. సంస్కృత వ్యాకరణములయందుగాని, ద్రవిడ దేశభాషా వ్యాకరణములయందుగాని దక్షిణదేశభాషలనన్నిటిని కలిపి 'ద్రావిడ' భాషలని యెవరును పిలిచియుండలేదు. తెనుగు, అరవము ప్రత్యేక భాషలుగనే నిరూపింపబడినవి. వీటినే ఆంధ్రమని, యింద్రవిడ మనియు ననిరి. దీనిని గురించి వ్రాయుచు బర్నెలుపండితు డిట్లనెను:

"ద్రవిడ భాషలు రెండు ప్రత్యేక భాషలుగా విభజింపబడినవి. తనంతట తాను నిల్వదగిన తెనుగు, రెండవది తమిళ భాషయు. తమిళ భాషయం దితరభాషలన్నియు నిమిడి యున్నవి."

అయితే యిట్లు వ్రాసియు బర్నెలు పండితుడు ద్రవిడమను పదమును అన్నిభాషలకును కలిపియే యుపయోగించెను. ఇందుకు కారణము కాల్డ్వెలు పండితుని విభజనయే.

37. అరవభాషను, సంస్కృతభాషను కవల పిల్లలనుగ సృష్టించి అగస్త్యునకు అరవభాషను, పాణికి సంస్కృతభాషను శివుడే నేర్పించెనని 'కాంచీపురాణము' నందును, 'తిరువిలయిదల పురాణము' నందును వ్రాయబడి యుండెను. సుబ్రహ్మణ్యస్వామియే అగస్త్యమహాఋషికి అరవమును నేర్పెనని వ్రాసియుండిరి. ఈ యూహలను బట్టి 'నేమినాథం' 'వీరసోలియం' గ్రంథకర్తలు 'తొల్కప్పియం' భాష్యకర్తలు అరవమునకు, సంస్కృతమునకు హెచ్చుసంబంధములే యుండెనని వ్రాసియుండిరి. పదునెనిమిదవ శతాబ్దమున 'ఇలక్కనకొట్టు' 'ప్రయోగ వివేకము' అను గ్రంథములు వ్రాసినవారును, అరవము సంస్కృతభాషలో నొక ఉపభాషగ పరిగణించిరి. వీరు వ్రాయుటలో అరవము ప్రత్యేకభాషగ నుండుట అసంగతమని వ్రాసియుండిరి.

38. అన్నివిషయముల నాలోచించి దక్షిణ హిందూదేశమున పడమటి భాగమున నున్న సముద్ర వ్యాపారమువలన పూర్వకాలమున నుండి కలసిపోయిన విదేశీయజనసమూహముచేతను, కొంతకాలము భూభాగముగ నుండి సముద్రమున అంతరించిన లిమూరియా ఖండములయందలి జనముల రాకవలనను, ఆర్చిపిలాగోనుండి, హిందూదేశమునందలి యితరభాగముల నుండియు లేచివచ్చి దక్షిణ హిందూదేశమున నివాసముగ నుండియున్న జన సాముదాయమువలనను మాటలాడబడెడు భాషలు యొక్క ప్రత్యేక

ప్రాచీనభాషారూపమును ధరించి అందుండి యీ ద్రవిడ, తెలుగు, కన్నడ, మళయాళ భాషలు యుత్పన్నమయి యుండవచ్చుననియు కాల్డ్వెలు పండితు డభిప్రాయపడి ఈ భాషల నన్నిటిని కలిపి ప్రత్యేక ద్రవిడభాషా సాంప్రదాయముగ నేర్పరచియుండిరి. అయితే కాల్డ్వెలు పండితుడును భాషలను పరిశీలించి వ్రాయునపుడు అతిజాగరూకతతో నీ క్రింది విధమున వ్రాసియుండెను:

"గ్రీకు గాధిక కెల్టిక్ పర్షియను సంస్కృత భాషలతో ననేక సాదృశములున్ను, సారూప్యమున్ను ద్రావిడభాష కున్నను మొత్తముమీద నాకు చూడ హెచ్చుగ నీ భాషయందు సిథియను భాషాసంబంధము కలదని కన్పట్టుచున్నది."

కాల్డ్వెలు పండితునికి యిండో యూరపియను భాషలతో ద్రవిడ భాషలకు సంబంధము లనేకములు కనుపించినను వాటినన్నిటిని త్రోసిపుచ్చి చివరకు సిథియను భాషలతో ప్రత్యేకత హెచ్చుగనున్నదని అభిప్రాయపడెను. ఆ ప్రత్యేకత యెట్టిదో, ఆ ప్రత్యేకత ఇండోజర్మానిక భాషలతో నేల సరిపడలేదో మాత్రము చెప్పుట కష్టముగనున్నది. వారున్ను దానిని వివరించిచెప్పియుండలేదు. ద్రావిడభాషకు సిథియను భాషాసంబంధమున్నదను సిద్ధాంతము నితర పాశ్చాత్య భాషాపండితు లంగీకరించనూలేదు. కాని వారు ఇండో జర్మానిక భాషా సంబంధమునూ అంగీకరించలేదు. అందున నీ భాషల కొక త్రిశంఖు స్వర్గమేర్పడినది.

సంస్కృతభాషాపండితులు వైయ్యాకరణులు మాత్రము మొదటి నుండియు నీభాషలు సంస్కృతభాషకు 'వికృతు' లని గట్టిగా చెప్పుచుండిరి. పదజాలమునందు గల సంబంధమును ప్రత్యేకించి నిరూపించుటకు తత్సమములనియు, తద్భవములనియు, దేశీయములనియు మాత్రము వివరించిరి.

'తజ్జాసమాచ దేశ్యాగ్రామ్యా చేయం చతుర్విధా భవతి'
యని ఆంధ్రశబ్దచింతామణి యందును,

ఆ. "తత్సమంబు నాఁగ దద్భవంబన నచ్చ
తెనుగు నాఁగ మరియు దేశ్య మనఁగ
గ్రామ్యభాష నాఁగ గల వైదు తెఱఁగులు
వేరవేర వాని విస్తరింతు."

క. "మును సంస్కృతములపైఁ
దెనుగు విభక్తులు ఘటించి తేటపడఁగ జె
ప్పినది తత్సమ మనఁ జను
వనము ధనము పురుషు డబల వసుమతియనన్."

తే. "ఆంధ్ర దేశపు స్థానీయులైన సకల
జనములకును మఱంగు దేశములేక
తేట తెల్లమిగా బల్కు మాటలెల్ల
నవనిశుద్ధాంధ్ర దేశ్యము లనఁగబడును."

అనియు కేతన ఆంధ్రభాషాభూషణంబునను విస్తరించిరి.

తెలుగువ్యాకరణమువలన 'నన్నయభట్టీయము' సంస్కృతమున వ్రాయబడియున్నది. 'కర్ణాటకభాషాభూషణమును ప్రథమకన్నడ వ్యాకరణము 'నాగవర్మ' యనువారిచే సంస్కృతముననే వ్రాయబడెను. ఇటీవల పదునేడవశతాబ్దమున కూడ మళయాళభాషయందు వ్రాసిన వ్యాకరణమునకు 'రాజరాజవర్మ' యనువారు సంస్కృతభాషావైయ్యాకరణుని పేరనే 'కేరళపాణినీయ' మనుపేర గ్రంథమును వ్రాసి యుండెను. కన్నడభాషయందు 'భట్టకలంకదేవ' యనువారు కన్నడవ్యాకరణమును సంస్కృతభాషయందే వ్రాసియుండిరి. అరవభాషయందు వ్యాకరణప్రయోగమునుగూర్చి వ్రాయుచు, 'ఇలక్కన్న కొట్టు' యను వ్యాకరణ గ్రంథమును వ్రాయుచు

ఆ గ్రంథముయొక్క ఉపోద్ఘాతమున గ్రంథకర్తయగు స్వామినాథదేశికరనువారు సంస్కృతమును చక్కగ స్తుతించుచు వ్రాసియుండిరి. స్వామినాథ దేశికరుగారి సమకాలికుడగు సుబ్రమణ్యదేశికరుగారు మళయాళభాషను గూర్చి వ్రాయుచు 'తమిళ' పదము సంస్కృతపదమైన 'ద్రవిడ' నుండి యుత్పన్నమైనట్లు వ్రాసియుండెను. వారు రచించిన 'ప్రయోగవివేక'మను గ్రంథమున వ్యాకరణమునకును, వాంగ్మయమునకును గల సంబంధమునుగూర్చి వ్రాసియుండెను. 'పరంజ్యోతి మునివర' యనువారు 'తిరువిలయదళ పురాణము' నందును, 'శివజ్ఞానయోగి' తాను వ్రాసిన 'కాంచీపురాణము' నందును శివుడు అగస్త్యమహామునికి అరవవ్యాకరణము నేర్పించినట్లు వ్రాసియుండెను. ప్రథమవ్యాకరణమయిన తొల్కప్పియమునందు మాత్రము అవరభాషాజననము సంస్కృతముననుండి యని వ్రాసియుండలేదు.

అరవము : కాల్డ్వెలు

41. ఇప్పటికి దాదాపు నూరుసంవత్సరములక్రింద కాల్డ్వెలు (Dr. Caldwell) పండితుడు ద్రవిడవ్యాకరణములను (Comparative Grammar of the Dravidians) బయల్పరచెను. అంతకుపూర్వ క్రైస్తవమతప్రచారకు లనేకులు హిందూదేశమునందలి జనులను వారి భాషలద్వారా బాగుగ తెలిసికొనుటకు ప్రయత్నములు చేయుచూ వచ్చిరి. అట్టివారిలో ప్రథముడు 'బెషి' (Beschi) యను పాదిరియై యుండెను. ఈత డరవభాషయందు వ్యాకరణమును, నిఘంటువును ప్రచురించెను. ఈతడే 'తెంబవాణి' యను పద్యకావ్యమునుకూడ వ్రాసియుండెను. ఈతడు 1747 వ సంవత్సరమున మరణించెను. అటు పిమ్మట డేనిషు మతప్రచారకులు వీరిమార్గమునే అనుసరించిరి. విన్సలో (Winslow) యనువారు అరవభాషలో నొక నిఘంటువును (A comparative Tamil & English Dictionary of High & low Tamil) ప్రచురించిరి.

మ ళ యా ళ ము

42. మళయాళమునందు మతప్రచారకు లింతకన్నముందే కొంత భాషాసేవ చేసియుండిరి. 1738 వ సంవత్సరమునకే వీరిచేత పోర్చుగీసు భాషయందు మళయాళవ్యాకరణము వ్రాయబడెను. జర్మను, యిటాలియను మతప్రచారకులచే 1746 వ సంవత్సరమున మళయాళనిఘంటు వొకటి ప్రచురింపబడెను. పీటరు క్లిమెంటనువారు మళయాళవ్యాకరణమును ప్రచురించిరి. ఇల్లే రాబర్టు డ్రమ్మండను వారు ఒక వ్యాకరణమును 1789 న వ్రాసిరి. ఈ ప్రచారకులు వ్రాసిన గ్రంథములలో మిక్కిలి ప్రఖ్యాతిగాంచిన గ్రంథము డాక్టరు గుండార్టు గారి మళయాళభాషలోని నిఘంటువు.

తె లు గు

43. డేనిషు ప్రచారకుడైన షల్జు (Schulze) మొదటి తెలుగుపండితుడు. ఈతడు తెలుగున పాండిత్యమును సంపాదించెను. 1807 వ సంవత్సరమున తెనుగువ్యాకరణము నొకదానిని ప్రచురించెను. వీరిపిమ్మట మారిసు సోదరులు తెనుగున నొక నిఘంటువును తయారుచేసిరి. A. D. కాంబె లనువాడు తెనుగున వ్యాకరణమును వ్రాయగా దానిని యీస్టిండియాకంపెనీవారు 1813 వ సంవత్సరమున సంపాదించి 1818 వ సంవత్సరమున ప్రచురించిరి. వీరు వ్రాసిన వ్యాకరణమును వాడుకయందు 'జెంటూ' యని పిలువబడెడు తెనుగు వ్యాకరణమని పేరుబెట్టిరి. ఆ కాలమున తెనుగుభాషను జెంటూ భాష యనియు, తెనుగువారిని జెంటూలనియు పిలిచెడివారు. జెంటూ యనునది పోర్చుగీసు భాషాపదము. మారిసుపండితుడు వ్రాసిన నిఘంటువు 1835 వ సంవత్సరమున ప్రచురింపబడెను. వీరితరువాత ఛార్లెసు ఫిలిప్పు బ్రౌనుగారు తెనుగుభాషకు చేసినసేవ అపారమైనది. వీరిచే ననువదింపబడిన వేమనపద్యములు వీరిని ప్రఖ్యాతికి తెచ్చెను. అటుపిమ్మట తెనుగు ఛందస్సునుగూర్చి "అనాలెసిస్ ఆఫ్ తెనుగు

ప్రోసడి"యను నొక ప్రచురణమునుగావించిరి. ఈ గ్రంథమునందు తెనుగు ఛందస్సును సంస్కృతఛందస్సుతో పోల్చిచూపించిరి. ఇందుకు కంపెనీ వారు వీరినిసన్మానించిరి. వీరినిఘంటువులు, వ్యాకరణము మిక్కిలి ప్రఖ్యాతిగాంచినవి. 1813 వ సంవత్సరమునకే తెనుగు వాంగ్మయి జ్యోతి ప్రమిదె కళావిహీన మగుచుండెననియు, ఆ సంవత్సరమున మదరాసు కాలేజివారు వత్తిని నూనెయందు తడిపి దీపమునకు కాంతిగలిగించె ననియు బ్రౌనుపండితుడు వ్రాసియుండెను. అట్టి సమయమున నిదుర బోవుచున్న తెనుగుపండితులను నిదురనుండి లేపి తెనుగు వాంగ్మయమును బ్రౌనుపండితు డుద్ధరించెను. చెదలుపట్టుచున్న తెనుగు వ్రాత ప్రతులను రక్షించిరి. మెకంజిపండితుడు యీ వ్రాతప్రతులను తయారుచేసి సంగ్రహించిరి. అదియే యిప్పుడు చెన్నపట్టణమున ప్రాచ్యగ్రంథాలయమున నుంచబడినది. మనప్రభుత్వమువా రా పుస్తకములను మన దేశమునకు తెప్పించుటకు ప్రయత్నములు చేసినపిమ్మట నిపుడా పుస్తకముల నకళ్ళను తిరుపతియందున్న విశ్వవిద్యాలయమునకు తెప్పించగల్గిరి.

క న్న డ ము

44. కన్నడభాషయందు షల్జు (Schulze) పండితుడు సిరెంపూరు మతప్రచారకులు హెచ్చుగ పాటుపడియుండిరి. వీరి తరువాత కిట్టెలు (Kittel) పండితుడు పాటుపడియుండెను. బ్రౌనుపండితుడు తెనుగుభాషకు చేసినసేవ కిట్టెలుపండితుడు కన్నడభాషకు చేసియుండెను. కన్నడభాషయందు నిఘంటువును తయారుచేసి ప్రచురించియుండిరి.

45. ఈ పాశ్చాత్యపండితులు ద్రవిడభాష నుద్ధరించుటకు చేయు ప్రయత్నములకు తోడుగ శాసనములను బయల్పరచుటకును ప్రయత్నములు జరుపబడెను. ఆనాటికి మన దేశపండితులకు శాసనముల ప్రాముఖ్యత, యుపయోగము చక్కగ తెలిసియుండలేదు. భాషాచరిత్ర

మును విశదపరచుటకు యీ శాసనములు మిక్కిలి యుపయోగకర మనుటలో సంశయ మనవసరము. శాసనములు సంపాదించుటయందు బర్నెలు, బూలరు, కీల్హారను, గ్రియర్సను హల్ట్సు మొదలుగాగల పాశ్చాత్య పండితులు గొప్ప సేవచేసిరి. ప్రభుత్వమువారున్ను వీరికి సహాయముగ ప్రత్యేక యెపిగ్రాఫికుశాఖను నొకదానిని నిర్మాణించిరి.

వా డు క భా ష

46. పూర్వ ప్రబంధములను సమకూర్చుటయే గాక గ్రామ్యభాషయొక్క ప్రాబల్యమునుకూడ పాశ్చాత్యపండితులు గమనించిరి. మతప్రచారమునకు గ్రామ్యభాషను తెలిసికొనుట అత్యవసరమని గ్రహించిరి. అందుకని గ్రామ్యభాషలో వ్యాకరణములను తయారుచేసిరి. గ్రామ్యభాషలో యున్న జీవము గ్రాంధికభాషలో లేదని వారు గ్రహించిరి. ఇందు జీవకళ కలదనిరి. భాషయందలి మార్పులన్నియు వాడుకభాషలో చక్కగ కనుబడగలవు. భాష యెట్లుమారుచున్నదియు అద్దమునందువలె గ్రామ్యభాషయందు చూడనగునని పాశ్చాత్యపండితులు గమనించిరి.

47. పైన పేర్కొనబడిన పాశ్చాత్యపండితు లందరును తాము నివసించు గృహములందు సుఖజీవనము జరుపుకొనుచు, భాషా సేవ చేయుచుండ, మరికొందరు పాశ్చాత్యపండితులు అడవులలోను, కొండలలోను తిరిగి, అచటి కొండజాతులవారిని కలుసుకొని, వారితో నివసించి తమ సౌఖ్యమును పారదోలి, అసహ్యమైనట్టి, అనారోగ్యములైనట్టి ప్రదేశములలో ననేక దినములుండి భయంకర మృగముల బాధలను తప్పించుకొని, ఆహారబాధలకు నోర్చి, అష్ట కష్టముల ననుభవించి కొండజాతులవారి భాషను నేర్చుకొని, అందు జ్ఞానమును సంపాదించి, వాటికిని నాగరికతగల భాషలకునుగల సంబంధముల నవలోకించి ప్రపంచమునకు తెలియజెప్పిన భాషాపండితు లనేకులుండిరి. వారు భాషకు చేసిన మేలు మిక్కిలి సంస్తవనీయమైనది. అట్టి వారిలో

చెప్పదగినవార నేకులు కలరు. 'బాట్స'ను వారు 'ఒరాన్సు' జాతివారి యందును, 'డాసన్' పండితుడు 'గాండ్స' జాతివారితోను, 'మార్షలు' 'మెట్సు', 'పోపు', 'డీ బ్రీన్' మొదలయినవారు 'తోడాల'తోను, 'బిరెల్' అనువారు 'తులూ' జాతివారితోను,' 'కోల్స'ను వారు 'కూర్గు' జాతివారితోను కొండలయందును, అడవులయందును నివసించిరి. వీరు భాషాసేవకై పడినపాట్లు చెప్పనలవికాదు. మన ఆంధ్రులలో కీర్తిశేషులైన గిడుగు రామమూర్తి పంతులుగారి పేరు గొప్పగా సంస్మరింపబడినది. 'సవర' జాతివారితో తిరిగి, వారివద్ద నివసించి వారిభాషయందు పాండిత్యమును సంపాదించి వారివద్దనే కొండలలో నివసించి, మలేరియా బాధచే పీడితులై చెమిటివారై యెన్నియో కష్టములకు గురియైరి. వీరిభాషాజ్ఞాన సముపార్జనయందు గల ప్రేమ అనిర్వచనీయము, అపారము.

48. పైన వ్రాసిన కష్టములన్నియు భాషాజ్ఞాన సముపార్జనకు మిక్కిలి ముఖ్యమైన సోపానములు. ఇట్టి పండితుల కష్టముల వలననే భాషాశాస్త్ర ముద్భవించినది. భాషకును భాషకునుగల పరస్పర సంబంధములను కనుగొనుటలో కాల్డ్వెలు పండితుడు పడిన బాధలను మనమూహింపజాలము. వీరు మన భాషలకు చేసిన సేవ నిక్కముగ వర్ణనాతీతము. వీరీ భాషల సంబంధములను పరిశోధించి 'కంపారిటివ్ గ్రామరు ఆఫ్ ది ద్రావిడియన్సు ఫైలాలజి' యను పేర నొక వ్యాకరణమును 1859 వ సంవత్సరమున ప్రచురించిరి. వీరభిప్రాయమున నీ ద్రావిడ భాషలని పిలువబడెడు దక్షిణాది భాషలకును, ఇండో-జర్మానికు భాషలకును చాల హెచ్చు పోలికలున్నను యీభాషలకును, సిథియను భాషలకును యింక నెక్కువ పోలికలు గలవని వీరి నిశ్చితాభిప్రాయమై యుండెను. వీరితో సమకాలికుడైన 'డాక్టరు పోపు' పండితుడు వీరభిప్రాయముతో నంగీకరింపకయు, సిథియను భాషలకును ద్రావిడభాషలకును గల సంబంధములను,పోలికలను వారంగీకరించలేదు. ద్రవిడభాషలు కేవల సంస్కృతభాషా జనితములు కాకపోయినను

వాటితో హెచ్చుసంబంధము కలవని మాత్రము డాక్టరు పోపుగా రభిప్రాయపడిరి. వా రీ క్రిందివిధముగ వ్రాసియుండిరి.

"దక్షిణ హిందూస్థానపుభాషల నెంత జాగ్రత్తతో చదివిన అంత సన్నిహిత సంబంధములు సంస్కృతముతో నున్నట్లు కనబడుచు, యిండోయూరపియనుభాషలతో మిక్కిలి హెచ్చైనట్టియు, ప్రాథమికమైనట్టియు సంబంధము లుండియున్నట్లు సాక్ష్యము కనుపించుచున్నది. కాని యివి కేవల సంస్కృత భాషకు వికృతులుగాని, నిజముగ కేవల ప్రాకృత భాషలుగాని కాజాలవు. అయితే యీ భాషలన్నియు యిండోజర్మానికు భాషలలో జేర్చదగినవనియు, ఇవన్నియు సంస్కృతభాషతోపాటు సంస్కృతము జనించిన యింకొక పూర్వభాషకు సంబంధము లున్న భాషలునై యుండవలెననియు నా దృఢఅభిప్రాయమై యున్నది. ఈ భాషలన్నియు సంస్కృతభాషకూడా నిరూపించని కొన్ని సన్నిహిత సంబంధములను 'గ్రీకు' 'గాథికు' 'పర్షియను' భాషలు చెందియున్న కుటుంబములతో కలిగియున్నవి."

డాక్టరు జి. యు. పోపు ప్రాచ్యభాషా పండితుడు.

49. ఇది యిట్లుండ 'కిట్టెలు' పండితుడు చెప్పిన ప్రకారము సంస్కృతములోనికి ద్రావిడ భాషాపదములే తీసికొనబడిన వని యొకవాదనను బయలుదేరదీసిరి. ఈ వాద మెంతమాత్రము సరియైనదికాదని యితర పాశ్చాత్యపండితులే విమర్శించిరి. కిట్టెలు పండితుడు అట్టి 420 పదములను ప్రత్యేకించెను. వీటిలో చాలవరకు మన దేహమునందుండెడి అవయవములు, ప్రతిదినము వాడుకొన బడెడు వస్తువులు, పాత్రసామానులు నై యున్నవి. అంత నాగరికత చెందిన ఆర్యులకే దినదినము వాడబడునట్టి వస్తువులకు యితర భాషా పదముల యెరువు తెచ్చికొనిరనుట మిక్కిలి వింతగనున్నది. వీ రీపదముల నెరువు తెచ్చుకొనుట వీరిద్దరు కలసినపిమ్మటనై యుండవలయును.

అట్లైన నంతకుముం దీపదములు తమ భాషయందు లేవనుట మిక్కిలి హాస్యాస్పదముగ నుండక తప్పదు. అందువలన నీ వాదమును మన మంతగ చర్చింప నవసరములేదు. కాని యీ విషయమునుగూర్చి 'బీమ్సు'ను నింకొక పాశ్చాత్య పండితుడు వ్రాసిన విమర్శనము నిచట వ్రాయుదును:

"ఆర్యులు తమ పూర్వీకులనుండి కొన్నిమాటల నెరువు తెచ్చికొనిరను వాదమునకుగల ప్రాథమికమైనట్టియు, ముఖ్యమైనట్టియు కొన్ని సులభమైన అభ్యంతరముల నిచట నిరూపించుట అవసరము. మాటకు మాటకు నుండు సాదృశ్యమునుబట్టి నిరూపించుట యితర కారణములు లేనప్పుడు క్షేమముకాదు. ఒక అరవపదమున 'క' యను నక్షరమున్నది. అదే యక్షరమున్ను సంస్కృతమున కనబడుచున్నది. అంత మాత్రముననే యీ సంస్కృత పదము అరవముననుండి జనించినదని చెప్పుట సమంజసము గాదు. నేను ముందుగ చెప్పునదేమన్న ఆర్యులు అనాగరికులకు బలమునందును, నైతికముగను బలవంతులు. అందువలననే వారివద్దను, వారు యితరులవద్దను పదములను తీసికొనుటకన్న వారివద్దనుండి తీసికొనుటయే సహజము. ఆర్యులు హిందూదేశమునకు రాకపూర్వమే వారికి భాషా పదములతో నిండిన భాష యుండెను. అందుచేత వారింకొక భాషనుండి పదములను తీసికొననవసర ముండియుండదు. అందు మామూలుపదములు అనగా కట్టుకొను గుడ్డలపేర్లు, మామూలుగ వాడుకొను వంటపరికరములు, వేటవస్తువులు, పనిముట్లు, తమ అవయవములపేర్లు బంధుత్వమును నిరూపించెడి పేర్లు వారు ఎరువుతీసి యుండరు. వారిదివరకు చూచియుండని చెట్లు, జంతువులు ప్రకృతియందలి యితర వస్తువులు మొదలయినవాటిపేర్లు తమ భాషలోనికి తీసికొందురేమో. అదిన్ని గాక సహజముగ తమ భాషలో అట్టి వస్తువులకు పేర్లను

సృష్టిచేయ యత్నించుట సహజము. ఏనుగకు చేతివలె ఉపయోగించెడి తొండమున్నందున 'హస్తిని' అను మాటను కల్పించిరి. కోతి అడవులలో తిరుగుచున్నందున 'వానర' యనిరి. నెమలి యొక్క కూతనుబట్టి మయూర మనిరి.

బీమ్సు ఈ విషయములనే గూర్చి వ్రాయుచు నింకొకచోట నిట్లువ్రాసిరి:

"చతుర్థీ విభక్తియం దరనములో వచ్చెడు 'కు' ప్రత్యయమునకును, హిందీభాషలోని 'కో' యను ప్రత్యయమునకును గల సాదృశ్యమునుబట్టి యేదో గొప్ప ఉపద్రవము సంభవించునట్లు కాల్డ్వెలుపండితు డూరక వెఱ్ఱివెఱ్ఱిగా వాదించ ప్రారంభించెను. కాని ప్రత్యేకముగ చూడబడెడు ద్రవిడసిథియను, ఆస్ట్రిక, రష్యను, మలయా సాదృశ్యము లట్లుంచి నెమ్మదిగా స్వాస్థ్యముతో నాలోచించిన అనేక వ్రాతప్రతులనుండి చూపి ఈ ప్రత్యయము యితర భాషలతో సంబంధము లేకుండగనే తమ భాషాకుటుంబములతోనే స్పష్టముగా నిరూపించుటకు సాధ్యమగును."

50. కాన కేవల సారూప్య సాదృశ్యములనుబట్టి యొక భాష నింకొక భాషనుండి పదముల నెరువు తెచ్చుకొన్నదని చెప్పుటకు యితర కారణములు, నిదర్శనములు ఉండవలెను.

51. 'మాక్సుమూలరు' పండితు డీ భాషలు తురేనియను భాషకు సంబంధించినవై యుండవచ్చునని అభిప్రాయపడెను.

52. 'పేయ'సను నింకొక పండితుడు ద్రావిడ భాషలు 'ఆర్యను సెమిటిక్కు' భాషలకు చెందినవనియు, తురేనియను జాతికి చెందినవనియు వ్రాసియుండెను.

53. 'ఫ్రెడరికు ముల్ల'రను నింకొకపండితుడు ద్రావిడ భాషలకును, ముండా భాషలకును పరస్పర సంబంధములు కనుపించు

చున్నవనియు అందువలన నీభాషలు ముండాజాతికి సంబంధించినట్లుగ భావింపదగుననియు అభిప్రాయపడెను.

54. అయితే కాల్డ్వెలుగారి భాషాసేవ అపారమైనదే యైనను వారు అరవభాషను మాత్రమే ముప్పది సంవత్సరములు బాగుగ చదివిరికాని, ద్రావిడభాషలని చెప్పబడెడు యితర తెనుగు, కన్నడము, మళయాళము భాషలయందు పరిశ్రమచేసి యుండలేదు. అందువలననే తానుజేసిన కృషి ననుసరించి యితరభాషా పండితులను కూడ కృషిచేసి తాను తాత్కాలికముగ నేర్పరచిన అభిప్రాయములను పరీక్షించి సరిచూడమని వ్రాసియుండిరి. వారిట్లు వ్రాసిరి :

"ద్రావిడభాషలు మాట్లాడబడు మండలములలోని జనులను పురికొల్పి వారివారి భాషల నితరభాషలతో పోల్చి ప్రత్యేక విజ్ఞానదృష్టితో పరిశీలించగలరని నా ముఖ్యోద్దేశమైయున్నది. నాకు చేతనయినంతవరకు చేయదగిన పనిని వదలిపెట్టకుండా అరవభాషను విస్పష్టము జేయుటకై ప్రయత్నించి యుంటినని నమ్ముచున్నాను. ఇంతటినుంచి తెనుగు, మళయాళము, కన్నడము ప్రత్యేక చదువనుద్యుక్తులైనవారీపనిని ప్రారంభించి పరిశోధించగలరని ఆశిస్తున్నాను. అప్పుడే ద్రావిడభాషలు, అందలి వాడుక గ్రామ్యభాషలు పూర్తిగ పరిశోధింపబడగలవు."

55. వారంతగా వ్రాసియుండిరేగాని వారి తరువాతవారెవ్వరును యీ విధమైన పరిశోధన చేసియుండలేదు. ఒక్క గ్రియర్సను పండితుడు మాత్రము కొంత పరిశోధన జరిపియుండిరి. వారున్ను కాల్డ్వెలుగారి అభిప్రాయముతో పూర్తిగ అంగీకరించలేదు. అయితే వారున్ను ద్రావిడభాషలు సంస్కృతమునుండి జనించినవనియు నంగీకరించలేదు.

56. కాల్డ్వెలు పండితుడు వ్యాకరణమును వ్రాసిన కాలమునకు ప్రాకృత భాషలనుగూర్చి ప్రపంచమున కెక్కువగా తెలిసియుండ

లేదు. ఈ ప్రాకృత భాషలనుకూడ పరిశీలించి యుండిన ద్రవిడ భాషలను పేర జరుగుచున్న దక్షిణ హిందూదేశ భాషలకును, ఉత్తర హిందూదేశ భాషలకును ప్రాకృత భాషలద్వారా సంబంధము కనుపించెడిదేమో. అట్టిసంబంధము లేకయున్న నీ భాషలయందు చక్కనిపాండిత్యమును సంపాదించి వ్యాకరణములు వ్రాసిన పండితులందరును నీ భాషలను సంస్కృతభాషలయొక్క వికృతులని యేల చెప్పియుందురు? ఈ విషయమునుకూడ మనపండితులు పరిశీలించిన బాగుండెడిది. కాని అట్లు జరిగియుండలేదు. కాల్డ్వెలు సిద్ధాంతములన్నియు పరిపక్వత పొందిన పరిపూర్ణ అభిప్రాయములు కావు. మన ఊహానుబట్టి ఆలోచించినను ఉత్తరమునకును, దక్షిణమునకును సంస్కృతియందుగాని, ఆచార వ్యవహారములయందుగాని, ధర్మాధర్మములయందుగాని, విశ్వాసములయందుగాని, సాంప్రదాయములయందుగాని భేదములంతగా కనుపించవు. అట్లైన భాషలయందు మాత్రము భేదము లెందు కుండవలయునో యను అంశము నూహించుట కష్టసాధ్యముగ కనుబడకపోదు.

57. ఇట్టిపరిశీలన కాల్డ్వెలు పండితుని తరువాత కొందరు పండితులు ప్రారంభించినట్లు కనుపించుచున్నదిగాని ఫలవంతముకాలేదు. అమరావతి శేషగిరిశాస్త్రిగారు చెన్నపట్టణమున ప్రెసిడెన్సీకాలేజి ఆచార్యులుగనుండి సంస్కృతమునందును, ద్రవిడభాషయందును మంచి పాండిత్యమును కలిగియుండి కొంత పరిశోధనగావించి యుండిరి. కొంత కాలముక్రింద కె. వి. సుబ్బయ్యగారను నింకొక పండితుడు ద్రావిడ భాషాధ్వనులనుగురించి 'ఇండియను ఆంటిక్వేరియను' పత్రికయందు కొన్నివ్యాసములు వ్రాసియుండెను. కాని వారున్ను పనిని పూర్తిచేయరైరి. టేకుమళ్ల రాజగోపాలరావుగారను నింకొకపండితుడు కొంతకాలము 'సౌదిండియను రీసెర్చి' యను పత్రికను నడిపించిరి. అందు ద్రావిడ భాషాసాముదాయమునుగూర్చిన కొంతపరిశోధనను గావించిరిగాని వారున్ను యేమియు చేయజాలరైరి. అటుపిమ్మట మద్రాసు విశ్వవిద్యాలయమునందు నల్గురు రీడర్లను నియమించిరి. అట్టివారిలో

ఆర్. స్వామినాథయ్యరుగారు 'ద్రావిడభాషావిభక్తి ప్రత్యయము' ల గూర్చియు, 'సర్వనామముల' గూర్చియు కొన్నివ్యాసముల ప్రచురించిరి. వీరు ద్రావిడభాషల సంస్కృత భాషాజనితమును నిర్ణయింప ప్రయత్నించిరి కాని వారకాలమరణమున పనిని పూర్తిచేసియుండలేకపోయిరి. అటుపిమ్మట పండిత జి. జోగిసోమయాజులుగారున్ను, డాక్టరు చిలుకూరి నారాయణరావుగారున్ను నీ భాషాపరిశోధనల గావించిరి. వీరిలోనొకరు మొదటివారు కాల్డ్వెలు సిద్ధాంతములనే నంగీకరించిరి. రెండవవారు ద్రావిడభాషలకు ప్రాకృత సంస్కృతభాషాజన్యతను నిర్ణయించుటకు ప్రయత్నించిరి. రెండవవారీ విషయమై మిక్కిలి ప్రయాసపడిరిగాని వారును కొద్దికాలమునకే కొంతపని జేసినపిమ్మట పని పూర్తికాక పూర్వమే దివంగతులైరి. కాని వీరిద్దరి పరిశోధనలకన్న పరస్పరద్వేషములు వృద్ధియాయెనేగాని పరిశోధన లంతగా లాభించియుండలేదు. మనలో కొందరు పండితులు పరిశోధనలు గావింపకయే కాల్డ్వెలు పండితుడు వ్రాసిన యభిప్రాయములే పరిపక్వమైనట్టివిగను తీసికొని వాటిని విమర్శించకయే ముందుకు పోవుచున్నారు. మరికొందరు కాల్డ్వెలుగారి యభిప్రాయములు పరిపక్వములైనవిగావని చెప్పుటయే గాని అందున్న లోప మేదియో నిరూపించుటలేదు. అంతేగాక ఆంధ్రవిశ్వవిద్యాలయ మిప్పటికి ముప్పదిసంవత్సరముల పైకాలమున ప్రారంభింపబడినను ఆంధ్రభాషయందు పరిశోధనలు హెచ్చుగ గావించుటకు సావకాశముల గల్గించి ప్రోత్సహించియుండలేదు. ఆంధ్ర భాషా కోవిదులున్ను, పండితులున్ను భాషాశాస్త్ర విషయమై తగినంత శ్రద్ధను తీసికొనుటలేదు. ఇద్దరు ప్రఖ్యాత భాషాపండితులు భాషాశాస్త్రమునుగూర్చి రెండు పెద్దపుస్తకములను వ్రాసి, ఒకరినొకరు పరుషముల నాడికొనిరేగాని భాషకు నిజమైనసేవ జేసియుండలేదు. ఇతరులకు ప్రోత్సాహము కనుపించుటలేదు. ఇప్పటికి నప్పుడప్పుడు కాల్డ్వెలు పండితుని అభిప్రాయములు సరియైనవనికొందరున్ను, సరియైనవి కావని మరికొందరున్ను పత్రికలలో వ్యాసములు వ్రాయుటయు వారి

కనుకూలమైన ఉదాహరణములను వారున్ను, వీరికి వీలయిన ఉదాహరణముల వీరున్ను ఉదహరించిన్ని, వారివారి వాదములను సమర్థించుచున్నారేకాని యెప్పుడును సమగ్రముగ నాలోచించినవారు కనుపించరు. ఇట్టిస్థితిలో ఆంధ్ర విశ్వవిద్యాలయము వారున్ను, అందలి భాషాశాస్త్ర పండితులున్ను శ్రీ వేంకటేశ్వర, ఉస్మానియా, మదరాసు, కన్నడ, అన్నామలై, కేరళ విశ్వ విద్యాలయ భాషాపండితులున్ను సంప్రదించి యీ విషయమై సంపూర్ణచర్చ గావించి పరిశోధనల గావించు మార్గముల నన్వేషించి నిర్ణయించి నా యా ప్రభుత్వముల సహాయమునుపొంది, గట్టిప్రయత్నములుచేసిన బాగుండునని తోచుచున్నది.

58. ఈ విషయమునుగూర్చి ముగించక పూర్వము యింకొక విషయమై కొంత చెప్పదగియున్నది. మన పూర్వపండితులు భాషలో తద్భవములు, తత్సమములు, దేశీయములు యుండియున్నవని చెప్పుచూ వచ్చిరి. ఈ దేశీయపదము లేవి యని కొంత ఆలోచింపతగియున్నది. దేశీయపదములన్న కేవల ద్రావిడపదములని చెప్ప వీలులేదు.

తే. గీ. ఆంధ్రదేశ పదస్థాయులైన సకల
జనములకును మరుంగుదేశంబు లేక
తేటతెల్లముగా బల్కు మాటలెల్ల
నవనిశుద్ధాంధ్రదేశ్యము లనగబడును.

సంస్కృతపదమునుండి జనించక అనార్యులచే వాడబడిన పదములే దేశీయపదములని మహారాష్ట్రులు వివరించిరి. అయితే పూర్వపండితులీ దేశపదముల నెట్లువివరించిరో మనము తెలిసికొందము.

59. హేమచంద్రుడనుపండితుడు 'దేశీయరత్నావళి' యను గ్రంథము నొకదానిని వ్రాసెను. ఆ గ్రంథమునందు పదములన్నియు దేశీయపదములు. అయితే నీపుస్తకమునుగూర్చి వ్రాయుచు భండా

ర్కరు పండితుడు యిందులోని కొన్నిపదములు సంస్కృతపదములే యని వ్రాసియుండెను. ఆప్టెపండితుడు 'దేశి' కూడ నొక ప్రాకృతభాషయేనని చెప్పియుండెను. హేమచంద్రుడు తన రత్నావళీగ్రంథము నందలి కొన్నిపదములు సంస్కృతపదములనియు, మరికొన్ని పదములు తత్సమములనియు నంగీకరించెను. పూర్వపండితుల అభిప్రాయమున సంస్కృతమునకు చెందనిపదము లన్నియు దేశీయపదములే. అంత మాత్రమున నివి ద్రావిడపదములు కాజాలవు.

60. 'అప్ప', 'అమ్మ', 'అక్క', 'అత్త', 'శెట్టి', 'శూల', 'కల్ల' మొదలయిన పదములు అన్నియు దేశీయపదములని కొందరు వాదించుచున్నారు. 'అప్ప', 'అమ్మ' పదములు 'అంబ', 'అంబా' యను సంస్కృతపదములనుండి జనించినవని తోచుచున్నది. 'అంబ' యనుపదము వేదమునందే వాడబడియున్నది. 'అక్క' యనుపదమున్ను సంస్కృత పదమే. దీనికి 'తల్లి' యనునర్థము కలదు. 'పొట్ట' 'ప్రకోష్ఠ' యనుపదమునుండి వచ్చి యుండవచ్చును. 'కోష్ఠ' యన 'పొట్ట' యనునర్థము. అట్లే 'శెట్టి' 'శ్రేష్ఠి' యను పదమునుండి వచ్చెను. 'సులే' 'శూల' యను పదమునుండియు, 'కల్లు' 'కల్య' యను పదమునుండియు వచ్చియుండవచ్చును. ఇట్లే యనేక దేశీయపదములు సంస్కృతపదజనితములుగాని, సమములుగాని యై యున్నవి.

61. ఇట్లే కాల్డ్వెలు పండితుడు సంస్కృత జనితములు కావని నిరూపించిన యనేకపదములను వ్యాకరణమునకు సంబంధించిన అంశములను, సర్వనామములగూర్చి చెప్పిన ప్రత్యేకతను, అంకెలను గూర్చి వ్రాసిన వ్యాఖ్యను కీ. శే. చిలుకూరి నారాయణరావుగారు తన 'ఆల్ యింట్రొడక్షను టూ కంపారటివ్ ఫైలాలజీ' యను పుస్తకమునను, తాను తరువాత ఆంధ్రభాషనుగూర్చి వ్రాసిన పుస్తకమునను విమర్శించి యీ పై అంశములన్నియు ప్రాకృతభాష నుంచియు, వేద భాషనుంచియు, యిరేనియనుభాష నుంచియు సమన్వయపరచుటకు

ప్రయత్నము గావించిరి. వారు వ్రాసిన సమాధానములు నిష్పాక్షిక బుద్ధితో నాలోచించిన కొంతవరకు సమర్థనీయములేయని తోచక మానదు.

62. ఈ విషయముల నిరూపించుటలో మాటలలో సాదృశ్యసారూప్యములను చూపినంతమాత్రమున భాషాకుటుంబముల నేర్పరచుటకు వీలులేదని శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. ముఖ్యముగ నీ సందర్భమున గమనింపవలసిన విషయము భాషల నిర్మాణములో సామ్య ముండవలయును. అయినను మనవా రీవిషయమున పరిశోధన గావించియుండలేదు. కాల్డ్వెలుపండితు డీవిషయమై కొంతపరీక్షించెను గాని అది అసంపూర్తిగ నుండియున్నది. వారి పరిశోధన ద్రావిడభాషను సంస్కృతభాషతో మాత్రము సరిపోల్చి చూచియుండిరి. అట్లుగాక వేదభాషతోను, ప్రాకృతభాషతోను, నేటి ప్రాకృతములైన హిందూస్థానీ భాషలతోను సరిపోల్చి చూచినయెడల నీ విషయము కొంత తేలి యుండెడిది. ఈ విషయమునుగూర్చి వ్రాయుచు 'హారన్లీ' యను పాశ్చాత్యపండితు డిట్లు వ్రాసెను :

"హిందూదేశ వైయ్యాకరణులు దేశీయపదములను తత్సమ తద్భవ పదములతోపాటు మూడవ భాగముగ నిరూపించి యుండిరి. దేశీయశబ్దమునకు సరియైనఅర్థము దేశమునకు అనగా ప్రాంతీయ దేశమునకు ప్రథమమున చెందినవై యున్నదని. తాము సంతుష్టికరముగ సంస్కృతభాషనుండి జనించినట్లుగ చెప్పజాలని పదముల నన్నిటిని దేశీయపదములని, అందువలన నా పదములు దేశమునందుగాని, పల్లెలయందుగాని సృష్టింపబడిన వని తలంచిరి. ఏవిధములుగ నీ పదము లుత్పన్నము లయినవో వారు తెలియజెప్పుటలేదు. ప్రథమనివాసులైన వారివద్దనుండి యెరువుతీసికొనిరో లేక సంస్కృతభాషకు పూర్వమే యుండిన ఆర్యులు సృష్టించినవో లేక సంస్కృతభాషనుండి జనించినను వాడుకయందు పూర్తిగ మారిపోయి గుర్తుపట్టజాలని స్థితియం

దున్నవో కూడ తెలియుటలేదు. దేశాచారములను, యిప్పటి పండితులధోరణియు గమనించిన సంస్కృతమునుండి తీసికొనబడి రూపు మాసిపోయి గుర్తుపట్టజాలకుండునట్టి పదములై యుండ వచ్చునని తోచుచున్నది. ఇప్పటి నూతనపద్ధతులను బట్టి చూడ నూతనమార్గముల ననుసరించి యీ పదములనుసంస్కృతభాషా జనితములని నిరూపించి దేశీయపదముల జాబితానుండి వాటిని తగ్గించుచున్నారు.

63. పైన వ్రాసినప్రకారము పూర్వపండితులచే దేశీయము లుగ నెంచబడిన యనేకపదములు సంస్కృతభాషకు సన్నిహితము లైన పదములుగ నిప్పటిపండితులు కనుగొను చున్నట్లున్న, అందు వలన దేశీయపదములజాబితా తగ్గుచున్నట్లున్న తెలియనగును. భాషామర్యాదల నాలోచించి చాలపదములకు సంస్కృత మూలముల నేర్పరుపవచ్చునని తలంపవచ్చును. వీనికి పరిశోధనయే ముఖ్యమైనది. అదేవిధముగ నుత్తరహిందూస్థానములోని భాషలలోని దేశీయపదము లని అచటి వైయ్యాకరణులు తలంచిన పదములగూర్చి వ్రాయుచు 'బీమ్సు' పండితుడిట్లు వ్రాసెను :

"క్రొత్తపద్ధతుల ననుసరించి ప్రత్యేకపరిశోధనగావించి, భాషాభి వృద్ధిసూత్రములను గమనించి ప్రయత్నించి పనిజేసిన, దేశీయ పదములని యెంచబడిన పదములకు సరియైన పదములను సంస్కృతమునగాని, ప్రాకృతమునందుగాని తెలిసికొనుట గొప్ప కష్టమైనపని గాదని చెప్పుట మొండితనముగాదని తోచు చున్నది. ఉన్నది ఉన్నట్లుగ నాలోచించినను తత్సమములు, తద్భవములు ఆర్యభాషకే చెందినవైనచో మిగిలిన అనార్య భాషాపదములు బహుస్వల్పముగ నుండును. దేశీయపదము సంస్కృతమునుండి వచ్చిన తద్భవము కాకున్నను ఆర్యభాష నుండి (సంస్కృతముకాని) వచ్చిన తద్భవపదమునుండి జనించి యుండవచ్చును. అట్టి సందర్భములో నీదేశీయపదముయొక్క

మూలపదము సంస్కృతపదమునందుగాని, ప్రాకృతమునందుగాని కనుబడకపోవచ్చును. అందువలన నీపదములయొక్క మూల పదములకై మిగిలిన యిండో జర్మానిక భాషాపదములలో వెదుకవలసివచ్చును."

64. ఇదేప్రకారమున తెనుగుభాషలోని దేశీయపదములకు సరిపోయినపదములకై సంస్కృతమునందుగాని, ప్రాకృతమునందుకాని, మరి యితర ఆర్యభాషలలోగాని వెదుకవలసియున్నది. అట్టి పరిశోధనలు గావించినచో నీ దేశీయపదములన్నియు నార్యభాషలోనివే నని తేలవచ్చునని తోచుచున్నది.

65. కొంత ఓర్పుతో నీ విషయమునందు పరిశోధన జరిపినచో ద్రావిడభాషలని చెప్పెడు దక్షిణాత్య భాషలన్నియు ఆర్య భాషా జనితములనియే నిరూపించుటకు సావకాశమున్నట్లు కనుపించుచున్నది. తమిళమను పదమే సంస్కృతపదమైయుండ తమిళ భాషయందు ప్రథమగ్రంథ మగు తొల్కప్పియమే సంస్కృత జనితమై తొలికావ్యముగనుండ నీ భాషయు, నీ భాషాపదములు, నీ భాషయందలి వ్యాకరణ పద్ధతులు సంస్కృత ఆర్య ప్రాకృత భాషలతో సంబంధములేదని చెప్పుట సమంజసముగ కనబడలేదు. కాల్డ్వెలు పండితుడు తన వ్యాకరణమను గొప్ప గ్రంథమును వ్రాయుటలో శ్రమ పడలేదని, వారు గొప్ప మార్గదర్శికత్వమును చూపలేదనికాని యెవ్వరు చెప్పుటలేదు. అంశములను పరిశీలించి మన పండితుల అభిప్రాయములతో సమన్వయ పరచుటకు యత్నించినంతనే కాల్డ్వెలు పండితుని అగౌరవపరచినట్లుగ భావించకూడదు. కాల్డ్వెలు పండితుడు తన అభిప్రాయమే నెగ్గితీరవలయునని పట్టుపట్టియుండలేదు. ప్రాకృత భాషలు, వేదభాషలు, యితర ఆర్యభాషలు చదువుకున్న పండితులు, కాల్డ్వెలుగారు అనుసరించి పనిచేసి వదలిపెట్టిన దగ్గరనుంచి ముందుకు పరిశోధన ప్రారంభించి తగినంత శ్రద్ధతో పరిశోధనగావించిననీ విషయము సులభముగ పరిష్కారము కావచ్చునని తోచుచున్నది.

66. ఈ ద్రవిడ భాషల విషయమై పూర్తిగావించక పూర్వము భాషయందలి వ్యాకరణ విషయమును గురించి కొద్దిగ వ్రాసెదను.

ఏ, ఓ అక్షరములు

ఏ, ఓ అక్షరములు సంస్కృతభాషలో లేవనియు, అందు వలన సంస్కృతమునకు, తెలుగునకు సంబంధము తక్కువయనియు ఆక్షేపించియున్నారు. అయితే యీ అక్షరములు ప్రాకృతభాషలో నున్నవి. డాక్టరు నారాయణరావుగా రీవిషయమునుగూర్చి ప్రమోదూత సంవత్సర కార్తీకమాస భారతి పత్రికలో వ్రాయుచు నీ విషయమై చర్చించి యుండిరి. వరరుచి యిచ్చినట్లుగ నందు కొన్ని యుదాహరణములున్ను యిచ్చివుండిరి.

సం.	ప్రా.	సం.	ప్రా.
యవ్వనం	జొవ్వనం	శయ్యా	సెజ్జ
ముక్తా	మొత్త	శైత్యం	సేచ్చం
సేవా	సెవ్వ	నీడం	ణెండం
ఏకం	ఎక్కం	త్రైలోక్యం	తెల్లోకం

68. అప్పయ్య దీక్షితులుగారు రచించిన 'ప్రాకృత మణిదీప' మను గ్రంథమున ప్రాకృతములో హ్రస్వములైన 'ఏ, ఓ' లు ఉన్నట్లు సమర్థించిరి: ఓఢ్ర మలో 'అ' అని వ్రాసి 'ఓ' గా ఉచ్చరించెదరు. 'గం' 'గోం' గా నున్ను, 'బలె' 'బోలె' గా నున్ను ఉచ్చరింతురు.

'చ' 'జ' లు

69. దంత్యోచ్చారణగల 'చ' 'జ' లు తెలుగు భాషలోనే కాదు, సంస్కృతభాషలో కూడ నున్నవి. అప్పకవి వ్రాయుటలో నీ క్రింది అధోక్షజవచనమును వ్రాసియుండెను.

'చ జౌ తజ్జే ప్రాకృతే దంత్యా వేవనసంశయః'
వరరుచి మొదలయిన కొందరు వైయ్యాకరణులు చ జ ల దంత్యోచ్చారణ ప్రాకృతమున సూచించియుండిరి.

70. ఈ విషయమునుగూర్చి 1927 వ సంవత్సరం యుగాది సంచికయందు విద్వాన్ గరిమెళ్ల సోమన్నగారు యిట్లు వ్రాసియుండిరి:

"మనభాషాపదసామగ్రిని పరిశీలింప మొదటినుండియు నిది సంస్కృత ప్రాకృతములపై నాధారపడినట్లు తోచుచున్నది. 'అమ్మ' 'అయ్య' 'నాయనా' 'అక్క' 'బాబు' 'తాత' 'మామ' 'నీరు' 'అగ్ని' 'కొండ' 'సముద్రము' 'భూమి' 'సూర్యుడు' 'దీపం' 'పెట్టె' 'కుండ' 'మంచము' 'కుంచము' 'బట్ట' 'వాణి' 'చీర' మున్నగుమాటలు మధ్య తెచ్చిపెట్టుకొన్నవై వుండవు. నిత్య వ్యవహారములలోనుండు వేలకొలది మాటలు సంస్కృత సంబంధము కలవే. 'నెయ్యి' 'నూనె' 'తాటి' 'ఆముదం' 'ఈత' 'చింత' 'మల్లె' 'కలువ' 'గారె' 'బూరె' 'జంతికె' 'పాలు' 'అప్పడం' 'బియ్యం' 'సున్నం' 'మెంతి' 'కంద' 'పెండలం' 'కాకర' మున్నగుమాటలు సంస్కృతమునకు చేరినవి. 'గద్ద' 'రాంబందు' 'తీతువ' 'కుక్క' 'కోకిల' 'పావురం' 'కుక్క' 'గాడిద' మున్నగు జంతునామములు ఆర్యభాషకు చేరువయగునవి.

'తెలికలు' తిలలతో సంబంధం, 'కంసాలి' కర్మసాలి, 'మంగలి' మంగలివాద్య సంపాదకుడు, 'కంచరి' కాంస్యకారుడు, 'కోమటి' గోమతుడు, 'మాదిగ' మాతంగుడు, 'గొల్ల' గోకులుడు, 'చాకలి' క్షాలకుడు, లేక క్షారకుడు, 'గోడ' 'పల్లె' 'బావి' 'వాడ' 'అడవి' మున్నగుమాటలు తెనుగునకును, సంస్కృతమునకును మొదటినుండియు బంధుత్వము తెలుపును. ఇట్లు తెనుగు సంస్కృత ప్రాకృతముగ, జన్యముగ కనబడును.

అయిదవ ఉపన్యాసము

ద్రవిడ భాషలు

1. వివరములు

ద్రవిడ భాషలు అను శీర్షిక క్రింద దాదాపు పండ్రెండు భాషల పేర్లు చెప్పుచున్నారు.

1. తమిళము, 2. మళయాళము, 3. కన్నడము, 4. తెనుగు, 5. తులు, 6. కొడగు, 7. తోడ, 8. కోట, 9. గాండ్, 10. ఖాండ్, 11. ఒరాను, 12. రాజమహాల్.

ఈ పైన చెప్పిన పండ్రెండింటిలోను మొదటి నాలుగు భాషలు మాత్రము దేశమునందు మంచివ్యాప్తియందుండి ప్రసిద్ధభాషలుగ వాడబడుచున్నవి. తులు, కొడగు భాషలయందును కొంత పరిశ్రమ గావింపబడుచున్నది. మిగిలిన ఆరు భాషలున్న దేశమునందు కొద్ది ప్రదేశములయందు వ్యాప్తియందున్నవిగాని యీ భాషలయందేలాటి పరిశ్రమయు లేదు. ఈ పండ్రెండు భాషలుగాక బ్రూహి యను నింకొకభాష బెలూచి స్థానమునందు వ్యాప్తియుందున్నది. ఈ బ్రూహి యను భాషయు ద్రవిడ భాషలకు సంబంధించినదనియే భాషా శాస్త్రజ్ఞుల యభిప్రాయమైయున్నది. దీని విషయమై యిదివరకే నాల్గవ యుపన్యాసమున కొంత చర్చింపబడినది. ఈ పైన చెప్పిన భాషలలో తమిళమునుగురించి కొంత విపులముగను, మళయాళము, కన్నడమును గురించి కొద్దిగను తెనుగు లేక ఆంధ్రమును గురించి ప్రత్యేకముగను మిగిలిన భాషలగురించి పరిచయముచేసి తెలిసికొన గలందులకును వివరములు వ్రాయుదును. అట్లు వ్రాయుటలో తమిళమును గురించి ప్రథమమున వ్రాయుదును. ఈ వ్యాసముననే మిగిలినభాషలనుగూర్చి

మూడవ భాగములో పరిచయము చేయుదును. ఆంధ్రమును గురించి ప్రత్యేకముగ ఆరవయుపన్యాసమున వ్రాయుదును.

2. ఇదివరలో నాల్గవవ్యాసమున వ్రాసినదానినిబట్టి ద్రవిడ భాషలని వివరింపబడిన భాషలన్నియు ప్రత్యేక కుటుంబమునకు చెందినవి కావనియే నాస్వంతఅభిప్రాయమైయున్నను ఇప్పటికి భాషాశాస్త్రజ్ఞులు చేసిన పరిశోధనలనుబట్టి హెచ్చుమంది మనదేశముననేమి, యితర పాశ్చాత్య దేశముల నేమి యీ భాషలను ప్రత్యేకించి ద్రవిడ భాషలుగనేవాడుచు వివరించుచున్నారు. కాని మనదేశమునందలి, అందును ముఖ్యముగ మన తెనుగుదేశమునందలి భాషాశాస్త్రజ్ఞులు సమకూడి యీ భాషయందును, మిగిలిన దక్షిణాదిభాషలయందును పరిశోధనలుగావించి వేదభాషను, ప్రాకృతభాషను ప్రత్యేకముగ చదివి యెందుకు మనభాషలు ఆర్యభాషలకు జెందవో గమనించి పరిశోధించవలయునని కోరుచున్నాను. ఇందుకు ప్రభుత్వమువారున్ను తగినంత సహాయముచేయుదురుగాకయని దేవుని ప్రార్థించుచున్నాను. మన పండితులున్ను నీవిషయమున ప్రభుత్వమువారియొక్కయు, విశ్వవిద్యాలయములవారియొక్కయు సహాయ సహకారములను కోరుదురుగాక యని ప్రార్థించుచున్నాను.

2. తమిళము : అరవము

1. చెన్నపట్టణమున నుండియు, దక్షిణభాగమున నుండు జనులను మనము సామాన్యముగ నరవవారనియు, వారుండు దేశము నరవదేశమనియు, వారు మాట్లాడుభాష నరవభాషయనియు చెప్పుచున్నాము. మనమేగాక కన్నడిగలును, మహారాష్ట్రులును కూడ నిట్లే పిలుచుచున్నారు. కాని ఆ దేశస్థులుమాత్ర మా పేరు నంగీకరించునట్లుగ కనుపించదు. వారు తాము తమిళులమనియు, వారుండు దేశమును తమిళదేశమనియు, వారిభాషను తమిళభాషయనియు మాత్రమే చెప్పుకొనుచున్నారు. వారు తమగ్రంథములం దెచ్చటను తాము నరవ

వారనిగాని, తమదేశ మరవదేశమనిగాని, తమభాష అరవభాషయని గాని చెప్పికొనియుండలేదు. మన పురాతనగ్రంథములం దెచటను వీరినుద్దేశించి తమిళమని వాడినట్లు కనుపించదు. సంస్కృత కవులు తమ గ్రంథములయందు 'ఆంధ్ర ద్రావిడ' భాషలనియు, సంస్కృత ఆంధ్ర ద్రావిడ భాషలనియు మాత్రము వ్రాసియుండిరేగాని తమిళమను మాటయే వ్రాయరైరి. మను తన ధర్మశాస్త్రమునందు ద్రవిడులు దక్షిణహిందూస్థానవాసులని వ్రాసియుండెను. 'ద్రావిడి' యనుభాష దక్షిణాపథమున మాట్లాడబడు భాషగా పరిగణించినది. దీనినే పైశాచి ప్రాకృతభాషలలో నొకదానినిగ చెప్పియుండిరి. భాషాశాస్త్రవేత్తయగు బాబు ద్విజేంద్రలాల్మిత్ర యనువారు 1854 వ సంవత్సరమున వ్రాయుచు 'ద్రావిడి' యనునది ప్రసిద్ధ ప్రాకృతభాషయని పేర్కొనెను. 'ద్రావిడి' యను పదములోని 'ద్ర' యను సంయుక్తాక్షరము సంస్కృత జనితమేగాని తమిళముకాజాలదు. తారానాథునిగ్రంథమున 'ద్రమిళ' యను పదము 'ద్రవిడ'కు బదులుగ నుపయోగింపబడెను. మళయాళ భాషా పరిశోధకుడైన పాశ్చాత్యపండితుడు 'డాక్టరు గుండార్ట'నువారు మళయాళపురాణమునందు 'ద్రమిళ'యను పద ముపయోగింపబడినట్లు చెప్పియున్నారు. పాళీభాషయందు వ్రాయబడిన 'మహామనస' యను గ్రంథమున 'దమిళి'యను పదము వ్రాయబడియున్నది. ఇట్లే 'ద్రవిడ' యను పదము 'ద్రమిడ'గను 'ద్రమిళ'గను 'దమిళి' గను 'దమిల'గను వ్రాయబడి చివరకు 'తమిల' మైనట్లు తోచుచున్నది. 'తవిల' మను పదము 'తమిర'గ కూడ వాడబడుచున్నది.

ఉత్పత్తి

2. తమిళ భాషోత్పత్తిని గూర్చి అరవదేశమునం దనేక గాథలు కలవు. ప్రథమమున శివుడు సంస్కృతవ్యాకరణమును 'పాణిని' కిన్ని, అరవవ్యాకరణమును అగస్త్యమునికిని ఉపదేశించున ట్లొకగాథ కలదు. ఈ గాథనే చమత్కారముగ నింకొకరూపమున చెప్పియుండిరి.

దేవఋషియగు అగస్త్యులవారు సంస్కృతముకన్న రమ్యమైన భాషను తన కుపదేశించమని కందస్వామిని ప్రార్థించినట్లును, తనకట్టి వర మివ్వబడినట్లును, తా నచటినుండి యింటికేగ అచట నొకమూల కొన్ని భూర్జరపత్రముల సంపుటములు పరిమళము లీనుచున్నట్లును, వాటి మధురరసముల నాస్వాదించుచుండ 'తమిష్' అను పదము కూడ వినబడెననియు, అందువలన నీ భాష 'తమిష్' భాషయని పిలువ బడెననియు చెప్పుదురు. 'తమిష్' యన మధురమైన యను నర్థమగుట వలన నీ భాష మిక్కిలి మధురమైనభాష యనియు చెప్పుదురు. అగస్త్యమునిచే ప్రార్థింపబడిన దైవము 'కందస్వామి'. ఈతడే 'స్కంధ స్వామి' అనగ 'కుమారస్వామి'. అరవభాషయం దీతనిని 'మురుగ' నందురు. 'కుమార' యను పదము 'మురగ' గ మారినది. భాషయం దిట్టి మార్పులు జరుగుచునేయున్నవి. 'హింసిం'చునది గనుక సింహ మనియు, 'యా' యేది 'మా' లేదో అది 'మాయ' గను మారినది. ఇట్లే ఇంగ్లీషు 'సావరిన్' తెనుగున 'నవరసు' గ మారినది. పైన చెప్పబడిన కథ యొక గారడికథగ కనుపించుచున్నది. ఇట్టిగాథ కాధార మెద్దియును లేదు. ఇది సమంజసముగను కనుపించదు. అది యెట్లున్నను అరవవాఙ్మయమునందును, పురాణములయందు శివుడే అరవభాషను సృజించినట్లు చెప్పబడుచు అరవమున్ను, సంస్కృత మున్ను కవలపిల్ల లనియు శివుడు అరవమును అగస్త్యున కుపదేశించి నట్లును కనుబడుచున్నది. ఇట్లే 'కాంచి పురాణము' నందును, 'తిరు వలయకల పురాణము' నందును వ్రాయబడి యున్నది. ఇంకొక తమిళ పండితుడు సుబ్రహ్మణ్యస్వామి అగస్త్యునకు తమిళమును నేర్పినట్లు వ్రాసియుండిరి. అయితే జయినులు వ్రాయుటలో బౌద్ధసన్యాసి యగు 'అవలోకిత' యనువారు నేర్పినట్లు జెప్పుచున్నారు.

3. 'పింగళాండే' యను గ్రంథమున 'తమిష్' అన తియ్యనిదైన భాషయని చెప్పబడెను. ఈ అర్థము అరవవాఙ్మయమున 'చింతామణి' గ్రంథకర్త యొక్కరే క్రీ. త. 950 సంవత్సరమున

నుపయోగించి యుండెను. పింగళాండెయందు వ్రాయబడిన యర్థము ననుకరించి 'ద్రావిడ ప్రకాశిక' గ్రంథకర్తయును, మరికొందరు పండితు లును 'తమిష్' యన తియ్యనైన యను పరిభాషను చేయుచున్నారు. అరవ నైషధమునందు నాయకి యగు దమయంతి మాటలయందు తమిళభాషకన్న మధురత్వమున్నదని వ్రాసియుండిరి.

4. 'తమిళ' శబ్దమునకు సరియైన యుత్పత్తి కనుబడనందున కొందరు అరవపండితులు తమ భాషకు ప్రత్యేకనామము లేదనుట అవమానకరమని 'తమి'యన 'ఒంటరిగ' యను నర్థము గలదనియు, అందువలన నీ భాష ప్రత్యేకతగలభాష యనిరి.

5. కనకసభాపతి పిళ్లెగారు తామ్రలిప్తినుండి తమిళమను మాట జనించెనని చెప్పిరిగాని అందు స్వారస్యత యెంతమాత్రము కనుపించనందున వదలివేయబడినది. మరియు తామ్రలిప్తి యను దేశము తెనుగుదేశమని వీరభద్రరావుగారు వ్రాసిరి.

6. అరవపండితులుగాని, వైయ్యాకరణులుగాని నీ భాష నామమును గూర్చి వ్రాసియుండిరా యని విచారించిన నదియు కనుపించుటలేదు. ప్రథమమున ఆర్యావర్తమున నుండి వచ్చిన ఆర్యులలో అగస్త్య మహాఋషియు, మరికొందరున్న వచ్చియున్నట్లు కనుబడును. ఇది అందరు నంగీకరించినవిషయమే. అయితే అగస్త్యుల రాకనుగురించి వ్రాయకపూర్వము అగస్త్యునిగురించి కొద్దిచరిత్రను వ్రాయుదును.

7. మిత్ర వరుణు లిద్దరు స్వర్గలోకమున నూర్వసి యను దేవకన్యను ప్రేమించియుండిరి. ఆ సందర్భమున కొంత తేజస్సు యీలోకమున రెండుకుండలయందు పడెనట. అందువలన నా కుండల యందు వసిష్ఠాగస్త్యు లిద్దరు నుద్భవించిరి. వీరిని కుంభ సంభవు లనిరి. ఇంకొకచోట అగస్త్యుడు పౌలస్త్యునికి భార్యయగు హవిర్భుక్కువలన జనించెనని చెప్పబడినది. అగస్త్యునకు పెద్ద కమండల ముండెనట.

ఈ కమండలసహాయమువలన నొకానొకప్పుడు సముద్రపునీటిని త్రాగెనని గాథ జెప్పుదురు. ఈతడు ఉత్తరదిశనుండి దక్షిణమునకు రా ప్రయత్నించగా మధ్యనున్న వింధ్యపర్వతము విపరీతముగ పెరుగుట ప్రారంభించెను. అంత అగస్త్యుడు క్రోధించి శపించి వింధ్యపర్వతమును దాటి దక్షిణమునకు వచ్చెను. అట్లు వచ్చునపుడు అచ్చటచట ననేక ఆశ్రమములను తనపేర యేర్పాటుచేసెను. ఇట్లనేక ఆశ్రమముల నేర్పరచి చివరకు తంజావూరువద్దనున్న వేదారణ్య మను నరణ్య ప్రదేశమును జేరి అచట తన కొకఆశ్రమము నిర్మించుకొనెనట. ఈతడు దక్షిణాపథమునకు వచ్చుట మహాభారతమున వనపర్వమున తొమ్మిదవ అధ్యాయమున వివరింపబడెను. ఈతడు అగస్త్య సంహిత, గీత, సకలాధికార మను మూడు గ్రంథములను వ్రాసెను.

8. మరియు అగస్త్యులు వ్యాకరణమును వ్రాసియుండిరి. ఈ వ్యాకరణముపేరు 'అశత్తియన్'. ఇది అగస్త్యునిపేరే. 'అగస్తియను అనుటకు బదులు 'గ'కు 'శ' ను కలిపి 'అశత్తియ' ననిరి. ఈ వ్యాకరణ మెచటను దొరకియుండలేదు. ఈతనిశిష్యుడని చెప్పబడి 'తొల్కాప్పియా'రని పిలువబడెడు వైయ్యాకరణి తన వ్యాకరణమగు 'తొల్కాప్పియం' గ్రంథమును వ్రాసెను. ఈ గ్రంథమున 'తమిళకము' నకు సరిహద్దుల నిచ్చియుండెను. 'తమిళక'మన 'తమిళలోకమే' యను సంస్కృతపదమే. ఈ పదమును విడదీసిన 'తమిళ + ఉలకం' అగును. 'ఉలకం' అను పదము సంస్కృతపదమగు 'లోకము' నకు సమము. అరవమున నేమాటయు 'ల' తో ప్రారంభింప బడదు. అందువలన 'ఉ' అను అచ్చుపదము చేర్చబడి 'ఉలక' మైనది. తమిళకు ఉలకం కలిపిన ఉచ్చారణలో తమిళకమైనది. అందువలన నీ తమిళకమను పదము సంస్కృతపదమే యై యున్నది. ఈ పుస్తకముపేరగు 'తొల్కాప్పియ' మున్ను కేవల సంస్కృతమే యై యున్నది. ఇది 'తొలికావ్యము'గ గాని, 'తొలికబ్బము'గ గాని మనము గ్రహించ నగును. కాని కొందరు అరవకవులు స్వాభిమానమును పురస్కరించుకొని

'కపియం' అను పదము శుద్ధ అరవపదమనియు, సంస్కృతభాషయే శుద్ధ అరవభాషనుండి కావ్య మను పదమును తయారుచేసిరనియు చెప్ప సాహసించిరి. ఈ విషయమును పండితు లంత తేలికగా నంగీకరించరేమోనని శంకించి యింకొక విచిత్రమైనసిద్ధాంతమును బయలు పెట్టిరి. మధుర యను పట్టణమునకు దక్షిణమున 'తొల్కాప్పియ కుడి' యను గ్రామముండెననియు, తొల్కాప్పియ గ్రంథకర్త ఆ గ్రామవాసు డైనందున 'తొల్కాప్పియు'రని పేరు కలిగియుండిరనియు, వారు వ్రాసిన గ్రంథ మగుటవలన నీ గ్రంథమును 'తొల్కాప్పియ' మనబడెననియు చెప్పుచుండిరి. ఈ సమాధానమును సరియైనదికాదని కనుబడుచున్నది. తొల్కాప్పియ కుడి యను గ్రామము లేదు.

9. తొల్కాప్పియరు ప్రాచీనకవి యనుటలో సందేహము లేదు. అతడు సంగకవులలోనివా డనుటకును, అందరికవులలో నిప్పటికి తెలిసినంతవరకు ప్రథమకవి యనుటకును సందేహములేదు. ప్రస్తుతము దేశమునందు కనుగొనబడిన అరవగ్రంథములలో నీతని తొల్కాప్పియ మను లక్షణగ్రంథము మొదటిగ్రంథమే యైయున్నది. ఈతని గ్రంథమున నుదహరింపబడిన గ్రంథము లొకప్పు డుండిన యుండ వచ్చునుగాని అట్టి పుస్తకము లెవ్వియు నిప్పుడు కనుపించవు. ఈతడు సంగకవియని పైన వ్రాసియుంటిని. 'సంగ' మన 'సంఘ'మను సంస్కృత పదమే యైయున్నది. ప్రాచీనకాలమున తమిళభాష నుద్ధరించుటకై సంఘము లేర్పరుపబడెను. ఇట్టిసంఘములు మూడు ఉండెడివి. ఈ మూడు సంఘములును మధురయను పట్టణమున నుండెడివట. ప్రథమ సంఘముండిన మధుర యను పట్టణము యిప్పటి మధురకాదు. అప్పటి మధుర సముద్రమున మునిగిపోయెను. తరువాత 'వైఘూ' నది యొడ్డున నింకొక మధుర వెలసినది. ఇదియే పాండ్య దేశపు రాజధానియగుమధుర. ఇది మూడవ సంగకాలముననుండిన మధుర. మన తొల్కాప్పియరను నాతడు రెండు మూడు సంగములనాటివాడు. ఈ మూడవ సంగము బహుశః క్రీస్తుశకమునకు పూర్వమే యుండి యుండవచ్చును. కాని

ఆంధ్రుల చరిత్రమును వ్రాసిన చిలుకూరి వీరభద్రరావుగారీ సంగమ కాలము క్రీస్తుశకి మునకు తరువాత యని నిర్ణయించిరి. ఇది యెట్లుండి నను తొల్కాప్పియ రను కవియు, వారి తొల్కాప్పియ మను లక్షణ గ్రంథమును ప్రాచీనమైనవని చెప్పుటలో సందేహములేదు. వీరు తమ గ్రంథమున తమిళలోకమునకు సరిహద్దుల నిచ్చుచు తమిళభాషయందు 'ఇయర్ చోళ్' అను పుట్టిదేశీయపదము లుండెననియు, 'తిశైచోల్' యితర దిశలనుండి వచ్చిన పదములనియు వ్రాసియుండెను. ఇదిగాక 'తిరిచోల్' అను గ్రాంథికభాష యింకొకటికలదు. ఇది పండితులభాష. సామాన్యజనుల కర్థముకాదు. మరియు పరిశుద్ధమయిన భాషను 'సేన్' అని అందురు. ఇతర భాషాపదములు హెచ్చుగనుండుభాష 'కొడు' తమిళము. మధురయందును, పరిసరప్రాంతములయందును పరిశుద్ధమైన భాష స్థిరపడి యుండెను. ఈ ప్రాంతము నానుకొనియుండు ప్రదేశ మంతయు పంద్రెండు తమిళనాడులుగ విభజింపబడెను. ఈ పన్నెండు నాడుల వివరములు నీ లాక్షణిక గ్రంథమున వివరింపబడినవి. అవి:

1. దక్షిణపాండ్య 2. కుట్టినాడు 3. కుడనాడు 4. కర్మనాడు
5. వేనాడు 6. పులినాడు 7. ప్రనినాడు 8. అరువానాడు
9. అరువావరదలైనాడు 10. శీతంనాడు 11. మలైనాడు
12. పుననాడు నయి యున్నవి.

పైన వ్రాయబడిన పంద్రెండునాడులుగ నరవదేశము విభజింపబడినట్లు లాక్షణిక గ్రంథములయందు కనబడుచున్నది. ఈ నాడులలో మాట్లాడబడెడు మాటలన్నియు తమిళభాషతో మిళితమై తమిళ భాషను వృద్ధిజేసెను. ఇవిగాక యితరదేశ భాషాపదములున్ను తమిళమున చేరినట్లు లాక్షణికులు వర్ణించుచుండిరి. అట్టి భాషాపదము లన్నియు 'తిశైచోళ్' అనబడెను. తిశైచోళ్ అనగా నాయా 'దిశ'ల యందు మాట్లాడబడు పదములు. 'తిశై' యను పదము సంస్కృత పదమగు 'దిశ'.

10. పైన పేర్కొనబడిన నాడులలో యెనిమిదవనాడు అరువనాడు. తొమ్మిదవది 'అరువావరదలైనాడు'. ఈ రెంటిలోను 'అరువా'యను పదముకలదు. ఈ 'అరువా'యను పదమునకును, అరవ భాషకునుగల సంబంధ మెట్టిదియను అంశమును మనము కనుగొన్న యెడల తమిళమున కరువమని యెట్లు పిలువబడెనోయను విషయమును మనము స్పష్టముగ తెలిసికొనవచ్చును.

11. అగస్త్యమహాముని ప్రథమమున దక్షిణాపథమునకు వచ్చిరనియు, వారితోసహా కొందరు కుటుంబములవారుకూడ వచ్చి యుండిరనియు చెప్పుదురు. వీరితో వచ్చినవారిలో 'అరువాలార్ల'ను కుటుంబములవారు కొంతమందియుండిరి. ఈ విషయమునుగూర్చి తొల్కాప్పియ గ్రంథమునందలి ఉపోద్ఘాత సూత్రమునకు వ్యాఖ్యానము వ్రాసిన'నాచినార్కానియూ'రను భాష్యకర్త యిట్లువ్రాసెను: అగస్త్యుడు ద్వారకానగరమునకు పోయి అచ్చటనుండి దక్షిణదేశమునకు వచ్చు నపుడు వారితోపాటు శ్రీకృష్ణుని వంశీయులైన రాజకుటుంబములను పదునెనమండుగురును, 'వెవీర్లు' 'అరువాలూరు' శాఖీయులు మరి కొందరున్ను వచ్చియుండిరని వ్రాయబడెను. కనుక 'అరువాలూరు' శాఖీయులు కొందరు అగస్త్యునితో దక్షిణదేశమునకు వచ్చిరనుటలో సందేహములేదు. వీరు ఇక్కడకు వచ్చునప్పటికి నిచట స్థానికముగ నివసించువారు వీరిరాక నంతగా హర్షించినట్లుతోచదు. అందుకే వీరు ప్రవేశించిన ప్రదేశమంతయు అపరిశుద్ధమై మైలపడినట్లుగ పరిగణింప బడెననియుగూడ తొల్కాప్పియమున వ్రాయబడెను. మొత్తముమీద స్థానికులు క్రొత్తవారి నాహ్వానింపక అసూయాభావముతో చూచి యుండిరనుట అసహజము కాజాలదు. అగస్త్యునివెంటవచ్చిన వలీరు శాఖవారు మైసూరురాష్ట్రమునందలి ద్వారసముద్రమున నివాసము నేర్పరచుకొనిరి. అరవాలూరువారు నివాస మేర్పరచుకొన్న ప్రదేశమే అరువనాడై యుండవలెను. ఆ 'నాడే' తెనుగుదేశమునకు చెంగల్పట్టు జిల్లాలోగాని, ఉత్తరార్కాటుజిల్లాలోగాని ప్రదేశము వీరు నివసించెడు

ప్రదేశమై యుండవలెను. ఈ ప్రదేశములకు సరిహద్దుననున్న తెనుగు, కన్నడీయులకు వీరు అరవలై యుండవలెను. ఈ అరవలు తమస్థావరము నేర్పరచుకొని మెల్లమెల్లగ తమిళదేశమంతయు పాకియుండవచ్చును. కాని ఆ శాఖలవారికి యీ అరవాలూరి శాఖవారిమీదనున్న అసూయ వలన తమభాష నరవభాషయనిగాని, తమ నరవలనిగాని చెప్పుకొని యుండరు. కాని సరిహద్దుననున్న తెనుగువారికి వీరందరు అరవలయి అరవలని పిలువబడిరి. వీరిభాష అరవభాషయై యున్నది. ఇది అరవ పదముయొక్క సరియైన నిర్వచనమైయుండునని తోచుచున్నది.

12. అరవపండితులకీ నిర్వచనము సరియైనది గాదను నభిప్రాయముచే, అరవమను పదమున కనేక యుత్పత్తుల ప్రయత్నించిరి గాని అవి అన్నియును సరియైనవిగను, అంగీకరింపబడదగినవిగను కనబడుటలేదు. సంస్కృతశబ్దమైన 'రవ' శబ్దముననుండి జనించి తమిళ భాషలో 'అరవ' మైనదనియు, న + రవ యను రెండుపదములు కలసి 'అరవ' మైనదనియు చెప్పుదురేగాని యీ యుత్పత్తి సరియైనదని వారే అంగీకరించియుండలేదు.

13. అరవసాహిత్యము నీతిబోధకమై హెచ్చు ప్రాధాన్యముగలదిగ నుండినందున తమిళ పదమగు 'అరం' న నుండి 'అరవ' మను పద ముత్పత్తియై యుండవచ్చునని డాక్టరు గుండార్టుగా రభిప్రాయ పడిరి. దీనిని సమర్థించుటకు తగు ఆధారములున్ను కనుపించవు. మరియు నిట్టి యుత్పత్తినిచ్చుటకు అరవవారు సాహసించనూలేదు.

14. కొందరు హాస్యమునకై యొకయుత్పత్తిని కల్పించిరి. అరవవారికి దగ్గరలోనున్న కొందరితరభాషల మాట్లాడువారు అరవ భాషను మాటలాడువారి మాటలను విని గందరగోళముగ నున్నదని యెంచి, వారితో పోరాడిరనియు అంత వారు కొంతసేపటికి 'మే మర వము మేమరవ'మని మాటలాడక నూరకుండిరనియు, అప్పటినుండియు వీరి మాటలను అరవమాటలనియు, వారిని అరవవారనియు చెప్పుచు

వచ్చిరనియు చెప్పుదురు. ఈ యుత్పత్తి హాస్యజనకముగనే యున్నది గాని సరసు లెవ్వరు నంగీకరించదగినది కాదు.

15. మొత్తముమీద అరవవా రెప్పుడు నెచ్చటను తమరు అరవ వా రనియు, తమభాష అరవభాష యనియు చెప్పియుండలేదు. తెనుగువారును, కన్నడీయులును, కొంతమంది మహారాష్ట్రులున్ను, దక్షిణపీఠభూమిలోని కొందరు మహమ్మదీయులున్ను మాత్రము వీరి నరవవా రనియు, వీరిదేశ మరవదేశమనియు, వీరిభాష అరవ భాషయనియు జెప్పుచున్నారు. తమ గ్రంథములలో నీ అరవవారు తమను తమిళులనియు, తమభాష తమిళభాష యనియు, తమదేశము తమిళదేశ మనియు జెప్పుకొనియుండిరి. ఇదివరలో వ్రాసినట్లే తమిళ శబ్ద మెట్లుత్పన్నమైనదో తెలియుటలేదు.

16. తమిళ శబ్దమునకు విద్వాన్ క. నరసింగరావుగారు భారతియందు వ్రాయుచు నింకొక క్రొత్తయుత్పత్తిని సూచించి యుండిరి. తమిళ్ అను పదమును తమ్+ఇళ్ అని విడదీసి 'తం' అను పదము నీటితో సంబంధించిన దనియు, ఈ పదమున నుండియే 'తన్ని' యను పదము జనించెననియు, 'యిళ్' అను పదమే 'యిల్' అనియు అనగ నివాసస్థలమనియు, అందున నీటిప్రదేశమున నివసించువారు గాన చల్లనివారనియు, అందువలన వారిని తమిళులని యుండిరనియు వ్రాసియుండిరి. నీట జనించు తామరపువ్వును తమ్మిర యని తెనుగున పిలుచుచునే యున్నాము. అయితే యీ యుత్పత్తివలన తమను చల్లని వారని పొగడినందున వారు సంతోషించిన సంతోషింపవచ్చునుగాని, నీ యుత్పత్తి నిచ్చినవారి చమత్కారమునకు మనము సంతసింప వచ్చునుగాని దీనివలన వ్యవహారము ముందుకు జరుగుటలేదు. ఈ యుత్పత్తి కాధారమున్ను కనుపించదు.

17. తొల్కప్పియ గ్రంథమునుగూర్చి ముచ్చటించుచు నిదివరలో తొల్కప్పియ మన తొలికబ్బమనియు, నదియే తొలికావ్య

మనియు వ్రాసియుంటిని. ఈ గ్రంథ మిప్పటికి దొరకినంతవరకు అరవ భాషయందలి ప్రథమమున వ్రాయబడిన గ్రంథమే యనుటలో అనుమానములేకున్నను నిది కేవల లాక్షణిక గ్రంథముగాని కావ్య మనిపించుకొనజాలదు. ఈ లాక్షణిక గ్రంథమునకు వ్రాయబడిన వ్యాఖ్యానములయం దివ్వబడిన నుదాహరణములబట్టి యిది అరవభాషలో తొలిపుస్తకమై యుండజాలదు. ఏ భాషయందైనను కొంత వాఙ్మయము పెరిగినపిదపగాని లాక్షణిక గ్రంథములు వ్రాయబడవు. అందువలన లాక్షణిక గ్రంథములు వ్రాయకపూర్వమే అరవమునందు కొంత వాఙ్మయ ముండితీరవలయును. ఇట్టి వాఙ్మయ ముండియున్నట్లును వ్యాఖ్యానమునం దివ్వబడిన యుదాహరణములవలనను తెలిసికొనవచ్చును. కాని అట్టి గ్రంథము లెవ్వియు నిపుడు కనుబడుటలేదు. అరవపండితులు మాత్రము 'సంగ' వాఙ్మయ ముండెనని గట్టిగ చెప్పుచున్నారు. ఇట్టే 'సంగము' లున్నట్లును కూడ స్పష్టముగ తెలియుచున్నది.

సంగములు

18. ఈ సంగములు పండిత పరిషత్తులు. ఆ కాలమున వ్రాసినవని చెప్పబడెడు కొన్ని 'పాటలు, పదములు' నున్నవి. ఇవికొన్ని వీరుల పరాక్రమముల గూర్చియు, మరికొన్ని శృంగార రసమును గూర్చియు వ్రాయబడినవై యున్నవి. ఈ పాటలు, పద్యములు సంపుటి చేసి శృంగారమునుగూర్చి వ్రాయబడినవి. 'అహం' అనియు, పరాక్రమమునుగూర్చి వ్రాసినవి 'పురం' అనియు విభజింపబడినవి. ఇవన్నియు గ్రంథములుగ వ్రాయబడినవి. వీటినన్నిటిని పరిష్కరించి మహా మహోపాధ్యాయ వి. స్వామినాథయ్యరుగారు ప్రచురించిరి. అట్టి ప్రచురింపబడిన గ్రంథమున పత్తుపాటు పురాణనున్రను, సిలప్పదికార్యము, మణిమేఖలై, జీవక చింతామణి యను గ్రంథములలోని కొన్ని యుదహరింపబడినవి.

19. సంగమని పైనవ్రాయబడిన పదము 'సంఘ' మను సంస్కృతపదముయొక్క వికృతియైయున్నది. ఇది కవులందరునుండెడు సంఘము. పూర్వకాలమున రాజులయొక్కసభలలో నిట్టి సంఘము లుండెడివి. వారు వ్రాసిన కావ్యములే పరిష్కరింపబడి సంగమున నంగీకరింపబడెడివి. అటుపిమ్మట ప్రచారమునకు వచ్చెడివి. ఈ సంగములగూర్చి అరవగ్రంథములలో నీక్రిందివిధముగ వ్రాయబడి యుండెను.

'పాండ్యరాజులు' ఆదిమధ్యాంత సంగములని మూడు సంగములు స్థాపింపబడినవి. ఇందులో మొదటి సంగములో 546 గురు కవులుండిరి. వీరిలో మొదటివారు 'అగత్తియనార్'. త్రిపురసంహారుడైన ధూర్జటి శివుడు మురుగన్ లేక కుమారస్వామి, మురంజియురిముడి నాగరాయుడు, దిక్పాలకుడైన కుబేరుడు కూడ నీ పరిషత్తులోనివారే. వీరియెదుట 4449 కవులు తమకావ్యములను విమర్శనార్థమునకై సమర్పించియుండిరి. ఈ కావ్యములలో 'పరిపాడన్' 'మురునారై' 'ముదుకురుహు' 546 గురు కవులు 4447 సంవత్సరములు తమ వ్యవహారమును నిర్వహించిరి. 'కాయను నవళుది'యను రాజునుండి 'కడుంగాన్' అను రాజు వరకు యెనుబది తొమ్మండుగురు రాజులు రాజ్యమును పరిపాలించిరి. ఈ రాజులలో యేడుగురు రాజులు స్వయముగ కవులు. ఈ సంఘము మధురయను పట్టణమున నుండెడిది. ఈ మధురాపట్టణము తరువాత కాలమున సముద్రములో మునిగిపోయినది. ఈసంగమువారు అగత్తియన్ అనేవ్యాకరణమును ప్రమాణముగ గ్రహించిరి.

20. ఇదేవిధముగ రెండు మూడు సంగములను గురించియు వ్రాయబడెను. రెండవ సంగముకూడ సముద్రమున మునిగిపోయినది. 'కపార' పురమున 59 గురు పరిషద్సభ్యులతో 3700 ల సంవత్సరములు కార్యనిర్వహణము గావించి 3700 కవుల కావ్యముల పరిశీలించినది.

ఈకాలమున 59 గురు రాజులు రాజ్యమును పాలించిరి. "అగస్తియన్, తొల్కాప్పియం, మోసివెల్లార్ కపియన్, తిరియన్మోరన్, కిరాండె" యను కవులపేర్లు ఆ సంగమున పేర్కొనబడినవి. ఆ కాలమున అగస్తియన్, తొల్కాప్పియం, భూతపురం అను మూడు వ్యాకరణములు ప్రమాణ గ్రంథములు. అప్పటి 59 రాజులలో అయిదుగురు కవులు.

21. మూడవ సంగము 1850 సంవత్సరములు 49 గురు రాజుల పరిపాలనలో 49 సభ్యులతోకూడినదై 449 గురు కవుల కావ్యముల పరిష్కరించినది. అగస్త్యమునియు, నతని శిష్యులును ఈ సంగమునందు సభ్యులు. కనకయ్యను కుమారుడగు 'నక్కి' రను వారీ పరిషత్తునందు సభ్యులలో నొకరు. 'తిరువలామలా' రను గ్రంథమున 49 గురు కవులపేర్లు చెప్పబడినవి. ఈ నలుబది తొమ్మండుగురు కవులు సంస్కృత అక్షరములగు నలుబదితొమ్మిది అవతారములని 'హాలాస్య మాహాత్మ్య' మను గ్రంథము వ్రాయబడెను. 48 గురు అక్షరములు వాగ్దేవి యొక్క అవతారములును, నలుబది తొమ్మిదవ అక్షరమగు 'హ' శివుని అవతారమనియు చెప్పబడెను. ఈ నలుబది తొమ్మండుగురు కవులును గంగానదీతీరమున జన్మించి మధురాపురమునకు వచ్చియుండిరని చెప్పబడినది. ఈ పైన సంగములను గురించి వ్రాసిన విషయములన్నియు ప్రొఫెసరు శేషగిరిశాస్త్రిగారి తమిళవాఙ్మయ ఉపన్యాసముల (Essays on Tamil Literature) నుండి సంగ్రహింపబడినవి.

22. యాబదితొమ్మిదవరాజగు భూపచూడామని రాజ్యము చేయుకాలమున పెద్ద జలప్రళయము సంభవించెననియు, ఆ ప్రళయమున నీ సంగము నశించెననియు జెప్పుదురు. ఎట్లు సంగములు నశించెనో వివరములు సరిగ తెలియవుగాని మొత్తముమీద నీసంగములన్నియు నశించినవని అరవపండితులందరు నేకీభవించుచున్నారు. కాని యీ మూడవ సంగనాశనమునకై యొక ప్రత్యేక విశేషమును

కొందరు చెప్పుచున్నారు. 'కురల్' అను ప్రసిద్ధ గంథమును వ్రాసిన 'తిరువల్లువా' నను కవి 'పెరయా' యను నీచకులమునకు చెందినవాడనియు, అతనిని పరిషద్సభ్యులలో చేర్చుకొనుటవలన నీ మూడవ సంగమునాశనముచేయబడినదనియు కొందరు కొంతయీర్ష్యతో జెప్పుచున్నారు. ఈ విషయము కేవలము కల్పితమనియు, యిట్టి అభూత కల్పన కల్పించుటకు కారణము 'వల్లువాన్' అను పదమును తప్పు డర్థము చేసికొనుటవలన కల్గినదనియు వ్రాసియుండిరి. వల్లువానను పదము రాజ్యాధికారియు, మంచిపండితునకును 'పింగళాండె' యను గ్రంథమున మొదట నుపయోగింపబడెను. 'కంబ' రామాయణమున నీ వల్లువా నను వారు రాజ్యాధికారియే ననియు, రాజ్యసభయందు జరిగెడు వ్యవహారములను ప్రచురింపబడెడి యుద్యోగి యనియు వ్రాయబడినది. 'చూడామణి' నిఘంటువునం దీ 'వల్లువా' నను పదమునకు 'నిమిత్తగాన్' అను నర్థము చెప్పబడినది. నిమిత్తగా నను పదమునకు ముందు రానున్నవిషయముల జెప్పెడువాడని వాడుకలోనికివచ్చినది. ఇటీవల నీ వల్లువానను పదము సామాన్యముగ పెరయా కులస్థులలో సన్యాసిగా భిక్షాటనము జేయుచు ముందువచ్చెడి మంచి చెడుగులను వివరించెడువారని నిరూపించుచున్నారు. కనుక ప్రస్తుతకాలమున వల్లువానను పదము పెరయాకులమువారి కుపయోగించబడుచున్నంత మాత్రమునను 'తిరువల్లువా'నను పేరులో దాదాపు రెండువేలసంవత్సరముల పైకాలమున వల్లువానను పద మున్నందువలన తిరువల్లువాను పెరయాకులమునకు జెందినవారని చెప్పుటకాని, అందువలన సంగమంతను యీర్ష్యాభావముచేత నాశనముచేయబడెనని చెప్పుటకాని గొప్పపొరపాటు, అసమంజసము, కేవల మన్యాయము నైయున్నది.

23. ఈ పైనవ్రాయబడిన మూడుసంగములను గూర్చిన విషయములన్నియు నసంగతములుగను, అసహజములుగను ఉన్నవని తెలిసికొని అరవపండితులు మొదటి రెండుసంగములను గురించియు

వదలుకొని, ఇంతేగాక మొదటిరెండు సంగములలోనివని చెప్పబడెడు కావ్యము లెవ్వియు నిపుడు కనుపించుటయు లేదు.

24. ఇట్టివే యితరగాథలు కొన్నిగలవుగాని నవియు విశ్వాసపాత్రములైనవిన్ని కావు. ఏదియెట్లున్నను ఒక్కటిమాత్రము నిశ్చయమని కనుపించుచున్నది. పైనచెప్పిన మూడు సంగములున్నను, లేకున్నను ఒక సంగముమాత్ర మున్నట్లు కనుపించుచున్నది. రసంగమున కధ్యక్షుడు నక్కీరారనువారు. ఇప్పటికి నిలిచియున్న 'ఎత్తుతొగై' 'పత్తుప్పాటు' 'పదినేను కల్కణక్కు' అను పుస్తకము లీ సంగసభ్యులచే నంగీకరింపబడెననియు తెలియుచున్నది. ఈ సంగవిషయమును, అందలి సభ్యులపేర్లను 'తిరువళ్లువా'రను వారిచే రచింపబడిన నీతిబోధక గ్రంథమగు 'కురల్' అను గ్రంథమున కనుబడుచున్నది. ఈ పుస్తకములే సంగవాఙ్మయ గ్రంథములని చెప్పబడుచున్నవి. తొల్కప్పియం కూడ యీ సంగకాలమునదే యైయున్నది. ఈ తొల్కప్పియరు అగస్త్యుని పండ్రెండుగురి శిష్యులలో నొకరు. ఈతడు జామదగ్ని మహాముని వంశీయుడు, బ్రాహ్మణుడునై యున్నాడు. తెలుగు, మళయాళం, కన్నడ భాషలలో వ్రాయబడిన వ్యాకరణములు సంస్కృతభాషలో వ్రాయబడగా యీ తొల్కప్పియ మను వ్యాకరణ మరవములో వ్రాయబడి యున్నది. అయితే 'డాక్టరు కైను' గారు చెప్పినట్లే వ్యాకరణము నరవవ్యాకరణమని చెప్పుటకంటె అరవభాషలో వ్రాయబడిన వ్యాకరణమన్న బాగుండెడిది. ఏలనన యీ వ్యాకరణము అరవములో వ్రాయబడినను సంస్కృతభాషకు సంబంధించిన విషయములనే యీ వ్యాకరణమునందు వ్రాయబడెను. తొల్కప్పియం వ్యాకరణగ్రంథమే తరువాత కాలమున బయలుదేరిన లక్షణగ్రంథములకు మూలాధారము. ఈ లక్షణగ్రంథమున కనేక వ్యాఖ్యానములు వ్రాయబడినవి. 'నచ్చినార్కినియా' రనువారు వ్రాసినదే సమగ్రమైన వ్యాఖ్యానము. ఈతొల్కప్పియ మను గ్రంథ మెపుడు వ్రాయబడినదో చెప్పుటకు తగిన ఆధారము లేవియును లేవు. ఎన్నిసందర్భములను చూచి ఆలోచించినను

క్రీస్తుశక ప్రారంభమునకన్న వెనుక వ్రాయబడెనని చెప్పుటకు ఆధారములు లేవు. అరవదేశమున లభించిన మొదటి శాసనము ఆరవ శతాబ్దినాటిది. అంతకుపూర్వము శాసనములు కనుపించుటలేదు. ఈ సంగము కాలమునందున్నట్లుగా చెప్పె రాజులపేర్లు దేశచరిత్రలో కనుపించవు. సంగముకాలమును నిర్ణయించుటకై ఆధారములను వెదకి కాలనిర్ణయము చేయనెంచిన పండితుల కెట్టిఆధారములున్ను కనుపించలేదు. అరవపండితులుమాత్ర మీ సంగముకాలమును వీలయినంత పురాతన కాలమునకు త్రోయనెంచుదురు. అయితే యిది కేవలయూహాజనితమే యైయున్నది. మొత్తముమీద నీతొల్కప్పియ వ్యాకరణము క్రీస్తుశక ప్రారంభకాలముననో, అంతకు తరువాతనో రచింపబడియుండునని విమర్శకులు తలంచుచున్నారు.

25. ఈ మూడవ సంగముకాలమున వ్రాయబడినవను పుస్తకములయందు యవనవ్యాపారస్థులు, ఓడలు, వారిసైన్యము, యవనసారాయి, యవన దీపములు మొదలయిన విషయములగురించి వ్రాయబడియుండెను. ఈ యవనులు క్రీస్తుశక ప్రారంభమునవున్నవారు. టాలమి యను చాటసారి యిచటి చరిత్రనుగురించి వ్రాసియుండెను. వీటినన్నిటినిబట్టి క్రీస్తుశక ప్రారంభమున నీ సంగమును తొల్కప్పియ గ్రంథము నుండినట్లు మన మూహించవచ్చును.

26. ఈ సంగము విషయమై అరవవాఙ్మయమున మనకు ప్రథమమున 'ఇరయనా'రను వారిపేర శివుడే వ్రాసినట్లుగా చెప్పబడెడి కామసూత్రములను గూర్చి వ్రాయబడిన 'అహప్పొరుల్' లేక 'కళావియున్' అను గ్రంథము దాదాపు క్రీస్తుశకము తరువాత తొమ్మిదవ శతాబ్దమున వ్రాయబడియున్నది. అటుపిమ్మట పదియవ శతాబ్దమున దొరకిన 'సన్నానన్నార్' రాగిశాసనమునందు మహాభారతము అరవమున ననువదించినట్లును, యీ మధురసంగమును గూర్చియు పలుకరింపబడెను.

తొల్కాప్పియమను గ్రంథమున మూడుఅధికారములు గలవు. అందు మొదటి రెండధికారములయందు భాషావ్యాకరణముల గూర్చి తెలుపును. మూడవఅధికారమున వస్తురసాదుల ఛందో అలంకార విషయములును తెలుపబడినట్లు పండితులు జెప్పుచున్నారు.

అ క్ష ర ము లు

27. అరవభాషయందు తెలుగు, కన్నడ, మళయాళ భాషలయందువలె అక్షరములు దేవనాగరి అక్షరములను, అందును అశోకుని శాసనములయందు వ్రాయబడిన అక్షరములనే పోలియున్నవి. అయితే యిందలి అక్షరములు కొంత గుండ్రముగనుండును. ఈ గుండ్రతనము వ్రాసెడిపరికరములవలన గల్గినదని తోచుచున్నది. తాటాకు పత్రములపైన ఇనుపగంటములో వ్రాయుటవలన చిరుగకుండుటకై గుండ్రముగ వ్రాయవలసి యుండెను.

అ చ్చు లు

28. అరవభాషయందు మొత్తముమీద ముప్పది మూడు అక్షరములుగలవు. అందచ్చులు అ, ఆ, ఇ, ఈ,ఉ, ఊ ఎ, ఏ, ఒ, ఓ, ఐ, ఔ అనునవి. ఇందులో ఎ ఒ అనునవి సంస్కృతభాషయందు లేవు. సంస్కృతములోని ఋ ౠ అను నక్షరములు అరవమున లేవు. సంస్కృతము నందలి అనుస్వార అరవమునందు లేదు. అరవమున నీ యచ్చుల నన్నిటిని 'ఉయిల్ యెళుత్తు' అందురు. 'ఎళుత్తు' అనగా వర్ణములు ఎళుధాతువునుండి వచ్చినవి. 'ఎళు' అనగా లాగుటయని యర్థము. ఒకదానినుండి యింకొకటిలాగి వ్రాయబడునవి గనుక 'ఎళుత్తు' అని పిలువబడినవి.

29. అ, ఆ. ఈ రెండక్షరములు సంస్కృతమునందువలె, ఉచ్చరింపబడుచున్నవి. కాని కొన్నిసందర్భములలో ప్రథమాక్షరము 'అ', 'ఎ' వలె ఉచ్చరింపబడుచున్నది. 'బలం' అను పదము 'బెలం' గను, 'జపం' అను పదము 'సెబం' అను పదముగను ఉచ్చరింపబడుచున్నవి. 'అ' చివర నున్నప్పుడు అరవములో 'ఎయ్' గ నుచ్చరింపబడుచున్నది. 'తల' 'తలెయ్', 'వల' 'వలెయ్', 'మల' 'మలెయ్' అగుచున్నవి. అ, ఇ, ఉ అనునవి నిర్దేశార్థకములు. ఆ, ఏ, ఓ అనునవి ప్రశ్నార్థకములు. ఆ అను నక్షరము ఒక్కొకప్పుడు 'ఏయ్' అని ఉచ్చరింపబడును. 'ఆశా' యనునది 'ఆశేయ్' అనియు, 'చిత్రా' అనునది 'శితిరేయ్' యనియు ఉచ్చరింపబడును. అచ్చులలో యితర అక్షరములగురించి ప్రత్యేకముగ చెప్పవలసినదేమియు లేదు.

హ ల్లు లు

30. అరవములో హల్లులు పదునెనిమిది. క, జ, చఞ, ట, ణ, త, న, ప, మ, య, ర, ఱ, ల, వ, ళ, ఴ (Zha) యనునవి. వీటిని 'మెయిన్ యెళుత్తు' లందురు. ఇవిగాక యింకను మూడు అక్షరములు గలవు. అవి ∴ 'అయిదం' (ఆయుధం) ఇది విసర్గను పోలియున్నది. దీని ఉచ్చారణ కంఠ్యములవలె 'హ' గ నుచ్చరింపబడవలెను. మిగిలినవి రెండు అర్ధానుస్వారము పూర్ణానుస్వారమును పోలియున్నవి.

31. "క చ ట త ప"లు పరుషములు. 'జ ఞ ణ న మ' యనునవి సరళములు. య ర ల వ ఱ ళ యనునవి ఇళ్లైయెళుత్తు లనబడును. అనగా అంతస్థములు. గ జ డ ద బ లు సరళములు. ఇవి అరవ భాషయందు లేవు. అర్థము ననుసరించి క చ ట త ప లే సరళములుగ నుచ్చరింపబడును. ఒక్కొక్కప్పుడు 'హ' 'గ' వలె నుచ్చరింపబడును. 'మహ' 'మగ' గ నుచ్చరింపబడుచున్నది.

32. తాలవ్యములు:- చ ఞ అరవమునందు శ ష స అను నక్షరములు లేనందున సామాన్యముగ నాయక్షరము లన్నియు చ యను నక్షరము వలెనె పలుకుదురు. వ్రాయునపుడు చ యని వ్రాసినను, పలుకునపుడు శ యనియే పలుకుదురు : 'శివ'. మూర్ధన్య

ములు : ట ణ. అరవ భాషలో ట యను అక్షరముతో మాట ప్రారంభముచేయరు. ట యను పరుషాక్షరమును ప్రథమమున నుపయోగింపక దీనికి సహాయముగ ఇ అను నచ్చును చేర్చుకొందురు. అందువలన ట యొక్క ఉచ్చారణ సామాన్యముగ 'డ' వలె యుండును. మాట మధ్యలోకూడ 'న' తరువాత ట కలియదు. ట డ గ మారును. 'మంటప' యను సంస్కృతపదము అరవమున 'మండబ' గ మారును.

33. దంత్యములు:- త న సామాన్యముగ సంస్కృతము నందువలెనే యుచ్చరింప బడుచున్నవి.

34. ఓష్ఠ్యములు :- ప మ ప్రత్యేకముగ చెప్పతగినదిలేదు.

35. య ర ఱ ల ళ వ :- ర ల అను నక్షరములతో అరవమున మాట ప్రారంభింపబడదు. ర యను నక్షరము తనకు పూర్వము అ యను నచ్చునుగాని, ఇ యను నచ్చునుగాని సహాయము తీసికొనును. సంస్కృతమగు 'రాజ' అరవములో 'ఇరాశన్' అని గాని, 'ఇరాయన్' అని గాని, 'అరాశస్' 'అరాయన్' అని గాని మారుచున్నది. 'రక్తము' 'ఇరక్తం' లేక 'అరక్తం' అగుచున్నది. 'రేవతి' 'యిరోవతి' గ మారును. 'రవ' 'అరవ' గ మారుచున్నది. సంస్కృత 'లోకం' అను పదము 'ఉలగం' అగుచున్నది. 'ళ' 'ఱ' కూడ యిట్లే మారును. ఴ (Zha) ఱ్ఱ యను నక్షరము అరవములో మాత్రమే యున్నది. ఇతరభాషలలో లేదు. పూర్వ మీ యక్షరము తెలుగుభాషయం దుండెడిది. ఇప్పుడు 'ట్ఱ' ఉపయోగించబడుచున్నది. 'ళ' వేదభాషయం దుండెడిది.

36. ఴ (Zha) : ఈ అక్షరము అరవమునకు ప్రత్యేకము. ఇది సంస్కృతమునలేదు. తెనుగుభాషలోకూడ యిప్పుడు లేదు. పూర్వ ముండెడిది. ఈ అక్షరము యుద్ధమల్లుని శాసనమున కనుబడినది. దీని ఉచ్చారణ చిత్రముగ నున్నది. స్థలమునుబట్టియు, మాటలనుబట్టియు

మారుచుండును. దీనిని గురించి ముందు ఆంధ్రభాషను గురించిన ఉపన్యాసములో వ్రాయుదును.

37. శ, ష, స, క్ష యను నక్షరములు అరవభాషయందు లేవు. అయితే ఒకప్పుడు అరవమున 'క్ష' యను నక్షరము చిత్రముగ వ్రాయబడుచున్నది. 'లక్ష్మణన్' అను మాట 'ఇలక్కనన్' అని వ్రాయబడుచున్నది. 'క్ష', 'క్క' గ మారినది. 'విష్ణు' యను పదము 'విణ్ణు' యని వ్రాయబడుచున్నది. ఒకప్పుడు 'ష', 'డ' గ మారుచున్నది. 'మనుష' అను పదము 'మానిదన్' అని వ్రాయబడుచున్నది. 'ఆషాఢ' మాసము 'ఆడి' యగుచున్నది స యను నక్షరము 'ద' గా మారుచున్నది. 'మాసం' 'మాదం'అగుచున్నది. 'మనసు' 'మనదు'గ మారుచున్నది. ఒక్కొకప్పు డీ యక్షరము వదలివేయబడుచున్నది. 'సంధ్య' (సాయంకాలము) 'అంధి' యగుచున్నది. 'స్థానం' అను పదము 'తానం' అగుచున్నది. ఒక్కొక్కప్పుడు 'ఇ' అను అచ్చును సహాయముగ తీసికొనుచున్నది. 'స్త్రీ' యను పదము 'ఇస్త్రీ' గ మారుచున్నది. 'శ్రావణ' మను పదము అరవమున 'ఆవణి' యగుచున్నది. ఇదే మళయాళములో 'ఓనం' అగుచున్నది. సంస్కృత పదము 'శ్రీ' 'తిరు' యగుచున్నది.

38. అరవభాషయందు 'హ' యను నక్షరము లేనేలేదు. 'మహా' యను పదము 'మగ' గ నుచ్చరింపబడుచున్నది.

39. ఇట్లే 'శ' యను నక్షరముగల పదములకు సరియగు పదములు యీ క్రింద చూపును.

సం	అ	సం	అ	సం	అ
శరం	చరం	దేశ	తేచం	షష్టి	చట్టి
శిల	చిరేయి	శ్రీ	తిరు	భాష	పేచం, పెట్టెం.

40. ఈ భాషను మాట్లాడువారు పదమధ్యమున ద్విత్వము తప్ప ఆదియందు సంయుక్తాక్షరమును ఉచ్చారణయందు సహించని

వారై యుండిరని యూహింపవలసి యున్నది. ఆ కారణముచేతనే సంస్కృత శబ్దములోని సంయుక్తాక్షరముల విడగొట్టి తగిన యచ్చులతో గూర్చి రెండక్షరములుగ బల్కుచున్నారు. లేదా సంయుక్తాక్షరమును పూర్వాక్షర ద్విత్వము కలదానినిగ మార్చి పలుకుచున్నారు. 'భాగ్యం' 'పాక్కియం' అయినది. అట్లే 'శుక్లం' 'చక్కియం' అయినది. 'బ్రాహ్మణ' 'పిరమణ'గను, 'క్లేశ' 'కిలేశ'గను, కావ్యం 'కాప్పియన్'గను మారినవి.

అరవ వాంగ్మయము

41. అరవ వాంగ్మయమును గూర్చి వ్రాయుచు పండిత శ్రీనివాసాచారిగారు తమ 'టామిల్ స్టడీ' సను (Tamil Studies) గ్రంథమున ఆర్యులసంబంధము కలుగక పూర్వము అరవవారిలో చెప్పుకొనదగినంత వాంగ్మయమే లేదని వ్రాయుచు నిట్లు వ్రాసిరి:

"ఇందువలన అరవవాంగ్మయ మంతయు ఆర్యుల సాంప్రదాయములతో నింపివేయబడినట్లు స్పష్టపడుచున్నది. దక్షిణాదికి బ్రాహ్మణులు రాకపూర్వమే అరవలలో చెప్పదగినంత వాంగ్మయము లేదనియే చెప్పవచ్చును. యం. మావ్లకు (M. Mavelaque) పండితుడు స్పష్టముగ చెప్పినట్లు అరవ దేశమునందలి వ్రాయబడిన వాంగ్మయములో చిన్న గ్రంథముల నుండియు అన్నిగ్రంథములును ఆర్యులతో సంపర్కము కలిగినవిమ్మటివే అయియున్నవి."

42. అరవ వాంగ్మయమును గూర్చి వ్రాయుటలోగల కష్టములను గురించి శ్రీ కె. చంద్రశేఖర మనువారు 1953 వ సంవత్సరము జనవరి 17 వ తేదీన ప్రచురింపబడిన త్రివేణి పత్రికయం దిట్లు వ్రాసిరి :

"అరవ వాంగ్మయ చరిత్రనుగూర్చి సూక్ష్మముగా వ్రాయ యత్నించుట సులభమైన పనికాదు. ఇప్పటికి (1953) వరకు

అరవదేశము (Tamilnad అధికారపూర్వమైన వాంగ్మయ చరిత్ర వ్రాయబడి యుండలేదు. సోదరిభాషలైన కన్నడము, తెలుగు, మళయాళ భాషలయందు అధికారపూర్వకమైనట్టి వాంగ్మయ చరిత్రలు ప్రసిద్ధిజెందిన పండితులచే వ్రాయబడి యుండగా పాండిత్యప్రకర్ష కలదని చెప్పుకొనదగిన యొక్క భాషాపండితునిచేతనైనను అరవభాషావాంగ్మయము నందలి ప్రధాన ఘట్టముల చరిత్ర వ్రాయబడియుండలేదు. అయితే పత్రికాముఖమున అప్పుడప్పుడు విలేఖరులచే కొద్దిగా వ్రాయబడుచునే యున్నది. అసంపూర్తిగను, సామాన్యముగ జనాంగీ కృతమును పొందని కొన్ని కొన్ని వివరములును, కవులను గూర్చియు, రచయితలను గూర్చియు కొన్ని కొన్ని సందర్భములు వ్రాయబడుచునే యున్నవి."

సంగ వాంగ్మయము

43. అరవభాషలో ప్రథమ వాంగ్మయము క్రైస్తవయుగ ప్రారంభమున సంగమకాలమున వ్రాయబడినదై యున్నది. ఆ కాలమున రచింపబడినవన్న గ్రంథములలో ప్రసిద్ధిజెందినవి 'పత్తుప్పాటు' 'పురాణనున్రు' 'శిలప్పాధికారం' 'మణిమేఖల' యు నై యున్నవి. ఇందు శిలప్పాధికార గ్రంథము నాటకమునకు సంబంధించినది. ఈ గ్రంథకర్త 'ఇలాంగొఅడిగ'లనువారు. ఈ గ్రంథమున నాటకమునకును, కళకును సంబంధించిన విషయము లుండియున్నవి. కథావస్తువు బహుచక్కగ నున్నది. కవిత్వము మృదుమధురము, పాత్రపోషణ బహు సమర్థతతో చేయబడినది. మణిమేఖలై జనాకర్షణీయమైన గ్రంథము. ఈగ్రంథములు క్రీస్తుశకప్రారంభమున కరికాలచోడునికాలమున వ్రాయబడినవి. ఈ పైన వ్రాయబడిన రెండు గ్రంథములును బౌద్ధ, జైన మతావలంబకులైనవారిచే వ్రాయబడినట్లు కనుబడుచున్నవి.

దివ్యప్రబంధ రచనలు

44. అటుపిమ్మట దివ్యప్రబంధరచనలు ప్రారంభింపబడెను. ఈ సమయమున వైష్ణవభక్తులును, శైవభక్తులును తమతమ మత ప్రచారమునకై గ్రంథములను వ్రాసియుండిరి. ఈ కాలమున బౌద్ధ మతమును, జైనమతమును, అణగద్రొక్కుటకై ప్రచారము కావింప బడినది. ఈ కాలమున శైవమతమునుగూర్చి ప్రచారము గావించిన వారు 'తిరువనక్కరార్' 'తిరుజ్ఞానసంబంధరార్' 'మాణిక్యవాచ కార్'ను అయి యుండిరి. 'తిరుమలనఫిరాన్' 'తిరుమలనగై' 'విష్ణు చిత్తు' యనువారు వైష్ణవప్రచారకులు. ఈ కాలముననే ఆళ్వారులు 'నాళాయిరప్రబంధమును', శైవులు 'తేవారం' అను గ్రంథములను రచించిరి. ఈ ఆళ్వారులలో చాలమంది తమ కావ్యములయందు తిరుపతి దేవుడైన శ్రీ వేంకటేశ్వరస్వామినిగురించియు, అలివేలు మంగతాయారమ్మనుగూర్చియు వ్రాసియుండిరి. వారు వ్రాయుటలో శ్రీ వేంకటాచలపతియే ఆదిమూర్తియనియు, వేంకటాచలమే మోక్ష దాయకమనియు నీ యాళ్వారులు వచించియుండిరి. శ్రీ వేంకటాచల పతి 'అలివేలుమంగాపతి'యనియు, నీతడే శ్రీనివాసుండనియు వ్రాసి యుండిరి.

కావ్య యుగము

45. దీని తరువాతయుగము కావ్యయుగము. ఈ యుగ కాలమును నిర్ణయించుట కాధారములు మెండుగనున్నవి. ఈ యుగము పది మొదలు పదమూడవ శతాబ్దారంభమువరకు నుండెనని చెప్ప వచ్చును. ఈ యుగమునందే 'కంబ' ననువారు దేశమునందు ప్రసిద్ధి గాంచిన 'రామాయణ' గ్రంథమును వ్రాసియుండెను. ఈ రామాయణ మును వ్రాసిన కంబను ప్రతాపరుద్రునికి సమకాలికుడు. 'ఒత్తైకుప్ప'నను నింకొక కవియు 'రామాయణము' ననువదించెను. 'కాచియప్ప' యను వారు 'స్కాంధపురాణము' ననువదించిరి. 'పరంజ్యోతిముని' యనువారు

'హాలాస్య మాహాత్మ్య' మను గ్రంథమును రచించిరి. ఇది పద్య కావ్యమే. దండి అలంకారశాస్త్రమును, 'బుద్ధమిత్రు' డనువారు 'వీర సోలియం' అనుపేర పద్యకావ్యమును వ్రాసియుండిరి. ఈ కాలముననే కొన్ని చారిత్రిక ప్రబంధములున్ను వ్రాయబడినవి. 'జయకుందు' డను కవి 'కరుణాకర తొండమాను' యొక్క వీరచరిత్రను 'కళింఘట్టుపరణి' యనుపేర నొక చారిత్రిక ప్రబంధమును రచించెను. ఈ తొండమానుడు కులోత్తుంగచోడుని సేనానియై యుండెను.

46. అరవవాఙ్మయమునం దీయుగమే మిక్కిలిప్రఖ్యాతి గాంచిన యుగము. అనేకములైన వేదాంతగ్రంథములు, గొప్ప వ్యాఖ్యానములు, పురాణప్రబంధములు విరివిగా వ్రాయబడెను.

47. పదియవ శతాబ్దమున జైనమత సన్యాసియగు 'తిరు లక్కదేవ'రను వారిచే 'జీవకచింతామణి' యను నొక గ్రంథము రచింపబడెను. ఈ గ్రంథమునందు బహుచక్కని కవిత్వము కలదు. ఈ గ్రంథము చాలకాల మెవరికిని తెలియకనే యుండెను. అయితే యిటీవల డాక్టరు వి. స్వామినాథయ్యరుగారి పరిశోధనలవలన పందొమ్మిదవ శతాబ్దమున బయల్పడి ప్రచురింపబడినది.

48. ఈ యుగములోని కంబరామాయణమును గూర్చి కొద్దిగ ముచ్చటించ తగియున్నది. ఈ గ్రంథమును చదివినవారెల్లరును ఈ గ్రంథముయొక్క ప్రాశస్త్యమునుగూర్చి మిక్కిలి పొగడిరి. ఈ గ్రంథము మృదుమధురశైలిలో వ్రాయబడినది. ఈ గ్రంథ మిప్పటికి మన హిందూదేశముననేగాక పాశ్చాత్యదేశములయందును గొప్ప ప్రఖ్యాతిని పొందినది. సంస్కృతభాషాపదములున్ను, సంస్కృతియు నీ గ్రంథమున బహురమ్యముగ నుపయోగింపబడినవి. కవి తనకాలపు అభిప్రాయములను, సంస్కృతిని ఈ గ్రంథమున చక్కగా నుపయోగించి గ్రంథమునకు గొప్ప వన్నెను తెచ్చిపెట్టెను.

49. ఈ యుగముననే అనగా పదునాల్గవ శతాబ్దమున 'విల్లి పుత్తూరా'రను నింకొక కవి భారతమును రచించి మిక్కిలి ప్రఖ్యాతి వడసిరి. ఈ యుగముననే ప్రఖ్యాత వ్యాఖ్యాతలు కొన్ని గ్రంథములకు భాష్యములు వ్రాసిరి. అట్టి భాష్యగ్రంథములలో మిక్కిలి పేరెన్నిక గన్న వ్యాఖ్యాత 'నాచినార్క్కినాయ'రను భాష్యగ్రంథకర్త.

ఆధునిక యుగము

50. ఈ కాలమున వ్రాయబడిన గ్రంథము లనేకము లనేక విషయములగూర్చి వ్రాయబడినవి. మతము, రాజకీయములు, ఇతిహాసములు, కావ్యములు, భాష మొదలయిన అన్ని విషయముల గూర్చియు గ్రంథములు వ్రాయబడెను. ఈ కాలమున శైవమతములయందు సాహిత్యము చక్కగ వృద్ధిచేయబడినది. 'అతివీర పాండ్య' నను వారు 'నైషధకావ్య' మను 'లింగ' 'కూర్మపురాణము'లను రచించిన నాతని సోదరుడు 'కాశీఖండము'ను వ్రాసెను. వైష్ణవులు 'విల్లిపుత్తూ' రను వారు మహాభారత గ్రంథము ననువదించిరి. 'పిళ్లై పెరుమాళ్లయ్యంగారు' యెనిమిది ప్రబంధముల వ్రాసియుండిరి. ఈ కాలముననే 'ఉమారుపులవా' రను మహమ్మదీయకవి 'మహియుద్ధ నందనారు పిళ్లై' యను గ్రంథమును 'కాంస్టెంటైను బెషీ' యను (Constantine Beschi) ఇటాలియను దేశపు మతప్రచారకుడు అరవమున 'యేసుక్రీస్తు' శతకమును 1768 వ సంవత్సరమున వ్రాసియుండెను. ఈ ప్రచారకుడే 'తొన్నులు విలక్కం' అను వ్యాకరణ గ్రంథమును వ్రాసియుండెను. 'కృష్ణపిళ్లై' యను మతప్రచారకుడు 'బనియ'నను నింకొక ఇంగ్లీషు గ్రంథకర్త ఆంగ్లమున వ్రాసిన 'పిల్గ్రిమ్సు ప్రోగ్రె' సను గ్రంథమును (Piligrim's Progress by Bunyan) అరవభాషయం దనువదించిరి.

51. శైవగ్రంథములు వ్రాసినవారందరు హెచ్చుగ బ్రాహ్మణేతరులైయుండిరి. వైష్ణవమత గ్రంథములు వ్రాసినవారిలో హెచ్చుమంది

బ్రాహ్మణులైరి. వీరందరుకలసి బుద్ధ జైనమతముల నణగంటించిరి. అట్లు చేయుటలో బ్రాహ్మణులు హెచ్చు పలుకుబడి గలవారైరి. అందువలన బ్రాహ్మణ ప్రాబల్యమును తగ్గించుటకై అరవవారిలో బ్రాహ్మణేతరులయందు బ్రాహ్మణద్వేషము జనించెను. ఈ కాలముననే కొందరు యోగుల మనియు, సిద్ధుల మనియు బయలుదేరిరి వీరందరు బ్రాహ్మణద్వేషులే. వీరుమాంత్రికులు, తాంత్రికులునుకూడ నైయుండిరి. వీరు బ్రాహ్మణ ఆచారములను, మతమును, వేదములను దూషించ ప్రారంభించిరి. ఈ దూషణయే పద్యరూపమున ప్రారంభింపబడెను. వీరు కేవల నాస్తికులు కారు. ఆస్తికులే యై యున్నారు.

52. అరవ వాఙ్మయమునందు మహాభారతమునకున్న ప్రచారము రామాయణమునకు లేదు. శ్రీకృష్ణ బలరాములు అవతార పురుషులుగ నరవవా రంగీకరించిరి. అయితే రామ రావణులు చరిత్ర పురుషులనియే వారి అభిప్రాయము. అయితే వైష్ణవ ఆళ్వారులు మాత్రము రామ రావణుల నిద్దరిని దైవసంభూతులుగనే పూజించుచూ వచ్చిరి. రామ యనుపదము చీకటియను నర్థముగల 'ఇరుళ్' అను పదముననుండి యుత్పన్నమైనదనియు, రాక్షసులు వానరులు ఆర్యుల కన్న యెక్కువ నాగరికత, సంస్కృతి గలవారనియు, అరవవారు అసురులనియు, రాక్షసులు కేవల శివపూజనమాత్రమే చేయువారనియు, ఆర్యులు కేవలము ప్రకృతినే పూజించువారనియు వాదించుచుండిరి. ఇటీవల ఆర్యులందరు బ్రాహ్మణులనియు, నీ యార్యులను నిర్మూలించవలయుననియు కూడ వాదించుటకు ప్రారంభించిరి.

53. మహాభారతగ్రంథ మరవభాషలోనికి 'పెరుందేవర' యనువారు 6-వ శతాబ్దముననే అరవములోని కనువదించియుండ రామాయణగ్రంథ మరవభాషలోనికి 12-వ శతాబ్దమున 'కంబ'నను వారిచే అనువదింపబడెను (1185).

54. ఆర్యు లుత్తరదేశమునుండి, దక్షిణ హిందూస్థానమునకువచ్చుటయే రామాయణకథాప్రారంభమని అరవల అభిప్రాయమై

యున్నది. ఇది క్రీస్తుపూర్వము బహుశః పదునైదుశతాబ్దముల క్రింద జరిగియుండ వచ్చునని యెంచబడుచున్నది. రామాయణమందు జరిగిన కథాకాలమున పాండ్యరాజ్య ప్రశంస కనుబడదు. అప్పుడీదేశమంతయు నరణ్యముగ నుండెను. ఆ కాలమున నిచట రాక్షసులు, వానరులు, యక్షులు, యాతుధానులు, నాగులునై యుండిరి. పాండ్యదేశపు రాజు వద్దనుండియున్న మారవనాయకుని యక్షుడనిరి.

వానరులు నిజమైన కోతులు గారు. వారు పొట్టి నల్లటి కోతిరూపము కల్గిన నీగ్రిటో జాతివారై యుందురేమో. వీరు కంద (ఉల్లిపాయలు), మూల (ముల్లంగి), ఫలాదులు తినెడువారు. వారికి రాళ్లు, కర్రలు యుద్ధముచేయు ఆయుధములై యుండెను. వీరికిని, రాక్షసులకు నేలాటి సఖ్యతయు నుండినట్లు కనుపించదు. వీరిప్పటి మలాసరులు, వాలార్లు, కదిర్లు, సోలిగలు, యిరులు మొదలయిన అనాగరిక జాతివారి పూర్వీకులై యుందురు. ఇప్పటికిని వాలి సుగ్రీవు లను పేర్లుగలవారీజాతివారిలో నాయకులుగనున్నట్లు తెలియుచున్నది.

55. మనకు పాశ్చాత్యులతో పదునేడవ శతాబ్ద ప్రారంభ మునకే సంబంధము కలసినది. వారి సంబంధము కలసిన పిమ్మటనే మన ప్రాంతీయభాషలయందు మనకు కొంత అశ్రద్ధ కల్గినది. అట్లే అరవవారికిని తమ భాషయగు అరవము నలక్ష్యము చేయ ప్రారంభించిరి. అయితే అప్పటి పాశ్చాత్య మతప్రచారకులు అందులో జెసూటు ప్రచారకులునైన 'రాబర్టుడినోబిలి' 'బెస్చి' యను వారలు అరవభాషయందు హెచ్చుశ్రమపడిరి. వారికి మన దేశ నాగరికత, మనదేశవిషయములు తెలిసికొనుటకీ భాషలను నేర్చుకొను యవసరము కల్గెను. నోబిలి యను మతప్రచారకుడు మనదుస్తులను ధరించి మన దేశభాషయగు సంస్కృతమును, తానునివసించు దేశభాష యగు అరవమును బాగుగచదివి ఆ యా భాషలయందు మతగ్రంథము లను వ్రాసెను. బెస్చియనువారు క్రైస్తు చరిత్రమునేగాక అరవభాష యందొక 'చతురహరది' యను పేర నొక నిఘంటువును తయారు చేసెను. పందొమ్మిదవ శతాబ్దము ప్రారంభమునకే మనదేశమున ముద్రాక్షరశాల యొకటి నిర్మింపబడెను. అప్పటినుండియు అరవభాష యందు పుస్తకము లచ్చొత్తింప ప్రారంభించిరి. దీనివలన అరవవారిలో తిరిగి తమభాషను వికాసవంతముగ చేయవలెననెడి ఆశలు రేకొత్తెను. అయితే అప్పటికే పాశ్చాత్యసంపర్కము హెచ్చై అభిప్రాయముల యందు మార్పుకల్గెను. ఇంగ్లీషుభాషా వాఙ్మయమునం దభిరుచి హెచ్చు గాజొచ్చెను. అట్టిసమయమున అరవవారిలో మార్పుకలిగి ఒకవిధమైన గద్యకావ్యములను వ్రాయుట ప్రారంభించిరి. స్థలపురాణ ములు వ్రాయ ప్రారంభించిరి. ఇట్టి నూతన గద్యకావ్యముల వ్రాయునట్టి వారిలో దామోదరంపిళ్ళె, మీనాక్షిసుందరంపిళ్ళె, కనకసభాపతిపిళ్లె, వేదనాయగంపిళ్ళె, సుందరంపిళ్ళె మొదలయినవారు తమ రచనలను గద్యమున ప్రారంభించిరి. పైవారిలో దామోదరంపిళ్ళె జాఫ్నా పట్టణనివాసి. ఈతడు పట్టభద్రుడై అరవభాషయందలి యుద్గ్రంథముల నచ్చొత్తింప ప్రారంభించెను.

56. కనకసభాపతిపిళ్లెగారు తమిళభాషలయందు పరిశోధనలు చేయనారంభించెను. ఈతడున్ను జాఫ్నా నివాసియే. జాఫ్నాయందు తమిళభాష చాలహెచ్చుదశయం దుండెను. అచట శైవ మత ప్రాబల్యమున్ను హెచ్చుగ నుండెను. పందొమ్మిదవ శతాబ్దమునకే సభాపతిపిళ్లెగారి తండ్రి పట్టభద్రుడై చెన్నపట్టణమున నివసించు చుండెను. ఆయన మద్రాసు ప్రభుత్వమున నుద్యోగిగాజేరి, అరవ ఇంగ్లీషు నిఘంటువు నొకదానిని రచించిరి. వారి పుత్రుడగు కనక సభాపతిపిళ్లెగారు పట్టభద్రుడై కొంతకాల ముద్యోగముచేసి తిరిగి న్యాయశాస్త్రమును చదివి అందును పట్టభద్రుడై, న్యాయవాదిగనుండి తిరిగి యుద్యోగమునుస్వీకరించి చివరకు భాషాపరిశోధనయందు నిమగ్ను డాయెను. ఇట్టి పరిశోధనల ఫలితముగ 'తమిళులు పదునెనిమిదివందల సంవత్సరములకు పూర్వము' (Tamils Eighteen hundred years

౨౯౦) అను గ్రంథమును రచించి ప్రఖ్యాతిగనెను. ఈ గ్రంథము మిక్కిలి ప్రసిద్ధిగాంచెను. వీరి ప్రతిభ యీ గ్రంథమువలన బహిర్గత మాయెను. ఈ గ్రంథమువలన నితని కీర్తి ప్రఖ్యాతిగాంచెను. కాని వీరి అభిప్రాయములు మాత్రము పండితులచే నంగీకరింపబడలేదు. వీరు 1906 వ సం. యేబదిఒకటవ సంవత్సరమున కీర్తిశేషులైరి.

57. వేదనాయకంపిల్లె యనువా రింకొక ప్రతిభావంతుడైన కవి. వీరి నీతిబోధకమైన మతమునకు సంబంధించిన పద్యము లిప్పటికి వాడుకయందున్నవి. అరవభాషయందు వ్రాయబడిన ప్రథమ నవల 'ప్రతాపమదలియారు చరిత'మను పేర వీరిచే వ్రాయబడినది. ఈ నవల 1876 వ సంవత్సరమున ప్రచురింపబడినది. వీరు ప్రభుత్వమునందు జిల్లామునసబుగా నుండిరి. వీరి నవలారచనకు బెస్చిమతప్రచారకుడు వ్రాసిన 'పరమార్థ గురుకరై' ఇబ్రహింపారాధరు వ్రాసిన 'విక్రమాదిత్యుని'కథలు వీరికి ఆదర్శములుగ నుండెను.

58. సుందరంపిల్లెయనువా రింకొక గద్య రచయిత. వీరు వ్రాసిన 'మానోన్మనియం' అను గ్రంథము చెప్పదగిన నాటక గ్రంథము. ఈ గ్రంథమునందు కొన్ని స్వాతంత్ర్యమునకును, జాతీయతకును తోడ్పడిన పాటలు గలవు. 'రాజమయ్యరు'గారు వ్రాసిన 'కమలాంబాలు చరిత్ర' మున్ను, 'గోపాలకృష్ణభారతిగారు వ్రాసిన 'నందనారు' చరిత్రమున్ను యితర ముఖ్యమైన గ్రంథములు. ఈ రెంటియందును మంచి పాటలు వ్రాయబడియున్నవి.

59. ఇటీవల మరణానంతరము పేరు ప్రతిష్ఠలు హెచ్చుగా కొనియాడబడిన దేశాభిమానియగు సుబ్రహ్మణ్యభారతిగా రింకొక జాతీయకవి. ఈతడు ప్రఖ్యాతిగన్న రచయిత. ఈతడువ్రాసిన గ్రంథము లన్నియు దేశాభిమాన పూరితమైన రచనలు. వీరి రచనలు స్వాతంత్ర్యసంపాదనకై పాటుపడిన రోజులలో జాతీయభావము వీరులలో బాగుగా నాటబడినది. వీరి మరణాంతరమున ప్రజాస్వామ్య

ప్రభుత్వమువారు వీరి దేశాభిమాన పూరితములైన గ్రంథములను బాగుగా ప్రచారముగావించి వీరి పేరుప్రఖ్యాతులు దేశమునందంతటను వెదజల్లిరి. వీరు జీవించియున్నప్పటికంటె మరణించినపిమ్మటనే వీరి జాతీయతాపూరితమగు రచనలు మన్ననను పొందినవి.

60. ఈ సందర్భమును పూర్తి చేయక పూర్వమే ఎ. మాధవయ్య, నటేశశాస్త్రిగార్లను గురించి కొద్దిగ చెప్పవలసి యున్నది. వీరిద్దరును నవలారచనయందు ప్రఖ్యాతిని గడించిరి. వీరు బెంగాళీ దేశపు రచయితలగు బంకించంద్రచటర్జిగారున్ను, రవీంద్ర నాథ టాగూరుగారున్ను వ్రాసిన ప్రఖ్యాత నవలలను అరవభాషలోనికి అనువదించిరి.

5. "Tulu" "తులు"

61. ద్రవిడమున మిగతా వ్యవహరింపబడు భాషలలో 'తులు' యనునది యొక భాషగ పరిగణింపబడుచున్నది. అయితే ఈ భాషకు అక్షరములు లేవు. వాఙ్మయమున్ను యేమియు లేదు. మిగతా మొదటి నాల్గు భాషలతో పోల్చుట సరికాదనియే తోచుచున్నది. ఈ భాషలో వాఙ్మయ మేమియు లేకున్నను పరిపక్వమగుచున్న భాషలలో చెప్పదగిన భాషయే యని తోచుచున్నది. ఈ భాష కొన్నిజిల్లాలలో కొద్దిమందిచేత మాత్రమే మాట్లాడబడుచున్నది. ఈ భాషను మాట్లాడుజనులు మొత్తముమీద యేబది లక్షలకన్న నెక్కువమంది లేరు. ఈ భాష క్షీణదశయందున్నదని చెప్పుటకును వీలులేదు. బ్రిగెలుపండితుడు చెప్పినట్లు తులు భాషను మాట్లాడువారు చాల భయస్థులున్ను, నెమ్మదిగలవారునై యున్నారు. ఈ బ్రిగెలుపండితుడు తులుభాష కొకవ్యాకరణమును వ్రాసియుండెను. డాక్టరు యెల్లిసు పండితుడు తులుభాష మళయాళభాషకు సంబంధించిన భాషయని అభిప్రాయపడెను. కాని బ్రిగెలు పండితుడు చెప్పుటలో

మళయాళభాషకును. అరవభాషకున్నగల సంబంధముకన్న తులునకు మళయాళమునకుగల సంబంధము తక్కువయనిరి. కన్నడభాషకును తులుభాషకును హెచ్చుసంబంధమున్నట్లు కనుబడుచున్నది.

6. కొడగు లేక కూర్గు భాష

62. పడమటి కనుమలని చెప్పబడెడు పర్వతములలో కొన్ని భాగములనున్న నొక చిన్నజిల్లాయందలి జనులు మాత్ర మీ కొడగు భాషను మాట్లాడు చున్నారు. దీనినే 'కూర్గు' భాషయనియు పిలుచు చున్నారు. 'కూర్గు'నే 'కొడగు' యందురు. అట్లే 'కుడగు' యనికూడా చెప్పబడుచున్నది. 'కుడగు' యనుపదము 'కుడ' యను ధాతువునుండి వచ్చుచున్నది. 'కుడ' యనగా 'పడమర' యని యర్థము, ఇది యొక ప్రత్యేకభాషగ గణించుటకంటె 'తులు' భాషతో కూడుకొనిన కన్నడ భాషయని చెప్పుట సక్రమమేమోయని తోచుచున్నది.

7. తొడా

63. తొడా, మిగిలిన భాషలు దేశమునందు హెచ్చుగ పరిశ్రమ చేయబడనిభాషలు. 'తొడా' భాషనే 'తుడా' భాషయనియు చెప్పుదురు. ఈ 'తొడా' జాతివారు హెచ్చుగ నీలగిరిపర్వతములల్లో నివసించుచున్న గిరిజనులు. వీరిచట ప్రథమముననుండియు నున్నవారని తోచదు. వీరిసంఖ్యయు వేలసంఖ్యకు మించలేదు. ఇపుడు వీరిసంఖ్య క్షీణించుచున్నట్లు కనుబడుచున్నది. వేయిమందికి లోపుగ నున్నారు.

8. కోటా

64. కోటా భాషను మాట్లాడువారు కోట యను జాతి వారు. వీరున్న నీలగిరిపర్వతమున నివసించువారే. వీరిసంఖ్యయు కొద్ది

లోనేయున్నది. మొత్తమువిూద పంద్రెండువందలమంది మాత్రమే యున్నట్లు తెలియుచున్నది. వీరిభాష పురాతనభాషయే యై యున్నది. అయితే హెచ్చుగ కన్నడభాషకు సంబంధించిన భాషయైయున్నది.

9. గాండ్

65. మధ్యహిందూస్థానములోని కొన్ని కొండజాతులవారు మాట్లాడుభాష 'గాండ్' భాష. దీనినే పూర్వము గాండ్వానా భాష యని పిలిచెడివారు. ఈ భాషను మాట్లాడువారు దాదాపు పదిపదిహేను లక్షలమంది జనముండి యున్నారు. ఈ భాష కొంత తెనుగుభాషను, మరికొంత అరవమును, కన్నడమును అనుకరించుచున్నది.

10. ఖాండు

66. ఖాండ్లను జాతివారు మాట్లాడుభాష ఖాండు భాష. దీనినే 'కూ' భాషయని పిలుచుచున్నారు. ఒరిస్సా దేశ పరిసరప్రాంతముల వీరు నివసించుచున్నారు. వీరు తమను 'కూ' లనియే పిలుచుకొను చున్నారు. వీరికిని, 'గాండ్ల' కున్ను చాల సంబంధము లున్నట్లు తోచు చున్నది. 'ఖాండు' 'గాండు' అను పదములలోని 'కొండ' యను పద మున నుండి యుత్పన్నమైనట్లు తోచుచున్నది. కొందరు చెప్పుటలో అవర పదమయిన 'కుంద్రు' యను పదముననుండి యుత్పన్నమైనదనిరి. 'కుంద్రు' యన్నను 'కొండ' యనియే యర్థము. వీరి భాషలున్న 'అరవ' 'కన్నడ' 'తెనుగు' భాషాపదములతో మిళితములై నా భాషలనే యనుకరించుచున్నవి.

11. ఓరాన్ లేక ఓరువాన్ భాష

67. ఛోటానాగపూరు ప్రాంతములయందు కొన్ని జిల్లా లలో నివసించు ఆదిమనివాసులు ఓరాను జాతివారు. మాట్లాడుభాష 'ఓరాన్' లేక 'ఓరువాన్' భాష. రెవరెండ్ ఫాదర్ హాన్ అనువారు

వీరిభాషలో వ్యాకరణము నొకదానిని తయారు చేసియుండిరి. ఈ భాషను మాట్లాడువారి సంఖ్య దాదాపు యేడు యెనిమిది లక్షలు ఉండవచ్చును.

12. రాజమహాల్ లేక మాలారుభాష

68. 'మాలారు' లేక 'రాజమహాల్' భాష వంగదేశము నందలి రాజమహాలు ప్రాంతములలో నివసించు ఆదిమనివాసులైన వారు మాట్లాడు భాషయై యున్నది. ఈ భాష మాట్లాడువారిసంఖ్య దాదాపు అరువది వేలుండవచ్చును.

69. 'మాలారు' 'ఒరాను' భాషలు గాక మిగతా భాషలన్నియు ద్రావిడ భాషలేయని కాల్డ్వెలువా రంగీకరించిరి. కాని 'మాలారు' 'ఒరాను' భాషలను ద్రవిడభాషలలో జేర్చుటకు యితరు లంగీకరించలేదు. వీటియందును కొన్ని ద్రావిడభాషాపదము లున్నట్లే కనుబడుచున్నవి.

ఐదవ ఉపన్యాసము (A)

కన్నడభాష లేక కర్నాటభాష వాంగ్మయము

ఉపోద్ఘాతము

కదంబులు

మన భారతదేశమంతయు అరువదినాలుగు బ్రాహ్మణ కుటుంబములమధ్య విభజింపబడెననియు, అందు దక్షిణహిందూస్థానము ముప్పది యిద్దరు వంశీయులు అనుభవించు చుండిరనియు నొక సాంప్రదాయ ముండెడిది. ఇట్టివిభజన పరశురామునిచే చేయబడెనని కొందరును, కదంబ రాజ్యాధిపతియగు మయూరవర్మచే గావింపబడెనని మరికొందరును జెప్పుచున్నారు.

2. నాసిక, కన్యాకుమారి దేశముల మధ్యభాగమున నుండెడి దేశమును పరశురాముడు పరిపాలించి యుండెనని చెప్పుదురు. దీనినే కిరాట, విరాట, మరాట, హాయగ, తులువ, కొంకణ, కేరళ యను నేడు కొంకణములని పిలుచుచుండిరి. నవీన కనరదేశ మగు తుళువ, హాయగప్రాంతముల కదంబులు రాజ్యము జేయుచు లోనున్న కర్నాట రాజ్యభాగమునుకూడ వీరే కలుపుకొని రాజ్యము జేయుచుండిరి. కొంకణదేశములోని సహ్యాద్రి పర్వతపంక్తులలో నుండియున్న కదంబ వృక్షముక్రింద శివపార్వతుల కొక తనయుడు జనించినందున నిచటిజనులకు కదంబులని పేరు కలిగినట్లు చెప్పుదురు.

3. ఒకప్పుడు శివుని స్వేదబిందువు అచట నుండియున్న కదంబ పుష్పముపైన బడగా నా స్వేదబిందువువలన నొకరు జనించిరనియు, అందువలన నా బాలుని కదంబు డనిరనియు, నా బాలునికి

త్రినేత్రములుండి యున్నందున నాతనినే త్రినేత్రకదంబు డనిరనియు, నాతడు పెద్దవాడైనపిదప గజముచే పుష్పాలంకృతుడై తుళువదేశమునకు రాజ్యాధిపతిగ నేర్పరుపబడెననియు, నీతడు రాజ్యము జేసినందున నచటివారిని కదంబులని పిలిచిరనియు నింకొక సాంప్రదాయమున్న కలదు. ఈ కదంబులనువారు శాలివాహశక తొంబదియవ సంవత్సరమున అనగా 168 A. D సంవత్సరమున నొక శాసనమున పేర్కొనబడినట్లును కనుబడుచున్నది. అయితే అంతకుపూర్వమే టాలమీయనువారు దేశాటనము జేయుచు వనవాసియను గ్రామము నొకదానిని చెప్పినట్లు, ఆ వనవాసి మలబారు సముద్రతీర ప్రాంతమనియు తెలియుచున్నది. ఈ కదంబుల రాజులలో మూడవవారని కొందరును, ఆరవవారని మరికొందగను జయంతిపురమను పేర నొక పట్టణమును స్థాపించినట్లు శెప్పుదురు. ఈ జయంతిపురమే వనవాసి యను గ్రామమని కొందరును, కందనపురమని మరికొందరును శెప్పుచున్నారు. ఈ రాజే మయూరవర్మ యను నభిప్రాయము నందరు వెల్లడించి యుండిరి. ఈ మయూరవర్మ యను రాజ అహిక్షేత్రము లేక వల్లభీపురమను ప్రదేశమున నుండి బ్రాహ్మణులను రప్పించినట్లు శెప్పబడుచున్నది.

4. పురాణములయందు కదంబవంశమునకు జెందిన డెబ్బది నల్గురు రాజుల పేర్లను శెప్పుచు, వారీ తుళువదేశమును పరిపాలించినట్లును వ్రాయబడియున్నది. గోకర్ణ, వనవాసి, సావనూరు శాసనములయందు పండ్రెండు పదమూడవ శతాబ్దములయందు రాజ్యము జేసిన కదంబ రాజులపేర్లు కనబడుచున్నవి.

5. కవరభాష తెనుగు, అరవభాషలతో పోలికలయం దొకటిగనే కనబడుచున్నను విభక్తులయందుమాత్రము వేరుగ కనుపడుచున్నది. శ్రీరాముని దండకారణ్యప్రవేశమే ఆర్యుల సాంస్కృతిక ప్రారంభదశ అయి వుండవచ్చును. ఆ కాలమునందు దండకారణ్యమున ఆటవికులున్న, కొండజాతివారున్న నివసించియుండిరి. అగస్త్య మహర్షియే ప్రప్రథమమున దండకారణ్యమునందును పిమ్మట అరవ

దేశమునందును తన ఆశ్రమముల నేర్పరచుకొనియుండెను. అంతకు పూర్వమే పరశురాముడు అహిక్షేత్రముననుండి ఆర్యులతో సహా మలబారుదేశ సముద్రతీర ప్రాంతములకు ప్రవేశించియుండెను. నందుని తండ్రియగు ఉత్తుంగభూపనృపతి బ్రాహ్మణులను మహానదీతీరమునకు తీసికొనివచ్చెను. ధరణికోటరాజగు ముక్కంటిపల్లవు డీ బ్రాహ్మణులను మనదేశమునకు క్రీస్తుకుతరువాత మూడవశతాబ్దికే తీసికొనివచ్చెను. సుదక్షిణుడు వీరిని శ్రీకాకుళమునకు తీసికొనివచ్చెను.

6. పాండ్యరాజు, తాయమానునీల యనువారు అయోధ్య నుండి పాండ్య, చేరదేశములను స్థాపనచేసియుండిరి. అప్పుడే మయూరవర్మయు కొంకణదేశమునందలి వనవాసియందు వీరిని ప్రవేశపెట్టియుండెను.

7. ఈ పై వివరములన్నియు పాశ్చాత్యదేశపు చరిత్రకారుల యభిప్రాయములై యున్నట్లు కనుపించుచున్నది.

కన్నడ కర్నాట కానరీసు భాష

8. ద్రావిడభాషా విభాగమును గూర్చి వ్రాయుచు నీ కాలపు పరిశోధనా పండితులచే కన్నడభాషయు, నరవ తెలుగు భాషలవలెనే ద్రావిడభాషా జనితమైనదానినిగనే పరిగణింపబడినట్లు వ్రాసియుంటిని. ఆ విషయమై తిరిగి యిచట ప్రస్తావింపక కన్నడభాషయొక్క ప్రాచీనతను గురించియు, నా భాషయందలి సాహిత్యమును గురించియు మాత్రమే కొంతవరకు వ్రాయ ప్రయత్నింతును.

ప్రాచీనత

9. ఈ భాషయు, నాంధ్ర తమిళ భాషలవలెనే యిప్పటికి దాదాపు రెండువేల సంవత్సరముల పై కాలమున యుండి యున్నట్లు చరిత్రవలన తెలియుచున్నది. అయితే చరిత్రపరిశోధకులు యీ ఆంధ్ర తమిళ కన్నడ భాషలలో తమిళ భాషయే మిక్కిలి పురాతన

భాష యైనట్లును, తరువాత కొద్దిసంవత్సరములకు కన్నడభాష యుండి యున్నట్లున్ను, దానికి పిమ్మట కొద్దికాలమునకు ఆంధ్రభాష యుండి యున్నట్లున్ను శాస్త్రజ్ఞులు అభిప్రాయపడియున్నారు.

10. అయితే కొందరు కర్నాట భాషాపండితులు తమభాష వేదకాలమునకు పూర్వమే యుండి యుండెననియు, నొక విధముగ నార్యభాషలకన్న నీ భాషకు పూర్వచరిత్ర యున్నట్లును నిరూపింప ప్రయత్నించుచుండిరి. అట్టి యాచారములు చరిత్రలో కనుపించినచో నట్లంగీకరించుట కెవ్వరును వెనుదీయ నవసరములేదు. అందులకు సందేహింపరనియే నేను నమ్ముచున్నాను. కాని అట్టియాధారములు కేవల యూహాజనితములే యైనచో అట్టి వాదములు సర్వజనాంగీకృతములు కాజాలవు. ఇట్టి పండితులు కొందరు ఋగ్వేదమున పలుకరింపబడిన 'యదు', 'తురదస' యను జాతివారీ కన్నడులకు పూర్వీకులనియు జెప్పుదురుగాని అట్టి వాదనకు సహేతుకరమైన ఆధారము లెచటను కనుపించుటలేదు. మరికొందరు పండితులు పూర్వకాలమున నీ కన్నడుల పూర్వీకులు దేశద్రిమ్మరులుగ నుండు కాలమున 'అరేరు'లని పిలువబడి యుండెడివారనియు, నీ 'అరేరు' అను పదమున నుండియే 'ఆర్యులు' అను పదము జనించి యుండెననియు కూడ జెప్పుదురు. కాని యిట్టి యూహను సమర్థించుటకు యెట్టి ఆధారములను నిరూపించి యుండలేదు.

11. మరియొక భాషావేత్త కొన్ని స్మృతిగ్రంథముల యందు 'నాటకము' లనియు, 'కర్ణము' లనియు పదములు కనుబడుచున్నవనియు, నీ రెండు పదములను కలిపిన 'కర్ణాటక' మను పదము కలుగుచున్నదనియు, అందువలన స్మృతులకాలముననే కర్ణాటకులుండియుండిరనియు నూహించుచున్నారు. ఇది కేవల అసంబద్ధమైన యూహాజనితవాదముగ కనుబడుచున్నది. నా కీవిషయమును ప్రథమమున జదివినపుడు నా చిన్ననాటి వింతవిషయమొకటి జ్ఞాపకమునకు

వచ్చినది. మా పట్టణములోని న్యాయవాది చతురోక్తుల నాడుచు తన సోదర న్యాయవాది నింకొకరిని గూర్చి "అతనికేమి, అతడు పూర్తి మద్రాసుకును కలకత్తాలోని ప్రథమభాగమునకు నధికారి" యని నింగ్లీషుభాషలో ననుచుండెడివారు. అదేమిటా యని నెమ్మదిగా తెలిసికొనగా (Madras & Cal) కేవల పిచ్చివాడని గ్రహించవలసి వచ్చెను. అదేవిధముగ నీ యుత్పత్తియు చతురతతో గూడినదేగాని [illegible]ాధారము కలదిగాదని తోచుచున్నది.

12. మహేంజదారో త్రవ్వకముల యందు 'కన్న' చిహ్న[illegible]గల యొక ముద్ర (Seal) దొరకినదనియు, అందువలన [illegible] కాలమున 'కన్న' ముద్రగాగల యొకజాతి మనుష్యులుండి యుండవచ్చుననియు, వారి వీరులను 'కన్నవీరు' లని పిలుచుచుండెడి వారనియు ఆ పదమే కాలక్రమమున భ్రష్టమై కన్నరులు, కన్నడులు అయినదనియు కొందరి వాదము. ఇది కేవలము ఊహాగానమే కాన అంగీకరింపదగినది కాదు.

13. ఈ పైన వ్రాయబడిన వాదములన్నియు కేవలము యూహాజనితములుగనే యున్నవి. కాని వాటియందు నిశ్చితార్థముగ జెప్పదగినదెట్టియు కనుపించదు. ఈ వాదముల బలహీనతను వారే గమనించి, యిప్పటి స్థలనామములకున్ను కొన్ని పూర్ణచరిత్రల యందలి ప్రఖ్యాతివహించిన కథాంశములకున్ను సంబంధమును కలిగించి ఆ కాలముననే కన్నడదేశముండెననియు అప్పటివారి సంతతివారే యిప్పటి కన్నడిగలనియు నిరూపింప యత్నించుచున్నారు. ఇదియు సహేతుకరమైన పద్ధతియని చరిత్రకారు లంగీకరించజాలకున్నను నీ పద్ధతి కొంతమనశ్శాంతిని కలుగజేయగలదు. అట్టివాటిని కొన్నిటి నిచట యుదహరించెదను.

14. ఇప్పటి కన్నడదేశములోని 'నగరఖండము' పూర్వము భాగవతమునందు వ్రాయబడిన 'పాతాళ' ప్రదేశమనియు, అందువలన నప్పుడు చెప్పబడిన బలిచక్రవర్తికాలముననే యీ కన్నడదేశ ముండి

యుండెననియు నొక కథగా చెప్పుచున్నారు. అట్లే ఇప్పటి హంపీ నగరప్రాంతము సుగ్రీవుని రాజధానీనగరమనియు, చుట్టుప్రక్కలనున్న ప్రదేశమంతయు కిష్కింధమనియు చెప్పుచున్నారు. రామాయణ కాలమున చెప్పబడిన పంపానది యిప్పటికిని యుండియే యున్నది. పంపానదినిబట్టియే హంపీనగరమున కాపేరు వచ్చినదని లోకవిదితమే యై యున్నది. ఇప్పటి గోకర్ణ పర్వతమే యా కాలమునకే ప్ర... యున్నట్లు రామాయణమునందే వ్రాయబడి యున్నది. కంభ...ని నిర్బంధమునుండి దశరథుడు విడిపించిన స్థలము వైజయంతి; హనుమంతుడు రాజ్యముచేసిన ప్రదేశ మిప్పటి హొ...ణ మనియు, అదియే హనుమానావరమనియు, ఇప్పటి కన్నడదేశములోని చిట్టలుర్గ జిల్లాలోని జెట్టింగు రామేశ్వరమే పూర్వపు రావణునిచే జటాయువుని చంపిన స్థలమనియు, దిబ్బయని పిలువబడెడు ప్రదేశము వాలి దిబ్బయనియు, పంపానది సీతాదేవి చెరువనియు, నాసిక జన స్థానమనియు, హోనగల్లుజిల్లాలోని కాంతిదిబ్బ యను ప్రదేశము దశరథపురము, కర్నాటదేశభాగములనియు గుర్తించిరి. హోనగల్లునే మత్స్యపురముగా నిర్ణయించిరి. ఈ హోనగల్లును పండ్రెండవశతాబ్దినాటి శాసనమునందు విరాటకటి యని పిలువబడినట్లు వ్రాయబడియున్నది. మహాభారతమునందు వ్రాయబడిన కర్ణవీరపురము యిప్పటికొల్హాపుర ముగ గుర్తించిరి. భాగవతమున బలరాముడు పంపా, భాగీరథీ, కావేరి నదులయందు స్నానము చేసినట్లును, శ్రీశైల గోకర్ణ పర్వతముల సందర్శించినట్లును వ్రాయబడి యున్నది.

15. ఈ పైన చెప్పబడిన రెండు విధముల అంశములును కేవలయూహాజనితములే గాని చరిత్రాత్మకవిషయములు కావు. ఈ విషయములగూర్చి జనులు కథలుగా జెప్పుకొనుట కనుకరించునవేగాని చరిత్రయందు ధైర్యముగ నిదమిత్థమని నిర్ధారణ చేయుటకు తగిన యాధారములు లేవు. అట్టి యాధారములు యికముందైనను దొరక గలవని యాశయు కనుపించుటలేదు.

16. కన్నడభాషను గురించిగాని, కన్నడదేశమును గురించి గాని, కన్నడదేశస్థులను గురించిగాని మన కిప్పటికి తెలియవచ్చిన చరిత్ర విషయములు శాసనములవలన, చరిత్రవలన క్రీస్తుశక ప్రారంభ మున నుండి మాత్రము తెలియుచున్నవి. వాటినిగురించి వ్రాయుటకు కొంత ప్రయత్నించెదను.

కొన్ని నాణెములు

17. చరిత్రలో పరిశోధనలు జరుపగా యిప్పటి కన్నడ రాజ్యములోని చిట్టల్దుర్గనందు పురాతనకాలమునకు సంబంధించిన కంచు నాణె మొకటి చైనాదేశపు రాజగు 'హన్సుయతి' యను వారిపేరు గల్గిన వెండినాణె మొకటియు, 'అగస్టసు' సార్వభౌముని ప్రతిమగల యింకొక నాణెమున్ను కన్నడ దేశమునందలి కొన్ని ప్రదేశముల యందు దొరకినవి. ఈ నాణెములనుబట్టి క్రీస్తుశక ప్రారంభమునకే కన్నడదేశమునకున్ను, చైనా గ్రీకుదేశములకున్ను వ్యాపారసంబంధము లున్నట్లు తెలియుచున్నది.

18. దీక్షితుడను నొకచరిత్రకారుడు గావించిన పరిశోధనల వలన మౌర్యకాలపునాటి కన్నడిగలచరిత్ర కొంత తెలియుచున్నది. కన్నడదేశమునందలి కొంతభాగము మౌర్యులకాలమున వారియాధీన మునను న్నట్లు కనుబడుచున్నది. అశోకుని కాలపునాటి మహిషా మండలమే యిప్పటి మహిసూరుగా పరిగణింపబడుచున్నది. అయితే ప్రొఫెసర్ ఫ్లీట్‌ను (Prof Fleet) అను నింకొక పండితుడు మహిషా మండలి వింధ్యపర్వతములకు దక్షిణముగ నర్మదానదీతీరముననున్న మాంధాత ప్రదేశమై యుండవచ్చునని యభిప్రాయపడిరి.

కొన్ని శాసనములు

19. క్రీస్తుశకము 125 A. D. కాలమున రాజ్యముచేసిన శాతవాహన పులిమాయి యను రాజుయొక్క కాలమున 'అదవని' తాలూకాలోని 'మాండవ' యను గ్రామమున దొరకిన శాసనమునుబట్టి అప్పుడా దేశము 'శాతవాహన సీరద'యని పిలువబడినట్లును, మౌర్యుల తదనంతరము శాతవాహనులు రాజ్యముచేసినట్లును తెలియవచ్చుచున్నది.

20. చంద్రగుప్తమౌర్యుడు కర్నాటదేశములోని శ్రావణ బెల్లహోలాయను గ్రామమును 'భద్రబాహుని' తో సహా సందర్శించినట్లు రెండవ శతాబ్దములో దొరకిన యొక శాసనమున వ్రాయబడియున్నది. అయితే శ్రీరంగపట్టణమున దొరకిన యింకొక మూడవ శతాబ్దపు శాసనమున "భద్రబాహు చంద్రగుప్త మునిపతి భరణ ముద్రాంకిత" యని యుండియున్నది. దీనినిబట్టి కాలనిర్ధారణమునందు కొంతభేదము కనుబడుచున్నది.

21. ప్రథమమున కదంబులే కర్నాటదేశమున నొక స్వాతంత్ర్యరాజ్యమును స్థాపించిరనియు, వారిలో మయూరవర్మయను వారు ప్రథమ చక్రవర్తియనియు రెండు మూడు శాసనములవలన తెలియుచున్నది. ఈ విషయము చందవోలువద్ద దొరకిన 248 A. D. శాసనమువలనను, అదేకాలపునాటి తల్లమండ శాసనమువలనను వ్యక్తమగుచున్నది.

22. అయితే ఈ శాసనము లెవ్వియును కన్నడలిపియందు వ్రాయబడినవి కావు. ఇప్పటికి కనుగొనబడినంతవరకు ప్రథమమున కన్నడలిపిలో వ్రాయబడిన శాసనము బేలూరు చిక్మగులూరు గ్రామములమధ్య నున్న హాలిమిడిగ్రామములోనిదై యున్నది. ఇది 450 A. D. నాటి శాసనమై యున్నది. ఇందును హెచ్చుపదములు

సంస్కృతపదములై వాటిలో కొన్ని కన్నడపదములు మిళితములై యున్నవి.

23. రెండవశతాబ్దమున వనవాసియను గ్రామమున వ్రాయబడిన యింకొక శాసనమున 'చాటుకుల నందశాతకర్ణి' యనువారు నాగ ప్రతిష్ఠ గావించినట్లున్నది. ఈ శాసనమునందు 'కర్నాట అరసమనే తంగళి' యను మాటలుగలవు. అయితే యీ వనవాసియను గ్రామము ఆర్యదేశమున నున్నట్లు 'టాలమి' (Ptolemy) యను శాస్త్రజ్ఞుడు వ్రాసి యుండెను.

24. మరియు వాంగ్మయమునందు శూద్రకుడు వ్రాసిన మృచ్ఛకటికయందు 'కర్నాట కలహ' మను మాటలున్ను కనుపించుచున్నవి.

25. ఈ విషయమునుగూర్చి ముగించక పూర్వము రెవరెండు జె. యం. ఆంథాసనువారు (Rev. J. M. Anthos) The origin and the glorious past of the Andhras అను గ్రంథములో 82-83 పేజీలలో యీ క్రిందివిధముగా "కానరీసు భాష ఆంధ్రభాషా సంపర్కము కలదా" యను శీర్షిక క్రింద వ్రాసియుండిరి.

26. మాంష్యురు విల్లియం సను పండితుడు (Monseiur Williams) సూచించినట్లు ఆర్యులకువలెనే యీ ఆంధ్ర ద్రావిడులు మధ్యఆసియా దేశములోని ఆక్ససు జక్సార్టెసునదుల (Oxus and Jexartes) మధ్యప్రదేశముననుండి అచటినుండి కొంతకాలము క్రింద ప్రథమముననే హిందూదేశములోనికి తోసుకొనివచ్చి కొంతకాలము ఇండసునదీప్రాంతమున నివసించి ప్రప్రథమమున నా ప్రదేశమును వదలి దక్షిణహిందూదేశమున తమ తమ స్థానముల చేరుకొని యుండవచ్చును.

27. ప్రప్రథమమున నీ కన్నడిగులపేర నొక రాజ్యము లేనందునను, ఉత్తరహిందూదేశములో నివసించుచున్న రాజ్యముల

యందు గాని జనసామాన్యమునందు వీరి పేరు మెచటను పలుకరింప నందునను క్రీ. పూ. 1-వ శతాబ్దముననే ఆంధ్ర వంశీయులగు కుషానులు రాజ్యముచేయుకాలమున పడమటికనుమ ప్రాంతములయం దుండిన గోదావరీనదీ పరిసరములయందున్న నాసిక యను పట్టణము ఆంధ్రరాజ్యములో కలసియుండియుండవలెనని చరిత్రవలన మన మూహించవలసి యున్నది. మగధరాజ్యముతో కూడిన ఉత్తరదేశ రాజ్యాధిపతియగు కణ్వప్రభువు ఆంధ్రరాజులచే చంపబడి ఆ రాజ్యము నంతను తమరాజ్యములో కలుపుకొని యుండిరి. అలెక్సాండరు ప్రభువు తనసైన్యమునందలి విభేదములవలన చేయజాలని పనిని ఆంధ్రు లాకాలమున జేసియుండిరి.

కన్నడ వాంగ్మయము

28. ఇంతవరకు కన్నడభాష ప్రాచీనతనుగురించి కొన్ని ఊహాజనిత సిద్ధాంతములను కన్నడదేశమునదొరకిన కొన్నినాణెము లను గురించియు, మరికొన్ని శాసనములను గురించియు వ్రాసియుంటిని. అయితే ప్రాచీనకాల శాసనములన్నియు కన్నడేతరభాషయందే యుండి యున్నందున ఆకాలమునకన్నడభాషగాని, కన్నడలిపిగాని యెట్లుండెనో తెలిసికొనుటకు యెట్టిమార్గమున్న కనుబడియుండలేదు. ఆ కాలమున కన్నడభాష యుండెనా లేదా యన్న సంశయమున్న కలుగుచున్నది. కాని కన్నడులే యుండియున్నచో వారు మాట్లాడెడిభాష కన్నడమె యైయుండవలెననెడిమాట స్పష్టమే. కాని అప్పటిభాష యెట్లుండెడిదో మాత్రము మన మిపుడు తెలిసికొనుటకు వీలు కనుపించుటలేదు.

29. అయితే కన్నడదేశములోని కొందరు జైనకవులు తాము వ్రాసిన కావ్యములలో ప్రారంభపద్యములయందు 'సామంత భద్రుడు' 'కవి పరమేష్ఠి' 'పూజ్యపాదు'లను గూర్చి కొన్ని ప్రశంసలను గావించిరి. సామంతభద్రు డను కవి 'మనుకాకహళ్లి' యను గ్రామమున 138 A. D. లో నున్నట్లు కనుపించుచున్నది. ఈతడు వ్రాసిన

గ్రంథములున్న, సంస్కృత ప్రాకృత భాషలయందున్న వ్రాయబడినట్లు కనుబడుచున్నది. అంతేకాని కన్నడభాషలో వ్రాసినట్లు కనుబడదు. కవి పరమేష్ఠి యెవరో వివరించి చెప్పుటకున్న వీలు కలుగుటలేదు. 10-వ శతాబ్దమున వ్రాయబడిన 'కవి రాజమార్గ' మను గ్రంథమున 'కవి సార్వభౌము'డను యొకకవిపేరు వ్రాయబడి యున్నది. ఆతడున్న, కవిపరమేష్ఠియు నొకరేనని చెప్పుటకున్న వీలుకలుగుటలేదు.

30. కవిరాజ మార్గమునందు కొందరు గద్యకవులగు 'నాగార్జునుడు' 'జయబంధుడు' 'దుర్వినీతు'డనువారల పేర్లు కనుపించు చున్నవి. ఈ 'దుర్వినీతు' డను కవి కన్నడదేశము నేలిన గాంగేయ వంశపువాడై యుండవచ్చునని జెప్పుదురు. ఇది నిజమేయైనచో నీతడు 472-512 A. D. సంవత్సరములమధ్య రాజ్యము జేసియున్నందున 6-వ శతాబ్ద ప్రారంభముననే కన్నడభాషలో వాంగ్మయ మున్నట్లు స్పష్టపడుచున్నది. ఇదేవిధముగ యింకొక పద్యముననుండి మరి కొన్ని గద్యరచనలు, పద్యకావ్యములు, కావ్యవిధానములు, అలంకార శాస్త్రములు, వ్యాకరణశాస్త్రములు నుండి యున్నట్లు తెలియగలదు. రామాయణమను పద్యకావ్యమున నిట్లే మరికొన్ని విషయములున్న తెలియుచున్నవి.

31. ఇటీవల 'వడ్డెరాదనె' యను నొక గ్రంథము ప్రచు రింపబడినది. ఈ గ్రంథమునందు కొందరు జైనులచరిత్రలు వ్రాయబడి యున్నది. ఈ గ్రంథము ప్రాకృతభాషలో వ్రాయబడినది యేడవశతాబ్ద ములోనని తెలియవచ్చుచున్నది. ఇది వ్రాసినవారు 'శివకోటాచార్య' డనియు తోచుచున్నది. కాని యీ పేరుగల కవి కన్నడవాంగ్మయ ములో కనబడదు కాన యీ వచనకావ్యము హాలకన్నడ భాషలో వ్రాయబడినట్లు కనబడుచున్నది.

32. దేవచంద్రుడను నింకొకకవి కన్నడమున 'చూడామణి' యను నింకొక గద్యకావ్యమును 650 A. D. కి వ్రాసినట్లు కనుపించు

చున్నది. ఈ గ్రంథమున్ను 'వడ్డెరాదని' తరువాతనే వ్రాయబడి యుండవలయును.

33. అదేకాలపునాటి యింకొక కవి 'తుంబలాచార్యు'డను వారి పేరున్ను కనుపించుచున్నది. ఈతడు 'చూడామణి' యను పద్య కావ్యమును వ్రాసినట్లు చెప్పుదురు. అయితే పైన వ్రాసిన 'శివకోటాచార్యుడు'ను, వీరున్ను యొకరేనని తోచుచున్నది. ఈతనినే శ్రీ 'వరదాచారి' యనియు పిలిచెడివారు. ఈ చూడామణియను గ్రంథము 'తత్వార్థమహాశాస్త్ర' మను గ్రంథమునకు భాష్యగ్రంథమైయున్నది. ఇందు 96000 పద్యము లున్నవి. దీనినే 1604 వ సంవత్సరముననుండిన భట్టు అకలంకుడనువారు యింకొక మణిగ్రంథమును వ్రాయుచు కర్నాటభాషలోని గ్రంథము గొప్పయుద్గ్రంథమనియు వ్రాసియుండిరి.

34. చారిత్రకముగా కదంబులు కర్ణాటదేశ పశ్చిమభాగమున ప్రథమమున మయూరవర్మ రాజుగ రాజ్యముచేసినట్లు చెప్పబడినను, పల్లవులు తెలుగు కన్నడదేశములను అయిదవ శతాబ్దికి కలిపి రాజ్యముచేసినట్లు స్పష్టమగుచున్నది. ఆ కాలమున అరవదేశమునందలి ఉత్తరభాగమైన తొండమండలము, అందుకు పడమరగనున్న ప్రదేశమును, ఉత్తరముననున్న తెలుగు కన్నడ దేశములున్ను పల్లవుల పరిపాలనక్రింద కలసివుండినట్లుగ కనబడుచున్నది. ఆ కాలమున పల్లవుల శాసనములన్నియు ప్రాకృత సంస్కృత భాషలయం దుండెడివి. ఆ కాలమున తెలుగుగాని, కన్నడముగాని యెట్లుండెడిదో తెలిసికొనుట కష్టసాధ్యమైయున్నది. అయితే మనకు బయల్పడినంతవరకు అక్కడక్కడ తెలుగున కొన్నిపద్యములున్ను, కన్నడమున కొన్నిగద్యపద్యములున్ను యున్నట్లు కనుబడుచునే యున్నవి. కాని ఆ కాలమునకు యీ రెండు భాషలున్ను బాల్యదశయందే యున్నవనుట స్పష్టము. కాని స్పష్టముగా తెలుగుప్రాచీనమా? లేక కన్నడముప్రాచీనమా? యని చెప్పజాలకున్నను కన్నడమే ముదటిదని యూహింపనగును. అయితే, తెలుగునకు, కన్న

డమునకు లిపియందు, భాషయందు, సంస్కృతియందు, ఆచారవ్యవహారములందు, సాంప్రదాయములయందు హెచ్చు సాదృశ్యము లున్నవనుటలో సందేహమేమిన్ని లేదు. ప్రప్రథమమున వ్రాయబడిన 'కవిరాజమార్గ'మను గ్రంథమున కర్నాటదేశమునకు దక్షిణముననున్న కావేరి నుండి యుత్తరముననున్న గోదావరినదివరకు నుండు దేశమంతయు ఒకేప్రభుత్వముక్రింద నుండినట్లును, దానినే కర్నాటదేశమని పిలచినట్లును కనుబడుచున్నది. 'కావేరియింద గోదావరి' యని వ్రాయబడి యుండెను. దీనినిబట్టి తెలుగుదేశమేకాక కొంత అరవదేశము, కొంత మరాటదేశమున్ను కర్నాటదేశముగనే వాడబడుచుండెడిది. పులిగిరి యను పట్టణమును చుట్టియున్న ప్రదేశమంతయు అచ్చ కన్నడదేశమై యున్నది.

35. కవిరాజమార్గమను గ్రంథము లక్షణ గ్రంథము. సంస్కృతపండితుడైన దండిమహాశయునిచే వ్రాయబడిన కావ్యాదర్శమను గ్రంథము ననుకరించి వ్రాయబడిన లక్షణగ్రంథమై యున్నది. ఈ గ్రంథము నృపతుంగునిచే వ్రాయబడినది. ఈతనిని అమోఘవర్మ యనియు పిలిచెడివారు. ఈతడు రాష్ట్రకూటరాజు. తొమ్మిదవ శతాబ్దములో 844-77 సంవత్సరముల మధ్య రాజ్యము చేసియుండెను. అప్పటికే కావేరి గోదావరి నదులమధ్యనుండు రాజ్యము విభజింపబడి వేరు వేరు రాజుల యాధీనమునందున్నట్లును కనుబడుచున్నది. గోదావరి నానుకొని, కృష్ణానదిని దాటి, కొంతవరకుండియున్న ప్రదేశమంతయు చాళుక్యరాజులక్రిందను, కావేరి నానుకొని కాంచీపురమువరకు నుండు దక్షిణదేశమంతయు పాండ్య చోళరాజుల ప్రభుత్వముక్రిందనుండగా మిగిలిన మధ్యప్రదేశమంతయు నృపతుంగునియొక్క స్వతంత్ర ప్రభుత్వముక్రింద నుండెననియు తోచుచున్నది. ఉత్తరదేశమున కప్పటికి వేంగి రాజధానియై యుండెను. ఈ కవిరాజమార్గమను గ్రంథము నృపతుంగ రాజు వ్రాయలేదనియు, విజయుడనువారు వ్రాసి యుండెననియు వాదమింకొకటి కలదు. అది యెట్లున్నను ఈ కవిరాజమార్గమను గ్రంథ

మిప్పుడు లేదు. అయితే ఆ గ్రంథమునందు వ్రాయబడినవని చెప్పే గద్య పద్యరచనలు వాటిరచయితలపేర్లు చెప్పబడియున్నది. ఈ నృపతుంగరాజు రాజ్యముచేయు కాలమునకు ఆంగ్లదేశమున 'ఆల్ర్ఫెడు ది గ్రేటు' అను రాజు రాజ్యము చేయుచుండెను.

36. మనదేశమునం దాకాలమున మతప్రాబల్యము హెచ్చుగ నుండెను. చాళుక్యరాజ్యమున జైనమత ప్రభావము చాలవరకు క్షీణించి యుండెను. వైదికమత ప్రభావమే హెచ్చుగనుండెను. అప్పుడప్పుడే వీర శైవమతమున్ను ప్రారంభించెను. అంతేకాక ఆ కాలముననే భాష యందును చాల మార్పులు కలుగుచుండెను. చాళుక్యరాజులు దేశ భాషను ప్రోత్సహించుచుండిరి. పండితులందరును సంస్కృతభాషను బాగుగ నేర్చుకొనియుండిరి. అట్లయ్యును కేవల ఆంధ్రభాషయగు ప్రాకృతమును ప్రోత్సహించుట మానివైచిరి. అయితే దేశభాషయందు పెద్దగ్రంథములు యెవ్వరున్ను వ్రాసినట్లు కనుబడకున్నను శాసనముల యందు మాత్ర మచట నచట దేశభాషలో పద్యములు, కవనము వ్రాయుచున్నట్లు పదియవ శతాబ్దికే కనబడుచున్నది. అయినను కవులలో ననేకులు జైనమతావలంబను లైనట్లును కనబడుచున్నది. ఇట్టికవులకు రాజపోషణగాని, సామాన్యజన ప్రోత్సాహముగాని లేనట్లు స్పష్టపడుచున్నది. బాగుగ చదువుకున్న జైనమతావలంబులగు కవులకు పోషణ ప్రోత్సాహములు నీరసించినందున కొందరు ముఖ్యకవు లాంధ్ర దేశమునందలి వేగిరాజ్యమున నుండి జైనమతావలంబకులున్న- జైనమతమునకు పోషణ ప్రోత్సాహములనిచ్చెడు కన్నడదేశమున కిట్టి కవులు వలసపోవ ప్రారంభించిరి. ఇట్లే ఆ కన్నడదేశమునందలి హిందూ మతాభిప్రాయులైన కొందరు వైదికపండితులున్న, కవులున్న కూడ మనదేశమునకు ఆ కాలమున వచ్చినను వచ్చి యుండవచ్చును. ఇట్లు పదియవశతాబ్దమున కన్నడదేశమునకు ఆంధ్రదేశముననుండి వలసగా వెళ్లినవారిలో పేరుచెప్పదగిన కవులు పంప, రన్న, పొన్న, నాగవర్మ యనువారుండి యుండిరి. వీరు కన్నడదేశమునకు పోయి

కన్నడభాషలో ననేక గొప్పగ్రంథములనువ్రాసి యా దేశమున పేరెన్నిక గనిరి. పైన వ్రాసినవారిలో పంప, రన్న, పొన్న యను మువ్వురు కవులును రత్నత్రయమని పిలువబడి ప్రఖ్యాతికొచ్చిరి.

1. పంప

37. చంద్రగుప్తుడు రాజ్యము చేయుకాలమున 'భద్రబాహు'డను జైనమతస్థుడు కన్నడదేశమునకు వచ్చి జైనమతమును, జైనసాంప్రదాయములను స్థాపించిరి. అప్పటినుండియు జైనమతము కన్నడదేశమున పాతుకొనిపోయి దినదినాభివృద్ధి జెందినది. పదియవ శతాబ్దినాటికి జైనసాంప్రదాయములు మంచిదశయం దుండెడివి. ఆ కాలమునకు 'పంప' యను ఆంధ్ర వైదిక పండితుడు, జైనమతాభిమాని తన దేశమున రాజపోషణగాని, సామాన్యజనపోషణగాని చెందజాలక తన మాతృదేశమును వదలి జైనమత మభివృద్ధిగాంచుచున్న కన్నడదేశములోని వేములవాడ యను పట్టణమునకు జేరెను. అప్పు డా పట్టణమున అరికేసరి యను రాజు రాజ్యముచేయుచుండెను. ఆ రాజుగారి యాస్థానమునందు కవిగా ప్రవేశించెను. పంపయనునాతడు వేంగీరాజ్యమున మంచి వైదికపండితకులమున జన్మించెను. ఈతని తాత మాధవశర్మ వేదాధ్యయనము గావించిన పిమ్మట మంత్రశాస్త్రము నభ్యసించెను. ఈయన యజ్ఞమును కావించెను. అయితే పంప యనువారికి జైనమతసాంప్రదాయములయందును జైనమతము నందును అభిరుచి యెక్కువగా నుండెను. అందువలన నీతడు వేంగీ దేశమును వదలి కన్నడదేశములోని వేములవాడయను గ్రామమునకు బోయి అచటి రాజైన 'అరికేసరి' యను రాజుగారి ఆస్థానమున కవిగానేర్పడి అచటనే గొప్ప ప్రఖ్యాతిగాంచెను. మన ఆంధ్రదేశమున నన్నయ మహాకవి యెట్లాదికవిగా నెంచబడెనో అట్లే నీ పంపయు కన్నడదేశమున కాదికవిగా ప్రఖ్యాతిగాంచెను. నన్నయ మహాకవి యెట్లు మహాభారత గ్రంథమును రచియించి యిచటి కవిత్రయములో

నొకమహాకవిగా పరిగణింపబడెనో అట్లే నీ పంపకవి కన్నడదేశములో రత్నత్రయములో నొక కవిరత్నముగ పేరెన్నికగనెను.

38. ఈతడు ప్రథమమున ఆదిపురాణ మను గ్రంథమును వ్రాసెను. ఇది జైన తీర్థంకరులలో నొకరి జీవిత చరిత్ర. ఈ కవి వ్రాసిన రెండవ గ్రంథము 'విక్రమార్జున విజయ' మను గ్రంథము. జైనమతస్థుల ప్రకారము మహాభారతకథ యెట్లుండవలయునో మనకు తెలియజేసెడి కథ యిందు వ్రాయబడెను. జైనధోరణిలోనే అర్జునునిచరిత్ర వ్రాయబడెను. ద్రౌపదికి అర్జును డొకడే భర్త. అతనికి ద్రౌపది యేకైకపత్ని. అయితే యీ కవి వ్రాయుటలో తనదేశమును పరిపాలించుచున్న 'అరికేసరి'యను రాజును మనసునందుంచుకొని అతని చరిత్ర నీ గ్రంథమునందు చిత్రించెను. ఆ కాలపునాటి విషయములను కొన్నిటి నీ చరిత్రయం దిమిడ్చెను. మొత్తముమీద కథ మార్చబడినను గ్రంథముమాత్రము మిక్కిలి అత్యున్నతపద్ధతిని వ్రాయబడి కన్నడవాఙ్మయములో వ్రాయబడిన గ్రంథములలో మిక్కిలి మేటి యని చెప్పదగిన గ్రంథమై యున్నది.

2. పొన్న

39. రత్నత్రయములోని రెండవవారైన 'పొన్న' యను కవియు మన ఆంధ్ర, వేంగీ దేశమునుండి వలసవెల్లిన కన్నడకవియే యైయున్నాడు. ఈతడు కన్నడభాషయందు శాంతిపురాణ మను గ్రంథమును రచియించెను. ఇది జైనమతస్థులలోని పదునారవ తీర్థాంకుని జీవితచరిత్రయైయున్నది. ఇదిగాక 'జినాక్షరమాల' యను స్తోత్ర గ్రంథము నింకొకదానిని వ్రాసి యుండెను. ఈ కవి సంస్కృత కన్నడభాషలయందు గ్రంథముల రచించుటచే నీతనికి 'ఉభయభాషా చక్రవర్తి' యను బిరుద మివ్వబడెను.

3. రొన్న

40. కన్నడ కవిరత్నత్రయములోని మూడవ కవిరత్నమీ 'రొన్న' యను కవి. ఈతడును ఆంధ్ర వేంగిదేశముననుండి కన్నడదేశమునకు వెల్లినవాడే. ఈతడు 'అజితపురాణ' మనుపేర జైనమతాధికారులలో రెండవ తీర్థంకారునిజీవితకథను వ్రాసెను. 993 A.D. సంవత్సరమున చాళుక్యరాజైన నాగవర్మయొక్క భార్యయగు 'అత్తమాంబ'గారి కోరికపైన నీ గ్రంథము వ్రాయబడెను.

41. ఇదిగాక యీ కవి 'సాహస భీమవిజయ'మను నింకొక గ్రంథమును చంపుగా పది యాశ్వాసములలో వ్రాసియుండెను. ఇందులో భీమునికి, దుర్యోధనునికి జరిగిన గదాయుద్ధము వర్ణింపబడినది. అందువలననే నీ గ్రంథమును 'గదాయుద్ధ'మనియు జెప్పుదురు. చాళుక్యరాజైన ఆహవమల్లుకు భీముని గుణగణములన్నియు కల్పింపబడినవి. ఈ కవియు 'కవిచక్రవర్తి'యనియే పిలువబడెను.

42. ఈ కవియొక్క పోషకుడగు 'చావుందరాయుఁ'డను రాజు, యీ కవి 'శర్వణబెళ్గొ' వద్ద 'గోమతేశ్వరము'ను స్థాపించినందులకు 'రాయ' యను బిరుదము నిచ్చెను. ఇంతేగాక నీతడు 'చావుండరాయపురాణ' మను నింకొక గ్రంథమును వ్రాసియుండెను. ఈ గ్రంథమునందు 24 గురు జైనతీర్థంకారులయొక్కయు, 12 గురు చక్రవర్తులయొక్కయు, తొమ్మండుగురు బలభద్రులగురించియు, తొమ్మండుగురు నారాయణులగురించియు, మరి తొమ్మండుగురు ఉపనారాయణులయొక్కయు జీవితచరిత్రములను రచించెను.

43. ఈ వాఙ్మయచరిత్రను వ్రాయకపూర్వమే నిచట నొక ముఖ్యవిషయమును వ్రాయవలసియున్నది. చంద్రగుప్తుడు రాజ్యముచేయుకాలమున 'భద్రబాహు' డను నొక జైనప్రవక్త యీ కన్నడరాష్ట్రమునకు వచ్చి జైనమతమును, జైనసాంప్రదాయ

ములను యిచటి జనులమనసులందు బాగుగ నిలిచియుండునట్లు ప్రచారము గావించియుడెనని పైన 37 వ పేరాలో వ్రాసియుంటిని. ఈ దేశమున తిరిగి వీరశైవమతము స్థాపింపబడి దాని ప్రభావము జనుల నావరించువరకు నీ జైనసాంప్రదాయములే వీరిలో ప్రకాశించుచుండెను. అందువలన రామాయణాది వైదికగ్రంథము లీప్రాంతమున నంతగా జనులమనసులయందు ప్రవేశించియుండలేదు. అందుచే రామాయణ మహాభారతములయందలి జెప్పబడిన ముఖ్యఅంశములను మార్చుటయు, వాటిబదులు జైనధోరణిని వాటినికల్పించుటయు నొక ముఖ్యఅంశమై యున్నది. జైనధోరణిప్రకారము హిందూదేశమంతయు జైనదేశమే. ఈ దేశమునం దెచటను బ్రాహ్మణమతము గాని, వైదికమతముగాని, వేదమంత్రములుగాని లేవు. ఇచటిమనుజులందరును జైనయతులు. ఇచట చరించువా రెల్లరు భూచరులు, ఖేచరులు. రాక్షసు లనబడు వా రందరు కేవల విద్యాధరులు. వా రందరు వ్యోమయానవిదలులు. బ్రాహ్మణులయందుగాని, బ్రాహ్మణ మతమునందుగాని జెప్పదగిన మంచి యేమియులేదు. రామాయణ మహాభారతమునందు వ్రాయబడిన కొన్ని గొప్పఅంశములను మానవ బుద్ధికి అందుబాటులోనుండునట్లు మార్పుగలిగించి మానవబుద్ధికి అతీతముగనున్న అంశముల నన్నిటిని నమ్మదగినట్లుగా మార్పు జేసిరి. హనుమంతుడు, సుగ్రీవుడు మొదలగువారు కేవల మానవజాతికిచెందినవారే. కాని వానరస్వరూపులుగారు. వారియందు మానవత్వమేగాని వానరత్వము లేదు. సేతుబంధన మనునది మిథ్య. వారిసేనలు నభోగమన విద్యవలన సముద్రమును దాటియుంటిరి. రామలక్ష్మణులు అవతార పురుషులు గారు. లక్ష్మణుడే రామాయణమునందు కథానాయకుడు. రావణుని యుద్ధమునందు చంపినది లక్ష్మణుడే. రావణునిచంపి రాముని లక్ష్మణుడు రక్షించును. లక్ష్మణుడే అచ్చుతుడు. కృష్ణుడు, రామలక్ష్మణులు బలరామవాసుదేవులు. రామునితల్లి అపరాజిత. కౌసల్యకాదు. లక్ష్మణ శత్రుఘ్నులు ఒక తల్లికి బుట్టినవారుకారు. రావణుడు బహు

రూపిణీవిద్య నభ్యసించి, పదిమందిరావణులుగా కనుపించెను. జీవహింస పనికిరాదు. అది నిషేధింపబడినది. జనులు దేవుని ప్రార్థించవలెను. రావణుడున్ను శాంతీశ్వరతీర్థంకరుని ఆలయము ప్రవేశించి, వారిని ప్రార్థించును. రావణుడు శివతాండవస్తోత్రమును వ్రాసియుండెను. ఇట్టి అభిప్రాయములనే జనులకు విప్పిచెప్పుటకై జైనకవులు తమతమ గ్రంథములలో ననేకమార్పులు గావించి గ్రంథములను వ్రాసిరి.

తిరిగి వాఙ్మయమును గూర్చి వ్రాయుదును.

4. నాగవర్మాచార్య 984 A. D.

44. నాగవర్మయను కవియు ఆంధ్రవేంగిదేశముననుండి కన్నడదేశమునకు వచ్చిన కవులలో నొకరైయుండెను. ఈతడు 'ఛందాంబుధి' యను నొకసుప్రసిద్ధ గ్రంథమును, ఛందస్సును గురించి వ్రాసియుండెను. ఇదియే కన్నడభాషలో ఛందస్సునుగూర్చి వ్రాయబడిన ప్రథమగ్రంథమైయున్నది. ఈకవి బాణుని కాదంబరిననుకరించి 'కర్ణాటకాదంబరి' యను నింకొక గ్రంథమును కర్ణాటభాషయందు రచించియుండెను. ఇది యొకచంపుకావ్యము. ఈతడీ గ్రంథమును తన భార్యయొక్క కోరికపై వ్రాసియుండెను.

5. దుర్గసింహ

45. దుర్గసింహయను నొకమంత్రియు శైవబ్రాహ్మణుడును 'పంచతంత్ర' మను నొకగ్రంథమును చంపుగా వ్రాసియుండెను. ఈ గ్రంథమునకు గుణాఢ్యునిచే వ్రాయబడిన బృహత్కథ మాతృకమై యున్నది. ఈ గ్రంథము ప్రాసయుక్తమై చక్కనిభాషలో వ్రాయబడెను.

6. చంద్రరాజు

46. దుర్గసింహకవి తన గ్రంథమునందు తనకు సమకాలికుడైన చంద్రరాజునుగురించి (భద్రరాజు ?) వ్రాసియుండెను. ఈ చంద్ర

రాజు మదనశాస్త్రమును గురించి 'మదనతిలక' యనుపేర పదునెనిమిది అనుకరణములుగల నొక చంపుగ్రంథమును రచించియుండెను.

7. శ్రీధరాచార్య 1049 A. D.

47. శ్రీధరరాజ యను నొక జైనబ్రాహ్మణుడు 'జాతక తిలక' మను నొక జ్యోతిషగ్రంథమును, 'చంద్రప్రభ చరిత్ర' యను నొక కావ్యమును వ్రాసియుండెను.

8. నాగవర్మాచార్య 1079 A. D.

48. నాగవర్మాచార్య యను కవి 1079 వ సంవత్సరమున 'చంద్రచూడశతక' మను గ్రంథమును వ్రాసియుండెను.

9. నాగచంద్ర 1105 A. D.

49. నాగచంద్రి యను జైనకవి యింకొకరు 19 వ తీర్థాంకరునిపేర 'మల్లినాథ జినాలయ' మను ఆలయమును బీజపూరులో కట్టించి 'మల్లినాథపురాణ' మను చంపుకావ్యమును రచించెను. ఈతడే 'రామచరిత పురాణ' మను గ్రంథమును వ్రాసెను. ఇందు రామాయణకథ నంతను జైనధోరణిలో వ్రాసియుండిరి. ఈతనికి 'అభినవపంప' యను బిరుదము నుండెను.

10. రాముందరయ్య 975-984 A. D.

50. రాముందరయ్య యను కవి త్రిషష్ఠి పురాణమను గ్రంథమున జైనతీర్థాంకరుల చరిత్రను 978-984 సంవత్సరములమధ్య వ్రాసెను. ఈతడు రామమల్లు యను రాజుయొక్క మంత్రి. ఈ కవి 'రన్న' యను కవిని ప్రోత్సహించెను.

11. నయశేన 1112

51. ఇంకొక జైనకవి 1112 వ సంవత్సరమున దేశీయ కవితయందు అనగ అచ్చ కన్నడభాషయందు 'ధర్మామృత'మను గ్రంథమునువ్రాసి సంస్కృతగ్రంథరచనను హేళనగావించెను.

12. భీమకవి 1195

52. 'భీమ' యను కవి, పాలకూరి సోమన్న వ్రాసిన గ్రంథము ననుకరించి బసవపురాణమను గ్రంథమును రచించెను.

13. అందయ్య 1235 A. D.

53. ఇంకొక కవి 'అందయ్య' 1235 వ సంవత్సరమున 'కబ్బిగరకవ' యను పేర (అనగా కవిరక్షకుడు) మదన విజయచరిత్రమును తత్సమ తద్భవపదములతో దేశికవితయం దొక కావ్యమును రచించెను. సంస్కృతపదములను పూర్తిగా విసర్జించెను. ఈ గ్రంథమునందు ఇది శివపార్వతుల ప్రేమగాథ.

14. బ్రహ్మశివ

54. బ్రహ్మశివ యను కవి జైనమతమే అన్ని మతములలో ప్రశస్తమైనదనినిరూపించుటకు 'సమయపరీక్ష' యను గ్రంథమును 12 వ శతాబ్దమున వ్రాసియుండెను.

15. కీర్తివర్మ

55. 12 వ శతాబ్దముననే కీర్తివర్మ యను కవి 'గోవైద్య'మను గ్రంథమును వ్రాసియుండెను. ఇది వైద్యమును గురించిన గ్రంథమని దానిపేరే చెప్పుచున్నది.

16. కర్ణపార్య 1145 A. D. 1170 - A. D.

56. కర్ణపార్య యను కవి 'నేమినాథపురాణ'మను పేర జైనతీర్థంకారులలో నిరువది రెండవవారి చరిత్రను 1145 వ సంవత్స

రమున వ్రాసియుండెను. ఈ పురాణము కృష్ణునిగూర్చియు, మహాభారతమునుగూర్చియు పదునాల్గధ్యాయములలో వ్రాయబడిన గ్రంథము. ఈ కవినికూడ నేమినాథకవి యనియె పిలుచుచుండెడివారు. ఈ కవియే 'లీలావతి' యను నొక కల్పితకథను 1170 వ సంవత్సరమున వ్రాసియుండెను.

17. రెండవ నాగవర్మ

57. రెండవ నాగవర్మయను కవి కన్నడవ్యాకరణమునకు సంబంధించిన 'కావ్యావలోక'మను గ్రంథమును అయిదధ్యాయములలో వ్రాసియుండెను. ఈ గ్రంథమంతయు సూత్రములతో నిండియున్నది. అయితే యీ సూత్రములే పద్యరూపమున వ్రాయబడినవి. ఈ నాగవర్మవ్రాసిన యింకొక గ్రంథము 'కర్ణాటభాషా భూషణ'మను లక్షణగ్రంథము. ఈ గ్రంథమునందు సూత్రములన్నియు సంస్కృతమునందును, ఉదాహరణములు మాత్రము కన్నడ భాషయందును వ్రాయబడియున్నవి. ఈ కవి 'వాస్తులోక'మను నింకొక నైఘంటుక సంబంధమగు గ్రంథమును రచించియుండెను. ఇందు సంస్కృతపదములకు సరియైన కన్నడపదము లివ్వబడినవి. ఈ కవి పదమూడవ శతాబ్ద ప్రథమభాగమువరకు నుండి యుండెను.

18. ఉదయాదిత్య 1150 A. D.

58. ఉదయాదిత్య యను నొక చోళరాజు దండి వ్రాసిన 'కావ్యాలంకార'మను గ్రంథము ననుసరించి 'ఉదయాదిత్యాలంకార'మను నొక అలంకారలక్షణశాస్త్రమును 1150 వ సంవత్సరమున రచించెను.

19. రాజాదిత్యుడు

59. రాజాదిత్యుడను నింకొక జైనకవి గణితశాస్త్రమునందనేక గ్రంథముల నతిసులభశైలిని సామాన్యజనుల కర్థమగునట్లు

'వ్యవహార గణిత' మనియు, 'లీలావతీ గణిత' మనియు, 'క్షేత్ర గణిత' మనియు గ్రంథములను రచించెను.

20. నేమి చంద్రుడు

60. హొసల్యరాజులు పరిపాలనచేయుకాలమున జైనకవులనేకులు విలసిల్లియుండిరి. ఈ కవులందరు ముఖ్యముగ జైనతీర్థంకరుల చరిత్రలను చంపుకావ్యములుగ వ్రాయుచుండిరి. 'వీరబల్లాల' యను రాజు పరిపాలించుసమయమున 'నేమిచంద్రు' డను నొక కవి 'లీలావతి' యనుగ్రంథమును రచించెను. ఈతడు తాను జీవించియుండగ 'నేమినాథపురాణ'మను నొకగ్రంథమును వ్రాయ ప్రయత్నించెను. కాని అట్టిగ్రంథము పూర్తికాకమునుపే అతడు చనిపోయెను. ఆతడు వ్రాసినగ్రంథము పూర్తికానందున దానికి 'అర్ధ నేమి' యని పేరుపెట్టిరి.

21. జన్న 1209 A. D.

61. జన్నయనువారొకరు మంత్రిగ నుండిరి. వారు ఆలయములు కట్టించుటలో బహునేర్పరి. వారు గొప్పగ్రంథకర్తయు నగును. వారు 1209 వ సంవత్సరమున 'యశోధర చరిత్ర' యను గ్రంథమును రచించెను. ఈ గ్రంథమునందు 'మారెమ్మ' యను గ్రామదేవతకు బలియివ్వదలచిన యిద్దరు బాలుర విషాదచరిత్రయు, వారి యాక్రందములును వర్ణింపబడినవి. చివర కా పిల్లలిద్దరును బలియివ్వక నే వదలిపెట్టబడిరి. ఈ చరిత్ర ప్రచురింపబడినపిమ్మట బలియిచ్చుట నిషేధింపబడినది. ఈ కవియే పదునాల్గవ తీర్థంకరుడగు 'అనంతనాథుని పురాణము'ను వ్రాసియుండిరి. 1230 A. D. ఈతనికవిత్వము మిక్కిలి గంభీరముగ మృదు మధురశైలిలో వ్రాయబడియున్నది.

22. బంధవర్మ

62. బంధవర్మ యను కవి వైశ్యకులమునందు జన్మించియుండిరి. వీరు 'హరివంశాభ్యుదయ' మను గ్రంథమును వ్రాసియుండిరి.

ఇదేగాక జీవమును ప్రబోధించు నీతినిగురించి 'జీవసంబంధ'మను గ్రంథమును వ్రాసియుండిరి.

23. శికుమాయన 1232

63. 'శికుమాయన' యను కవి సంగీతవాయిద్యములతో చదువబడెడు నొక క్రొత్తపద్ధతిని ప్రారంభింపబడిన సాంగత్యగ్రంథముల రెంటిని 'అంజనాచరిత్రము', 'త్రిపురాహరణము' యను గ్రంథములను వ్రాసియుండెను. ఇందు త్రిపురాహరణమను గ్రంథము వేదాంత గ్రంథము. ఇది జననము, లయము, మృత్యువును సంబంధించి వ్రాయబడిన గ్రంథము. వీటిని మనము యక్షగానము లందుము.

24. మల్లిఖార్జునకవి 1245 A. D.

64. జన్నకవియొక్క బావమరది సోదరుడగు మల్లిఖార్జున కవి 'సూక్తిసుధార్ణవ' మను నీతిబోధకగ్రంథము నొకదానిని పదునేడు నీతిబోధకవిషయములనుగూర్చి వ్రాసియుండెను. వీటిని సంస్కృతమున సంఘాతము లందురు.

25. కే శి రా జు 1262

65. కేశిరాజు అనుకవి పైనవ్రాసిన మల్లిఖార్జునకవి కుమారుడు. ఈతడు కన్నడభాషావ్యాకరణమును 'శబ్దమణిదర్పణ'మను పేర గద్యకావ్యముగ వ్రాసి అచ్చటచ్చట నందలిసూత్రములకు భాష్యమునుకూడ వ్రాసియుండెను. ఈ గ్రంథము చారిత్రకముగను, శాస్త్రసంబంధముగను మిక్కిలి యుపయుక్తమైన గ్రంథము.

26. క్షే మేం ద్ర 1275

66. క్షేమేంద్రు డనుకవి జైనధోరణిలో రామాయణమును రచించెను.

27. ర ట్ట క వి 1300

67. స్వభావ సంసిద్ధములై ప్రకృతికి సంబంధించిన వర్షము, ఉరుములు, మెరుపులు, భూకంపములు, గ్రహములు మొదలగువాని చలనమువలన సంభవించు శుభాశుభములు, శకునములు మొదలుగాగల విషయములను గురించి 'రట్ట' యనుకవి 'రట్టమతము' లేక 'రట్ట సూత్రములు' అనుపేర నొక గ్రంథమును వ్రాసెను. ఈ గ్రంథమునందు మేఘలక్షణములు, సూర్యలక్షణములు, గురుచారఫలం మొదలయిన శాస్త్రవిచక్షణ నిర్వచింపబడినది. ఈ గ్రంథము ఆంధ్రభాషలోనికి అయ్యలు భాస్కరులు అనువారు అనువదించి యుండిరి. వీరిని అయ్యలాఖ్య బయ్యలాఖ్య ద్వయమందురు. వీరు అయ్యలరాజు రామభద్రుని బంధువులు. ఈ యిద్దరు కవులు 1692-98 మధ్య నుండి యుండిరి.

28. నా గ రా జ క వి 1339 - 1360

68. నాగరాజను కవి సంస్కృతగ్రంథములనుండి యాబది రెండు కథలను కన్నడ భాషలోనికి 'పుణ్యాశ్రయ' మను పేర చంపుకావ్యముగ రచించెను.

29. మ ం గ రా జు 1360

69. మంగరాజను కవి 'ఖగేంద్రమణి దర్పణ'మను గ్రంథమును (Toxicology) విషయమునుగూర్చి 1360 వ సంవత్సరమున వ్రాసియుండెను.

70. ఇప్పటికప్పటికే దాదాపు రెండు శతాబ్దములక్రింద కర్నాట దేశమున వీరశైవమత మావరించి యుండెను. వీరశైవులందరు నీ జైనమతము నంతరించుటకున్ను, అట్లు గావింపలేకున్న దాని వ్యాప్తి నైనను తగ్గించుటకున్ను ప్రయత్నములు గావించుచూ వచ్చిరి. అయితే విజయనగర సామ్రాజ్య స్థాపనయగు పదునాల్గవ

శతాబ్ద మధ్యకాలమువరకున్ను జనులయొక్కయు, రాజులయొక్కయు పోషణ వలన జైనమతము వృద్ధియగుచునే యుండెను. విజయనగర రాజ్యము స్థాపింపబడి విజృంభించినను రాజులీ జైనులను, జైనమతమును పోషించుచునే యుండిరి. అట్లయ్యును జైనమతముయొక్క ప్రాబల్యము మాత్రము కొంతవరకు క్షీణించకపోలేదు. ఇదియునుగాక దక్షిణ దేశమున హిందూమతమునందు వైష్ణవమత ప్రాబల్యమును కొంతవరకు హెచ్చుగుచుండెను. శైవము, వైష్ణవము హిందూమతమున నుండి జనించిన చీలికలేమై యున్నవి. వీటిలో వీటిమధ్య విభేదములున్ను హెచ్చుగనే యున్నవి. అట్లుండియు నీ రెండు మతశాఖలు జైనమతముయొక్క ప్రాబల్యమును అంతరించుటకుగాని, దాని బలమును తగ్గించుటకుగాని సహాయకారులుగనుండి ప్రచారము గావింప మొదలు పెట్టెను. అట్టిప్రచారమువలన జనులలో కొంత మార్పు కలుగక పోలేదు. జైనమతము అంతరించకున్నను ఆ మతముయొక్క ప్రాబల్యము జనులపై తగ్గిపోయెను. ఇట్టి మార్పువలన కన్నడ వాఙ్మయము నందును కొంత మార్పు కల్గియుండెను.

71. నేనింతవరకున్ను కన్నడ భాషయందు హెచ్చుగ జైనకవులను గురించియే వ్రాసియుంటిని. ఇతర కవులను గురించి యెక్కడో ఒకచోటతప్ప ముచ్చటించియే యుండలేదు. ప్రప్రథమమున నీ కన్నడదేశములో కవులు హెచ్చుమంది జైనకవులేయై యుండుటయె యిట్లు వ్రాయుటకు కారణము. అంత మాత్రమున నీ దేశమున యితరమత కవులులేరని యభిప్రాయపడ నవసరములేదు. వారిని గురించియు మున్ముందు వ్రాయబడును. ఇప్పటికి దేశమునందు కొంతమార్పు కల్గినదని వ్రాసియుంటిని. అట్టిమార్పు దేశమునందలి వాఙ్మయమునందును కొంత వుండి యున్నది. ఈ విషయమును మనసునందుంచుకొని యికముందు వ్రాసినదానిని గమనింతురుగాక యని కోరుచున్నాను.

30. మాధవకవి 1885

72. హరిహరరాయలు, దేవరాయలు రాజ్యము చేయు కాలమున మాధవుడను జైనకవి రాయలమంత్రిచే ప్రోత్సహింపబడి జైనతీర్థంకరులలో పదునైదవవారి యొక్కయు, మరికొందరియొక్కయు చరిత్రను 'ధర్మనాథ పురాణ' మను పేర వ్రాసియుండెను. ఈ కవియే శ్రవణ బేల హోలలోని గోమతేశ్వరమును గూర్చియు నొక కావ్యమును వ్రాసియుండెను.

31. వృతవిలాస

73. సంస్కృతభాషయందు అమరగతి యనుకవి 'ధర్మపరీక్ష' యను పేర వ్రాసిన గ్రంథమును కన్నడభాషలో నదేపేరుతో 'ధర్మపరీక్ష' యను గ్రంథము ననువదించెను. ఈ కవియే 'శాస్త్రసార' మను నింకొక మతసంబంధమైన గ్రంథమును కన్నడభాషయందు వ్రాసియుండెను.

32. అయాతవర్మ 1400 A. D.

74. అయాతవర్మయనుకవి 'రత్నకరండక' యను సంస్కృత గ్రంథమును 1400 సంవత్సరమున కన్నడభాషలోనికి అనువదించెను. ఈ గ్రంథమునందు జైనుల ముఖ్యవిశ్వాసములు, నమ్మకములను గురించి వ్రాయబడియున్నది.

33. భాస్కరకవి 1424 A. D.

75. పెనుగొండ గ్రామకాపురస్థుడగు భాస్కరకవి 'జీవంధర రాజు' యొక్క చరిత్రను నొక కావ్యముగ వ్రాసియుండెను.

34. బొమ్మరసు 1485

76. తర్కనాంబి గ్రామకాపురస్థుడగు 'బొమ్మరసు' కవి నాగకుమారుని చరిత్రను గ్రంథముగ వ్రాసెను. ఈ నాగకుమారుడు ధనాపేక్షను త్యజించి మతసంబంధమగు పవిత్ర జీవితము నాశ్రయించెను.

35. కోటీశ్వరుడు 1500 36. బాహుబలుడు 1560

77. తులువదేశస్థుడగు 'కోటీశ్వరుడు' శృంగేరి కాపురస్థుడగు 'బాహుబలుడు' అను కవులు మొదటివారు 1500 సంవత్సరమునను, రెండవవారు 1560 వ సంవత్సరమునను యీ నాగకుమారుని చరిత్రయే వ్రాసియుండిరి.

78. 1509 వ సంవత్సరమునకే శ్రీకృష్ణదేవరాయలు విజయనగర సామ్రాజ్యాధిపతియాయెను. వీరికాలమున అనేకమతస్థులు పాండిత్యమునందు, కవనమునందు సామ్రాటుచే ప్రోత్సహింపబడిరి. ఆ కాలమునందును జైనకవులకు రాజపోషణయు, ప్రోత్సాహమును కలుగుచునే యున్నది. కాని వారికవిత్వము యితరభాషయందువలె అందును ముఖ్యముగ తెలుగుభాషయందువలె అభివృద్ధిగాంచి యుండలేదు. రాయలవారికాలమున రాయలవారికన్న వారివద్దనున్న కన్నడయధికారులు కన్నడభాషను హెచ్చుగ ప్రోత్సహించియుండిరి.

37. మంగరస

79. జైనకవులలో 'మంగరస' యను కవియుండియుండెను. ఈ కవి 'జయనృప' యను గ్రంథమును చక్కని సులభశైలిలో వ్రాసియుండెను.

38. అభినవ (అనుభవ) వాది విద్యానాథుడు

80. అనుభవవాది విద్యానాథుడను కవి రాయలకాలముననే యుండెను. వారిపాండిత్యమును, వారికవిత్వమును రాయలవారు మిక్కిలి శ్లాఘించి వారికి రత్నాభిషేకము గావించిరి. 900 A. D. సంవత్సరము మొదలు 1450 వ సంవత్సరమువరకు కావ్యముల రచించిన కవులయొక్క కావ్యసారమును నలుబదియైదు విషయములుగ విభజించి యొక 'కావ్యసార' మను పేర నొక గ్రంథమును రచించెను. అయితే యీ గ్రంథము రాయలవారి యనంతరము బయల్పడినది.

39. సాల్వకవి 1560

81. సాల్వయను నింకొకకవి రాయలకుకూడ సమకాలికుడే గాని వారితరువాత ప్రఖ్యాతికి వచ్చెను. ఈ కవి కొంకణదేశమున నాస్థానకవిగనుండి జైనపద్ధతిని భారతమును 1560 లో వ్రాసియుండెను. అయితే అదివరలో రాయలవారి ప్రథమదశలో కృష్ణభారతమను పేర కుమార వ్యాసులనువారు వ్రాసిన గ్రంథమునకు పోటీగా నీ భారతమును 1560 లో నీ సాల్వకవి వ్రాసియుండెను. కాని వీరి భారతము కుమార వ్యాసుల భారతమంత జనాకర్షణీయముగ నుండలేదు. అయినను యిదియు నొక గొప్ప గ్రంథమనియే చెప్పబడుచున్నది.

40. రత్నాకరవర్మ

82. రత్నాకరవర్మయను కవి క్షత్రియకులస్థుడు. ఈతడనేక గ్రంథములను వ్రాసియుండెను. "త్రిలోకేశ్వర"యను గ్రంథము జైనమత సంబంధమైనది. 1557 వ సంవత్సరమునకే వ్రాయబడెను. వీరే వ్రాసిన "అపరాజిత జాతక" మనునది యింకొక గ్రంథము. ఈ గ్రంథము వేదాంతమును, నీతిని బోధించునదియై యున్నది. ఇది ప్రథమ జైనతీర్థాంకుని కుమారుడైన "భరతుని" చరిత్ర. ఈ గ్రంథము చారిత్రిక గ్రంథ మని చెప్పుటకు వీలులేదు.

41. నామన్నారు కవి 1559

83. నామనార్నరనుకవి ధ్యానపూరితమైన గ్రంథము నొకదానిని "జ్ఞానభాస్కర" మనుపేర 1559 వ సంవత్సరమున వ్రాసి యుండెను.

వీరశైవ మత ప్రాబల్యము

84. ఇంతవరకు జైనమతమును గురించియు, దాని పాబల్యమును గురించియు, అందులోని కన్నడకవులు వారికావ్యములను గురించియు వ్రాసియుంటిని. కన్నడదేశమునందు ప్రథమము నుండియు జైనమతప్రాబల్యము హెచ్చుగనుండినను పదియవ శతాబ్ది నుండియు యీ జైనమతముతో బాటు శైవమతము వీరశైవమతములయందభిలాష కన్నడిగులలో హెచ్చుగనే యుండెను. ఈ వీరశైవులలో ముఖ్యులైన బసవ చెన్నబసవ యనువారి సమకాలికులైనవారున్ను తాము నిర్వచించు మతవిషయములు జనులకు సులభముగా గ్రహించ కలుగుటకు సులభశైలిని వచనరూపకముగ వ్రాయుటకు ప్రారంభించిరి. వీరిలో దాదాపు రెండువందలమంది స్త్రీలున్న మహదేవియొక్క నాయకత్వమున వ్యవహరించి యుండిరి. ఈ వీరశైవులనుగురించి E. P. Rice "ఇ. పి. రైస"ను పాశ్చాత్యపండితు డొక రీ విధముగ వ్రాసియుండిరి.

"Inform, the Vachanas are brief, disconnected paragraphs, each ending with the one or the other of the names of Siva; under which he is worshipped.

"వ్రాత సరళిలో నీ వచనములు సంక్షేపముగను, ఒకదానితో నింకొకదానికి సంబంధము లేకుండునట్లును వ్రాయబడినవి. అది శివపూజ కుపయోగించెడు శివనామములతో సంత్యమగుచుండెను.

In style they are epigramatical parallelistic and allusive. They dwell on the vanity of riches, the valulessness of mere rites or book learning, the uncertainity of life and the privileges of Siva Bhakti. They call men to give up desire for worldly wealth and ease and to live lives of sobriety and detachment of world and to turn to Siva for refuge. They are seldom controversial but entirely hortatory, devotional and expository. They are still recited by Lingayat Acharyas for the instruction of their followers"

భాషాసరణిలో చమత్కారముగను, సమాంతరముగను, ప్రార్థనామాచకముగను ఉండెడివి. ధనమదాహంకారమును గూర్చియు, కేవల పుస్తక పాండిత్యము యొక్కయు, కేవల కర్మక్రియల యొక్కయు నిష్ప్రయోజకత్వమును గురించియు, జీవితముయొక్క అనిశ్చయత్వమునుగురించియు శివభక్తియొక్క అధికృతనుగూర్చియు వ్రాసియుండెను. ప్రాపంచిక సుఖములను, ద్రవ్యార్జనను వదలి ప్రపంచవ్యామోహమును పరిత్యజించి శాంతియుతమై నట్టియు, శివభక్తియందు మనస్సును నిల్పి మోక్షప్రాప్తికై శివపూజను చేయుమనియు ప్రబోధించుచున్నవి. ఆ వచనములు వివాదాస్పదములైనవి కాక ప్రోత్సాహకప్రబోధకములుగను, ధర్మక్రియా విషయములుగను, అర్థప్రకాశకముగను ఉండియున్నవి. ఆ వచనము లిప్పటికిని లింగాయతాచార్యులచే తమ శిష్యుల ప్రబోధనకై పఠింపబడుచు చేయున్నవి."

85. ఈ ఆరాధ్యులలో కొందరు ముందు ముందు వీర వసంతరాయుడు రానున్నాడనియు, అట్లు వచ్చి వీరిని మిక్కిలి అభివృద్ధికి తీసికొనిపోయి వీరలకు సంపూర్ణమోక్షము నివ్వగలడనియు చెప్పుచుందురు. అట్టివా రారాధ్యులలో 'కాలజ్ఞాను' లనెడివారు.

86. 1. బసవకవి 2. చెన్నబసవ కవి.

బసవ యను ఆరాధ్యపండితకవి పైనచెప్పిన పద్ధతిన ఆరు గ్రంథముల రచించెను. బసవబంధవుడైన చెన్నబసవ పండితకవి కొన్ని గ్రంథములను వ్రాసెను.

87. ఈ ఆరాధ్యులలో పండితులు రెండు విధములుగ నుండిరి. ముగ్గురు పండితులు. అయిదుగు రాచార్యులు.

పం డి తు లు

3. మంచన లేక శివలెంక పండితుడు.
4. శ్రీపతి పండితుడు.
5. మల్లిఖార్జున పండితుడు.

ఈ ముగ్గురు పండితులు.

ఆ చా ర్యు లు

6. కొల్లిపాకగ్రామ కాపురస్థుడగు 'రేవన్నసిద్ధ' లేక 'రేణుకాచార్యుడు'.
7. కొత్తాపురకాపురస్థుడగు 'మరులుసిద్ధ'.
8. పండితులలో నొకరగు 'పండితారాధ్యులు'.
9. ఏకోరామతండె.
10. విశ్వేశ్వరాచార్యులు.

ఈ అయిదుగురు ఆచార్యులు.

ఈ పైన చెప్పిన పండితులు, ఆచార్యులు సమకాలికులై యున్నారు.

10. హరీశ్వరకవి 1147-1173 A. D.

88. హంపీ కాపురస్థుడగు హరీశ్వర కవి 1147 వ సంవత్సర 1173 సంవత్సర మధ్యకాలమున నివసించియుండెను. ఈ కవి విరూపాక్షునిగురించి స్తోత్రరూపకమగు గ్రంథమును 'పంపాశతక' మనుపేర వ్రాసియుండెను. ఇదిగాక 'గిరిజాకల్యాణ' మను యొక చెంపుకావ్యమును పది ప్రకరణములలో వ్రాసెను. ఇందు శివ పార్వతుల వివాహవిషయమునుగూర్చి వ్రాయబడెను. ఇదిగాక 'శివగరుడ రాగళెగ' లను గ్రంథమున నరువది శైవభక్తుల చరిత్రము వివరింపబడెను.

11. రా ఘ వాం క క వి

89. రాఘవాంక కవి హరీశ్వరుని మేనల్లుడు, శిష్యుడునై యుండెను. ఈతడు దాదాపు ఏడు గ్రంథములను వ్రాసెను. అందులో 'హరిశ్చంద్రి' కావ్యము మిక్కిలి ప్రాముఖ్యతను చెందినది. ఇది షట్పదీవృత్తములో వ్రాయబడి మంచిశైలి కలిగియున్నది. అయితే యిందు చాల వ్యాకరణదోషము లున్నవందురు. ఇదిగాక 'సోమనాథ చరిత్ర' మను నొక గ్రంథమును, 'సిద్ధరామపురాణ' మను నింకొక గ్రంథము సోమనాథుని గురించియు, రాముని గురించియు వ్రాయబడినది. వీరేవ్రాసిన 'వీరేశ్వర చరిత్ర' 'శరభచరిత్ర' యను గ్రంథములు చారిత్రక గ్రంథములై యున్నవి.

12. ప ద్మ ర స

90. పద్మరసయను కవి నరసింహరాయునివద్ద యుద్యోగిగ నుండి 'దీక్షాబోధిని' యను నొక గ్రంథమును వ్రాసియుండెను. తన జీవితచరిత్రమునే 'పద్మరాజపురాణ' మను పేర తన శిష్యులలో నొకరు వ్రాసియుండిరి.

13. పాలకురికి సోమనాథుడు

91. పాలకురికి సోమనాథకవి గోదావరిజిల్లాకు చెందిన నొక తెలుగు పండితకవి. ఈతడు తెలుగు కన్నడ భాషలయం దనేక గ్రంథములను వ్రాసి యుండెను. ఈతడు శైవమత ప్రాశస్త్యమును గూర్చి గ్రంథములను వ్రాసెను. 'గీతాబోధిని' 'పంచరత్న' యనునవి యితని కన్నడగ్రంథములు.

14. తో ట దా ర్య

92. పాలకురికి సోమనాథకవినిగూర్చి యాతనిశిష్యులలో నొకరగు 'తోటదార్య'డనువారు యొక జీవితచరిత్రను కన్నడభాషలో 1520 వ సంవత్సరమున వ్రాసియుండెను.

15. దేవకవి 1200

93. దేవకవి వ్రాసిన 'కుసుమావళి' యను గ్రంథము 'నేమి చంద్రుని' లీలావతి యను గ్రంథమునుబోలిన గ్రంథము.

16. సోమరాజకవి 1222

94. సోమరాజు యనుకవి గెరిసొప్పరాజైన 'ఉద్భట'యను వారిచరిత్రను 'ఉద్భటాచార్య' యనుపేర నొక గ్రంథమును వ్రాసెను. దీనినే 'శృంగారరస' యనియు పిలుతురు.

17. భీమకవి 1369

95. భీమకవి యనువారు పాలకురికి సోమన్నగారు వ్రాసిన తెలుగు బసవపురాణగ్రంథమును మాతృకగనుంచుకొని కన్నడ భాషలో 'బసవపురాణ' గ్రంథమును 1369 వ సంవత్సరమున వ్రాసి యుండెను. ఈతడు వ్రాసిన బసవపురాణము షట్పదీవృత్తమున నే వ్రాయబడినది. ఈ బసవయనువారు నంది యొక్క అవతారమనియు, నీ అవతారపురుషు డీ లోకమున శివప్రాశస్త్యమును ప్రచారముగావించుటకు అవతరించెననియు, నీ ఆరాధ్యులమతమును బసవ గావించిన యద్భుతక్రియలను వ్రాసి తమ మతమునందు జనులకు ప్రత్యేక విశ్వాసమును గల్పించుటకు ప్రయత్నించిరనియు చెప్పుదురు.

18. చామరసకవి 1422 - 46 A. D.

96. చామరస యనుకవి నొక ఆరాధ్యబ్రాహ్మణుడు. ఈతడు బసవుని సహచరుడగు ప్రభులింగని చరిత్రను 'ప్రభులింగ లీల' యనుపేర నొక గ్రంథముగ వ్రాసెను. ఈతడు ప్రౌఢదేవరాయని రాజ్యములో సంస్థానకవీశ్వరుడుగ నుండెను. 1422 - 46 ప్రభులింగయనువారు గణపతిదేవుని అవతారముగ వర్ణింపబడెను. ఈ ప్రభులింగ లీల యను గ్రంథము తరువాత తెనుగుభాషలోని కనువదింపబడెను.

19. లక్కన్న 20. జక్కనార్యుడు

97. రెండవ దేవరాయడు రాజ్యముచేయుకాలమున నా రాజువద్ద లక్కన, జక్కన యనునిద్దరు లింగాయతుమంత్రులుండిరి. అందులో 'లక్కన' యనువారు 'శివతత్వచింతామణి' యను గ్రంథమును, 'జక్కనార్యుడు' నూరు కథలుగల 'నూరొందుస్థల' యను గ్రంథమును రచించెను. ఈ దేవరాయలు రాజ్యముచేయుకాలముననే 'కుమారబంకనాథ' 'మహాలింగదేవ' యను నిద్దరు పండితులకును, మరి కొందరికిని సన్మానము గావింపబడెను.

21. గుబ్బిమల్లనార్యుడు

98. కృష్ణదేవరాయని కాలములో గుబ్బిమల్లనార్యుడు ప్రథమకవి. ఈ కవి వ్రాసిన గ్రంథములలో 'వీరశైవామృతము' 'శివభక్తపురాణ'మను గ్రంథములు ముఖ్యముగ చెప్పుకొనదగినవి. ఈ గ్రంథములు తమ వీరశైవమత ప్రచారమునకు హెచ్చుగా నుపయోగింపబడెడివి. ఈతడు 'భావచింతారత్న' యను గ్రంథమును, సత్యేంద్ర చోళునికథయు వ్రాసియుండెను. భావచింతారత్నమును 1513 A. D. లో వ్రాసెను. రెండవ గ్రంథమగు సత్యేంద్రిచోళ చోళి రాజులలో నొకచరిత్ర. ఈ గ్రంథమునందు 'పంచాక్షరి' మాహాత్మ్యమునుగురించి హెచ్చుగ వ్రాయబడినది.

22. నంజుండకవి

99. నంజుండ యను నింకొకకవి కంప్లిదేశపురాజగు 'కుమారరాముని' చరిత్రమును వ్రాసి యుండెను. ఈ గ్రంథము చరిత్రాత్మక గ్రంథము.

23. లింగనమంత్రి 24. వీరభద్రరాజు

100. లింగనమంత్రి, వీరభద్రరాజు యను నిద్దరు కవులును శ్రీకృష్ణదేవరాయని కాలమునందలి కవులే. వీరిద్దరు పేరెన్నిక గన్న వీరశైవ కవులే.

25. విరూపాక్ష పండితుడు 1584

101. విరూపాక్ష పండితుడు చెన్నబసవ పురాణమను గ్రంథమును రచించెను. ఈ గ్రంథమునందు బసవ యనువారు శివునిఅవతారమనియే వ్రాసియుండెను.

26. గురుబసవకవి

102. గురుబసవ యనుకవి వీరశైవమత సర్వతోముఖ చరిత్రను గురించి వేర్వేరు విషయములను విశదీకరించుచు 'సప్త కావ్యము'లను గ్రంథమును రచించెను. ఈ గ్రంథము 1584 వ సంవత్సరమున వ్రాయబడెను. అప్పటికి వీరశైవులకును, వైష్ణవులకును గాఢమైన స్పర్థ లుండెడివి.

27. అదృశ్య కవి 1595

103. 'అదృశ్య' యను కవి 'ప్రౌఢరాయ చరిత్ర' యనుపేర వీరశైవాచార్యుల చరిత్రలను వ్రాయుచు వైష్ణవ బ్రాహ్మణ భారత చరిత్ర యందలి కొన్ని అంశములను తర్కించుచు విమర్శించెను.

28. తొంటాద సిద్ధేశ్వరము

104. తొంటాడ సిద్ధేశ్వరమను కవి జ్ఞానామృతమను నొక గ్రంథమును వ్రాసెను.

29. విరక్త తొంటదార్య కవి

105. తొంటదార్య యను కవి సిద్ధేశ్వర పురాణమును 1560 వ సంవత్సరమున వ్రాసియుండెను. ఈతనిని కొందరు విరక్త తొంటదార్య యని పిలిచెడివారు.

30. సర్వజ్ఞమూర్తి

106. మతసంబంధ మైనట్టియు, నీతిని బోధించునట్టియు, సాంఘిక విషయములను తర్కించునట్టియు 'సర్వజ్ఞపదగలు' యను నొక గ్రంథమును యీ సర్వజ్ఞమూర్తి యను కవి, వేమనశతకమును మాతృకగ నుంచుకొని వ్రాసియుండెను.

వైష్ణవకవులు

1. రుద్రభట్టు 1172 - 1219

107. రుద్రభట్టు యను బ్రాహ్మణుడు 'జగన్నాథవిజయ' మను నొక గ్రంథమును 1172–1219 మధ్యకాలమున వ్రాసియుండెను. ఈ గ్రంథము బాణాసురునివధతో నంత్యమగు శ్రీకృష్ణపరమాత్ముని చరిత్రమైయున్నది. ఇది చంపుకావ్యము.

2. నరహరితీర్థ 1287

108. నరహరితీర్థ యను కవి 1287 వ సంవత్సరమున శ్రీ మహావిష్ణునిగూర్చిన కొన్ని స్తోత్రగీతములను వ్రాసెను.

109. నిజమైన వైష్ణవమతముయొక్క పలుకుబడి కన్నడ వాఙ్మయమునందు శ్రీకృష్ణదేవరాయల కాలముననే ప్రకాశించినది.

3. నారప్ప

110. సంస్కృతభారతమునందలి మొదటి పది పర్వములు నారప్పయనుకవిచే రెండవ దేవరాయనికాలమున ప్రారంభింపబడెను. ఈ గ్రంథము 'గడగు' దేశమునందలి దేవుని కంకితముచేయబడెను. అందువలన నీ గ్రంథము 'గడగేనభారత' మని పిలువబడుచున్నది. ఈతనిని కుమారవ్యాసుడని పిలిచిరి.

4. తిమ్మనకవి

111. నారప్ప వ్రాయగామిగిలిన యెనిమిది పర్వములు భారతమున్ను తిమ్మన యను కవిచే శ్రీకృష్ణదేవరాయలకాలమున 1510 వ సంవత్సరమున వ్రాయబడెను. ఈ గ్రంథమును కృష్ణరాయ భారతమని పిలచిరి. ఈ కవి యీ గ్రంథమును కృష్ణదేవరాయని ఆజ్ఞానుసారముగ వ్రాసెను.

5. నరహరి

112. నరహరి యనుకవి షోలాపూరులోని తొరవె యను గ్రామ కాపురస్థుడు. ఈతడు వాల్మీకిరామాయణమును కన్నడభాషలో వ్రాసెను. అందువలననే నీతనిని కుమార వాల్మీకి యని పిలిచిరి.

6. చాటువిట్టలనాథకవి

113. చాటు విట్టలనాథకవి రాయలకాలమున నుండెను. ఈతడు భాగవత గ్రంథమును కన్నడభాషలో వ్రాసెను. ఇదిగాక మహాభారతములోని కొన్నిపర్వముల ననువదించెను.

114. మధ్వ గురువులగు వ్యాసతీర్థులవారు రాయల కాలములోనివారే. ఆ కాలమున చైతన్యులవారున్ను యిచటికి వచ్చి యుండిరి. వీరందరున్ను దైవభక్తిపూరితములగు విష్ణుసంకీర్తనములను దేవునిభజన కుపయుక్తమగునట్లు రాగేలి వృత్తములలో పద్యరూప ముగ ననేక భగవత్కీర్తనలను వ్రాసియుండిరి. వీరి ననుకరించియు, వీరిచే ప్రోత్సహింపబడియు ననేకభక్తులు నిట్టికీర్తనల వ్రాయుచుండిరి. ఈ పద్యరూపక సంకీర్తనమే ప్రజానీకమునకు మిక్కిలి యుపయోగ కరముగ నుండుటయేగాక వైష్ణవమత మీ పద్యరూపమున దేశమునం దంతటను ప్రచారము చేయబడినది. అట్లు ప్రచారము చేసినవారిలో కొంద రగ్రగణ్యు లుండిరి.

7. పురందరదాసు

115. అట్టివారిలో లోకప్రఖ్యాత పురుషుడు పురందర దాసు. వీరు రాయలకాలముననుండి వారి తదనంతరము 1564 లో మరణించిరి.

8. కనకదాసు

116. కనకదాసనువారింకొరు. వీరున్ను వారి సమకాలికులే. వీరు శ్రీకృష్ణునిగూర్చి కొన్నికీర్తనలు వ్రాసియుండిరి. వీటినే జనులు మోహనతరంగము లనియెడివారు. ఇట్టి తరంగములు శ్రీకృష్ణుని గూర్చియు, రామునిగూర్చియు వ్రాయబడెను. 'కృష్ణభక్తసేవ' యను నది వీరు వ్రాసిన యింకొక గ్రంథము.

9. భట్టకలంకదేవ

117. భట్టకలంకదేవ యను కవి 'కర్ణాటక కోశశబ్దమంజరి' యను వ్యాకరణగ్రంథమును వ్రాసియుండెను. ఇందు 592 సంస్కృత సూత్రములు కలవు. ఈతడు జైనమతస్థుడు. ఈతనికి ఆరు భాషలలో పాండిత్యము కలదు.

10. కాంతి యను కవయిత్రి

118. కాంతి యను స్త్రీ కవయిత్రి రామాయణమును వ్రాసెను.

11. పంచబాణకవి 1614

119. పంచబాణకవి బెలగొల కాపురస్థుడు. 1614 వ సంవత్సరమున బెలగొల దేవాలయమున గోమతేశ్వరుని స్థాపనచేసినపుడు భుజబలి చరిత్ర యను నొక గ్రంథమును వ్రాసెను.

12. చంద్రమ

120. చంద్రమ యను కవి కర్కోల ప్రతిమను స్థాపించిన సమయమున 1646 లో కర్కోల గోమటేశ్వర చరిత్రమనుపేర నొక గ్రంథమును రచించెను.

121. బసవునిచరిత్రమును బిజ్జలరాయని చరిత్రయనుపేర 17 వ శతాబ్దమున జైనులు వ్రాసియుండిరి. బసవనుగూర్చి తమ అభిప్రాయములను వెలిబుచ్చుచు నీ గ్రంథమును వ్రాసిరి. అట్లే వారి నీతులను గురించి 'జినమణిజిన' యను గ్రంథమును వ్రాసియుండిరి.

122. భర్తృహరి సుభాషితములను బోలు గ్రంథమును కన్నడభాషయందు పదునేడవ శతాబ్దమున సంఘాతాలు యనుపేర వ్రాసియుండిరి.

123. మల్లిఖార్జునుడను యొక కవి 1245 నీతిపద్యములుగల గ్రంథమును 'సూక్తి సుధార్ణవ' యనుపేర వ్రాసియుండెను.

124. కన్నడభాషయం దనేక శాస్త్రములను గూర్చిన పుస్తకములున్ను వ్రాయబడినవి.

125. హంసవింశతి, శుకసప్తతి, బేతాళపంచవింశతి, సింహాసన ద్వాత్రింశతివంటి యనేకపుస్తకములున్ను వ్రాయబడినవి.

పందొమ్మిదవ శతాబ్దమున కన్నడభాషను పోషించుటలో మైసూరుమహారాజు కృష్ణరాజ వడయారు ప్రఖ్యాతివడసెను. ఈ వడయరుగారు భాషాపోషకులేగాక తాము గ్రంథములను రచించెను. వీరును దాదాపు నలుబది పుస్తకములు 1838 కి వ్రాసియుండిరి.

వారికాల అలియలింగ రాజనెడువారు అనేక యక్షగాన గ్రంథములను వ్రాసియుండిరి.

వీరికాలమునను జైనకవులున్ను ఉండియుండిరి. 1838 వ సంవత్సరమున దేవీచంద్రుడను నొక జైనమతస్థుడు 'రాజావళికథ' యను నొక గ్రంథమును జైనధోరణిలో వ్రాసియుండెను.

19 వ శతాబ్ద చివరభాగమున డాక్టరు కిట్టె లను పాశ్చాత్య పండితుడు కన్నడమునుండి ఇంగ్లీషుభాషలోనికి యొక డిక్షనరి వ్రాసియుండెను.

కన్నడభాషను వృద్ధిజేయు నుద్దేశముతో కన్నడదేశమున "కర్ణాటక విద్యావర్ధక సమాజ" మనుపేర నొక సమాజము స్థాపింపబడెను. వీరాధిపత్యమున విద్యాభూషణ యనుపేర నొక పత్రిక స్థాపింపబడెను.

ఇటీవల యనేక నూతనకవు లుండిరి. ముద్దన యనుకవి రామాశ్వమేధమను నవలను వ్రాసియుండెను. శ్రీకంఠయ్య, గుండప్ప, కేంద్రి, దేవకవి పుట్టప్ప, రాజరత్నం కడెంగల్లు, మధురచెన్ని మొదలయినవా రందరు నూతనకవులు. ఇట్టివా రనేకు లుండియున్నారు.

ఆరవ ఉపన్యాసము

ఆంధ్రము : తెలుగు : తెనుగు

ఇప్పు డాంధ్రదేశ మనెడి రాష్ట్రమునం దుండెడివా రాంధ్రులై యున్నారు. వీరినే తెలుగువారనియు, తెనుగువారనియు కూడ పిలుచుచున్నారు. వీరిభాష ఆంధ్రభాష. దానినే తెలుగు భాషయనియు, తెనుగుభాషయనియుకూడ చెప్పుచున్నారు. సంస్కృత భాషయందు కొన్నిచోట్ల అంధ్రలనియు, మరి కొన్నిచోట్ల ఆంధ్రు లనియు కనుబడుచున్నది. ప్రప్రథమమున ఆంధ్రయని గాని, అంధ్ర యనిగాని వేదమున చెప్పబడియున్నది. ఐత్తిరేయ బ్రాహ్మణము నందు ఆంధ్రయను పదము ప్రథమమున కనుపించుచున్నది. ఇందు విషయమై సప్తమపంచికయందు తృతీయాధ్యాయమున నొక కథ చెప్పబడియున్నది. ఆ కథ నిచట సంపూర్ణముగ వివరించెదను.

2. ఇక్ష్వాకు వంశమున విదేహుని కుమారుడగు హరిశ్చంద్రునికి నూర్గురు భార్యలుండియు పుత్రులులేరు. వీరి ఇంటియందు నారదమహాముని నివసించుచుండెను. ఒక దినమున "నారదా! పుత్రులు కావలయునని జనులు కోరుచుందురే. కొడుకులవలన గల్గులాభము లెయ్యవి?" యని హరిశ్చంద్రుడు నారదుని నడిగెను. అందులకు "పుత్రులు లేనివానికి జీవితమేలేదను విషయము పశువులకు కూడ తెలియునే" యని నారదుడు చెప్పుచు నీవు వరుణునివద్దకు పోయి కుమారుడు కావలయునని కోరుము. ఆ కుమారుని తనకు బలి యిచ్చెద ననియు చెప్పుము" అనెను. అంత హరిశ్చంద్రు డట్లేచేయగ వరుణుడు వల్లె యనెను. అటుపిమ్మట హరిశ్చంద్రునికి 'రోహితు' డను పుత్రుడు కల్గెను. పిమ్మట వరుణుడు పిల్లవానిని బలియిమ్మని కోరెను. హరిశ్చంద్రుడు కాలవ్యవధి కోరుచుండెను. కొంతకాలమునకు రోహితుడు

పెద్దవాడైనపిదప హరిశ్చంద్రు డందుకంగీకరించి యీ విషయమును రోహితునికి చెప్పెను. రోహితు డందుల కంగీకరించక అడవికిపోయెను. ఇందుపైన వరుణుడు హరిశ్చంద్రునిపై కోపించి శపించగ హరిశ్చంద్రునికి జలోదరము కల్గెను.

3. రోహితు డిల్లువదలి ఆరుసంవత్సరములు తిరిగి తిరిగి అజగర్త యను ఋషియాశ్రమమునకు బోయి యీ సంగతినంతను చెప్పి ఋషికుమారులైన శునపుచ్ఛ, శునస్సేవ, శునోలాంగూల యను ముగ్గురుకుమారులలో నొకరిని వరుణునికి బలిగా నివ్వమని కోరెను. శునపుచ్ఛు నిచ్చుటకు తండ్రి అంగీకరించలేదు. శునోలాంగూల నిచ్చుటకు తల్లి అంగీకరించలేదు. శునస్సేపుడు తా నెవరికి నక్కరలేనందున తనను వరుణికి బలియిచ్చుట కంగీకరించెను. అంత రోహితుడు శునస్సేపుని వెంటనిడుకొని తండ్రివద్దకు వచ్చెను. హరిశ్చంద్రు డందులకుసంతసించి వరుణునకు తెలియపరచెను. వరుణుడు అందుల కంగీకరించెను. అంత రాజసూయయాగము ప్రారంభింపబడెను. సోమపానము చేయుసమయమున బాలుని బలియిచ్చుట కేర్పరుప బడెను.

4. యాగమునందు విశ్వామిత్రుడు హోత్రిగను, జమదగ్ని అధ్వర్యుడుగను, వసిష్ఠుడు బ్రహ్మగను, అయాస్యుడు ఉదాత్రిగను ఉండెను. అజగర్తుడు రెండువందలఆవుల ప్రతిఫలముగ గ్రహించి శునస్సేపుని యాగస్తంభమునకు గట్టెను. అజగర్తుడే శునస్సేపుని జంపుటకు ప్రయత్నించగ, శునస్సేపుడు తనను రక్షింపమని వరుసగా ప్రజాపతిని, అగ్నిని, సవిత్రిని, వరుణుని, తిరిగి అగ్నిని, విశ్వదేవుని, ఇంద్రుని, అశ్వినులను, ఉషస్సును ప్రార్థించెను. ఉషస్సును మూడు ఋక్కులచే ప్రార్థించెను. మొదటి ఋక్కునకే తనబంధ మూడిపోయి హరిశ్చంద్రుని ఉదరము తగ్గెను. మూడవ ఋక్కుతో శునస్సేపుడు వదలిపెట్టబడి హరిశ్చంద్రు డారోగ్యవంతు డాయెను. శునస్సేపుడు మిగిలినయాగమునందు తాను పాల్గొనెను.

5. అంత శునశ్శేపుడు విశ్వామిత్రునివద్దకు వెళ్లెను. అజాగర్తుడు తనకుమారుని తన కిమ్మనికోరెను. అందుకు విశ్వామిత్రుడంగీకరించలేదు. ఈతడు దేవతలచే తన కివ్వబడెననియు, దేవరతుడనియు, తన కుమారుడనియు విశ్వామిత్రుడు జవాబు చెప్పెను. అజాగర్తుడు శునశ్శేపుని తనవద్దకు రమ్మనెను. తనను చంపయత్నించి పాపముచేసినందున తాను రాననెను. అజాగర్తుడు తాను చేసినపాపము తప్పించుకొనదగినది కాదనియు, శునశ్శేపుడు తనకుమారుడుగనే యుండవలయుననియు కోరెను. శునశ్శేపుడు రోహితుని అడిగెను. చివర కితడు విశ్వామిత్రుని పెద్దకుమారుడై దేవతలప్రీతిని సంపాదించెను. అంత నీ విశ్వామిత్రుడు శునశ్శేపునితో తనయాశ్రమమునకు వెళ్లెను. ఈ కథయందు ముందున్నభాగమును ఋక్కుతోసహా యీ క్రింద వ్రాసెదను.

ఐతరేయ బ్రాహ్మణం, సప్తమపంచికా తృతీయాధ్యాయః "తస్య హ విశ్వామిత్రస్య ఏకశతం పుత్రా ఆసుః. పచాంశ దేవ జ్యాయాంసో మదుచ్ఛందసః పంచాశత్ కనీయాంస స్తత్ర యేజ్యాయాంసో న తేకుశలం మేనిరే. తా నను వ్యాజహా రాంతా న్వః ప్రజా భక్షీష్టేతి తపతేంధ్రాః పుండ్రాః శబరాః పుళిందా మూతిబా ఇత్యుదంత్యా బహవో భవంతి వైశ్వామిత్రా దస్యూనాం భూయిష్ఠాః."

పై దానికి సాయనభాష్యం

మదుచ్ఛందోనామకః కశ్చిత్పుత్రో మధ్యమ స్తతోపి జ్యేష్ఠాః కనిష్ఠాః ప్రత్యేకం పంచాశత్సంఖ్యాకాః ఇత్యేవ మేకశతం తస్య పుత్రాః. తేషాం మధ్యే జ్యేష్ఠానాం వృత్తాం తమాహ. తత్తేషు ఏకశతసంఖ్యాకేషు పుత్రేషు మధ్యే యే మధుచ్ఛందసో జ్యేష్ఠాః పంచాశత్సంఖ్యాకాః సంతి తే శునశ్శేఫస్య విశ్వామిత్ర పుత్రత్వం కుశలం న మేనిరే ఇదం సమీచీన మిత్యేవం నాంగీకృతవంతః. తాన్ జ్యేష్ఠాన్ పంచాశత్సంఖ్యాకా ననులక్ష్య విశ్వామిత్రో వ్యాజహార- వ్యాహరణం శాపరూపం వాక్యముక్తవాన్. హే జ్యేష్ఠపుత్రాః ! యుష్మాకం మదీయాజ్ఞాతిలంఘినాం ప్రజా పుత్రాదికా అంతాన్ భక్షీష్ట చండాలాదిరూపా న్నీచజాతివిశేషాన్ భజతామితి తపతే శప్తాః సంతో అంధ్రత్వాది పంచవిధ నీచజాతి విశేషా భవంతి. ఇతి శబ్దస్య తత్ప్రదర్శనార్థత్వా దన్యేపి నీచజాతివిశేషాః సర్వే వివక్షితాః ఉద్గతోంత ఉదంతో ఒత్యంతనీచజాతి స్తత్ర భవా ఉదంత్యాః తే బహవో ఒనేకవిధా వైశ్వామిత్రా విశ్వామిత్ర సంతతిజా దస్యూనాం తస్కరాణాం మధ్యే భూయిష్ఠా అత్యధికాః."

ఆ విశ్వామిత్రునకు నూర్గురు పుత్రులుండిరి. అందు మధ్యముడైన మధుచ్ఛందుడు జ్యేష్ఠుడుగాగల చిన్న కొడుకులు యేబదిమంది తనతో తెచ్చిన శునస్సేపుని జ్యేష్ఠునిగాజేసి వాని యాజ్ఞకు బద్ధులై యుండునట్లు విశ్వామిత్రుడు తన పుత్రులను కోరెను. జ్యేష్ఠపుత్రు లేబది మంది తండ్రియాజ్ఞను మన్నింపలేదు. మన్నింపకపోగా హేళనము జేసిరి. అందుకు విశ్వామిత్రుడు కోపించి తనవాక్యము ననుసరింప నిరాకరించిన జ్యేష్ఠపుత్రు లేబదిమందినిగూర్చి శాపరూపమైన నీ దిగువ వాక్యముల పలికెను: "పితురాజ్ఞాతిక్రమణ మొనర్చిన యో జ్యేష్ఠ పుత్రులారా! మీరు చండాలాది నీచజాతులుగ నయ్యెదరుగాక !" అని శపించెను. ఈ శాపమువలన వారలు శారీరకముగను, మానసికముగను నీచజాతి పరిణామమునుపొంది నీచజాతులయిన ఆంధ్ర, పుండ్ర, శబర, పుళింద, మూతిబా మొదలయిన నీచజాతులుగ మారిపోయిరి. 'ఇతి' శబ్దమువలన పైన పేర్కొనబడిన అయిదు జాతులేగాక యింకను యితరములుగనున్న అంత్యజాతులన్నియుకూడ జెప్పబడినవి. వారందరును అంత్యజాతులలో జనాన్మంతములలోకూడా ఉదయించుచుండిరి. విశ్వామిత్రుని సంతానమువలన బుట్టినవారు దస్యులనెడి దొంగలలో అత్యధికులుగ నుండిరి.

6. అసలు ఋక్కునందుకన్న వ్యాఖ్యానమునందు హెచ్చు సంగతులు వ్రాయబడియున్నవి. వ్యాఖ్యాన మిటీవల వ్రాయబడినదై నందున హెచ్చువిషయములు వ్రాయబడినవని చెప్పవలసియున్నది.

7. అసలునందు వ్రాయబడినదానివలన తన ఆజ్ఞ ననుసరించని పుత్రు లందరు నీచజాతులవా రగుదురుగాక యని శపింపబడిరి. ఆ నీచజాతులలో ఆంధ్రు లొకరై యున్నందున ఈ నీచ జాతులైన ఆంధ్రులు మొదలగువారు దస్యులని పిలువబడెడువారు. ఆ కాలమున దస్యులు అనాగరికులును, అనార్యులునై యుండిరి. ఆర్యులందరు ఇంద్రాగ్ని వరుణుల పూజించెడువారు. అనార్యు లట్లు పూజించుట కర్హులుగారు. నిరుక్తమునందు కర్మనాశికులు అనార్యులనియు, కర్మయుక్తులు ఆర్యులనియు చెప్పబడినది. ఆర్యులకును, అనార్యులకును పూజయందున్న భేదమువలనను, కర్మయందలి భేదమువలనను భేదములున్నట్లు కన్పించుచున్నది. అంతేగాని జాతియం దెట్టి భేదమున్నులేదు. దస్యులు నగరములందు నివసించుచున్నట్లును, రథములుగల్గియున్నట్లును, బంగారునగలు గల్గియున్నట్లును, ఆస్తిపాస్తులు సంపాదించినట్లును వేదమునందే వ్రాయబడియుండెను. దీనినిబట్టి చూడ దస్యులకును, ఆర్యులకును పూజలయందు తప్ప యితర విషయములందు భేదము లేనట్లును, వీరిద్దరు నొకే జాతివారే యైనట్లును, మంచి నాగరికత కలవారనియు స్పష్టపడుచున్నది. దస్యులు తస్కరులని యిప్పటికి నాలుగైదు వందల సంవత్సరముల క్రింద వ్రాయబడిన సాయనవ్యాఖ్యానమునందు వ్రాయబడినదే గాని ఆ కాలమున దస్యులు తస్కరులని యెవరున్ను చెప్పియుండలేదు. ఈ బ్రాహ్మణము మిక్కిలి ప్రాచీనగ్రంథ మనుట కెంతమాత్రము సందేహములేదు. ఇంతేగాక దస్యులనువారు అస్సీరియా, మీడియా, పార్శీదేశములవారు పిలువబడినట్లు రెండువేల అయిదు వందల సంవత్సరముల క్రింద 'డెరయ' సను పర్షియాదేశపు రాజు వ్రాయించిన పహ్లావిభాషయందలి శాసనమువలన రూఢి యగుచున్నది.

8. పాశ్చాత్య పండితులును మనవారు నీ బ్రాహ్మణము యొక్క సరియైన కాలమును నిర్ణయించుటకు ప్రయత్నించిరి. కోల్బ్రూకు (Colebrooke) పండితుడు నక్షత్రసంఘటనను గుణించి, జ్యోతిష శాస్త్రము నుపయోగించి నీ ఐత్తిరేయ బ్రాహ్మణము క్రీ. పూ. 4-వ శతాబ్దపు నాటిదై యుండవచ్చునని వెల్లడించిరి. మాక్సు మూలరు పండితుడు (Max Muller) తానెవ్వియో లెఖలను వేసి యీ బ్రాహ్మణము క్రీ. పూ. 8-వ శతాబ్దపునాటిదని లెఖించిరి. విల్సను పండితుడు (Wilson) తన లెఖలప్రకారము క్రీ. పూ. 11-వ శతాబ్దమునాటిదనిరి. మన పండితులలో భండార్కరు (Bhandarkar) పండితు డీ విషయమై కొంత పరిశ్రమ గావించెను. మనలో బాల గంగాధర తిలక్ పండితుడు (Bal Gangadhara Tilak) వ్రాసిన విషయముల నాలోచించిన వేదములు ప్రథమమున క్రీ.పూ. ఆరువేల సంవత్సరముల క్రింద ప్రారంభింపబడి బ్రాహ్మణములు పూర్తియగు నప్పటికి క్రీ. పూ. రెండువేల అయిదువందల సంవత్సరములై యుండవచ్చునని వ్రాసి యుండిరి. అందువలన నీ బ్రాహ్మణముల కాలమును గూర్చి సరిగా జెప్పజాలముగాని మొత్తముమీద నిప్పటికి మూడువేల సంవత్సరముల పైకాలమున వ్రాయబడినవని మాత్రము మనము స్పష్టముగా జెప్పనగును. ఆంధ్రు లప్పటికి పూర్వమే యుండి యుండవలెననెడి అంశ మిందువలన స్పష్టపడుచున్నది. అయితే అప్పుడు పల్కరింపబడినది, హ్రస్వముతో గూడిన అంధ్రులుగాని యిప్పుడు మన ముచ్చరించు దీర్ఘ 'ఆ' తో ప్రారంభింపబడిన 'ఆంధ్రులు' గారు. ఈ భేదమునుగురించి ముందు కొంత వ్రాయబడును.

9. పార్శీగ్రంథమగు 'జెండు అవెస్టా' యందు ఆంధ్ర యను శబ్దము వ్రాయబడియున్నదిగాని అది 'ఇంద్రుని' బదులు వ్రాయబడినట్లు కనుబడుచున్నది.

10. మన పురాణేతిహాసములయందును, ధర్మశాస్త్రముల యందునుకూడ నీ యాంధ్రపదము జాతిపదముగగాని, దేశపదముగ

గాని పల్కరింపబడినది. అయితే కొందరు పాశ్చాత్యపండితులును, మన పండితులును కూడ నీ విషయమై వ్రాసియుండిరి. అయితే మన రామాయణ మహాభారతమున వ్రాయబడిన కొన్ని శ్లోకములు ప్రక్షిప్తములై యుండవచ్చునని కొందరు శంకించుచున్నారు. కాని యిట్టి ప్రక్షిప్తశ్లోకముల నెందుకీ యితిహాసములలోనికి జొప్పించిరోయను కారణమున్ను కనుపించదు. చక్కగ పరిశీలించినవి ప్రక్షిప్తములున్ను కావు. ఈ వాద మెట్లున్నను యీ విషయములనుగూర్చి మాత్రము వ్రాయుదును.

వా ల్మీ కి రా మా య ణ ము

11. ఆదికవియగు వాల్మీకి తన రామాయణ కిష్కింధ కాండయందు

“విదర్భా నృషికాంశ్చైవ। రమ్యా న్మాహిషికానపి
తదావఙ్గం కలింగాంశ్చ। కౌశికాంచ సమంతతః.　　(10)

అన్వీక్ష్య దండకారణ్యం। సపర్వత నదీ గృహం
నదీం గోదావరీంచైవ। సర్వమేవానుపశ్యత.　　(11)

తథైవాంధ్రాంశ్చ పుండ్రాశ్చ। చోళాన్పాండ్యాంత్స కేరళాన్
అయోముఖశ్చ గంతవ్యః। పర్వతో ధాతుమండితః.　　(12)

—41 వ సర్గ.

దేశపరముగ ఆంధ్రము చెప్పబడెను. వానరు లన్వేషింపవలసిన దేశములను వివరించుచు కవి యీ దేశములపేర్లను కిష్కింధా కాండమునందు నలుబదియొకటవసర్గయందు యీ శ్లోకములను వ్రాసియుండెను. ఆంధ్రయను పేరు కల్గిన శ్లోక మేల ప్రక్షిప్తమో తెలియకున్నది.

12. అరణ్యకాండయందు సీతాదేవిని రావణు డెత్తుకొని పోయినపుడు సీత మొరలిడినను ఆ పెమొరలను వినుపించుకొను జను

లెవరు నీ ప్రదేశమున లేనట్లు వ్రాయుటవలన నిది కేవల మరణ్య ప్రదేశమై యుండెనని మన మూహింపవలసినదిగను, అందువలన నీ ‘యాంధ్ర’మను పేరుగల్గిన కిష్కింధ కాండలోని శ్లోకములు ప్రక్షిప్తములై యుండవలెనని వారి వాదన. ఇందు కొంత నిజములేకపోలేదు. ఈ ప్రదేశమంతయు అరణ్యమే యై యుండుట నిక్కవమే అయి యున్నది. ఈ వాదమును కాశిభట్ల బ్రహ్మయ్య శాస్త్రులవారు నన్నయభట్టారక చరిత్రమున వ్రాసియుండెను. ఇట్టి వాదమునే పాశ్చాత్యపండితులును కొందరు అనుసరించియుండిరి. మన దేశపండితులైన నవీనచంద్రదాసనువారున్ను అనుసరించియుండిరి. ఈ వాదమున చెప్పినట్లు యీ ప్రదేశమంతయు దండకారణ్యమైనట్లును, వాల్మీకి రామాయణమున ఉత్తరకాండయందు విపులముగను చదువుటకు సొంపుగ నుండునట్లును చిత్రించియుండిరి.

13. ఇక్ష్వాకునకు ముర్వురు పుత్రులుండిరి. అందు కనిష్ఠుడు మిక్కిలి మూర్ఖుడు. ఈతనికి వింధ్య శైలపర్వతములనడుమ నొక రాజ్య మేర్పరచిరి. ఈ రాజు పేరు దండుడు. ఇచట నీ దండు డొక రమ్యమైన పట్టణము నొకదానిని నిర్మించి దానికి మధుమంతమని పేరుపెట్టెను. ఆతడు అచట బహుకాలము చక్కగ పరిపాలనగావించి, యొక మనోహరమైన చైత్రమాసమున భార్గవముని యాశ్రమమునకు పోయి భార్గవ ముని లేనిసమయమున అప్రతిమరూపవంతురాలైన ఆ మునికుమార్తె యగుఅరజనుజూచి, మోహోన్మత్తుడై యామె వలదని చెప్పినను వినక బలవంతమున నామెను రమించెను. ఈ విషయమును భార్గవముని విని, కోపించి, దండుడు భృత్యబలవాహనములతో యేడుదినములలో మృతిజెందునట్లును, ఆ దేశముచుట్టును నూఱుయోజనములవరకును దేవేంద్రుడు దుమ్మువానను కురిపించి, కాల్చివేయునట్లును శపించి యీ దండుని దేశమునందున్న సకలజనములను, జనపదులను దండుని దేశమునకు వెలుపట నివసించున ట్లానతిచ్చెను. ఆ జనులందరును,

"నిష్క్రాంతో విషయాత్తస్మాత్ స్థానం చక్రే௨థ బాహ్యతః.

— 81 వ సర్గ శ్లో. 12.

దండుని దేశమునకు వెలుపట తమ నివాసంబుల నేర్పరచుకొనిరి. అతని దేశము మాత్రము నిర్జనమై దండకారణ్యమాయెను. కాని అచటనే కొందరు ఋషులున్నందున దానినే జనస్థానమనిరి.

తతః ప్రభృతి కాకుత్స్థ! దండకారణ్య ముచ్యతే
తపస్విన స్థితాయత్ర। జనస్థాన మతో௨భవత్.

— 81 వ సర్గ. శ్లో. 19-20

కాన దండుని దేశమునందున్న జనమంతయు దండుని దేశమునకు బయట నివాసము లేర్పరచుకొనిరి. పై దానివలననే దేశమంతయు నిర్మానుష్యము కాలేదని స్పష్టమగుచున్నది. సీతను రావణుడు తీసికొని పోయినమార్గమున జనులామె మొరలను వినలేదన్నంత మాత్రమున నచట దేశమే లేదనిచెప్పుటకు కారణము కనుపించదు. దండకారణ్య మధ్య ప్రదేశముననే తనకుమార్తెయగు అరజ నివసించుట కొకరమణీయ మైన సరస్సుండెననియు,నాపె యాకొలనువద్దనే నివసించుచుండినట్లును, ఆ దుమ్మువాన కురియు సమయమున నా యాశ్రమమున నుండువారు చావకుండునట్లేర్పరచి శుక్రుడును, తన ఆశ్రమవాసులు నింకొక-చోట వాసము నేర్పరచుకొనిరి. కాన నీ చరిత్రనుబట్టి దండకారణ్యము చుట్టును, భృగుఆశ్రమమునను జనులు నివసించుచున్నట్లే కనబడు చున్నది.

14. మరియు రామాయణ కాలమున లంకానివాసులగు అసురులు దండకారణ్య ప్రదేశమునంత నాక్రమించినట్లును రామాయణమే చెప్పుచున్నది. విశ్వామిత్రుని ఆశ్రమప్రాంతములవరకు అసురులు వచ్చుచున్నట్లును, తమ యజ్ఞముల చెడగొట్టుచున్నట్లును రామాయణమున వ్రాయబడియే యున్నది. ఆ కాలమున ఖరుడు,

దూషణుడు, త్రిసురుడు, మారీచ సుబాహులైనవా రందరు నచటనే యున్నట్లు రామాయణమే చెప్పుచున్నది. వీరందరు రావణాసురుని బంధుకోటివారే. ఐతరేయబ్రాహ్మణమునందు చెప్పబడిన ఆంధ్రులు, పుండ్రులు, శబరులు మొదలయిన వారందరు నీయసురులేమో! యను సంశయమున్ను పొడముచున్నది. మన వ్యాకరణ వేత్తలందరు రావణాసురుడు సమగ్రమైనట్టియు, సంపూర్ణమైనట్టియు, సలక్షణ మైనట్టియు ఆంధ్రవ్యాకరణమును వ్రాసెనని చెప్పుదురు. ఈ గ్రంథమున లేనివిషయ మింకొక వ్యాకరణగ్రంథమున లేదనియుకూడ చెప్పబడు చున్నది. ఈ రావణాసురునకు ఆంధ్రులకు సంబంధము కలదా? ఈ విషయమును సమన్వయ పరచుటెట్లు?

15. పైనవ్రాసిన విషయములనుబట్టి ఈ దేశమాకాలమున నిర్మానుష్యమని చెప్పుటకు వీలులేదు. జనులుండిరి. కాని లంకానివా సులగు అసురుల భయమువలననో లేక వారు సహాయముచేయజాల కనో మరియే యితర కారణములవలననో యూరకుండియుండవచ్చును. కాని దేశమునిర్మానుష్యమైనదని చెప్పుటకు వీలుకనుపించదు.

16. అరజ నివాసముచేసియుండిన స్థలమువద్దనున్న సరస్సే కొల్లేరుసరస్సని విజ్ఞులు చెప్పుదురు. ఆంధ్రదేశమునుగూర్చి వ్రాయ బడిన భాగమున్ను ప్రక్షిప్తమనియుచెప్పుటకు కారణము కనుపించదు. ఈ భాగమునందే అగస్త్యాశ్రమము, పంచవటి, పర్ణశాల మొదలయిన ప్రఖ్యాతస్థలము లుండియుండెను. వీటి నన్నిటినిబట్టి రామాయణ మునం దాంధ్రదేశ ప్రశంసచేయబడెనని చెప్పుటయే సరియని తోచు చున్నది.

మహాభారతము

17. భారతమునందు అర్జున వనవాసపర్వమున అనేక దేశము లను, పుణ్యక్షేత్రములను చూచినట్లు వ్రాయబడియుండెను. కాని ఆంధ్రదేశమునుగురించిన ప్రశంస కనబడదు. అయితే భారతము

నందలి యితరభాగములయందు ఆంధ్రప్రశంస లేకపోలేదు. కర్ణపర్వము నందు యీ క్రింది శ్లోకములయం దాంధ్రప్రశంస గలదు.

> సశక్తిప్రాస తూణీరా నశ్వారోహాన్ స్వయానపి
> పుళింద ఖన బాహ్లీక నిషాదా నాంధ్రకుంతలాన్
> దాక్షిణాత్యాంశ్చ భోజాంశ్చ శూరాన్ సంగ్రామకర్కశాన్
> దిశ స్త్రత నభో బాణైః కృత్వా ... ...

ద్రావిడులు, మళయాళులు భారతయుద్ధమున పాండవులతో కలసి యుద్ధముచేయగా నాంధ్రులు కౌరవపక్షపాతులై కౌంతేయపక్ష మవలంబించిరి. కర్ణపర్వముననేగాక ఆంధ్రశబ్దప్రశంస భీష్మ ద్రోణ పర్వములయందు గలదు,

సభాపర్వమునందు:

> "జటాసరోమద్రతానాంచ రాజా కుంతః పుళిందాశ్చ కిరాతరాజః
> తదాంగవంగే సహాపుండ్రకేణ పాండ్యోఢ్రరాజేన మహాంధ్రకేణ"

సహదేవుని దిగ్విజయయాత్రాసందర్భమున,

> దూతైరేవ వశే చక్రే కరం చైనా నదాపయత్
> పౌండ్రాంశ్చ ద్రవిడాంశ్చైవ సహాం శ్చోఢ్ర కేరళైః
> ఆంధ్రాం స్తాలవనాంశ్చైవ కళింగా నుష్ట్రకర్ణికాన్
> అటవీంచ పురీ రమ్యాం యవనానాం పురం తదా.

తాళవనముతోకూడిన ఆంధ్రదేశము దక్షిణదేశమున నున్నట్లు పేర్కొన బడినది.

తిరిగి సభాపర్వములోరాజాగమన మిట్లు వర్ణింపబడెను.

> ఆకర్షం కుంతలం చైవ మాళవా శ్చాంధ్రకా స్తదా

ఇట్లే ఆంధ్రశబ్దము భీష్మపర్వమునందును ప్రశంసింపబడినది. ఇన్ని ప్రదేశముల ప్రస్తావనచేయబడిన అంశము కేవలము ప్రక్షిప్తమని చెప్పుట సమంజసము కాజాలదు.

భా గ వ త ము

18. శ్రీమద్భాగవత నవమస్కంధమున 23-వ అధ్యాయమున నీ విధముగ వ్రాయబడి ఉన్నది.

> అంగ వంగ కళింగాద్యాః సింహ పుండ్రాంధ్ర సంజ్ఞితాః
> జజ్ఞిరే దీర్ఘతమసో బలే క్షేత్రే మహీక్షితః
> చక్రు స్స్వనామ్నా విషయాన్ షడిమాన్ ప్రాచ్యకాంశ్చతే.

దీనినే పోతన శ్రీమదాంధ్ర భాగవతమున నవమస్కంధమున నీ విధముగ వ్రాసియుండెను.

"తితిక్షునకు రుశద్రథుండు, రుశద్రథునకు హేముండు, హేమునకు సుతపుండును, సుతపునకు బలియు పుట్టిరి. ఆ బలివలన అంగ, వంగ, కళింగ, సింహ, పుండ్ర, ఆంధ్రులను పేరుగలవారార్గురు కుమారులు పుట్టిరి. వారు తూర్పుదేశములకు రాజులయి దేశములకు తమ తమ నామధేయముల నిడి ప్రభుత్వము చేసిరి. దీనినిబట్టి ఆంధ్రుడను రాజు రాజ్యము చేసినదేశము ఆంధ్రదేశమనియు, అచటిజను లాంధ్రులనియు పిలువబడినట్లు తెలియనగును. బలి యను రాజు మగధదేశమున రాజ్యము చేసినట్లు కనుబడుచున్నది.

హ రి వం శ ము

19. భాగవతమునందలి హరివంశమున నీ యాంధ్రప్రశంస గలదు. 'చాణూరు' డను ఆంధ్రమల్లు డొకడు కంసునివద్ద నుండెడివాడు. అతనిని గూర్చి వ్రాయుచు 'ఆంధ్ర మల్లు'డనియు,

"కరూశేషు ప్రసూతో౽యం చాణూరోనామ నామతః"

అని వ్రాయబడెను. అచట చాణూరుడేగాక 'ముష్టికు' డను యింకొక ఆంధ్రమల్లు డుండెను. ఈ చాణూరుడు 'కరూశేషు' కరూశమందు పుట్టెనని వ్రాయబడియుండెను. 'కరూశ'మనునది మనిషి పేరో, దేశము పేరో యని విచారింపగ నింకొకచోట 'కరూశాధిపతి' అని వ్రాయుట వలన కరూశ మనునది దేశ మనియే యూహించవలసియున్నది. ఈ కరూశదేశ మెచట నున్నదియు వాల్మీకిరామాయణ బాలకాండ యందు వ్రాయబడియున్నది. గంగా, సరయూ నదుల సంగమ ప్రదేశమును దాటి దక్షిణముగ పోయిన తాటకావన మున్నట్లును, దానికి ప్రక్కన 'మలద', 'కరూశ' దేశము లున్నట్లును విశ్వామిత్రుడు చెప్పెను. ఆ తాటకావనమునందు పూర్వ మగస్త్యుడు యను మహా ముని యుండెననియు, నాతడు తాటకి భర్తయగు 'సునందను' డను రాక్షసుని జంప తాటకి నా ప్రదేశమునంతయు నాశనము చేసెననియు చెప్పి తాటకిని రామునిచే చంపించెను. దీని దగ్గరనే విశ్వామిత్రుని ఆశ్రమమున్న కలదు. కనుక విశ్వామిత్రుని ఆశ్రమమునకు కొంత దూరమున 'మలద' 'కరూశ' దేశములుండెడివి. ఈ కరూశ దేశమునం దాంధ్రు లుండెడివారు. అందులో నొకడు 'చాణూరుడు'. ఈతడు కంసునివద్ద మల్లుడుగ నుండెడివాడు. శ్రీకృష్ణభగవాను డీ మల్లుని యుద్ధమున జంపెను. ఇదే కథ విష్ణుసహస్రనామములయందు కనుబడు చున్నది. విష్ణుమూర్తియొక్క సహస్రనామములలో 'చాణూరాంధ్ర నిషూదన' యను నామ మొకటియై యున్నది. ఈ 'చాణూరు'ని యెఱ్ఱప్రగడ యను నాంధ్రకవి తన హరివంశమను గ్రంథమున నిట్లు వర్ణించెను.

సీ. అనిమిషేభంబుల నెనిమిదిటిని గూడ
బెనిచి మానిసి జేయ వెలసెనొక్కొ
ప్రళయానిలార్కుల పసయంతయును నావ
టించి ప్రోవిడగ దీవించెనొక్కొ

పరుమానులందర పరమార్థవిధము రూ
పప్రౌఢి గైకొని ప్రబలె నొక్కొ
గోత్రాచలంబునకును బట్టుకదలి స
ర్వావయవస్ఫూర్తి యదరె నొక్కొ
యనగ లావు, వేడిమియు, రయంబు, మూర్తి
పెనుపు నఖిలాద్భుతంబులై పిక్కటిల్ల
దాన జగజెట్టియై వెండి తనకు నెందు
మారుమల్లులు లేకుండ మలసినాడు.

20. మను తన ధర్మశాస్త్రమునందు ఆంధ్రులను సంకర జాతివారుగ వ్రాసియుండెను. కారావార స్త్రీయందు నిషాదునకు పుట్టినవాడు చమారి (చర్మకారుడు) యనియు, బ్రాహ్మణస్త్రీయందు వైశ్యునకు జనించినవాడు వైదేహుడనియు, వైదేహస్త్రీయందు చమారివానికి బుట్టినవా డాంధ్రుడనియు వ్రాసెను.

కారావారం నిషాదాత్తు చర్మకారం ప్రసూయతే
వైదేహకా దంధ్రమేదా బహిర్గ్రామ వ్యవస్థితా.

21. ఇంకొకచోట నాంధ్రులు మాంసవిక్రయులుగా నుండి జీవించునట్లును మనువే వ్రాసియుండెను.

మత్స్యఘాత నిషాదానాం త్వష్టుస్త్వాయోగవస్యచ
మేధాంధచుంచు మద్గూనా మారణ్యపశుహింసనం.

ఇతర సంస్కృత కవులు

22. కవులలో కాళిదా సెచటను ఆంధ్రప్రశంస చేసియుండి నట్లు కనుబడదుగాని ఆ కాలమునందేయుండిన వరాహమిహిరుడు తన బృహత్సంహిత కూర్మవిభాగమునందు ఆంధ్రదేశప్రశంస చేసియుండెను.

"ఆగ్నేయ్యాం దిశి వర్ణితః. తదా ఆగ్నేయ్యాం దిశి కోశల
కలింగ వంగోపవంగ జఠరాంకాః కాళీక విదర్భ వత్సాంధ్ర
చేదికాశ్చ వితండాశ్చ" అని వ్రాసియుండెను.

బాణకవి తన 'కాదంబరి' యను గ్రంథమున చంద్రాపీడ మహారాజును వర్ణించుచు ఆంధ్ర ద్రవిడ ప్రశంస గావించెను.

"ఆంధ్రద్రమిళ సింహళ ప్రాయేణ సేవకజనేన".

అథర్వ శిఖోపనిషత్తునందు

"త్రిమూర్తీనాం సంస్కృతాంధ్ర ప్రాకృతాస్తు ప్రియంకరాః."
అనియు

కాణ్వస్మృతియందు

"ఆంధ్ర సంస్కృత భాషాస్తు దేవతార్హాః ప్రమోదదాః
సదంతైశ్చ కృదంతైశ్చ యుక్తా స్పర్శప్రదా నృణాం"
"రాజా కరూదభూ భాషా సంస్కృత మాంధ్రమయీ తదా"
"ఆంధ్ర సంస్కృత భాషాభ్యాం కవిత్వం ఋషితా ప్రదం"
"ఆంధ్రవిష్ణోరనుజ్ఞాకృతస్య మద్వ్యాకరణస్యద్రోహోగురుద్రోహః"

అనియు మొదలుగా వ్రాయబడినట్లు ఆంధ్రకౌముదియందు వ్రాయబడియుండెను. ఈ కాణ్వస్మృతిగాని, అథర్వణాచార్యుల గ్రంథములుగాని యిపు డెచటను లేవు. కాణ్వస్మృతియం దింకను శ్రీకాకుళమునం దేలుచున్న సుచేంద్రుడను రాజునకు హరియను ఆంధ్రవిష్ణు జనించినట్లునుగూడ వ్రాయబడియున్నది.

"ఆంధ్రనాథో మహావిష్ణుః నిశుంభదనుజాపహః
పురా స్వాయంభువ మనోః కాలే కలియుగే హరిః."
—ఆంధ్రకౌముది

అథర్వణ త్రిలింగానుశాసనమున ఆంధ్రవైయ్యాకరణుల పేర్లను వ్రాయుచు 'బృహస్పతి' 'కణ్వ' 'పుష్పదంత' 'రావణ' 'ఇంద్ర' 'అధోక్షజ' 'సోమచంద్ర' 'ధ్రువ' 'ఆంధ్రవిష్ణు' 'శృంగారభూషణ' మొదలయినపేర్లు వ్రాయబడినవి. రావణునివ్యాకరణము తెనుగుభాష లోని సంపూర్ణవ్యాకరణ మనియుకూడ వ్రాయబడెను.

"అనుక్తం సర్వశాస్త్రంతు రావణీయే విలోక్యతే"

అని చెప్పబడుటచే నీ వ్యాకరణము మిక్కిలి ప్రశస్తమైనదనియే చెప్పవచ్చును. పురాణమం దొకశ్లోకమున

"కణ్వాయనస్తత్ర భృత్యః వృషలీ బలీ"

యని వ్రాయబడెను. భృత్యులలో నొక 'సింహుక' లేక 'శ్రీముఖ సింధుక' యనువారు కణ్వవంశీయులలో రాజుగ నుండిరి. కాణ్వవంశపు వారు మగధాధిపతులుగ నుండిరి. ఈ భృత్యులే మగధరాజ్యమును కొంతకాలము పరిపాలించిరి. కణ్వుడు గొప్పఋషి. ఈతడే శకుంతలా దేవి తండ్రి. ఈతడు తెనుగుభాషకు వ్యాకరణము వ్రాసియుండెనని పైన చెప్పబడెను. అయితే రావణుని వ్యాకరణముగాని, కణ్వుని వ్యాకరణముగాని, పైనచెప్పబడిన యితర వ్యాకరణముగాని యెవ్వియు నిపుడు లేవు. కణ్వునకు, ఆంధ్రులకు సంబంధమున్న ట్లూహింపవచ్చును. కాని రావణు డెంతటి పండితుడైనను తెనుగుభాషకు, నాతనికి యెట్టి సంబంధముకలదో తెలియకున్నది. అయితే యాతడువ్రాసినది ఆంధ్ర వ్యాకరణమందురు. అందువలన నీతడు వ్రాసినది ప్రాకృతభాషా వ్యాకరణమై యుండవచ్చునా? ఆంధ్రభాష చులికిపైశాచి ప్రాకృత భాషయని యందురు. భాషయందు 'అధోక్షజఫక్కి' 'అథర్వణఫక్కి' యనునట్లు 'రావణఫక్కి' యనియు చెప్పుటకలదు. నారికేళపాకమున వ్రాయబడిన భాషనుగూర్చి చెప్పుచు యిది 'రావణఫక్కి' యని చెప్పుట వినబడుచునే యున్నది.

23. విశ్వేశ్వరభట్టాచార్య యను వైయ్యాకరణుని 'భాషా ముకుర' యను వ్యాకరణమునం దాంధ్రశబ్దమునుగురించి యింకొక గాథ వ్రాయబడెను. ఒకానొకప్పు "డగ్నిమిత్రుడను రాజు రాజ్యము చేయుచుండ నిప్పువంటియెండ కాచెను. ఆ యెండవేడిమి కా రాజు అంధుడాయెను. అంత నారాజు సూర్యదేవునిప్రార్థించ, నా సూర్యదేవుడు భాష నొకదానిని కల్పించెననియు, ఆ భాషవలన తన యంధత్వము పోయెననియు, అప్పటినుండియు నా భాషకు ఆంధ్రభాషయను నామము వచ్చెననియు వ్రాయబడెను."

24. ఇంతవరకు వ్రాసినదానినిబట్టి ఆంధ్రులు మగధ ప్రాంతములయందును, వింధ్యపర్వతములనుదాటి దగ్గరనేదక్షిణాపథమున నున్నట్లు కనుబడుచున్నది. ఋగ్వేదఆర్యులకు కొన్ని శతాబ్దములకు పూర్వము హిందూదేశమునకు వచ్చి ఉత్తర హిందూస్థానమున నివసించియుండువారిలో వీరున్ను మిళితమై యుండినట్లును, ఋగ్వేద ఆర్యులు వచ్చినపిదప వారితో పోరాడజాలక అగస్త్య మహాముని ఆధిపత్యమున కొంద రొక మూకగా వింధ్యపర్వతములదాటి తూర్పు తీరముననే జని రామాయణకాలమునకు గోదావరివద్ద అగస్త్యాశ్రమము నేర్పరచుకొని శ్రీరాములవారి కాతిథ్యము నిచ్చినట్లును రామాయణ మును బట్టి గ్రహించనగును. వీరున్ను, వీరివెంట వచ్చినవారున్ను అచ్చటనుండి బయలుదేరి హిందూదేశ దక్షిణభాగమునకు పోయి యుండిరనియు నిదివరలో వ్రాసియుంటిని. అయితే వీరితోపాటుండిన కొంద రా పూర్వపుఆర్యులు విశ్వామిత్ర శాపోపహతులైన ఆంధ్రులు ఋగ్వేదపు కాలపునాటి ఆర్యులతో పోరాడి వారిచే వెళ్లగొట్టబడక యెదురుతిరిగిన ఆంధ్రులుమాత్రము వింధ్యపర్వత ప్రాంతములనే యుండిరని యూహించనగును. వీరు దక్షిణాపథమున నున్నట్లు రామాయణమునందును, మహాభారతమునందును గనుపించుచున్నది. రామాయణ కాలమునకే యిప్పటి ఆంధ్రదేశమంతయు కేవల నిర్మానుష్యము గాకున్నను మునిఆశ్రమములచేతను, లంకా నివాసులైన

అసురులచేతను, మరికొందరు కొండలయందు నివసించువారలచేతను ఆక్రమింపబడినట్లు గనుపించుచున్నది. ఈ కొండలయందు నివసించు వారలే నాగులు, శబరులు, కోయలు మొదలయిన తెనుగుజాతివారై యుందురని యూహించదగును.

పురాణములనుబట్టి జూడ నీ నాగులు దండకారణ్యప్రదేశముననే నివసించుచు, బలవంతులై, రాజ్యము నేర్పరచుకొని రాజ్యమేలుచున్నట్లును కనబడుచున్నది. పురాణమునందు పలుకరింపబడిన నాగలోక మీ నాగులున్న దేశము. వీరికన్యలే నాగకన్యలై యుందురని తోచుచున్నది. నగమునం దున్నవారు నాగులు. వారే నాగజాతి వారు. నాగ మనగా పామని యర్థముకలదు. పామును పూజించువారు గనుకనో లేక పామును ధ్వజమునందు గల్గినవారు గనుకనో వీరు నాగులైరి. వీరు తెనుగువారే యైయుందురని తోచుచున్నది. తెనుగు వారికి నాగులఆచారములు అనేకము లలవడియున్నవి. తెనుగువారికి నాగులచవితి ముఖ్యమైనపండుగ. ఆ నాగజాతివారు అప్పటి ఆంధ్ర దేశమును తమరాజ్యముగ నేర్పరచుకొని రాజ్యపాలన చేసియుండిరి. ఆ కాలమున నాంధ్రులు దక్షిణాపథమున నుండిరి. దక్షిణాపథమన్న వింధ్యపర్వతమునకు దక్షిణముననున్న దేశము. వీరు వింధ్యపర్వత పరిసరదేశములయం దుండిరి. ఇప్పటి ఆంధ్రదేశమున నప్పు డాంధ్రులున్నట్లును, రాజ్యము చేయుచున్నట్లును కొన్ని బౌద్ధగాథలయందు వ్రాయబడియుండెను. వీరు బౌద్ధునిభామికలను సంపాదించి వజ్రాలదిన్నవద్ద పాతిపెట్టినట్లును అచట నొకస్తూపమును కట్టించినట్లును చెప్పబడినది. ఈ భామికలపెట్టె కపిలవస్తునగరమునకు దగ్గరనున్న రామాపురముననుండి వరదకు కొట్టుకొనిపోయి సముద్రములో పోవుచుండగా దానిని నాగులుపట్టుకొని మంజేరికాదేశమున వజ్రపుగనులవద్ద పాతిపెట్టిరనియు, తరువాత సింహళదేశపురాజులు దీని నివ్వమని కోరగా నాగులు యిచ్చినట్లును సయాముదేశపు గ్రంథములలో వ్రాయబడియున్నది. ఈ వజ్రపుగనులే తరువాత మార్కోపోలో (Marco Polo)

చూచిన గనులై యున్నవి. బౌద్ధునికాలమున నిప్పటి ఆంధ్రదేశ మంతయు మంజీరకాదేశ మనియు పిలువబడుచుండెను.

25. వింధ్యపర్వతములకు ఉత్తరముగ మగధదేశమున నీయాంధ్రు లున్నట్లును కనుపించుచున్నది. ఒకప్పుడు దక్షిణ కోశలము వీరిప్రభుత్వములోనిదై యుండెను. హుయేనిత్సాం (Hiouenithsang) గను చైనాదేశపు రాయబారి ఈ దక్షిణకోశలమునే 'మహాంధ్ర' యని చెప్పెను. ఈ రాజ్యమున కా కాలమున ఉజ్జయినీ (Ujjain) నగరము ఉత్తరపు సరిహద్దు, కళింగదేశము దక్షిణపు సరిహద్దు, మహారాష్ట్రము పడమటి సరిహద్దు, తూర్పు సరిహద్దు ఒరిస్సా రాష్ట్రమునై యున్నది. నర్మదా మహానదు లీదేశమునం దుండెడివి. దక్షిణదేశమునకు ఉత్తరముగ కరూరుదేశ ముండెడిది. ఉత్తర కోశలమునకు రాజధానియగు శ్రావస్తి నగరమున ఆంధ్రు లుండినట్లు పాళీభాషాగ్రంథములయందు,

"సావత్థియాం అంధర వలెన" యని యున్నది.

పాళీభాషయందు ఆంధ్రశబ్దము అంధ్ర (హ్రస్వము) గా వాడబడెను. శ్రావస్తిప్రాంతముననే 'అంధవనము' 'జేతవనము' అను రెండు వనము లుండెను. ఈ అంధవనముపేరు ఆంధ్రుల ననుసరించియే వచ్చెనని తోచుచున్నది. శ్రావస్తికిని, ఆంధ్రులకును కొంతసంబంధ మున్నట్లు పురాణములవలన తెలియుచున్నది. శ్రావస్తిపుర నిర్మాత యగు శ్రావస్తకరాజు ఇక్ష్వాకువంశజుడైన వికుక్షికి ఆరవతరమువాడనియు, నతని తండ్రిపేరు ఆంధ్రుడనియు వాయుపురాణము తెలుపుచున్నది. కాని మత్స్య బ్రహ్మాండ పురాణములయందు ఆతడు 'యవనాశ్వ' తనూజుడని, ఆంధ్ర మహీపతి మనుమడని చెప్పుచున్నది. వాయు పురాణమునందు చెప్పబడిన ఆంధ్రుడే యీ ఆంధ్రుడు. శ్రావస్తి పట్టణము సంయుక్తరాష్ట్రమునందలి అయోధ్యయం దుండెను.

26. పేరు తెలియని యొక పండితుడు ఆంధ్రభాష అనేక యుగములనుండి యుండెననియు, కృతయుగమున సుధాయనాచార్యులును, త్రేతాయుగమున శుకనాసాచార్యులును, ద్వాపరయుగమున దివోదాస, శల్యాతి, ఇంద్రమిత్రాచార్య లనువారు ముప్వురును కలియుగమున నందివర్ధన, దేవరాయ యను నిద్దరాచార్యులును మొత్తమున సప్తసంఖ్యాకులైన భాషాచార్య లుండిరని యీ క్రింది శ్లోకమున నుదాహరించిరి.

యుగబంధదామా భాషాచార్య భేదాః ప్రకీర్త్యంతే।
కృతే సుధాయనః ప్రోక్తః త్రేతాయాం శుకనాసకః।
దివోదాసశ్చ శల్యాతిః ఇంద్రమిత్రః తథైవచ
భాషాచార్యాః ద్వాపరే స్యుః తస్యాభూన్నందివర్ధనః।
తతోదేవలరాయశ్చ తస్య శిష్యో నియోగికః।
ఏతే క్రమేకకా భాషాచార్యాః ప్రకీర్తితాః॥

పై శ్లోకము లేకాలమున నే సందర్భమున నెందులకు వ్రాయబడెనో, వీటికాధారము లెట్టివియో తెలియదు.

27. బుద్ధుని కాలమున వింధ్యపర్వత ప్రాంతముల నిరుప్రక్కలనున్న ఆంధ్రులు మెల్లిమెల్లిగ దక్షిణమునకు జరిగి యిప్పటి ఆంధ్రదేశమును జేరి, అచటనే యిదివరలో రాజ్య మేర్పరచుకొని పరిపాలన చేయుచున్న తెలుగుజాతులవారైన కొండజాతివారితో సఖ్యతచేసికొని వారితో కలసిపోయి దేశమున స్థిరరాజ్యము నేర్పరచుకొన్నట్లు కనబడుచున్నది. క్రీ. పూ. నాల్గవ శతాబ్దమునకే చంద్రగుప్తుని రాజ్యమునకువచ్చిన మెగస్తనీసు రాయబారి (Megasthanes) అప్పటి ఆంధ్రరాజ్యమును మిక్కిలికొనియాడెను. చంద్రగుప్తుని మగధరాజ్యముతప్ప ఆంధ్రరాజ్యమును మించిన యింకొక రాజ్యము లేదని నాతడు వ్రాసియుండెను.

"...Next comes the Andhras, a still more powerful race which posseses numerous villages and thirty towns defended by walls and towers and supplies its Kings with an army of ten thousand infantryo 200 cavalry and 1000 elephants."

—*Mc. Crindle Megasthenes.*

"...లెక్కలేని గ్రామములను కలిగి ముప్పదినగరములతో కూడుకొని దేశమున రక్షణచేయగల్గిన చుట్టు గోడలుకలిగి తమరాజుల రక్షణకొరకై పదివేల కాల్బలములను, రెండు వందల అశ్వములను, వెయ్యి గజములను జాగ్రత్తపెట్టగలిగిన సైన్యమును కలిగియున్న అతి శక్తివంతమైన ఆంధ్రజాతి తరువాత పేర్కొనతగినది."

28. అశోకుని కాలమునకు అనగా క్రీ. పూ. ౨-వ శతాబ్దమునకే ఆంధ్రులు నాగరికులై పల్లెలు, పట్టణములు, దుర్గములు నిర్మించుకొని రాజ్య పరిపాలనము కావించుచున్నట్లు అశోకుని శాసనముల వలన తెలియుచున్నది. అశోకుని పదమూడవ శిలా శాసనమున (Edict) ఆంధ్రులు, పుళిందులు తమచే ప్రకటింపబడిన బుద్ధధర్మము నవలంబించిరని వ్రాయబడెను. ఈ శాసనములందును ఆంధ్రుల పేరే కనబడుచున్నది. కాని తెనుగులపేరు కనుపించుటలేదు.

29. మెగస్తనీసు రాయుబారి చెప్పినట్లుగ గొప్ప ఆంధ్ర రాజ్యమొకటి క్రీ. పూ. 4-వ శతాబ్దముననే యేర్పడి యుండుట తథ్యము. అయితే యింతటి గట్టిపునాదులతో రాజ్యమును స్థాపించుటకు కారణభూతులైనవా రెవ్వరో వృత్తాంతము చారిత్రకముగ తెలియవచ్చుట లేదు. ఈ విషయమును కనిపెట్టుటకు పురాణములందలి విషయములే మన కాధారములుగ నున్నవి.

ఆంధ్రకౌముదియను గ్రంథమున నీ క్రింది శ్లోకములు గలవు.

ఆంధ్రనాథో మహావిష్ణు ర్నిశుంభ దనుజాపహః
పురా స్వాయంభువమనోః కాలే కలియుగే హరిః.

కాకులే రాజవర్యస్య సుచంద్రస్య తనూభవః
అభవ త్సర్వదేవైశ్చ వేష్టితో లోకపూజితః.

నిశుంభుడను రాక్షసుని పరిమార్చిన ఆంధ్రవిష్ణువురాజు కాకులమునందు రాజ్యము జేయుచున్న సుచంద్రుని కుమారుడై స్వాయంభువుని కాలమున కలియుగ ప్రారంభమున జన్మించెను. ఇందులోని అతిశయోక్తిగా కనుబడు అంశమును తీసివేయగా "శ్రీకాకుళమునందు రాజ్యము చేయుచున్న సుచంద్రుని కుమారుడు ఆంధ్ర విష్ణువు" యని కనుబడును.

శ్రీశైల భీమ కాళేశ మహేంద్రగిరి సంయుతం
ప్రాకారంతు మహత్కృత్వా త్రీణి ద్వారాణిచాకరోత్.
త్రిలోచనో మహేశ స్స త్రిశూలంచ కరే వహన్
త్రిలింగరూపీ న్యవస త్త్రిద్వారేషు గణై ర్వృతః.
ఆంధ్రవిష్ణుః సురయుతో దనుజేన నిశంభునా
యద్వా త్రయోదశయుగా న్హత్వా తం రాక్షసోత్తమం
అవస త్తత్ర ఋషిభి ర్యుక్తో గోదావరీతటే.

ఆంధ్రవిష్ణువు నిశుంభుని ఓడించి శ్రీశైల, భీమేశ్వర, కాళేశ్వరములకు ప్రాకారములు కట్టించి, ఆ క్షేత్రములను ద్వారములుగ జేసి, తాను గోదావరీతీరమునకు బోయి రాజ్యమును స్థాపించెవనియు, అప్పటి నుండియు నీ దేశము త్రిలింగదేశ మయినదనియు వ్రాయబడినది. ఈ గాథకు చరిత్రయం దెట్టిప్రవేశము గనుపించకున్నను కేవలము కల్పితమైనట్లుగా నూహించుటకు కారణము కనుపించదు. ఈ పైన చెప్పబడిన కాకులము అవనిగడ్డ తాలూకాలోని శ్రీకాకుళమే

మైయున్నది. ఇచట ఆంధ్రవిష్ణుని దేవాలయము కలదు. చూడ జూడ యీ గాథయందలి రాజ్యాధిపతి యగు ఆంధ్రవిష్ణువునకే కొంతకాల మైనపిమ్మట దేవాలయమును కట్టించి యుండవచ్చును. క్రీ. పూ. మీ ఆంధ్రవిష్ణువు యిచట రాజ్యము చేసియుండవచ్చుననియు, నాతడు మిక్కిలి పరాక్రమవంతుడనియు, నీతడే గట్టిపునాదుల పైన నాంధ్రరాష్ట్రము నిప్పటి ఆంధ్రదేశమును స్థాపించియుండవచ్చుననియు తోచుచున్నది. వీరు చరిత్రయందు కనుపడకయున్నను చరిత్రాంశములు మాత్ర మీ గాథయందలి నిరూపింపబడిన అంశములను బలపరచుచునే యున్నవి. ప్రథమమున వీరు శ్రీకాకుళమున రాజ్యమేర్పరచి, తరువాత గుంటూరుజిల్లాలోని ధాన్యకటకమును జేరి, అచటనుండి తమ రాజ్యమును నానాదిశల వ్యాపింపజేసి, మహారాష్ట్రమున గోదావరివద్దనున్న ప్రతిష్ఠానపురమునకు శ్రీశైలము వద్దనున్న చంద్రగుప్త పట్టణమున కువ్యాపింపజేసి స్వతంత్రులుగ రాజ్యపాలనము జేయుచుండిరి. మగధరాజ్యము నేలుచున్న బృహద్రథుని జంపి పుష్యమిత్రుడను రాజు క్రీ. పూ. 184 వ సంవత్సరమున రాజ్యమునకు వచ్చెను. ఆకాలమున కళింగదేశపురాజైన ఖారవేలుడు ఆంధ్రరాజగు శాతకర్ణుని సహాయమున పుష్యమిత్రు నోడించినట్లు హత్తిగుంపగుహలో దొరకిన ఖారవేలుని శాసనమువలన కనుపించుచున్నది. మన పురాణములయందు శ్రీముఖుడను రాజు ఆంధ్రభృత్యపు రాజొకరు మగధదేశము నేలుచున్న సుశర్మ యను రాజును సంహరించి మగధరాజ్యమును పరిపాలించినట్లు కనుబడుచున్నది. అయితే అప్పటి రాజులపేర్లు మాత్రము ప్రత్యేకముగ విశదమగుటలేదు. కాని పురాణములయందు చెప్పబడిన ఆంధ్రభృత్యవంశ రాజులపేర్లు కొన్ని ధాన్యకటకము జగ్గయ్యపేట గ్రామములందు దొరకిన శాసనములలోని రాజులపేర్లతో నేకీభవించుటచేత ఆంధ్రదేశ కథాసంగ్రహమున నీ ఆంధ్రభృత్యవంశమే శాతవాహన వంశమనియు నిర్ధరించబడినది. శాతవాహనులే శాలివాహనులు. శాతవాహనులు ఆంధ్రదేశమును పాలించుట

ప్రారంభముననుండియు మనచరిత్ర సరిగా వ్రాయబడియున్నది. శాలివాహనులపిదప ఇక్ష్వాకులు, తరువాత పల్లవులు, విష్ణుకుండినులు, చాళుక్యులు రాజ్యము జేసిరి. ఈ చాళుక్యరాజులలో యేడవ శతాబ్దమున కుబ్జవిష్ణువర్ధనుడు రాజ్యమునకు వచ్చెను. తరువాత చాళుక్యులు చోళులతో కలసి కొంతకాలము రాజ్యము జేసిరి. వీరిరాజ్యము పదమూడవ శతాబ్దములో అంతరించెను. రాజమహేంద్రవరమున రాజ్యముచేసిన రాజరాజనరేంద్రుడు చాళుక్యరాజులలో చివరవాడు. చాళుక్య చోళులలో గొప్పగ పేరుబడినరాజు కులోత్తుంగ చోళుడు. ఈతని కాలముననే రాజ్యమునందలి ముఖ్యభాగములలో రాజప్రతినిధు లేర్పరుపబడి పాలనము జేసిరి.

ఆంధ్ర భాష

30. ఇంతవరకు ఐతరేయ బ్రాహ్మణమున పలుకరింపబడిన విశ్వామిత్ర సంతతివారగు ఆంధ్రులవద్దనుండియు యిప్పటి ఆంధ్రదేశము నేలుచు వచ్చిన పదమూడవ శతాబ్ది ఆఖరునాటి చాళుక్య చోళులవరకు ఆంధ్రులగురించి వ్రాసియుంటిని. కాని మనకు ముఖ్యమైన విషయము యీ ఆంధ్రులభాష యేది అను విషయ మాలోచించవలసియున్నది. మనము ప్రతిదినము వాడుచున్న తెలుగుభాషయేనా? అట్లుగాకున్న మనము మాట్లాడుభాష కెపుడు ఆంధ్రభాషయను పేరెట్లు వచ్చినది? యను అంశమును కొంత ఆలోచించవలసి యున్నది.

31. మనదేశమునకు వచ్చి రాజ్యముచేసిన ఆంధ్రులందరు ఉత్తరాదినుంచి వచ్చినవారై యున్నారు. వారు చిరకాలము ఉత్తరహిందూస్థానము ననివసించి కొంతకాలము వింధ్యపర్వతముల కిరుప్రక్కల నున్నవారే యై యున్నారు. వీరు మనదేశమును ప్రవేశించిన కాలము బౌద్ధమతము విజృంభించియుండెను. బౌద్ధమతస్థుల యొక్కయు, ఉత్తరహిందూస్థానమువారి యొక్కయు వాడుకభాష ప్రాకృత భాషయై యున్నది. మన వేదములన్నియు వేదభాషయగు సంస్కృతమున నెట్లు

స్థిరపరుపబడినవో! అట్లే బౌద్ధమత గ్రంథములైన త్రిపిటకములు ప్రాకృత గ్రాంథిక భాషలయందు వ్రాయబడియున్నవి. ప్రాకృతము వాడుక భాష. గ్రాంథిక భాష పాళీభాషయునై యున్నవి. ప్రాకృతమే గ్రంథములను వ్రాయునపుడు కొంత వ్యాకరణయుక్తముగ వ్రాయబడును. దానినే పాళీభాషయని పిలచిరి. ఆంధ్ర శాతవాహనులు, ఇక్ష్వాకులు, శాలంకాయనులు, పల్లవులు వీరందరును తమభాషయగు ప్రాకృతభాషయందే తమ రాజ్యమునందు పరిపాలనకై యుపయోగించిరి. ఆంధ్ర దేశమునందలి ప్రాంతీయభాషయగు తెలుగుభాషను పైకి రానివ్వక ప్రాకృత భాషనే ప్రచారమునందు పెట్టిరి. అందువలన తెనుగుభాష అడుగంటినది. మన ఆంధ్ర శాతవాహనులుగాని, ఇక్ష్వాకులుగాని, పల్లవులుగాని బౌద్ధమతావలంబకులు కాకున్నను వేదమతమునే అనుసరించుచున్నను యజ్ఞ యాగాది క్రతువులు చక్కగ కావించుచున్నను తమభాషయగు ప్రాకృతభాషనే రాష్ట్రభాషగ జేసి, తెనుగుదేశమున నా భాషనే ప్రచారము గావించిరి. అప్పటి తెలుగుజాతివారు ఆంధ్రపాలకుల ఒత్తిడికి యెదురుచెప్పజాలకనో, మరి యేకారణముననో వారిభాషకే ప్రాముఖ్యతనిచ్చిరి. ఇప్పటి మనస్థితికిని, పూర్వ మప్పటిస్థితికిని యెక్కువ భేదము కనుపించదు. ఇప్పు డుత్తరాది ప్రభువులు తమ వాడుకభాషయగు హిందీభాషను రాష్ట్రీయభాషగా జేసి దానిని మననెత్తిన రుద్దుచుండగ మన మంగీకరించుటలేదా! ఉత్తరములు వ్రాసికొను కార్డులు, డబ్బు నొకచోటునుండి యింకొకచోటుకు పంపుమని ఆర్డరు దరఖాస్తులు హిందీభాషలో తయారు జేసి మన నెత్తిన రుద్దుట మనము జూచుటలేదా! అట్లే ప్రభువులైనవారు తమ వాడుకభాషను రాజ్యభాషగా నేర్పరచి, వారి ఉత్తర ప్రత్యుత్తరములు, వారి రాజకీయ దినచర్య మొదలయినవన్నియు ప్రాకృతభాషయందే జరుపుచు మనము వ్రాసికొను విక్రయాది మొదలయిన దస్తావేజులన్నియు ప్రాకృతమునందే వ్రాయునట్లు జేసిరి. మన ప్రాంతీయభాషయగు తెనుగు నణగ ద్రొక్కిరి. మనదేశమున నారవ శతాబ్ది ప్రారంభమువరకు దొరకిన

శాసనములన్నియు ప్రాకృత వాడుక భాషయందుగాని, గ్రాంథిక భాషయగు పాళీభాషయందుగాని కానవచ్చుచున్నవి. మూడవ శతాబ్దమున దొరకిన యొకశాసనము తెనుగులిపియందు ప్రాకృతభాషలో వ్రాయబడెను. మనరాజులు బౌద్ధమతస్థులు కాకున్నను బౌద్ధమతమునం దెక్కువ అభిమానులై యుండిరి. అట్లుగాకున్న పిల్లలకు అక్షరాభ్యాసముచేసి 'ఓ, న, మా' లు దిద్దబెట్టునప్పుడుకూడ బౌద్ధస్మరణము జేయింతురా! సామాన్యముగ అక్షరాభ్యాస సమయమున పిల్లలచేత "ఓం నమశ్శివాయ" యను ప్రార్థనను జెప్పించి వాటినే దిద్దించెడి వారు. అట్టి శుభసమయమునందు యింకొక బౌద్ధమత ప్రశంస కల్పించి పైనవ్రాసిన మంగళవాక్యమునందు యింకొక మతదేవతను నమస్కరించునట్లు 'సిద్ధంనమః' యను నాల్గక్షరములను చేర్పించి యుండిరి.

32. అప్పటి వాఙ్మయ మంతయు ప్రాకృతమునందే వ్రాయబడెను. 'హాలు' డను రాజు తానే కవియై 'సప్తశతి' యను నీతిబోధక గ్రంథమును ప్రాకృతభాషయందు వ్రాసెను. ఆ కాలమున కాష్మీరు దేశమున 'గుణాఢ్యు' డను పండితుడు 'బృహత్కథ' యను గ్రంథము నొకదానిని ప్రాకృత గ్రాంథిక భాషయగు పాళీభాషయందు వ్రాసి శాతవాహనుని కంకితము జేసెను. ఈ ఆంధ్రులు రాజ్యముజేసిన కాలమునాటి శాసనములుగాని, గ్రంథములుగాని నేవియు తెలుగు భాషలో వ్రాయబడినట్లు కనుపించవు. వ్రాసియున్నను అవి యెవ్వియు నిప్పటికి దొరకలేదు.

33. చాళుక్యులు ఆంధ్రదేశమును పరిపాలించుటకు ప్రారంభించినపుడు బౌద్ధమతమునకు ప్రాబల్యముతగ్గెను. హిందూమతమునందు దేశస్థులకు ప్రీతి హెచ్చెను. శైవమతమునకు ప్రాబల్యము వచ్చెను. వేదమతము దేశమునందంతయు విరివిగా వ్యాపించెను. ప్రాకృత భాషకు, ప్రాకృతకవులకు, ప్రాకృతగ్రంథములకు పోషణ క్షీణించెను.

సంస్కృతభాషాభిమానము వృద్ధిజెందెను. అయితే అప్పటికి సంస్కృత భాష వాడుకభాషగా లేదు. అందువలన దేశభాషయం దాదరణ హెచ్చుగాజొచ్చెను. తెనుగుభాషయొక్క రేఖ చిగురొత్తెను. ఈ చాళుక్యులకాలమున తెనుగుభాష ప్రాముఖ్యతవహించెను. కాని అప్పటికి గత పదిశతాబ్దముల నుండియు వాడుకలేక బయటకువచ్చుటకు కొంతకాలముపట్టెను. ఆంధ్రులతో కలసిపోయినందునయున్ను, ఆంధ్రుల భాషయగు ప్రాకృత పైశాచ భాషలతో మిళితమయినందునయున్ను ప్రాకృతభాషాజాలమీ తెనుగుభాషయందు ప్రవేశించెను. తెనుగుభాష రూపే మాసిపోయెను. పూర్వపు తెనుగుభాష యెట్లుండెనో తెలిసికొనుటకు వీలులేకుండెను. ఆంధ్రభాషా మిళితమైన తెనుగుభాష రాజ రాజ నరేంద్రుని కాలమునకు నన్నయ భారతమునందు బయల్పడెను. నన్నయ భారతమునకు పూర్వమే కవులు కవిత్వము యుండి యుండవలయునని యూహకు గోచరమగుచున్నది. కాని మన కట్టికవనముగాని, కవులుగాని యున్నట్లు చరిత్రమునందు కనుపించుటలేదు. నన్నయకు పూర్వము కవిత్వ ముండెనా యనునది విమర్శనీయమైన ప్రశంసయాయెను. నన్నెచోడుని కుమారసంభవమను గ్రంథము అంతకంటె ముందు వ్రాయబడిన గ్రంథమని కొందరు విమర్శకు లందురు. కాని యీ విషయమున గొప్పవాదము బయలు దేరెను. మొత్తముమీద చాళుక్యులకాలమున తెనుగుభాష క్రమక్రమముగా నభివృద్ధి జెందెను. ఆ కాలముననే తెనుగుభాష వన్నె కెక్కినది. అదివరలో నడుగంటిన తెనుగుభాషలో కవులు పద్యములు వ్రాయుట ప్రారంభించిరి. ఇప్పటికి మనకు కనుబడిన మొదటి తెనుగు పద్యములు మూడవ విజయాదిత్యుని కాలములోనివై యున్నవి. అప్పటినుండియు తెనుగుభాష నాదరించుటయు, తెనుగుభాషలోని కవిత్వమును మన్నించుటయు, దానపత్రములను తెనుగుభాషలో వ్రాయుటయు, రాతిఫలకములపైన తెనుగులిపిలో తెనుగు భాషను వ్రాయుటయు ప్రారంభమైనది. అప్పటినుండియు తెనుగుభాష దినదిన

ప్రవర్ధమానమై రాజసన్మానమును వడయుచు రాజరాజనరేంద్రుని కాలమున నన్నయభట్టారకుడు మహాభారత గ్రంథమును తెనుగున వ్రాయ ప్రారంభించెను.

34. ఈ పైనవ్రాయబడిన అంశములవలన ఆంధ్రపదము తెనుగుపదము కాదనియు, ఐత్తిరేయబ్రాహ్మణమునందు పలుకరింపబడిన ఆంధ్రులున్ను, ధర్మరాజుగావించిన రాజసూయయాగమున కాహ్వానింపబడిన ఆంధ్రరాజు జైత్తరాహి యనియు, తెనుగురాజు గాడనియు, మనదేశమునేలుటకు ఉత్తరదేశమునుండి వచ్చిన ఆంధ్రులు తెనుగువారు గారనియు, వారు మాట్లాడినభాష యిచట తెనుగుభాష కాదనియు, వారు రాజ్యకార్యములయందును సామాన్యముగ శాసనములయందును వాడినభాష తెనుగుభాష కాదనియు స్పష్టపడుచున్నది.

35. పై చరిత్రలోని కొన్ని ముఖ్యాంశములవలన మనకు తెలియవచ్చిన పెద్దవిషయ మింకొకటి గలదు. ఉత్తరదేశముననుండి వచ్చిన ఆంధ్రులలో వేరు వేరు తెగలవారు తెనుగుదేశముననే తమ స్థిరనివాస మేర్పరచుకొని అనాదిగా నీ దేశముననున్నవారిలో తమకు తగినవారితో వివాహసంబంధములు జేయుచూవచ్చిరి. అందువలన నీ యాంధ్రులున్ను, యిచటి తెనుగువారున్ను నైక్యమయి కలసి పోయిరి. ఈ వివాహసంబంధముల ఫలితముగా జన్మించినవా రాంధ్రులా లేక తెనుగువారా యను ప్రశ్న యుండుటకు వీలులేదు. ఈ తెనుగుదేశమున జన్మించి, తెనుగుదేశమున నివసించుచున్నందున వీరును తెనుగువారే. అయితే వీరినాళములయందు ఆంధ్రులరక్తము ప్రవహించుచున్నందున వా రాంధ్రజాతికి జెందినవారే గనుక నీ యాంధ్ర తెనుగు సమ్మేళనమువలన నిచటివా రందరు నాంధ్రులు తెనుగువారు నయి యున్నారు. అయినను ఆంధ్రదేశస్థులు ఆంధ్రులే కాని, వారు మాట్లాడుభాష తెనుగుభాషయే గాని ఆంధ్రభాష కాజాలదు.

36. కొందరు భాషాభిమానులు యీ ఆంధ్రపదముయొక్క యుత్పత్తినిగూర్చి కొన్ని కొన్ని భిన్నాభిప్రాయముల నిచ్చుచున్నారు. అందులో కొన్నిటినిమాత్రము యిచట యుదహరించుచున్నాను. వాటియొక్క నిజానిజముల విమర్శింపక పాఠకులయూహకే వదలుచున్నాను.

37. చాటువుగ వాడుకలోనున్న నీ శ్లోకము నిం దుదహరించుచు

"అనంతం ధారయత్యేష దేశ శ్శైలాకృతిం తతః
అనంతధ్ర స్స ఏవాంధ్రః పరోక్షేణేంద్రవ త్స్మృతః ।

కొందరు భాషాభిమానులు శైలరూపముననుండు 'అనంతుని' నీ దేశము ధరించుచున్నందున నీ దేశమునకు అనంతధ్రదేశ మనుపేరు కల్గెననియు, అదియే ఆంధ్రదేశమని వాడుకలోనికి వచ్చెననియు చెప్పుచున్నారు. 'అనంతధ్ర'ములోని అక్షరములు లోపించుటకు యీ శ్లోకముననే యుదాహరణ మీయబడెను. ఇంద్రునకు మొదట 'ఇదంధు' డను పేరుండెననియు, పరాక్షప్రియులైన దేవతలవలన ఇంద్రుడను పేరు వచ్చినట్లును, అట్లే యీ దేశము ప్రథమమున అనంతధ్రదేశ మనియు, పిదప ఆంధ్రదేశమనియు పిలువబడుచున్నట్లు చెప్పుదురు.

38. మరికొందరు 'అంధరతి' యితి అంధరయనియు, అంధ్రయనియు, ఆంధ్రయనియు నుత్పత్త్యర్థమునుచెప్పుచు 'ఆం' అనగ 'విష్ణు'యని అర్థము జెప్పుదురు. ఈ విష్ణువే అవనిగడ్డ తాలూకాలోని ఆంధ్ర విష్ణువని జెప్పుదురు.

39. ఆంధ్రశబ్దము సంస్కృత శబ్దమనుటకు వివాదముండ జాలదు. ఉత్తరదేశముననుండి యీ దేశమునకు వచ్చినపుడే దేశ మంధకారభూయిష్ఠమై యనాగరికత గల్గిన జనులచే నివసింపబడి యుండుటచేతను, వచ్చినవారు నాగరికతకల్గి సంస్కారవంతులై సంస్కరింపబడిన భాషను మాటలాడుచున్నవా రగుటచేతను యిచట

నివసించు జనులను 'అంధు' అని సంస్కృత భాషయందు నామకరణముజేసిరనియు, ఆ మాటయే తరువాత అంధ్రులని ఆంధ్రులు గను మారెనని మరికొందరు జెప్పుదురు.

40. పైనవ్రాయబడిన యుత్పత్తులన్నియు విలాసార్థముగ వ్రాయబడినవేగాని వాటివలన చెప్పదగినవిషయము లెవ్వియు గనుపింపవు. ఈ వాదము లిట్లుండ నింకొక భాషాభిమాని యీ దేశము నాంధ్రదేశమనుట (దీర్ఘ ఆ) సరిగాదనియు, తానుచూచిన పురాతన గ్రంథములలో 'అంధ్ర' యని హ్రస్వఅక్షరమైన 'అ' తో వ్రాయబడి యుండెననియు, అందువలన 'ఆంధ్ర' లోని దీర్ఘాక్షరమును హ్రస్వముగమార్చి అంధ్రయని యుచ్చరింపవలయుననియు చెప్పుచున్నారు. 'అం' అను హ్రస్వాక్షరము అమృతాక్షరమనియు, 'ఆం' అను దీర్ఘాక్షరము చేతబడి మంత్రములలో మాత్ర ముపయోగింపబడుచున్నదనియు, యే శుభకార్యమును 'ఆం' అను దీర్ఘాక్షరముతో ప్రారంభింపరనియు చెప్పుచున్నారు. వీరు చెప్పువాదములో కొంత అర్థము లేక పోలేదు. కాని యిప్పు డీ సంస్కారమును జనులు తలబెట్టుదురాయని నాకు సందేహముకలదు. 'ఆం' యను దీర్ఘాక్షరముతో నేకార్యమును ప్రారంభింపరనుమాట వాస్తవమే. 'ఆం' అను పదము అశుభపదమే. కాని మతమునే ధిక్కరించు నీ కాలమున నీ విషయమునకు చెవి యొగ్గువా రెవరుందురు ? కాన వీరివాదము కేవల మరణ్యరోదనమే యని నాతలంపు. ఇంతకన్న నీభాషను ఆంధ్రమనిగాని, అంధ్రమనిగాని యనుటకంటె తెలుగనిగాని, తెనుగనిగాని చెప్పుట యెక్కువ శ్రేయస్కరమని తోచుచున్నది. ఇప్పటికినలబయి సంవత్సరముల క్రింద ఆంధ్ర విశ్వవిద్యాలయము ప్రారంభింపబడినపుడు అప్పటికి కూర్మా వెంకటరెడ్డి నాయుడుగారు (తరువాత సర్ బిరుదాంకితులు మదరాసు గవర్నరునైన) విశ్వవిద్యాలయమును తెనుగు విశ్వవిద్యాలయమని పేరుబెట్టిన బాగుండునని సలహానిచ్చిరి. కాని అప్పటినాయకులెవ్వరును నీ విషయమును చెవిని బట్టించుకొనలేదు.

41. ఇంతవరకు ఆంధ్ర యను పదమునుగూర్చియు, భాషను గూర్చియు, ఆంధ్రులను గూర్చియు చర్చించి యుంటిమి. అయితే ఈ ఆంధ్రభాషనే తెలుగుభాష యనియు, తెనుగుభాష యనియుకూడ ఆంధ్రులను తెలుఁగువారనియు, తెనుఁగువారనియు మనము పరిపాటిగ నుపయోగించుచునే యున్నాము. ఈ తెలుగు, తెనుగు పదము లెట్లు ఎప్పుడు వాడుకలోనికి వచ్చినవను విషయమును కొంతాలోచింపవలసి యున్నది.

42. తెనుఁగను పదము ప్రథమమున మహాకవి నన్నయకవి వ్రాసిన మహాభారతగ్రంథమున కనుబడుచున్నది. నన్నయ వ్రాసినంత వరకు తెనుఁగు పదమును వ్రాసియుండెనేగాని తెలుఁగు పదము నెచటను వ్రాసియుండలేదు. భారతమును వ్రాయుట కుపోద్ఘాతముగా,

క. జననుత కృష్ణద్వైపా
యనముని వృషభాభిహిత మహాభారత బ
ద్ధ నిరూపితార్థ మేర్పడ
తెనుఁగున రచియింపు మధికధీయుక్తి మెయిన్.

అని తాను ప్రేరింపబడినట్లు వ్రాసికొనియున్నాడు. నన్నయకు పూర్వము వ్రాయబడినట్లు నిస్సందేహముగ నేపుస్తకములు మనకు వ్రాయబడినట్లు కనుపడనందున అంతకుపూర్వము తెనుఁగను పదముగాని, తెలుఁగను పదముగాని వాడబడినట్లు మనకు తెలియుటలేదు.

43. నన్నయ భారతమును వ్రాయకపూర్వము క్రీ. త. రెండవ శతాబ్దముననో లేక మూఁడవ శతాబ్దముననో దొరకిన శాసనములు తెనుఁగులిపిలో వ్రాయబడి యున్నందున తెనుఁగుభాష అప్పటికి అనగా యిప్పటికి పదునేడు పదునెనిమిది శతాబ్దములక్రిందట తెనుగు

భాషమాట యెట్లున్నను తెనుఁగులిపి యుండెనని తెలియగలదు. కాని అపు డీమాట తెనుఁగని వాడబడెనా లేక తెలుఁగని వాడబడెనాయని తెలియదు.

44. నన్నయ ప్రారంభించిన మహాభారతము నన్నయ తరువాత తిక్కనచేతను, ఎఱ్ఱాప్రగడచేతను పూర్తిగావింపబడెను. వారు వ్రాసిన కాలమున నీభాష తెనుఁగుభాష, తెలుఁగుభాషయనికూడ వాడబడినట్లీ క్రిందిపద్యము

ఉ. సారమతిం గవీంద్రులు ప్రసన్నకవితా వివిధార్థ యుక్తితో
నారసి మేలునా నితరు లక్షరరమ్యత నాదరింప నా
నారుచిరార్థసూక్తినిధి నన్నయభట్టు తెలుంగున న్మహా
భారత సంహితారచన బంధురుఁడయ్యె జగద్ధితమ్ముగన్.

నందుగలదు. కాన తెనుఁగు తెలుఁగు పదంబులు పర్యాయపదములుగ పండ్రెండవ శతాబ్దమునకే వాడబడినట్లు స్పష్టపడుచున్నది. కాని తెనుఁగు తెలుఁగు పదము లెట్లుత్పన్నములాయెనో స్పష్టముగ జెప్పుటకు మాత్రము గట్టిఆధారములు కనుపించుటలేదు. వైయ్యాకరణులు, భాషాభిమానులు వారివారికి తోచినరీతి నీపదములకు నుత్పత్తి తెలియ జెప్పియున్నారు. వారుచెప్పిన విషయములనే కొన్నిటి నిచట క్లుప్తముగా వ్రాయుదును.

తెలుఁగు : త్రిలింగము : త్రికళింగము

45. తెలుఁగు త్రిలింగపదమునుండియు, త్రిలింగము త్రికళింగపదము నుండియు నుత్పన్నమయినవని కొందరు భాషాభిమాను లభిప్రాయపడుచున్నారు. ఈ విషయమున మనదేశమున భేదాభిప్రాయములున్న మెండుగనున్నవి. మనదేశపు పుట్టుపూర్వోత్తరములను బైటకిలాగుటకు ప్రయత్నములు గావించిన ప్రఖ్యాత పురుషులలో

నాకరగు కీ. శే. కొమరరాజు వెంకటలక్ష్మణరావుగారు తెలుగుపదము నుండియే 'త్రిలింగ' పద ముద్భవించినదని కూడ వ్రాసియుండిరి. భేదాభిప్రాయములన్నియు నాయాభాషాభిజ్ఞుల బుద్ధి ప్రాబల్యమువలనను ఊహాకుశలతవలనను కలిగినవే గాని మరివేరుకాదు. సత్యాన్వేషణము జేయుచు పూర్వకాలమునందు వ్రాయబడిన పుస్తకములందు దొరకిన వస్తుసామగ్రినిబట్టి వారియూహల సమర్థించుటకు ప్రతివారును ప్రయత్నము జేయుచుండిరి. వారి వాదనలవలన గాని, వారి తరువాతి వారు సంపాదించినట్టి క్రొత్త పరికరములవలనగాని యిటీవల కనుగొనబడిన పురాతన శాసనముల బట్టిగాని నీచర్చను గూర్చి స్థిరపడినయభిప్రాయ మిప్పటికిని దేశమునందు లేదనియే జెప్ప వలసియున్నది. ఇది యెట్లున్నను మనకిప్పటికి దెలిసిన విషయముల మాత్ర మిచట కొలదిగ వివరించెదను.

46. పదమూడవ శతాబ్దారంభమున నుండిన విన్నకోట పెదనామాత్యుడు తన కావ్యాలంకార చూడామణి యను పుస్తకమునందును, పదునేడవశతాబ్దప్రారంభముననుండిన కాకనూరి అప్పకవియు, మరి యితర వైయ్యాకరణులును తమవ్యాకరణములయం దీ పదముల కివ్విధముగ నుత్పత్తిని తెలియపరచిరి.

క. "ధర శ్రీపర్వత కాళేశ్వర దా
క్షారామ సంజ్ఞవరల ద్రిలింగా
కరమగుట నంధ్రదేశం
బరుదారఁ ద్రిలింగదేశమనఁ జనుఁ గృతులన్.

గీ. తత్త్రిలింగపదము తద్భవమగుటచేఁ
దెలుఁగుదేశ మనగ దేటపడియె
వెనుకఁ దెనుఁగుదేశమును నండ్రు కొందఱ
బ్భాష పంచగతులఁ బరగుచుండు.

—విన్నకోట పెద్దన : కావ్యాలంకార చూడామణి.

క. శ్రీక్షితిధర కాళేశ్వర
ద్రాక్షారామంబులనఁగ దనరారెడు నీ
త్రిక్షేత్రంబుల లింగము
లీక్షితిని త్రిలింగసంజ్ఞ నెన్నికకెక్కున్.

గీ. తత్త్రిలింగ నివాసము తనరు కతన
నాంధ్రదేశంబు దాఁ ద్రిలింగాఖ్య మయ్యె
తెలుగగుచు దద్భవము దాని వలనఁ బొడమె
వెనుక కొందఱు దానినే తెనుఁగు నంద్రు.

—కాకనూరి అప్పకవి : అప్పకవీయము

47. పైన చెప్పబడిన దానినిబట్టి శ్రీపర్వతము, ద్రాక్షారామము, కాళేశ్వరము అను మూడు క్షేత్రముల లింగములు త్రిలింగములనియు నా మూడు లింగముల మధ్యనుండు దేశము త్రిలింగదేశమనియు నీ త్రిలింగశబ్దభవము తెలుఁగనియు, తెలుఁగే తరువాతి వారిచేత దెనుఁగని వాడబడెననియు తెలియుచున్నది. అయితే త్రిలింగపదముయొక్క యుత్పత్తినిగూర్చి భేదాభిప్రాయము భాషాభిమానులకు కలదు. కాని మొత్తముమీద తెలుగు పదముమాత్రము త్రిలింగమునుండియే వచ్చినదని చెప్పెడి యూహ సరియైనదని తోచుచున్నది. మనదేశము కొంతకాలము త్రిలింగదేశమని వాడబడినటుల చరిత్రలో దృష్టాంతరములు లేకపోలేదు.

త్రిలింగము

48. ఈ విషయమై పరిశీలించి చూచినచో క్రీస్తుశకము ప్రథమ ద్వితీయ శతాబ్దముల నాటికి యీ త్రిలింగపదము మన దేశమునందేగాక పరదేశముననుండివచ్చిన రాయబారులు, దేశసంచారులును వాడినట్లు కనుపించుచున్నది. అట్టివారిలో

గ్రీసు దేశస్థులగు టాలమి (Ptolemy), ప్లీని (Pliny) యనువారలు ముఖ్యులు. వీరిరువురు నా రెండు శతాబ్దములలో హిందూ దేశమునకు వ్యాపారకాంక్షతో వచ్చియుండిరి. అప్పుడీదేశపు వర్తకులుకొందరు 'టాలిమి'కి త్రిలింగమునుగూర్చి చెప్పియుండిరి. అతడు త్రిలింగ దేశమును గూర్చి వ్రాయుచు (Trigly phon Vel Trilingam Regia) ట్రిగ్లిఫాన్ వేల్ త్రిలింగం రీజియాయని వ్రాసియుండెను. అతడు వ్రాయుటలో నీ దేశము గంగానది వద్దనుండినట్లు వ్రాసియుండెను. ఈ వ్రాతనుబట్టి గ్రీసు దేశస్థులకు త్రిలింగమునుగూర్చి తెలిసియున్నటు స్పష్టమగుచున్నది.

49. ఈ విషయమును గూర్చియే రెండవ చరిత్రకారుడైన 'ప్లీని'యను గ్రీసుదేశస్థుడు యీ దేశమునుగూర్చి వ్రాయుచు దీనినే 'మూడోగలింగ' మనియు, ఈ దేశము గంగానదిలోని యొక లంకయనియు నీ క్రిందివిధముగ వ్రాసియుండెను.

"Insulac in Gangae amplitudinus gentem Continens Upam Moodogalingam omine"

సంస్కృతపదమగు త్రిలింగమునకు యీ మూడోలింగమను పదము తెనుగుపదమై యుండవలెను.

50. చరిత్రకారు లిద్దరు యీ దేశము గంగానది సమీపములో నుండినట్లు వ్రాయుటవలన వారు స్థలనిర్దేశముచేయుటలో నేదైనపొరపాటును చేసియుండవలెను. అట్లుకానిచో నీ దేశ మధ్యముననున్న గోదావరీనదిని గంగానదినిగా భావించి అట్లువ్రాసి యుండవచ్చును. గోదావరినదిని దక్షిణ గంగయనుటయును దేశమునందాచారమే మై యున్నది. నన్నయభట్టు తన భారతములో "దక్షిణ గంగనాఁ దద్దయనొప్పి గోదావరియు" నని వ్రాసియుండెను. ఈ విషయమును గూర్చి వ్రాయుచు 'కాంబెలు' పండితుడు ఇట్లు సమర్థించెను :

"In accuracies respecting situations are not uncommon in the writings of the ancients and this might be reconciled by supporting that under the name Ganges, either the Ganges proper or the Godavari may be occasionally understood. Both are looked-upon as sister streams and each is known as Ganges. While returning from Benares, water from Godavari is brought home. Godavari is the oldest of the two while Ganges is the holier. Ancient books of Hindus, Vayupurana and Bhrahmmanda purana bear testimony that these two rivers have occasionally been considered as one, for, in more places than one in the puranas, Ganges proper is described as passing through Kalinga a country, which we know to be, the region watered by the course of the river Godavary. So for as regards the course of the river Ganges, through Kalinga described in the ancient books it must be the river Godavari which they allude to."

51. పూర్వులువ్రాసిన వ్రాతలలో స్థలనిర్దేశములనుగూర్చిన పొరపాట్లు అసామాన్యముకాదనియు, వాటిని సమన్వయము జేయవలసి యున్నది. గంగా గోదావరినదులు రెండున్ను సోదరీ సంబంధము గలవనియు, గోదావరి పురాతనమైనదనియు, గంగ పవిత్రమైనదియునై యుండి ఒకదాని కింకొకటి పొరబడ దగినవనియు, అందువలన మనము సమన్వయము చేయవలసి యున్నదనియు వ్రాసియుండిరి. వాయు పురాణమునందును, బ్రహ్మాండ పురాణమునందును నీ రెండునదు లొకటిగనే భావింపబడెననియు, కలింగదేశమున గోదావరీనది ప్రవహించుచున్నను గంగానదియే ప్రవహించుచున్నట్లు వ్రాసియుండిరనియు, గంగయని వ్రాసినను కళింగదేశమున ప్రవహించునది గోదావరీనదియే యని భావించవలయుననియు 'కాంబెలు' పండితుడు వ్రాసియుండెను.

52. బ్రహ్మాండ పురాణమున నీ త్రిలింగ వివరములున్న వ్రాయబడియుండెను. ఆ శ్లోకముల నిదివరకే వ్రాసియుంటిని. స్కాంధ పురాణమునందును 'త్రైలింగులు' అని ఆంధ్ర దేశస్థులు పిలువబడిరి.

కర్ణాటకాశ్చైవ త్రైలింగ్య గూర్జర రాష్ట్రవాసినః
ద్రావిడా ద్రావిడ పంచవింధ్య దక్షిణవాసినః.

53. త్రిలింగశబ్దానుశాసనమను వ్యాకరణమున, అధర్వణాచార్యులు త్రిలింగశబ్దమునకు వ్యాకరణము రచించెనని చెప్పియుండెను.

శ్లో. "లోకే ప్రసిద్ధం జయతి సర్వలక్షణ లక్షితం
శబ్దం త్రిలింగశబ్దానాం అధర్వణకవేః కృతిః
కరోమిశబ్దం శబ్దానాం త్రిలింగానాం సలక్షణం
బార్హస్పత్యాని సూత్రాణి కాణ్వం వ్యాకరణం విదన్".

—అధర్వణాచార్య : త్రిలింగ శబ్దాను శాసనం·

54. తారానాథుడను బౌద్ధగ్రంథకర్తయు త్రిలింగదేశ ప్రశంసను చేసియుండెను. పదమూడవ శతాబ్దమునాటి విద్యానాథ కవియు తన ప్రతాపరుద్రీయ గ్రంథమునందు త్రిలింగపద ప్రశంస చేసి యుండెను.

55. పైసందర్భముల నన్నిటిని నాలోచింప నీదేశమును క్రీస్తుశకప్రారంభముననే త్రిలింగదేశముగ వాడబడుచున్నట్లు స్పష్టపడుచున్నది. త్రిలింగదేశమన మూడులింగములమధ్య నుండు దేశము. ఇట్లు వైయ్యాకరణులు చెప్పునట్లు యిదివరలో వ్రాసియుంటిని. త్రిలింగములలోని మహేంద్రగిరి గంజాము మండలములోనిదై యున్నది. మహేంద్రపర్వతమున దేవదేవుడు కలడు. త్రిలింగములలో నొకలింగము శ్రీశైలమనుట నిర్వివాదాంశమే. భీమేశ్వరము గోదావరి జిల్లాలోనిది. ఈ కాళేశ్వరమనునది ఎచ్చటనున్నదో నిర్ధారణచేయుట

యందు భేదాభిప్రాయము కలదు. కాళేశ్వరమన తిరుపతికి చేరువనున్న కాళహస్తియని కొందరు చెప్పుచున్నారు. తర్కించిచూడ హైదరాబాదు రాజ్యములోని మంథెన సమీపముననుండు కాళేశ్వరమే యీ కాళేశ్వరమైయుండవచ్చునని దృఢముగజెప్పుట సమంజసముగ నున్నది. తిరుపతియొద్దనున్న కాళహస్తియైనచో హైదరాబాదులోని తెలంగాణము తెలుగుదేశములో జేరదు.

56. త్రిలింగములు గల పర్వతములను త్రినగములని జనులు వాడుచుండిరనియు, త్రిలింగమును త్రినగమును పర్యాయపదములని వాడుచుండిరనియు, త్రినగమునుండి తెనుఁగుపద ముత్పన్నమైనదనియు కొందరు భాషాభిమానులు అభిప్రాయపడుచున్నారు. ఇది సరియైన యుత్పత్తి కాదని మరికొంద రూహించుచున్నారు.

57. ఇది యిట్లుండ 'ప్లీని' యను గ్రీకుదేశస్థుడు వ్రాసిన మూడొగ లింగమునుగూర్చి కొంత యాలోచింతము. 'మూడొగ' లింగమన 'మూడవ' లింగమని లేక మూడో+కళింగ మనియు విడదీయవచ్చును. మూడవలింగమని మనము జెప్పినయెడల ఆ పదమునందంత అర్థముగాని, స్వారస్యము గాని కనుపించదు. మూడోకలింగమన్నంతనే దేశమున మూడు కళింగము లున్నవనియు, ఆంధ్రదేశము, మూడవ కళింగమనియు నర్థము జేసికొన నగును. ఇట్టి యర్థముచెప్పుటకు మన చరిత్రయందుగాని, మరి యితర కావ్యములయందుగాని ఆధారము లున్నవాయని యాలోచింపవలసి యున్నది. మహాభారతమునందేమి, మార్కండేయ పురాణమునందేమి, ఖారవేలుని శాసనమునందేమి మూడు కళింగములున్నట్లు వ్రాయబడియున్నది. ఈ భరతఖండము లున్నట్లును, అందు మొదటిది ఉత్తర కళింగమనియు, అదియే 'ఉత్కల' మనియు వాడబడుచుండెడిదని పై గ్రంథములవలన తెలియవచ్చుచున్నది. ఆ దేశము గంగానదిమొదలు కటకమువరకు వ్యాపించియుండెను. రెండవ కళింగము కటకమునుండి మహేంద్రగిరి వరకును వ్యాపించియుండెను. మూడవది మహేంద్రగిరివద్దనుండి గోదావరీ

తీరమువరకు వ్యాపించియుండిన దేశమనియు తెలియవచ్చుచున్నది. ఇదియే గ్రీసుదేశస్థుడు 'ప్లినీ' వ్రాసిన మూడోకలింగము అయివుండవలెను. కాంబెలు పండితుడు దీని విషయమునుగూర్చి వ్రాయుచు, 'మూడొగ' యను పదము మూడు యను పదముయొక్క పూర్వరూపమై యుండవచ్చుననియు నూహించియుండెను. ఈ యూహ నిరాధారమేయని తోచుచున్నది. మూడో + కలింగ మూడొగలింగముగ నుండి యుండవచ్చుననియు తోచుచున్నది. దీనినే సంస్కృతమున త్రికలింగమని చెప్పుచుండిరి. త్రికలింగశబ్దము కొంతకాలమువరకు వాడబడుచూ వచ్చినట్లు యుద్ధమల్లుని శాసనమున "వేంగీభూపః పతిరభూ త్త్రికలింగకోట్టైః" యనియు, చేదివంశజుడైన శ్రీకృష్ణ దేవరాజు 'త్రికలింగ' దేశమును జయించి త్రికలింగాధిపతుడాయెననియు కాశికాపురిలోని తామ్రశాసనమునందును కనుపించుచున్నది. కాన 'త్రికలింగ' మను పదమున్ను మన చరిత్రలో వాడబడియే యున్నది.

58. ఇట్లు మూడు కలింగములున్నట్లు యింకొక బొడ్డేరు శాసనమునందును విశదముగ కనబడుచున్నది. అయితే యీ శాసనమునందలి వివరములును, మహాభారతములోని వివరములయందును కొద్ది భేదములు కనుపడుచున్నవి. మహేంద్రగిరినుండి భీమునిపట్నము వరకున్న దేశ ముత్తలమనియు, భీమునిపట్నమునుండియు, భోగాపురము వరకున్న దేశము మధ్యకలింగమనియు, చివరది దక్షిణకలింగమనియు వ్రాయబడినది. ఆంధ్ర దేశములోని కొంతభాగము కలింగమని ఆముక్తమాల్యదనుండియు కనుబడుచున్నది. 'మున్ను కలింగదేశ విజిగీష' యని వ్రాయబడియున్నది. తెనాలి రామకృష్ణుని పాండురంగ మాహాత్మ్యమునందు ప్రతిష్ఠానపురము (పిఠాపురము) కలింగదేశమున కలంకారమని వ్రాయబడియుండెను.

59. పైసందర్భములనుబట్టి మన దేశము త్రికలింగమని, త్రిలింగమని, త్రినగమని, తెలుఁగు అని, తెనుఁగని, వాడబడుచూ వచ్చినటుల స్పష్టపడుచున్నది. ఈ పదములలో నేదిముందు వాడ

బడినదో, యేది తరువాత వాడబడినదో చెప్పుటకు తగినంత ఆధారములు కనుపించవు. అందువలన నేపద మేపదమునుండి పుట్టినదో చెప్పుటకుగాని, నీపదములన్నియు ప్రత్యేక ప్రత్యేకములుగ నుత్పన్నమయినవనిగాని చెప్పుట కష్టసాధ్యము. కాని కేవలము ఊహనే ఆధారపరచుకొని చెప్పవలసినచో త్రికలింగమునుండి త్రిలింగము, త్రిలింగమునుండి తెలుఁగు, తెలుఁగునుండి తెనుఁగు వచ్చెనని చెప్పవచ్చును. మరియు త్రిలింగమును సమర్థించుటకు సరిహద్దులనున్న మూడు శివక్షేత్రములను, మూడు పర్వతములను వివరించి ఆ క్షేత్రములమధ్య నున్న దేశము త్రిలింగమనియు, మూడుపర్వతములమధ్య నున్నందున త్రినగమనియు వాడుచుండిరని చెప్పనగును. ఇది సరియైనచో త్రిలింగము త్రినగము పర్యాయపదములుగ నుపయోగింపబడి యుండవలెను. అటుపిమ్మట త్రిలింగమునుండి తెలుఁగున్ను, త్రినగమునుండి తెనుఁగు అను పదమున్ను వచ్చియుండవచ్చును. అయితే త్రిలింగ మను పదము ప్రత్యక్షముగ వాడబడినట్లు కనబడుచున్నది గాని త్రినగమనుపద మెచటను, యెవరిచేతను వాడబడినట్లు కనుపించదు. అట్లయినచో తెలుగు అను పదములోని 'లు' అక్షరమునకు బదులుగ 'ను' యను నక్షరము వచ్చియుండవచ్చునని తోచుచున్నది.

60. ఇది యిట్లుండ నింకొక భాషాభిమాని తెనుగు యను పదము సంస్కృతపదమయిన దక్షిణ యను పదమునుండి వచ్చియుండెనని చెప్పుచున్నారు. ఇంతేగాక మనలో భాషాభిమానులనేకులీపదముల గూర్చి యనేకవిధములగు యుత్పత్తులను కల్పించిరి. ఈ యుత్పత్తులన్నియు కేవల హేతుసాధకము లనియు, మానసికకల్పితము లనియు వాటిని విమర్శించినచో మనము తెలిసికొనగలము. అయినను మనవారి బుద్ధిసూక్ష్మతనుమాత్రము వాటి యుత్పత్తులవలన మనము గ్రహించగలము. అట్టి యుత్పత్తులను కొన్నిటి నీప్రక్క నిరూపించి వాటికిగల యాక్షేపణలను కూడ తెల్పుదును.

దక్షిణ : తెనుగు

61. దక్షిణముననున్న దేశమంతయు దక్షిణాపథమని, 'దక్షిణ' యను సంస్కృతపదము వాడుకలో 'దక్షిన్' పదముగమారి ప్రాకృతమున 'దఖిన్' గను, 'దహిన్'రూపముదాల్చి, 'తహిన్' గ మారి 'తేన్' ఆయెననియు, ఈ పదమునకు అచ్చుపరమయినపుడు 'తెను'గాయెననియు, తెనుగు అనగ తెనుగువారి భాషయనియు, అదియే దక్షిణాపథులభాషయనియు కొందరు చెప్పుచున్నారు. ఇట్లే అరవమున 'తేన్' అనగ దక్షిణ మాయెననియు చెప్పియుండిరి. ఈ యుత్పత్తి వాదించ తగినట్లుగ కనుపించుచున్నను సరియైనదని చెప్పుటకు తగినంత ఆధారములు లేవు.

62. మరికొందరు అరవభాషలోని తేన్ అను అరవపదముననుండి 'తెనుగు' పదమును, 'తెఱుక్కు' నుండి 'తెలుగు' వచ్చినదనియు జెప్పుచు 'త్రిలింగము'న నుండి 'తెలుగు' వచ్చినదని చెప్పువారలు స్వభాషాభిమానులు కారనియు, కేవల సంస్కృతభాషాభిమానులనియు నాక్షేపించుచు అరవమున దక్షిణమున 'తెఱుక్కు' అని వాడుదురు. దాని విశేషరూపము 'తేన' తెనుగుదేశము దక్షిణదేశమైయుండుటచేత 'తెఱుక్కు' దేశమనియు, 'తెనుగు' దేశమనియు వాడబడినదని వీరియుద్దేశము. తెఱుక్కులోని 'ఱ' ఉచ్చారణలో 'ల' గ మారియుండుననియు, యిట్టి మార్పులుగల పదము లనేకము లున్నవనియు వాదించుచు అరవములోని 'తెఱియాదు' 'ముఱుంగకాయ' 'తెలియదు' 'ములగకాయ'గ మారినదనియు ఉదాహరణ నిచ్చుచున్నారు. అరవపదమయిన 'నాల్' నాలు గెట్లాయెనో అట్లే 'తేన్' పదము తెను గాయెననియు వ్రాసి యుండిరి (వెళుక్కు = వెలుగు). ఈ సాదృశ్యములన్నియు సరిగనే యున్నవిగాని వీ రిచ్చెడి సమాధానముగాని, హేతువుగాని సరిగావని చెప్పుటకు వీలు కలదు. వీరి యుత్పత్తికి తెనుగుదేశము దక్షిణదేశ మనుటయే ముఖ్యఆధారముగ గ్రహింపబడినది. తెనుగుదేశము దక్షిణదేశమనుటకు సందేహము

లేదు. కాని అరవదేశము తెనుగుదేశముకన్న హెచ్చుగ దక్షిణదేశమైయున్నది. కాని అరవదేశమును, దక్షిణదేశమనుట యుచితముగాని, తెనుగుదేశమును తెఱుక్కుదేశమనుట ఉచితముగాదు. మరియు తెఱుక్కుపదము అరవపదమైనందున మనదేశమును తెఱుక్కుదేశమని అరవలే అనియుండవలెను. అరవదేశమునకు మనదేశ ముత్తరముననున్నదిగాని దక్షిణమున లేదు. కాన మనదేశము తెఱుక్కుదేశము కాజాలదు. ఇంతేకాక అరవలు మన ఆంధ్రదేశమును 'వడహు' దేశమని వాడినట్లుకూడ కొంతవ్యాప్తి కలదు. అట్లుగాక ఉత్తరదేశస్థులీ దేశమును తెఱుక్కుదేశమని వాడిరనుటయు సరికాదు. ఏలనన ఔత్తరాహులభాష అరవము కాదు. ఉత్తరదేశస్థులు తమభాషాపదముచే నామకరణము చేసియుందురుగాని, ద్రావిడభాషాపదము నుపయోగించియుండరు. కాన నీ యుత్పత్తి సరియైనది కాదు.

63. ఈ విషయమునుగూర్చి వ్రాయుచు నొకరు చక్కని వాదము నొకదానిని బయలుదేరదీసియుండిరి. సంస్కృతదేశస్థులకీ దేశము దక్షిణదేశమనుటలో సందేహమేదియు నుండజాలదు. సంస్కృతజ్ఞు లీ దేశము దక్షిణదేశమనియు, నిచట నివసించువారిని దాక్షిణాత్యులనియు వీరు మాట్లాడుభాష దాక్షిణాత్యభాష యనియు చెప్పుచుండిరి. ప్రాకృతభాషావిభాగములలో దాక్షిణాత్యభాష యొకటి కలదు. సంస్కృతరూపమును దాల్చి, దక్షిణదేశస్థుల పదలాలిత్యము కలిగి అమృతతుల్యమగుభాషగ నీ భాషను నిరుక్తభట్టుడను వైయాకరణుడు నిరూపించియున్నాడు. రామశర్మ యను నింకొక కవి అమృతముకన్న తియ్యనిదై దక్షిణాపథ సమ్మిళితమైనదని వ్రాసియుండెను. ఈ దాక్షిణాత్యభాషయే తెలుగుభాషయని వాదించుచున్నారు. దక్షిణపథముననుండి తెనుగుపద ముత్పన్నమైనట్లును జెప్పుచున్నారు. ఇదివరలో నీ యుత్పత్తినిగురించి వ్రాసి అందులకు తగినంత ఆధారములేదనియే వ్రాసియుంటిని.

తేనె + అగు

64. 'తెనుగు'ను తేనె + అగు అని పదవిభాగముజేసి తెనుగుభాష తియ్యగ తేనెవలె మధురముగనుండుటచేత నీయుత్పత్తి చెప్పబడుచున్నది. ఈ యూహ కేవలముగ కల్పితమైనదియే కాని హేతుకరమైనది కాదు. అయితే దీనినే పాశ్చాత్యులు ప్రాగ్దేశపు ఇటాలియనుభాష యందురు. ఈ భాష తియ్యగనే యుండునుగాని చెప్పబడిన యుత్పత్తి మాత్రము సరిగాదు.

తెల్ల + అగు

65. ఇట్లే నీ పదమును 'తెల్ల + అగు' 'ࡂ' పదవిభాగము గావించి తెలుగువారు తెల్లనివారగుటచే తెలుగువా రనబడినట్లు కొంద రూహించు చున్నారు. ఈ యుత్పత్తి సరియైనది కాజాలదు. తెలుగువా రరవవారికన్న తెల్లవారున్ను కాదు. వీరందరును నల్లని వారేయని చెప్పక తప్పదు. శాస్త్రజ్ఞులు వీరినందరిని **Dark Skinned** అనియే చెప్పుచున్నారు.

66. తిలలచందమున రసవంతమగు గోవులు వేనవేలుగ నే దేశంబున చెన్నారునో నా దేశము 'తిలగు' యనబడును. అది యజ్ఞార్హమగు దేశముగ నెంచబడును. కావున మనదేశ మిట్టిదిగనుండి 'తిలగు' యను నామమున చెన్నారి తెలుగు యను నామమును కలిగి యున్నది. ఈ విషయమునే యొక పండితు డీ క్రింది శ్లోకము నాధారముగ జెప్పుచున్నారు.

సరసా స్తిల వర్ణావః
సంతి యత్ర సహస్రశః
సా దేశ స్తిలగుర్నామ
తతోఽసౌ యజ్ఞియస్మృతః.

ఈ శ్లోకమునందు చెప్పబడిన యుత్పత్తి కేవలము మనోకల్పితమైనదని వేరుగ విమర్శించి చెప్పనక్కరలేదు.

ఏడవ ఉపన్యాసము

నన్నయభట్టునకు పూర్వము తెనుగున కవిత్వముండెనా? లేక నన్నయయే ఆదికవియా?

"మన మిప్పటివరకు నెంత తరచిచూచినను వాగనుశాసనునకు పూర్వము కవులుగాని, కవితలుగాని యించుకయును గానిపించుట లేదు. పూర్వపువ్రాతలకై వెదకినవారు మంచిసామర్థ్యమును, మంచిపలుకుబడియును, నేర్పును, ఓర్పును గలవారుగాని సామాన్యులు గారు. ఆంధ్రప్రపంచము నంతయును గాలించి శోధించిరి. కాని వేరుకాదు. అయినను విఫలమనోరథు లైరి."

—కాశిభట్ల బ్రహ్మయ్యశాస్త్రి.

"అయినను పూర్వపుకవులు వ్రాసిన గ్రంథములుమాత్ర మిపుడేవియు నేత్రగోచరములు గాకున్నవి. ఏ హేతువుచేతనో నా కాలపుపుస్తకము లన్నియు నశించియుండును. ఆంధ్ర దేశమునంతను నొకసారి పరరాష్ట్రాధిపతులచేత దగ్ధముచేయబడినట్లును, అందుచేతనే నీదేశమునకు దగ్ధరాష్ట్రమనియు, వేంగిదేశమనియు నామములు కలిగియున్నట్లున్ను చెప్పబడియున్నది. ఆ మహాదహన సమయమునందు ఆవరకున్న పుస్తకము లన్నియు తగులబడిపోయి యుండవచ్చును."

—కం. వీరేశలింగకవి.

2. ఇట్లే యనేకపండితులు వ్రాసియుండిరి. కాని నన్నయ్యకు పూర్వము తెనుగుకవిత్వము లేదనుట కొంతఆశ్చర్యమును కలిగింపక మానదు. అనన్యసాధారణ పాండిత్యప్రకర్షతో, బుద్ధివికాస

ముతో, కట్టుదిట్టములతో భారతమునురచించుటకు పూర్వము మన దేశమున కవిత్వములేదనుట కొంతఆశ్చర్యమును కలిగించుట సహజమేకాని యిట్టిది అసాధ్యముమాత్రము కాజాలదు. అందువలననే అనేకపండితు లీవిషయమై గట్టిగ నిప్పటి కర్థశతాబ్దముక్రింద పరిశోధనలు గావించిరి. అట్లు పరిశోధనలుజేసినవారిలో మానవల్లి రామకృష్ణయ్యకవిగా రొకరు. వారు నన్నెచోడుని కుమారసంభవమును కావ్యమును ప్రథమమున 1907 వ సంవత్సరమున పరిష్కరించి ప్రచురించి అందొకపీఠికను వ్రాయుచు నా గ్రంథముననన్నయకు రెండు వందల సంవత్సరములక్రిందటి గ్రంథమని వ్రాయుచు దానినిరుజువుపరచుటకై ప్రయత్నించిరి. అందుకు హేతువులను నిరూపించిరి. అందుపైన దేశమున పెద్దచర్చ బయల్వెడలెను. అనేకపండితు లీ విషయమై తర్జన భర్జనలు గావించిరి.

3. చిలకూరి వీరభద్రరావుగారు తమ ఆంధ్రచరిత్రమున నీ విషయమునుగూర్చి చర్చించి వీరికాలమును నిర్ణయించుటకు తగిన ఆధారములు కనుపించుటలేదనియు, నీవిషయము నింకను పరిశీలించవలసియున్నదనియు ముగించిరి.

4. బుర్రా శేషగిరిరావుగా రీవిషయమునుగూర్చి వ్రాయుచు నీ కవి నన్నయ్యకు తరువాతివాడనియే నిర్ణయించిరి. కాని వారు జెప్పిన కారణములన్నియు సహేతుకరమైనవియు, ఆధారములు కలవియుగా కనుబడుటలేదు. అయితే వారివాదనను బలపరచుటకై కొన్నివంశవృక్షములను, శాసనములను నాధారము గావించుకొనిరి. నన్నెచోడుడు తనతండ్రి 'చోడబలి' యనిచెప్ప 'చోడబల్లి'కిని 'బల్లిచోడు'నకును,'మల్లిచోడు'నకును, 'మల్లిదేవు'నకును,'త్రిభువనమల్లిదేవచోడు'నకును భేదములేదనియు, వీరంద రొకరే ననియు చెప్పుచు వీరి కాలమును నిర్ణయించుటకు సమకట్టుట సమంజసముగ కనుబట్టుటలేదు.

5. వీరేశలింగముగారున్ను నీ విషయమై కొంతచర్చించిరి. కాని నదియు సరియైనమార్గమున జరిగియుండలేదు. కొన్నిశాసనముల

నాధారపడి వారివాదమును సమర్థింప బ్రయత్నించిరికాని ఆ శాసనములయందలి సందిగ్ధములను సమన్వయము చేయలేకుండిరి. నన్నయకు పూర్వము తెలుగుగ్రంథములును, తెలుగుకవులును లేకపోలేదనియు, నావర కేమియు గ్రంథములులేని పక్షమున అట్టి కట్టుదిట్టములతో నంతనిర్దుష్టముగ నూతనగ్రంథరచన చేయుట నన్నయకుగాని, మరియెవ్వరికిగాని సాధ్యమై యుండెడిదిగాదని వ్రాసి, చిట్టచివరకు వా రీ వాదనవలన సంతుష్టి చెందజాలక ఇది సంతృప్తికరమైన సమాధానము కాకున్నను యింతకంటె మంచియాధారము దొరకనప్పుడు దీనినే సరిపెట్టవలె ననిరి.

6. కట్టమంచి రామలింగారెడ్డిగా రీవిషయమై వ్రాయుచు "నన్నెచోడకవి శిఖామణి నన్నయకు తరువాతివాడు. కాలమునుబట్టి చూచిన సమీపస్థుడుకాని కాలనిర్ణయమున కితరాధారములు కలవు." "నన్నయభట్టునకు పూర్వము ఆంధ్రమున పద్యరచన యుండెను. చందస్సు ఉండెను. నన్నయకు పూర్వము కవిత్వము లేదనియు, అతడు మొట్టమొదటి లక్షణమును నిర్మించి, లక్ష్యములదీర్చి, వాఙ్మయమును సృష్టించె ననువా రెవ్వరు నీనాటికి గానరా''రనియు వ్రాసియుండిరి. నన్నెచోడుని కాలనిర్ణయముచేయుటలో వారు వ్రాసిన 'మునుమార్గకవిత'యను కందపద్యమునందలి 'చాళుక్యరాజే' 'రాజరాజనరేంద్రు'డనియు, అందున నీనన్నెచోడుడు, రాజరాజునకు తరువాతవాడనియు వ్రాసియుండిరి. ఈ యూహయు సరియైనదని చెప్పుటకు వీలులేదు. చాళుక్యరాజులలో రాజరాజనరేంద్రునకు పూర్వ మనేక ప్రసిద్ధరాజులు లేకపోలేదు.

7. బండారు తమ్మయ్యగారు, పాల్కురి సోమనాథకవిని గూర్చి వ్రాయుచు నన్నెచోడుడు సోమనాథకవి తరువాతవాడని వ్రాసియుండిరి. పాల్కురి సోమనాథుడు బసవపురాణమును ద్విపదకావ్యముగ వ్రాసెననియు, నా కావ్యమునుండి కొన్నిభావములను నన్నె

చోడుడు పద్యరూపమున వ్రాసెననియు, అందువలన నీతడు సోమనాథునికి తరువాతివాడనియు వ్రాసియుండిరి. ఇదియు సరియైన యూహ కాజాలదు. సోమనాథకవియే నన్నెచోడుని పద్యములయందుండిన భావములను ద్విపదగా వ్రాసియుండవచ్చును. పద్యద్విపదల పరివర్తనములవలన కవికాలము నిర్ణయించుట సరికాదు.

8. ఇంతవరకును ఇతరులవాదములను విమర్శించుచుంటినే గాని నన్నెచోడుని కాలమును నిర్ణయించుటకు ప్రయత్నించ లేదు. అట్లు నిర్ధారణ జేయుటకును తగినసావకాశములును కనిపించుట లేదు. ఈ విషయమునుగూర్చి యింకను పరిశోధనలు గావింపవలసి యున్నది. కాని కుమారసంభవకావ్యమున నుపయోగింపబడిన కొన్ని పూర్వపు శాసనములలో నుపయోగింపబడిన పదములు గలవు. ఈ పదములు నన్నయకాలమున వాడుకయందు లేవు. ఒకవేళ వాడినను పూర్వపుఅర్థమున వాడబడియుండలేదు. ఇట్టిపదములు 'కుమారసంభవమున' వాడబడియుండెను. 'వ్రకము' అనుపదము నన్నయకు పూర్వశాసనములయందు వాడబడెను. ఈ మాట కుమారసంభవమునందును వాడబడెను. 'అట్లువోలె' 'పగిదివోలె' 'కరణివోలె' 'మాడ్కివోలె' 'భంగివోలె' యిత్యాది పురాతనప్రయోగములు ఈ కవిగ్రంథమున లెక్కకు మిక్కిలిగ నున్నవి. ఈ కావ్యమును పఠించితిమేని తప్పక యిది నన్నయకుపూర్వమే రచింపబడినకావ్యమని కనుపడును.

> "ప్రాజ్యవసుంధరా రాజ్యమునకేగాక ప్రపూజ్య కవితా సామ్రాజ్యమునకును పట్టభద్రుడై యనల్ప ప్రాభవముతో నసామాన్య వైదుష్యముతో ప్రవిమల దివ్యశక్తులను, ప్రశస్త కావ్యమూర్తులను నిహమున వెలయించి పరమున శాశ్వతానందము ననుభవించుచున్న మహారాజ కవిరాజశిఖామణి నన్నెచోడదేవుడు ఆంధ్రమహాజనులకు చిరసంస్మరణీయు

> డగుచున్నా"డని ప్రారంభించి "ఇవ్విధమున పలువురచే బొగడ బడుచున్న యిమ్మహారాజ కవిరాజశిఖామణి యెప్పటివా డైననేమి యెప్పుడు నున్నవాడే, ఎప్పటికి నుండువాడే"

యని నడకుదుటి వీరరాజపంతులుగా రీ కవిశిఖామణిని గూర్చి వ్రాసియుండిరి. ఈ కవికృతకావ్యములలో నొకటి యగు కుమారసంభవ మహాకావ్యమును సంపాదించి ప్రచురించిన కీ. శే. రామకృష్ణకవిగారు ఆంధ్రలోకమునకు సర్వదా అభివందనీయులు.

9. ఈతడు రాజకవి. రాజకవులలో మొదటివాడు. ఈతడే ఆంధ్రకవులలో కూడ ప్రథము డనువిషయము వివాదాంశము. రామకృష్ణకవి యీతడే ప్రథమకవియని తనపీఠికయందు వ్రాసియుండిరి. కాని అది యితరపండితు లెవ్వరు నంగీకరించియుండలేదు.

10. ఈతడు సూర్యవంశపురాజు. కరికాలచోడుని సంతతి వాడు. తండ్రి చోడబలి. తల్లి శ్రీపతి. ఈతడు వ్రాసినపుస్తకములు 'కుమారసంభవము', 'కళావిలాసము'. నన్నెచోడుని భావములయం దత్యంత మనోజ్ఞత్వమును, ఆచ్ఛికములయం దత్యంత సౌభాగ్యత్వమును నిరతిశయములు. అర్థము సొంపున తిక్కన సొంపులకు సొంపు లున్నవి. తిక్కన పదపరికరముల కెల్లను మరింత సంపన్నములుగ నున్నవి. నన్నెచోడుని పద పరికరములకుగల సౌష్ఠవ పుష్టిని, కవితకుగల పాకప్రౌఢిని చూడగ తిక్కనకవియంత మెఱుగుగ దోపవు. మరి నన్నెచోడుడు తిక్కనకు పూర్వుడే యైనయెడల తిక్కన ఆంధ్రకవితా సామ్రాజ్య సింహాసనమునం దర్థాసనముకంటె నెక్కువ నన్నెచోడునికే యివ్వవలెను అని తేవప్పెరుమాళ్లయ్యగారు వ్రాసియుండిరి.

11. "ఈతని కవిత్వము మొత్తముమీద రసవంతమైనది. అసాధారణధారకలదియు, హృదయంగమైనదియు నై యున్నది. ఈతడు నాచన సోమనాథాది కవులతో తులతూగతగినవాడుగాని సాధారణుడు

గాదు. ఉతనికవిత్వమునందు, ద్వ్యర్థకసంధులు మొదలయిన కొన్ని స్వల్పదోషము లున్నవిగాని యివి రత్నాకరములోని నత్తగుల్లల వలె నంతగా పాటింపదగినవికావు. కన్నడభాషా సమ్మేళనము మాత్ర మంతగా శ్లాఘ్యముగాదు." కం. వీ. లింగంగారు.

కవికాల నిర్ణయమున కితరాధారములు

12. నన్నెచోడకవి 'కళావిలాసము'ను వ్రాసెను. ఇది క్షేమేంద్రుని 'కళావిలాసము' ననుకరించుచున్నది. అందువలన నీతడు క్షేమేంద్రుని తరువాతివాడు. క్షేమేంద్రుడు కాశ్మీరదేశస్థుడు. భోజరాజు కాలపువాడు. 1020 వరకు ఉండినవాడు.

13. షష్ఠ్యంతములు ఎక్కువ వ్రాయుట ప్రారంభించెను. ఉతడు వ్రాసెను.

14. పూర్వకవుల స్తుతించుటలో నన్నెచోడుడు ఉద్భటుని పేరుమాత్రము వ్రాసియుండెను. ఈ యుద్భటుడు కాశ్మీరదేశపు రాజైన జయసింహుని యాస్థానమునం దుండెను. ఈ రాజు క్రీస్తుశకము 779-813 సంవత్సరముల మధ్యనుండి యుండెను. కాని నన్నెచోడు డీతని సమకాలికుడుమాత్రము కాడు.

15. పైన వ్రాసినదానినిబట్టి నన్నెచోడుడు నన్నయకు పూర్వపువాడైనట్లు చెప్పుట కాధారములు కనిపించనందున ఇప్పటికి నన్నయయే ఆంధ్రభాషకు ఆదికవియనియు, నతనికి పూర్వము లక్షణ గ్రంథములుగాని, లక్ష్యగ్రంథములుగాని దొరకియుండనందున లేవని, అతడే ఆంధ్రకవితాగురువనియు, నన్నయభట్టారకుడే ఆంధ్రభాషకు వాగనుశాసనుడనియు నెల్లరు నంగీకరింపవచ్చును. అయితే ప్రస్తుతపు ఆంధ్రవాఙ్మయమంతయు సంస్కృతపద భూయిష్ఠమై ఆర్యసంప్రదాయములతో కూడుకొన్నదిగ గనబడుచున్నది. ఇట్టికవిత్వమును బోలిన అనగా సంస్కృత పదభూయిష్ఠమగు ఆంధ్రరచన అప్పటికే

దాదాపు మూడువందల సంవత్సరములు పైకాలముక్రిందనే యుండినటుల కోరాడ రామకృష్ణకవిగా రభిప్రాయపడుచున్నారు. ఇట్టి అభిప్రాయములో నేకీభవించు ఆంధ్రపండితు లిప్పు డనేకు లున్నారు. అయితే యిట్టికవిత్వము గ్రంథస్థమైనట్లు తోచదు. ఈ కవిత్వము యొక్క ఛాయలు కొన్నిశాసనములయందు కనబడుచున్నవి.

16. తెనుగుదేశమునకు ఈ యార్యులసంపర్కము క్రీ. శ. ప్రారంభమునకుపూర్వమే రెండుమూడు శతాబ్దములక్రిందనే కలిగినట్లు కనుబడుచున్నది. అప్పటికి ప్రాతదేశమందున దేశీయ వాఙ్మయ మేదైన నుండినను - లేకుండనుండదని నా గట్టినమ్మకము - అది గ్రంథస్థము కానూలేదు. అందువలన మనకు తెలియనూ తెలియదు. అంతకుముందలి వాఙ్మయము నోటిపాఠముగ నల్లవేయబడి యొకరి వద్దనుండి యింకొకరు ప్రచారము గావించి యుండవలెను. ఇప్పటికిని మనస్త్రీలు పాటల నల్లి నేర్చుకొనుట మనకు తెలిసియేయున్నది. ఇట్టి వాఙ్మయమంతయు మతసంబంధమైనదిగను, స్త్రీల నోములు, వ్రతములకు సంబంధించినదిగను, పిల్లలను ఆడించుటకును, నిద్రపుచ్చుటకును తల్లులుపాడెడులాలిపాటలు జోజోపాటలు మొదలైనవిగను, దేశమునందు మహామ్మారి, విషజ్వరము, కలరా, స్ఫోటకము మొదలయిన వ్యాధులు సంభవించినపు డాయా రోగదేవతల ప్రీతికిని, దేశశాంతికిని పాడినపాటలయందును నీ దేశీయకవిత్వము కల్గిన వాఙ్మయ ముండియుండవలెనని యూహించుచున్నది. ఇట్టి వాఙ్మయ మంతయు పద్యములు, పాటల రూపముగనుండి మృదుమధురమగు పదములుకలిగి మంచిశ్రావ్యమైన ఫణితిలో మిళితమై మిక్కిలి శ్రావ్యముగను, శ్రోతల కానందకరముగను, కోర్కెలను సమకూర్చి వారికిహృదయరంజకముగను నుండియుండవలెను. మరియు నిట్టిపాటలు, పద్యములును కేవలపామరజనులకు గ్రాహ్యమగునట్లు లోకమునందలి వాడుకభాషలో దేశీయపదములతో కూడుకొన్నవై యుండియుండవలెనని యూహింపబడుచున్నది. ఇట్టివియే మన తెనుగుభాషయందు చెప్పబడిన

వాఙ్మయమై యుండవలెనని తోచుచున్నది. ఇట్టిపాటలయందు రాగ తాళములుగాని, యతిప్రాసలుగాని, లాక్షణికపు కట్టుదిట్టములుగాని లేక కేవలము చెవులకింపుగానుండెడు లలితపదములు కూర్చినవై యుండ వలెను. ఇవియే పాటలు. ఇట్టిపాటలు అరవవాఙ్మయమునందు హెచ్చుగ నున్నవి. కన్నడమునందును కలవు. కాని కన్నడభాషలో నీ పాటలలో సంస్కృత ప్రాకృత పదములు మిక్కిలి హెచ్చుగ నున్నవి. అరవ భాషయందును యతిప్రాసలు గలవు. వాటినే అరవమునందు యానై ప్రాసై యని యందురు.

17. ఆర్యసంపర్కము కలిగినంతనే మన తెనుగువారు "పాత యొకరోత క్రొత్త యొకవింత" యనుసామెత ననుసరించి పాతవాటిపై నసహ్యముజెంది క్రొత్తగవచ్చిన ఆర్యులపాటలు, ఆర్యులవాఙ్మయ మును, ఆర్యుల సంప్రదాయములను అలవరచుకొని పాతపాటలకు, వాఙ్మయమునకు, సంప్రదాయములకు స్వస్తిచెప్పిరి. అందువలన పాతవి అడుగంటినవి. చివరకు మన ప్రాచీన తెనుగుభాషనుకూడ విస్మరించిరి క్రొత్తగవచ్చిన ప్రాకృత పైశాచి సంస్కృతభాషలను వాడుచువచ్చిరి. ఇంతజరిగినను విద్యాగంధములేని జనసామాన్యమును, స్త్రీలును మాత్రము పాతపాటలనే కొద్ది వాడుకమార్పులతో నిల బెట్టిరని యూహించవలసి వచ్చుచున్నది. ఇట్టిస్థితిలో మనదేశభాష ఆర్యులు రాకపూర్వ మెట్లుండెనో మనము విపులముగ తెలిసికొన జాలముగాని యీ పాటలనుబట్టి కొంతవర కూహించవచ్చును. ఇట్టి పాటలను, సామెతలను ఈ యుపన్యాసముచివర నుదాహరించెదను.

శా స న ము లు

18. ఈ శాసనములు మనకు కనుపడునంతవరకు రెండు విధములుగనున్నవి. కొన్నిశాసనములు తామ్రశాసనములు, మరికొన్ని రాతిశాసనములు. తామ్రశాసనములు సంస్కృతశాసనములై యున్నవి.

రాతిశాసనము యందు చాలభాగము సంస్కృతమునందే యున్నవి గాని కొన్ని తెనుగులిపిలో వ్రాయబడియున్నవి.

19. ఆంధ్రదేశము నేలినరాజులలో శాతవాహనులే ప్రథము లని శాసనములవలన, నాణెములవలన తెలియుచున్నది. వీరిలో ముప్పదిమందిరాజులు నాల్గువందల సంవత్సరములు రాజ్యముచేసినట్లు పురాణములయందు వ్రాయబడినది. కొందరుపండితులు చెప్పుటలో నీ శాతవాహనులలో నిరువదినాల్గవ రాజైన వాసిష్ఠీపుత్రపులోమా వియే ఆంధ్రదేశమున రాజ్యము జేసిన ప్రథమరాజని చెప్పుదురు. వీరికి పూర్వపురాజుల శాసనములన్నియు మహారాష్ట్రదేశమున కనుబడు చున్నవట. ఈ శాసనములయందు ఆంధ్రదేశ ప్రశంసయే లేదట. ఆంధ్ర దేశమున నాణెములేవియు దొరకియుండలేదు. ఇచట దొరకిన బౌద్ధ శాసనములయందెచటను శాతవాహన ప్రశంస కనబడలేదట. అందువలన ప్రథమముననున్న యిరువదిముగ్గురు శాతవాహనరాజులు ఆంధ్రదేశ మున రాజ్యము గావింపలేదని వాదించుచున్నారు. ఈ విషయమును గూర్చి డా. మారేమండ రామారావుగారు ప్రతిపక్షమును గావించుచు నొక పెద్ద వ్యాసమును వ్రాసియుండిరి. దొరకిన బౌద్ధశాసనములయందు ఆంధ్రదేశమని వ్రాయబడలేదు. కాని ఆంధ్రపథమని క్రీ. పూ. మూడవ శతాబ్దినాటి శాసనమునందు కలదు. అప్పటికాలపు బౌద్ధ వాఙ్మయమునందు 'అంధకగణ' 'అంధకవిణ్ణ' 'అంధక' యను పద ములు కనుపించుచునే యున్నవి. మొత్తముమీద ఆంధ్రరాజ్యమునేలిన శాతవాహనులనుటకు అభ్యంతరములేదు. శాతవాహనులు మొదటి నుండియు నిచట రాజ్యము గావించిరో లేక యిరువది నాల్గవరాజే ప్రథమమున రాజ్యము ప్రారంభించెనో యనునదియే చర్చనీయాంశము. ఏది యెట్లున్నను క్రీస్తుశక ప్రారంభమునుండి శాతవాహను లిచట రాజ్యము చేసిరనుట నిర్వివాదాంశము.

20. మొదటినుండియు మనఆంధ్రదేశమును పరిపాలించిన రాజులందరును బౌద్ధమతమును స్వీకరించినను లేకున్నను మొత్తము

మీద బౌద్ధమతమునందు హెచ్చుపక్షపాతులై బౌద్ధమతమునే హెచ్చుగ నాదరించినవారై యుండిరి. వారిభాషయు ప్రాకృతభాషయే యై యుండెను. రాజాదరణభాష ప్రాకృతభాష కావున తెనుగున వ్రాయబడిన గ్రంథములుగాని, తదితరములుగాని లేవు. అప్పటికాలపు శాసనములును రాజ్య భాషయగు ప్రాకృతముననే లిఖింపబడినవి. ఇట్లు లిఖింపబడినవాటిలో నచ్చటచ్చట తెనుగుపదములు కనబడుచున్నవి గాని దేశభాషయగు తెలుగు ఆ కాలమున నెట్లుండెనో కనుగొనుట కెంతమాత్రమును వీలు కలిగియుండలేదు. పల్లవులు రాజ్యము చేయునపుడు రాజ్యభాష ప్రాకృతముగనే యుండెను. చాళుక్యులు రాజ్యము చేయుకాలమునను కొంతవరకు ప్రాకృతభాషయే రాజ్యభాషగనుండెను. అందువలన మనకు దొరకిన తెలుగుపదములు ఆకాలపు ప్రాకృతములో కలిపిన తెనుగుపదములుగనే యుండెను. అట్టిదియే యిప్పుడు దేశీయ భాషయని పిలువబడుచున్నది.

21. అయితే పల్లవరాజులలో చివరకు రాజ్యముచేసినవారి కాలముననే తిరిగి బ్రాహ్మణమతము కొంత పైకి వచ్చుచుండెను. అప్పటికి కుమారిలభట్టు, శ్రీశంకరాచార్యులవారు నుద్భవించియుండిరి. బ్రాహ్మణమతమునకు సంస్కృతవిద్య ముఖ్యముగనుండెను. అందువలన సంస్కృతభాష జనులకు ప్రాధాన్యమాయెను. బ్రాహ్మణమతము దేశమునందు వ్యాప్తముకాగా బౌద్ధమతముయొక్క ప్రాముఖ్యత క్షీణింప ప్రారంభించెను. ప్రాకృతభాషయు దేశమందు వాడబడక దాని స్థానే సంస్కృతభాషయే వాడబడుచుండెను. ఆంధ్రరాజులును సంస్కృతభాషనే హెచ్చుగ ప్రోత్సహింప ప్రారంభించిరి. అప్పటి శాసనములన్నియు సంస్కృతభాషయందు లిఖింపబడినవి. అందువలన సంస్కృతశాసనములే హెచ్చుగ కనిపించుచున్నవి. పల్లవులు, చాళుక్యులు రాజ్యము చేయుకాలమున తెనుగులో లిఖింపబడిన శాసనములు లేకపోలేదు. కాని యవి బహుతక్కువగనుండెను. అట్టి శాసనములయందు వాయబడిన తెనుగును సంస్కృతపదములతో కూడి

యున్నది. అట్లే రానురాను నన్నయ భారతము వ్రాయుకాలమునకు సంస్కృతభాషయే తెనుగుఅంత్యములతో భారతమున వ్రాయబడి యుండెను. అంతేకాని అచ్చతెనుగు రూప మెట్లుండెనో కూడ మనకు తెలిసికొను ప్రాప్తము తెనుగువారికి కలిగియుండలేదు.

22. అందువలననే నన్నెచోడమహాకవి కుమారసంభవ గ్రంథమును వ్రాయ ప్రారంభించినపుడు,

క. మును మార్గకవిత లోకం
బున వెలయఁగ దేశికవిత పుట్టించి తెనుం
*గు నిలిపి రంధ్రవిషయమునఁ
జనసత్యాశ్రయుని దొట్టి చాళుక్యనృపుల్.

సంస్కృతమున కవిత్వము హెచ్చుకాగా దేశికవిత్వమును ప్రారంభించి సత్యాశ్రయుడు మొదలుగాగల చాళుక్యరాజులు తెనుగుకవిత్వమును స్థాపించిరని గ్రహింపవలసియున్నది.

23. ఈ పైనవ్రాయబడిన పద్యమునం దుపయోగింపబడిన 'మార్గకవిత, దేశికవిత' యను పదములు కొంచె మాలోచింపతగినవి. 'మార్గకవిత'యన సంస్కృతమనియు, 'దేశికవిత' యన దేశమునందు వాడబడు తెనుగనియు నర్థము వ్రాసి యుంటిని. 'మార్గ' యను పదము కవిత్వమునుగూర్చి వ్రాసినది నన్నెచోడుడే. 'మార్గ' 'దేశి' యను పదములు ప్రథమమున భాషకుసంబంధించినపదములు కావు. ఈ రెండు పదములున్ను సంగీతవిభేదములుగ సంస్కృతభాషలో వాడబడినవి. మరియు నాటకోపకారకములైన 'నృత్య' 'నృత్త' యను పదములకు పర్యాయపదములుగ వాడబడెను. ఈ రెంటిని నన్నెచోడుడు కవిత్వమును గూర్చివ్రాయుచు నుపయోగించెను. ఈ పదములు లక్షణగ్రంథము

*పాఠాం. గును నిలిపి రంధ్రవిషయంబునఁజనఁజాళుక్యరాజ మొదలుగఁ బలువుర్.

లయం దెచటను కనిపించవు. వీటినిగూర్చి సంగీత నాట్యశాస్త్రముల యందుచూచి వాటి భావములను కవిత్వమునకు సమన్వయము చేయవలెను. 'బ్రహ్మాది దేవతలకు రుచ్యమై మోక్షదాయకముగ' నుండు సంగీతము మార్గసంగీతమనియు, సామాన్యజనులకు సుబోధకముగ నుండునది దేశియనియు సంగీతశాస్త్రమునందు వివరింపబడినది. అందువలన విద్వాంసులనురంజింపజేయునదిమార్గసంగీతమనియు, పామరజనులరంజింపజేయునది 'దేశి' యనియు నర్థముచేసికొనవలయును. దీనినే వాల్మీకిరామాయణమున బాలకాండమున-

> తతస్తు తౌ రామవచః ప్రబోధితా
> వగాయతాం మార్గవిధాన సంపదా. బా. 4. 30.

ఋషులకు, రామాదులకు అర్థమగునట్లు ఉత్తమమార్గ పద్ధతిని కుశలవులు రామాయణమును గానముచేసిరని వ్రాసియుండెను. ఇట్లే నాట్యశాస్త్రమున విద్వాంసులను రంజింప జేయునది 'నృత్యము.' సామాన్యులను రంజింపజేయునది 'నృత్తము.'

24. ఈ భావములను కవిత్వమున కన్వయించినచో మంచి విద్వాంసులకును, పండితులకును అర్థమగునది మార్గకవిత యనియు, సామాన్య పామరు లర్థముజేసికొనదగినది ఆ యా దేశములయందలి భాషలలోని కవిత దేశికవితయనియు తెలియనగును. దీనినే నన్నెచోడుడు పైపద్యమున వ్రాసియుండెను. నన్నెచోడుడు తరువాతి వ్రాసిన పద్యమున

> "దురాగ్మార్గపథవర్తు లనఁదగు మార్గకవులన్"

అని వ్రాయుటలో మార్గకవిత్వమునందు కొందరు దుర్మార్గకవులు, మరికొందరు సన్మార్గకవులు నుండిరని నుడివినట్లు స్ఫురించుచున్నది. కాని అట్టివారెవ్వరైనది వ్రాసియుండలేదు. కాని

యీదుర్మార్గపథవర్తు లెవరని యాలోచించిన-సంస్కృతపదములకు కేవల తెలుగుపదములు కలిపి వ్రాయబడిన కవిత్వమే దుర్మార్గపథవర్తుల కవిత్వమని నన్నెచోడుని అభిప్రాయమైనట్లు కనబడుచున్నది. ఇట్టి కవిత మళయాళభాషయందు హెచ్చుగ నున్నది.

25. చాళుక్యరాజుల కాలమునందు మార్గకవిత, అనగా సంస్కృత కవిత్వము బాగుగా విస్తరించినది. అంతకు పూర్వము మనదేశమున నుండినది ప్రాకృత భాషయే. ఇదియే అప్పటి ఆంధ్ర దేశ భాష. అచ్చటచ్చట శాసనములయం దీభాష కనుబడుచున్నది. ప్రాకృతభాషా సంబంధము కల్గిన తెలుగుభాషయే దేశకవితయని చెప్పినట్లు కనిపించుచున్నది. ఇదిగాక ఆంధ్రుల సంపర్కముకలగని కాలమున నుండినభాష యింకొకటి యుండవలెను. అదియే నిజమైన దేశికవిత. దానినే మనము అచ్చతెనుగుగా భావించుచున్నాము. అట్టి అన్యభాషాసంపర్కములేని అచ్చతెనుగు ప్రాకృత భాషా సంపర్కముకలిగిన తెనుగుకూడ నన్నెచోడుడు దేశకవితగా నుద్దేశించినట్లు తోచుచున్నది. ఈ రెండవ విధమగు దేశికవిత మనకు ప్రాచీన శాసనములయందు కొంతవరకు కనబడునుగాని అచ్చతెనుగు ఎట్లుండెడిదో తెలుసుకొనుటకైనను మార్గములు కనిపించుటలేదు. అందువలననే మన వ్యాకరణములయందు దేశీయపదములుగా నిరూపింపబడిన యనేక పదములు ప్రాకృతభాషయందలి ధాతువులవలన నుత్పన్నమైనట్లు కనిపించుచున్నది. అవిఅన్నియు నిజమైన అచ్చతెలుగు పదములు కాజాలవు.

అచ్చ తెనుగు

26. సంస్కృత ప్రాకృతములతోగాని, తత్సమతద్భవములతోగాని సంబంధములేని కేవల తెనుగుపదములని కొందరు లాక్షణికుల అభిప్రాయమైయున్నది. కూచిమంచి తిమ్మకవి తన 'సర్వలక్షణ సారసంగ్రహమున' నీ యభిప్రాయమును వెలిబుచ్చియున్నారు.

క. సూరిజనుల్ లోక వ్యవ
హారంబుగ బాస దేశ మండ్రదియె హితం
బారగ నచ్చ తెనుంగని
యారూఢిగ గొందఱందురు...

27. తద్భవ దేశ్యపదములు రెండు నచ్చతెనుఁగుపదములే యని మఱికొందరు పండితుల అభిప్రాయమై యున్నది. ఇట్టివారే హెచ్చుగ నున్నారు.

అ ప్ప క వి

క. నెలకొను సంస్కృత తత్సమ
ములు దొరలక తజ్జదేశ్యముల మాఁటను సం
ధిలి కేవలాంధ్ర పదముల
నలరుకృతుల నచ్చతెనుఁగు లండ్రు తెలుఁగునన్.

క. తెలుఁగు మఱుంగులు ప్రాఁదెనుఁ
గులు తద్భవదేశ్యములను గూర్చి మృదుపదం
బులుగాఁగ నచ్చతెనుఁగులు
మెలఁకువలోఁ జెప్పఁదగు.

పై రెండభిప్రాయములలో మొదటిదే సరియైనట్టిదియు, సహేతుకమైనట్టిదియు నభిప్రాయమని చెప్పవలసియున్నది. కాని మొదటిఅభిప్రాయము ననుసరించినచో, నిజముగా నొక్క పద్యమైనను నే కవియు తెనుగున వ్రాయజాలడని చాలమంది పండితులు రెండవ యభిప్రాయమునే అంగీకరించి యున్నారు.

28. ఆంధ్రకౌముది యను నింకొక వ్యాకరణము కలదు. ఇది కణ్వమహాఋషిచే వ్రాయబడెనని చెప్పుదురు. ఆ వ్యాకరణమున "ఆంధ్రవిష్ణువునకు పూర్వము వాడుకయందుండిన సుబంత కృదంత

ధాతుసంయుక్తమైన వాక్యలు అచ్చతెనుగున వ్రాయబడె'నని వ్రాసియుండెను.

బ్రహ్మణా నిర్మితా వాచః
పూర్వ మాంధ్రేశే తుఃపరే
అచ్ఛా ఇతి చ కథ్యంతే
సుప్కృద్ధాతు సమన్వితాః.

పై వ్యాకరణ మెచ్చటను లేదు.

29. కేతన యను నింకొక లాక్షణికుడు తన 'ఆంధ్రభాషాభూషణ'మను వ్యాకరణమునందు తత్సమములనియు, తద్భవములనియు, అచ్చతెనుగనియు, దేశ్యమనియు, గ్రామ్యమనియు తెనుగుపదము లైదువిధములనియు, అందు అచ్చతెనుగును వర్ణించుచు నిట్లు చెప్పెను.

.... ఎల్లవారికిఁ ....
దెలిసెడి యా పలుకు లచ్చతెలుఁగన బరగున్.

తేరనాడిన దేశ్యంపు తెనుఁగులయ్యె.

అని వ్రాసెను. ఎల్లవారికిని తెలియుట అచ్చతెనుగులక్షణమనియు, తేరనాడుట అనగా తేటగా, అనాయాసముగ లేక (యితర) సంబంధములేకుండ బల్కుట దేశ్యముయొక్క లక్షణమనియు వ్రాసెను. సంబంధములేకుండుట యన ప్రాకృత సంస్కృతభాషా సంబంధము లేకుండుటయని యర్థము. తిరిగి వ్రాయుచు,

ఆ. వె. తత్సమంబుదక్కఁ దక్కిన నాలుగు
నచ్చ తెలుఁగటండ్రు రఖిలజనులు.

కాని తత్సమముగాక తక్కినవాన్ని అచ్చతెనుగని యేర్పరచిరి. పదునారవశతాబ్దమువరకు అచ్చతెనుగున గ్రంథము లెవ్వియు వ్రాయబడి యుండలేదు. అచ్చతెనుగున ప్రథమమున కావ్యము వ్రాసినది పొన్నగంటి తెలగనార్యుడు. ఈతడు వ్రాసినచరిత్రము 'యయాతి చరిత్రము.' ఈ కావ్యము 1574-81 సంవత్సరములమధ్య వ్రాయబడెను. దీనిని అమీనుఖానుని కంకితముగావించెను. ఈతనితరువాత కూచిమంచి తిమ్మనకవి, అడిదము సూరనయు రామాయణమును అచ్చతెనుగున రచించిరి. పందొమ్మిదవశతాబ్దమున అల్లమరాజు రామకృష్ణకవి అచ్చతెనుగున భాగవతమును రచించెను.

30. మనవారికే, అనగా తెనుగువారమని చెప్పుకొను నాంధ్రులకే తెనుగుభాషయందు తగినంతగౌరవములేనందునను, పండితులందరును సంస్కృతభాషనే పక్షీకరించినందునను, చిరకాలము ప్రాకృతభాషను మాట్లాడువారే ఆధిపత్యమువహించి తెనుగుదేశము నణగద్రొక్కినందునను తెనుగుభాషయం దెచటను కవిత్వము కానరాలేదు. మనకవులును, పండితులును సంస్కృతభాషాపాండిత్యమునే హెచ్చుగౌరవముతో చూచుచుండుటచేత తెలుగుభాష మ్లేచ్ఛభాషగా చాలకాలము గణింపబడి అలక్ష్యము చేయబడినది. పెద్దపెద్దకవులు, రాజులు తెనుగు నలక్ష్యముగా జూచి సంస్కృతపదభూయిష్ఠమై సామాన్యజనుల కర్థముగాని సంస్కృత పదములు హెచ్చుగ కూడియున్న తెలుగుభాషనే ఆంధ్రభాషయనుచు వచ్చిరి. చిట్టచివరకు తెలుగుభాషలో కవనము వ్రాయవలసివచ్చినపుడు పెద్ద క్షమార్పణ చెప్పుకొనవలసివచ్చెను. తెనుగువారి అందరితరఫున అప్పకవి తన వ్యాకరణమున నీ క్రిందిపద్యమును వ్రాసి లోకమునకు క్షమార్పణ గావించియుండెను.

క. క్షితి మ్లేచ్ఛభాష శ్రుతి గ
ర్హితమగు నట్లైన నీ ధరిత్రిని దానిన్
మఱి రోసి విడువగూడదు
సతతము వ్యవహారహాని సంధిలు కతనన్.

31. కవిత్రయములో నొకరగు యెఱ్ఱాప్రగడ నృసింహపురాణమున భారతకవిత్వస్తుతిజేయుచు తెనుగును, తెనుగువారిని వారిచదువును 'గాసట బీసట' యనియు వెక్కిరించెను.

ఉ. భాసుర భారతార్థముల భంగుల నిక్క మెఱుంగనేరమిన్
గాసటబీసటే చదివి గాథలు ద్రవ్వ తెనుంగువారికిన్
వ్యాసమునిప్రణీత పరమార్థము తెల్లగ జేసినట్టి య
బ్జాసనకల్పులం దలతు నాద్యుల నన్నప తిక్కనార్యులన్.

'గాసట బీసట' యను పదమునకు సంస్కారములేనట్టిదనియు, సలక్షణముగానట్టిదనియు గ్రహించవలెను. తాము తమకుగల అత్యంత భాషాభిమానమును పురస్కరించుకొని 'గాసట బీసట'గ నుండు తెనుగు భాషను సంస్కరించి లక్షణయుక్తముగ జేసి సంస్కృతపదభూయిష్ఠముగ జేసి పామరజనమున కందరానిదిగ జేసి సంస్కృతపండితుల కాదరముగలునట్లు జేసి వ్యాసమునిప్రణీతభారతము నాంధ్రీకరించితిమని వ్రాసికొనిరి. ఇట్లే యింకొక వైయాకరణ పతంజలి త్రిలింగభాషయగు తెలుగుభాషనుగూర్చి వ్రాయుచు,

"త్రిలింగభాషాయాః కోధాతుః కః ప్రత్యయః కిం ప్రాతిపదికమితి భగవతా భాష్యకారేణ క్షేపః కృతః."

ప్రకృతి ప్రత్యయ నిరూపణమైనను లేనట్టి అనాగరికభాషయని ఆక్షేపించిరి. ఇట్లు తెనుగువారే తెనుగుభాషను తెనుగుకవిత్వము నధిక్షేపించిరి. కాని ఆంధ్రుల ప్రాకృతసంస్కృత భాషయొక్క సమ్మేళనమువలన కలిగిన అథఃపతనమునకు చింతించరైరి. మీదుమిక్కిలి

పరభాషాసంకలితమై క్రొత్తగ నేర్పడిన ఆంధ్రభాషనే పైకితెచ్చి తెనుగను పేరును మరచిపోవుటకు యత్నించిరి. కాని రాజరాజుకాలమున రాజు నన్నయ నాహ్వానించి 'తెనుగున' భారతమును వ్రాయుమనుటయు, అందుల కంగీకరించి తెనుగును, ఆంధ్రమును పర్యాయపదములుగ తన భారతగ్రంథమున వాడుటయు సంభవించెను. కాలము జరుగుచు రాగా తెనుగువ్యాకరణములయందును, తెనుగనుపదమునకుబదులు ఆంధ్రమనియే హెచ్చుగ వాడుచు అచ్చ తెనుగును శుద్ధాంధ్రమనియు వాడుచు వచ్చిరి. ఇప్పటికి తెనుగు దేశమంతయు ఆంధ్ర దేశముగను, తెనుగురాజ్యమును ఆంధ్రప్రదేశ్ గను (హిందీభాష అంత్యముతో) మారిపోయి విడిగనున్న తెలంగాణా దేశమునుకూడ ఆంధ్రప్రదేశ్ నందే సంలీనము జేసి తెనుగను పేరునే అంతరింపజేయ జూచుచున్నారు. ఇందులకు తెలుగువారు సంతసించవలెనో, విచారపడవలెనో గ్రహించుట కష్టముగ నున్నది.

32. శాసనములగూర్చి వ్రాయుచు తెనుగు, ఆంధ్రము అను పదముల విచారణలోకి దిగితిని. ఇంక దీనిని వదలి శాసనముల విషయమయి ప్రారంభింతును.

శాసనములు (తరువాయి)

33. మన కిప్పటికి దొరకిన శాసనములలో ప్రథమశాసనము భట్టిప్రోలుశాసనము. ఇది క్రీ.పూ. మూడవ శతాబ్దినాటిది. అమరావతియందు క్రీస్తుకుపూర్వము ఇన్నూరు సంవత్సరముల క్రింద నుండి క్రీ. శ. రెండవశతాబ్దివరకు దొరకియుండెను. అమరావతియందు దొరకిన శాసనములలో నీ క్రింద వ్రాయబడిన

"నా గ బు"

మూడక్షరములుగల శాసన మొకటి కలదు. ఇది బ్రాహ్మలిపియందు చెక్కబడినది. ఇది తెనుగు ప్రత్యయాంతముగల తత్సమపదము. నాగబు నాగంబు = పాము యని యర్థముకలదు. సంస్కృతపదమగు 'నాగ'

తెనుగు ప్రత్యయమగు 'బు'తో కలుపబడినది. సంస్కృతపదములు తెనుగు ప్రత్యయములతో కలుపబడినట్లు కనుబడుచున్నది. 'బు' ప్రథమావిభక్తి ప్రత్యయ మప్పటికే యుండెను. నాగబు, నాగంబు, నాగము. ఇట్లే అద్దంకిశాసనమున కొట్టంబు, కొట్టబు, కొట్టము.

34. కొన్ని తామ్రశాసనములలో ఇవ్వబడిన గ్రామములు, వాటిసరిహద్దులు నిచ్చుటలో కొన్ని తెలుగునామములు కలవు. ఈ పదములన్నియు తెనుగు ప్రత్యయములతో కనుపడుచున్నవి. విభక్తి ప్రత్యయములనో, విభక్తిరూపములనో, విసర్గనో కలుపుకొని సంస్కృత పదములే శాసనములయందు లిఖింపబడినవి. ఈ శాసనములయందలి తెనుగుమాటలనుబట్టి, అప్పటి తెనుగును మనము గ్రహింపవలసి యున్నది. ఇట్టిశాసనములలో తెనుగులిపిలో వ్రాయబడినశాసన మొకటి మన గుంటూరుజిల్లాలోని మైదవోలుగ్రామమున దొరకియున్నది. అది ప్రాకృతశాసనమే.

35. తెనుగులో వ్రాయబడిన శాసనములు ఆరవ శతాబ్దకాలమునాటివి కొన్నిదొరకినవి.

ఆరవ శతాబ్దినాటి తెనుగుశాసనము

స్వస్తిశ్రీ పోటి మహారాజుల్లో శన ఐన్ను టోలి
అణపోతులు రేవణకాలు పుద్దడకాలు ఇచ్చిన పన్నిన
పెన్నారె ఇశరేనికిన్ తేని ఱిచ్చిన వాన్డు పఞ్చ
మహాపాతకున్డకున్

ఆ శతాబ్దినాటిదే 375 A. D. రేనాటి చోళుల ధనంజయవర్మనాటి కళమళ్ల శాసన మింకొకటి కలదు.

1. ...	4. యున్డురేనా	7. రేవణ కాలు (పం)
2. కక్ ముతురా	5. ఞు ఏలన్	8. పు చేనూరు కాజు
3. జు ధనంజ	6. చి ఋంబూలి	9. అళికళా (ఊరి)
		10. డ్డ పారు (ఊరి)

తరువాతిపంక్తులు శిథిలమైనవి. ఈ శాసనములన్నియు నిదివరకు వచనశాసనములనియే పండితులఅభిప్రాయమైయుండెను. ఈ శాసనములను శ్రీయుత నిడుదవోలు వెంకటరావుగారు ఆంధ్రవాఙ్మయ చరిత్రగ్రంథమున వివరించి వ్రాసి వాటి నన్నిటిని వచనశాసనములనియే అభిప్రాయపడియుండిరి. కాని యిటీవల డాక్టరు తాడేపల్లి వెంకటనారాయణశాస్త్రిగారు వీటివిషయములో పరిశోధనగావించి వీటిలో వ్రాయబడినవి కేవలవచనములు కావనియు, పద్యరూపముననే వ్రాయబడినవనియు నభిప్రాయపడిరి. పైనవ్రాయబడిన ధనంజయువర్మ శాసనము ద్విపదయనియు, యిట్లే యింకొకశాసనము తరువోజయనియు, యింకొకటి కందపద్యమనియు, ఇట్లే నెల్లూరుజిల్లాలో దొరకిన యింకొక శాసనము ఉత్సాహము, సీసపద్యములలో వ్రాయబడినదనియు తమ పరిశోధనవలన కనుగొనియుండిరి.

36. ఎనిమిదవ శతాబ్దమున దొరకిన శాసనములు రెండు కలవు. లక్ష్మీపురశాసన మొకటి, అహదనకర శాసన మింకొకటి. ఈ రెంటియందును కొంత తెలుగు కలదు. కాని సరిగ నర్థమగుటలేదు. లక్ష్మీపుర శాసనమున 'మంగి దోగరాజు' పేరు కనుపడుచున్నది. ఈతడు మూడవ విష్ణువర్ధనుని తండ్రి. ఈతడు బెజవాడవద్ద రాజ్యము చేసియుండెను. మంగి యనుపేరు అలివేలుమంగమ్మనుండియే వచ్చియుండును. మంగయ్య, మంగమ్మ యను మనుష్యులపేర్లు మంగినపూడి యను గ్రామము నిట్లేవచ్చియుండవచ్చును. లక్ష్మీపురశాసనము కృష్ణాజిల్లాలోని శ్రీకాకుళమువద్ద దొరకినది. ఈ రెండు శాసనములలో లక్ష్మీపురశాసనమే మొదటిది.

37. తొమ్మిదివశతాబ్దిలోని చెప్పదగిన శాసనములు ధర్మవరం, అద్దంకిలోనివి చాళుక్యలిపిలో లిఖంపబడినవి.

ధర్మవరం శాసనములు

38. ఇవి రెండు. ఇందులో మొదటిది విజయాదిత్యుని నాటిది. రెండవది చాళుక్య భీమరాజునాటిది. మల్లికార్జునుని దేవాలయమున నొక గోడ నానుకొని యున్నది. లిపి చాళుక్యలిపియేగాని భాష తెనుగే. 'గద్యంబుల' యని యుండుటచే కొంత గద్యము వ్రాయబడినట్లు కనిపించుచున్నది. మొదటిశాసనమునందు పద్యము, గద్యము కూడ కలదు. పద్యము సీసపద్యము. సంస్కృతపదములతో మిళితమై యున్నది. ఆద్యంతములు లేవు. శాసనము చక్కగా తెలియుటలేదు. తెలిసినంతవరకు కొన్ని గుళ్లు, మఠములు, ప్రాకారములు నియమింపబడినట్లు కనుపించుచున్నది. క్రిందనుండి పైకి వ్రాయబడినది.

పాండురంగని అద్దంకి శాసనము

39. ఈ శాసనము అద్దంకిగ్రామమున నొక పెరటియందు దొరకినది. శిలబద్దలైనది. అందువలన కొంతభాగము కనుపడుటలేదు. ఇది చాళుక్యలిపిలో వ్రాయబడినది. భాష తెనుగు. మొదటి యెనిమిది పంక్తులు పద్యము. ఇది తరువోజ. తరువాతనాలుగుపంక్తులు గద్యము. 'గర్వము' 'కొట్టము' అనుపదములు 'గర్వఁబు', 'కొట్టఁబు' గా వ్రాయబడినవి. 'బు' యే తరువాత 'ము' గా మారినది. ఈ శాసనము గుణగవిజయాదిత్యుని కాలమునాటిది. అనగా తొమ్మిదవ శతాబ్ది కడపటికాలమున లిఖంపబడియుండవచ్చును. ఇందు పేర్కొనబడిన 'పాండురంగడు' సైన్యాధిపతి. ఇందలి 'కట్టెపుదుర్గము' కతేవరం, 'దమ్మపురం' ధర్మవరము అయివున్నవి. భారతమునకు పూర్వము రెండువందల సంవత్సరముల క్రిందనే పద్యములు వ్రాయబడెనని ధ్రువపరచుట కీశాసనము మిక్కిలి ముఖ్యమైనది. ఈ శాసనమును కీ. శే. కె. వి. లక్ష్మణరావుపంతులుగారు పరిశీలించి యిది మాత్రాగణబద్ధమైనదనియు, ఇందువ్రాయబడినపద్యము తరువోజ యనియు స్థిరపరచిరి. ఇదియే అప్పటి దేశీయకవిత. ఈ శాసనమునందలి పద్యమును ప్రక్కపేజీలో వ్రాయుచున్నాను.

3. పట్టంబుగట్టిన ప్రథమంబునేణ్డు బలగర్వంబొ	పట్టంబు గట్టిన ప్రథమంబు నేడు బలగర్వ మొప్పగ బైలేచినే
4. ప్పిగబై లేచి నేన పట్టంబుగట్టించి ప్రభు	పట్టంబు గట్టించి ప్రభు బండురంగు
5. బణ్డురంగు బణ్చిన సామంత్త పడువతో బోయ	పంచిన సామంత పడువతో బోయ।
6. కొట్టంబల్వగ్గెణ్డు గొణివెంగి నాణ్డిం గొటల్చియు	కొట్టముల్ పండ్రెండు గొని వేంగినాటి
7. త్రిభువనాంకుశ బాణ నిల్పి కట్టెపుదుర్గంబు గడు	గొటల్చియు త్రిభువనాంకుశ బాణ నిల్చి।
8. బయల్సేసి కోణ్డుకూర్బెజవాడ గావించె మెచ్చి	కట్టెపుదుర్గంబు గడబయల్సేసి కందుకూర్బెజవాడ గావించె మెచ్చి।
9. పణ్డరంగు పరమ మహేశ్వరుణ్డు ఆదిత్యబట్టరని	పండురంగు పరమ మహేశ్వరుడు
10. కిచ్చినభూమి ఎనుబది పుట్ల అడ్లు పట్టనేలద	ఆదిత్యభట్టారునికి ఇచ్చిన భూమి ఎనుబది పుట్ల అడ్లు పట్టనేల ధర్మపురంబున।
11. మ్మ పురంబున దమ్మవుల వినిరక్షించినవారికి అశ్వ	ధర్మువులు వీనిని రక్షించినవారికి।
12. మేదంబున ఫలంబు అగు,	అశ్వమేధంబున ఫలం బగు॥

40. కందుకూరునందును పాండురంగని దింకొక శాసనము కలదు. అదియు పరిశీలింపగా సీసపద్యములే కనుపడినవి. అదే శతాబ్దమున కడపమండలమున నింకొక చోళరాజశాసనము కలదు. ఆ శాసనమునందు పద్యములు కనబడుచున్నవి.

యుద్ధమల్లుని బెజవాడశాసనము

41. బెజవాడగ్రామమున నింద్రకీలపర్వతమువద్ద కీ. శే. జయంతి రామయ్యపంతులుగారిచే కనుగొనబడినది. ఇది విష్ణువర్ధనుని కాలపు శాసనమై యున్నది. ఈ శాసనమునందు పేర్కొనబడిన యుద్ధమల్లు డను పేరుగల్గిన రాజు లిద్దరుండిరి. ఇందులో మొదటివారు క్రీ. శ. 814–818 వరకును, రెండవవారు 927–934 వరకును రాజ్యము చేసియుండిరి. ఈ శాసనమునకు సంబంధించిన యుద్ధమల్లుడు రెండవవారనియే నిర్ధారణ గావింపబడెను. ఈ యుద్ధమల్లుడు, మల్లుడనియు పిలువబడుచుండెను. ఈతని తాత మల్లపరాజు. ఈ శాసనముగల స్తంభమునకు నాలుగుప్రక్కలు లున్నవి. మూడుప్రక్కల వ్రాయబడి యున్నది. నాల్గవప్రక్కన 'ఒబ్బు' అని మాత్రమే శాసనమునకు సంబంధించినది. దానిక్రింద కులోత్తుంగచోళదేవుని నలుబది యొకటవ యేట చెక్కంపబడిన అరవభాషలోని శాసనమొకటి కలదు. ఇదిగాక ఈశ్వరభట్ల సోమయాజు లింకొకశాసనము 1165 వ సంవత్సరమున చెక్కించియుండెను. శా. శ. 1097 యుద్ధమల్లుని శాసనము నీ క్రింద పూర్తిగా వ్రాయుచున్నాను.

మొదటి ప్రక్క

1. స్వస్తి నృపాంకు శాత్యన్త వత్స
2. లసత్యత్రినేత్రవిస్తర శ్రీయుద్ధ
3. మల్లుం డనవద్య విఖ్యాతకీర్తి
4. ప్రస్తుత రాజాశ్రయుణ్డు త్రిభు
5. వనాభరణ్డు సకలవస్తు స
6. మేతుండు రాజసల్కి
భూవల్లభు

7. ణ్డద్ధిఁ పరగంగ బెజవాడం గొను
8. మరస్వామికి భక్తుండ్డాగుడి యుని
9. రుపమతి నృపధాముడ్డాత్తిచ్చె
10. నెగిదిచ్చెన్ మఠంబు గొర గల్గా కోరు
11. లిన్దు విడిసి బృందంబుగొనియు
12. ణ్డువారు పరిగాగ యబ్బార
13. నాసి వ్రచ్చినపాపంబు గొ
14. ణ్డు వెలయంగని య్యెట్టుడస్సి
15. మలినఃడై విడిసిన బ్రొ
16. లగల తానపతులును రా
17. జు పట్టంబుగట్టిన పతి

రెండవ ప్రక్క

1. యు నరియంబు య్యారుల
2. వెల్వరించిన నశ్వమేధంబు
3. ఫలం బుపేక్షించి లింగబడి
4. సిన పాపంబు ధమకు జ
5. ననుతచే బ్రోలు నుణ్డి బెజ
6. జాత్రకు వచ్చితి ణ
7. యను సుతుణ్డొణ్డు సోటుమె
8. చ్చక తివిటి యిన్నెలవ
9. యనఘుణ్డసేకొనియిన్దుప్రత్యక్ష
10. బయన్న నిచ్చగని మల్లణ్డె
11. త్తించె గుడియును మఠంబు
12. నుం గా ర్తికేయునకు

మూడవ ప్రక్క

1. రమనతో బెజవాడ కేల
2. బెడంగును రక్షయంగాను
3. న్దమతత మల్లపరాజువే
4. రడు దానం గట్టించెం
5. గ్రమంబున దానికి కలశ బిడ్డ
6. ట్లుగాగ మొగమూడు నమ
7. రంగ శ్రీయుద్ధమల్లు డ్డైత్తిం
8. చె నమిత తేజుండు తన
9. ధమ్మ్మర్గ వొడంబడి కాచ నృపుల కున్ద

నాల్గవ ప్రక్క

1. ంబుణ్డు

42. పై శాసనము పద్యముగ వ్రాయబడినది. ఇది ప్రాచీన కాలమునందు వ్రాయబడిన 'మధ్యాక్కర' యొక్క రూపము. ఇప్పటికి కనుపడినంతవరకు తెనుగులిపిన తెనుగులో వ్రాయబడిన శాసన మిదియే.

ఈ శాసనమువలన నన్నయకు పూర్వమే శతాబ్దకాలముక్రింద పద్యములు వ్రాయబడుచుండెడివనుట స్పష్టము. ఈ శాసనమువలన మనము దెలిసికొనదగు ఇంకొక ముఖ్యవిషయము గలదు. అరవభాషయందిప్పటికి నుండియున్న వింతయక్షర మొకటి మన తెనుగుభాషయందును కొంతకాలము క్రిందవరకు నుండెననియు, అటుపిమ్మటనాయక్షరపు ఉచ్చారణ మారిపోయి ఆ యక్షరము మనభాషనుండి పోయినట్లును తెలియుచున్నది. ఈ అక్షరము కన్నడభాషలోను ఉండి యుండెను.

43. ఈ అరవఅక్షరమునుబోలిన అక్షరము ష్డజ యను ఉచ్చారణగలది యీ శాసనమున మూడుమార్లు గనుపించుచున్నది. దీనిని జయంతి రామయ్య పంతులుగారు 'డ' యను నక్షరముగ వ్రాసియుండిరి. ఈ శాసనమునందే వ్రాయబడిన 'డ' యను నక్షరమునకును, నీ యక్షరమునకును చాల భేదమున్నది. ఇట్టి ఉచ్చారణగల యక్షరము కర్నాటభాషయందుండినట్లు 'కేశిరాజు' వ్రాసిన 'శబ్దమణిదర్పణ' మను గ్రంథమువలన తెలియగలదు. ఈ అక్షర మీ శాసనమునందే గాక యితర పూర్వశాసనములయందును కనుపడుచునే యున్నది. ఈ శాసనమున 'లింగంబడిసిన పాపంబు' యను వాక్యమున 'అడిసిన' యను శబ్దమునందును, మరి రెండుప్రదేశములయందును కనుపడుచున్నది. అడిసిన, అడుపుట యనుమాటలకు 'నశించుట' యను నర్థము చెప్పనగును. ఈ యక్షరమునకుబదులు తెనుగున 'డ' యును, కన్నడమున 'ఱ' యును వాడుకలోనికి వచ్చినట్లు కనిపించుచున్నది. మరికొన్ని ప్రదేశముల నీయక్షరమునకుబదులు బండి 'ఱ' యునుపయోగింపబడినది. ఇతరశాసనములయందు 'తా ఱు గుమ్మసీమ' 'పఱుమటికట్ట' 'ఱుల్లసీమ' 'చోటిమహారాజు' 'ప ఱు వేలు' 'కలుపఱ్ఱు' యనుమాటలయందు కనుబడుచున్నది. ఈ అక్షరమును వేరువేరు భాగముల వేరువేరుగ నుచ్చరించుచుందురు. కొన్నిప్రదేశముల 'ష' వలెను, 'డ' వలెను, 'శ' వలెను ఉచ్చరింపబడుచున్నది.

ఈ అక్షరము అడ్డగీత తలకట్టులేని బండి 'ఱ' వలె నున్నది. ఈ యక్షరము మళయాళభాషయం దిప్పటికిని గలదు. కన్నడమున పదియవ శతాబ్దివరకు నుండెను. తెనుగున 'ఎఱు వేల', 'ఏడు వేల' గను, 'పఱుమటి' 'పడుమటి' గను, 'చోఱమహారాజు' 'చోడమహారాజు' గను, 'తాఱికొండ' 'తాడికొండ' గను, 'మేఱాంబ' 'మేడాంబ' గను మారినవి.

ఎడువాడలపాలెపుశాసనము (1018)

44. ఈ శాసనము పూర్తిగ నాంధ్రభాషయం దున్నది. ఇది విమలాదిత్యుని కాలపునాటిది. ఇది యర్నగూడెంతాలూకాలో ఎడువాడలవద్ద దొరకినది. ఈ శాసనమునందు చెప్పబడిన భూభాగము బెజవాడతాలూకాలోని కొండపల్లివద్దనున్న కొలూరు గ్రామమై యున్నది. ఈ శాసనమునందలి

రెండవ రేఖ

కృష్ణపక్షం నవమీ ఆదిత్యవారం స్వస్తిశ్రీమ
తు మళయాళపతియున్న చోడయరాజులు పడవాలు
నడపనేయకు అగ్రహారంబుల (తో) డి పాడి యిచ్చు
అగ్రహారంబ కానుగద చెఱున్నలు దయచేసి యి
చ్చిన శాసనము పూర్వతః పొంగట్టూరిసీమ
మసీమం నైరుత్యతః క(వు)లూఱి సీమమసీమం
దక్షిణతః గణఱి విడిసీమ మసీమం ఆగ్నేయతః;
రెంగుల బెఱువుసీమ మసీమం పశ్చిమతః పోతిపూణ్డి

45. పైన ముఖ్యమగుశాసనముల కొన్నిటి నుదాహరించితిని. వీటినిబట్టి నన్నయకు పూర్వమే ఛందస్సుండెననియు, పద్యములను వ్రాసెడువారనియు నిరూపించుటకు వీలు కలుగుచున్నది. అయితే

అప్పటికి కవు లెవరో, వారెట్టి గ్రంథములు వ్రాసిరో వివరము లెవ్వియు మనకు తెలియుటలేదు. కాని కావ్యరచనయే చెప్పుట మాత్రము అతిసాహసము. రాజాదరణ లేకుండుటచే కవిత్వము విపులముగ వ్రాయ బడి యుండలేదనిమాత్ర మూహించవచ్చును.

44. పైన వ్రాయబడిన పద్యములనుబట్టియు, శాసనములను బట్టియు ఆనాటి భాషావిశేషములను గొన్నిటిని మనము గ్రహించ వచ్చును. ఆ విషయమును గూర్చియు కొద్దిగ వ్రాసి యీ విషయము నింతటితో పూర్తి చేయుదును.

45. కొన్ని శాసనములయందు గ్రామనామములు గలవు. ఆ గ్రామముల చివర 'పఱ్ఱు' 'కుఱ్ఱు' 'ఊరు' 'ప్రోలు' 'వాడ' 'వాటి' 'కొలను' 'పల్లి' 'పూణ్డి' మొదలయిన పదములు గలవు.

పఱ్ఱు	కుఱ్ఱు	ఊరు	ప్రోలు	వాడ
పాంబఱ్ఱు	కొండికుఱ్ఱు	మ్రొంతుకూరు	మల్లప్రోలు	తొండివాడ
కొంబఱ్ఱు	మండకొఱ్ఱు	కాంతలూరు	కొల్లిప్రోలు	కాకండివాడ
నిడుంబఱ్ఱు		క్రోనూరు	చేంబ్రోలు	
మొసంబఱ్ఱు	వాటి	చెఱువు	పల్లి	పూండి
దిగంబఱ్ఱు	గృధ్రవాటి	కలంచెరువుల	చెరుకుంబల్లి	పెనుంబూండి
	ద్రోణవాటి	రొండిచెరువుల	పెసరుంబలి	వడ్లంబూండి
		మహాదేవచెరువు		

కొన్నిపదములలోని 'ండి' పదము 'ణి' గా మారినది.

'కొండికి' 'కొణికి' గను, 'పండిదం' 'పణిదం' గను మారినవి.

'కాకండి' 'కాకాని' గను, 'కాకండివాడ' 'కాకినాడ' గను మారినవి.

మనుష్యులపేర్లు పూర్వము 'ఇయ' యను అంతముతో నుండెడివి : 'నన్నియ' 'దోచియ' 'కోటియ'. ఇపుడు 'ఇయ' 'అయ' గా మారినది : 'నన్నయ' 'దోచయ' 'కోటయ' గా మారినవి. పూర్వము 'బండి ఱ' హెచ్చుగ వాడబడెడిది. అది తరువాత 'డ' గ మారినది. 'వాణ్డు' 'వాడు' 'మూణ్డు' 'మూడు' అయినవి.

పూర్వము అడ్డగీటులేని బండి ఱ ఉండెడిది. ఇదియే ఇప్పటి అరవ భాషలోనున్న వింతఅక్షరము 'ఴ' ఇప్పుడీ యక్షరము లేదు. ఆకాలమున అనునాసికాక్షరములు హెచ్చుగ వాడబడుచుండెడివి. అప్పటి అనునాసికయే యిప్పటి పూర్ణానుస్వారము అర్ధానుస్వారముగను మారినది. 'డక్కల పూణ్డి' 'వన్దగిరి' 'సమ్పన్నుణ్డు'.

బహువచనమునందు యిప్పటి 'లు' కు బదులు 'ళు' హెచ్చుగ వాడబడెడిది.

46. పైన వ్రాయబడిన శాసనములన్నియు తెనుగుభాష ప్రాకృత సంస్కృతములతో సంకలితమైనపిమ్మటనే లిఖింపబడినవి. అందువలన నిజమైన అనగ అచ్చ తెనుగుమాటలు ఈ శాసనముల యందు కనుపించవు. అట్టివి మనకు గోచరము కావలయునన్న క్రీ.పూ. మూడవ శతాబ్దమునాటికి పూర్వపుశాసనములును మనము చూడగలము. కాని అట్టిశాసనము లింతవరకు ఎచటను కనుపడియుండలేదు. అందువలన అచ్చ తెనుగెట్లుండునో తెలిసికొనుట కష్టసాధ్యము. అయితే యిదివరలో సూచించినట్లు మన ఆడువారు పాటలలోగాని, అమ్మవార్లను స్తుతించు గేయములలోగాని, పిల్లలను నిద్రపుచ్చుటకు ఆడించుటకు పాడబడెడు జోల లాలిపాటలలోగాని అచ్చ తెనుగు రూపములు కనిపించవచ్చును. అట్టి విప్పటికి వాడుకయందు కనుబడుచున్నవి గాని అవి యెప్పుడు సృష్టింపబడినవో కనుగొనుట కష్టతరము. ఈ విషయమునుగూర్చి వ్రాయుచు టేకుమళ్ల రాజగోపాలరావుగా రిట్లు వ్రాసియుండిరి.

The many Telugu proverbs that are handed over to us, are poetic in structure full of rhyme and alliteration. They must have formed the popular portion of a pre-Aryan Telugu poetry. Some of the songs that

ఇప్పటికి మనకు సాంప్రదాయముగ వచ్చుచున్న కొన్ని సామెతలు నియమబద్ధములై పదలాలిత్యము, ప్రాసతో కూడినపద్యములబోలు పదములైయున్నవి. ఇది ఆర్యులు రాకపూర్వము జనామోదకరమైన కవిత్వ సాంప్రదాయములోనివై యుండవలెను. ఇప్పుడు వాడబడు

have come down to us such as the కుర్చ్పుల కథ and the Kameswari, (అక్కల) పాట are in the Ahavalpa metre of Tamil and their scansion is not possible until the Tamils are used. Songs like Rishula Asramamulu, Ramapattabhishekam and Sita surati are in the Taruvoja metre which is simply a line of Ahavalpa doubled and is in Tamil called the 'Yenzir Kadanedil Asiriya Virutam'. Several of them such as the 'Varasa patalu' do not contain a single Sanskrit word. A civilised and an enterprising nation like the Andhras which stood foremost in all the cultural arts cannot be supposed to have no poetry of its own. The survival of this Dravidian element in Telugu prosody even after an overpowering Aryan influence and the firm impression of a Dravidian prasam even on the Telugu Aryan metres could not have been possible if no Telugu poetry existed before.

చున్నట్టి కుర్చ్పులకథ, అక్కలపాటలు మొదలైనవి అరవభాషలోని అహవల్ప వృత్తములై పదవిభజన చేయుటకు కొంతవరకు అరవ భాష తెలిసికొనవలసి యున్నది. ఋషుల ఆశ్రమములు, రామపట్టాభిషేకం, సీత సురటి యను పాటలు తరువోజ వృత్తములో వ్రాయబడినవై యున్నవి. అరవదేశమున అహవల్ప వృత్తమే కొంత మార్చి అరవము లో యెంజీర్ కడనెడిల్ ఆసిరియ త్తం అనెడిదే యీ తరువోజవృత్తము. వరసపాటల యందున్న, వాటిని బోలిన మరికొన్ని పాటలయందున్న బొత్తుగ సంస్కృత పదములే కనుపడవు. శతాబ్దముల కాలమునుండి కళావికాసములలో విజృంభించి మిక్కిలి సాహస పరాక్రమములు గలిగి మంచినాగరికతను పొందిన ఆంధ్ర జాతియందు బొత్తిగా సాహిత్యవిజ్ఞానమే లేదనుట యూహించతగిన విషయమే కాదు. పూర్వము తెలుగు కవిత్వమే లేనిచో తెనుగు ఛందస్సునందు అరవ ఛందస్సంబంధ ముండుటగాని, అరవదేశమునందలి ప్రాసయొక్క ప్రభావమునకు తెనుగుకవిత్వమునకు సంపర్కము కలుగుటకాని జరిగియుండుటకు సావకాశము లేదు.

47. సంస్కృత ప్రాకృతములు ప్రబలినపిమ్మట వ్రాయబడిన వాటియందు తెనుగుపదములు నశించినవి. మన పూర్వపు ఛందస్సునందు చంపకమాల, ఉత్పలమాల మొదలైనవి కనుపడవుగాని

నియమబద్ధములై యతిప్రాసలతో కూడుకొని చదువుటకు సులభముగను, వినుటకు శ్రావ్యముగను మనోహరముగనుండు గీత, సీస, మధ్యాక్కర పద్యములు మాత్రము శాసనములయందు కనిపించినవి. ఇట్టివి కన్నడ భాషయందును నుండి యుండెను. మధ్యాక్కర వృత్తమును కన్నడ భాషయందు 'కిరియక్కర' మనెడు వారు. ఈ విషయము తొమ్మిదవ శతాబ్దినాటి 'నృపతుంగ' యనువారు వ్రాసిన గ్రంథము నందును, నాగవర్మ యనువారు వ్రాసిన లాక్షణిక గ్రంథము నందును కనిపించును. ఇట్టి వృత్తమే భారతమునందును మధ్యాక్కరగా వ్రాయబడెను. ఈ మధ్యాక్కరనుగురించి తరువాతివారు తెలిసికొన లేకుండినను పద్యములను మాత్రము మార్చుటకు యత్నించలేరు. అయితే ఆధునికులలో కొందరు అర్ధశతాబ్ది క్రింద నీ పద్యములను మార్చుటకు యత్నించగా పత్రికలయందు కొంతచర్చ జరిగెను. 'శశిరేఖ' యను పత్రికయందు దీని విషయమై కీ. శే. ఓరుమళ్ళ రాజగోపాలరావుగారు కొన్ని వ్యాసములను వ్రాసినపిమ్మట నీ పద్యములను మార్పు చేయక ప్రచురణకర్తలు ఆ మధ్యాక్కరలనే యథావిధిగ ప్రచురించిరి.

48. అరవభాషయందు 'యాప్పిరంగలమ్' అను ఛందో గ్రంథము పదునొకండవ శతాబ్దినాటి దుండెడిది. అందు తెనుగు ఛందస్సును గూర్చి ప్రస్తావించుచు 'వాంఛియార్ శయ్యాదవడగు చందవు' అను వాంచియార్ రచించిన తెనుగు ఛందస్సు గ్రంథమును చూచి తాను ఛందస్సును గురించి వ్రాసినట్లు చెప్పుకొనియున్నాడు. ఈవడగు గ్రంథము వాంచియారు వ్రాసెనని చెప్పబడినది. ఈ వాంచియారెవరో తెలియకున్నది. పుస్తకమున్ను లేదు. 'దాచియార్' నకును పొరబడి యుండవచ్చునా? అట్లైన దేచనయను కవి యొకరు వ్రాసిన 'కవిజనాశ్రయ' మను గ్రంథమై యుండవచ్చును.

49. ఇదివరలో స్త్రీలు పాడెడు పాటలపేరు చెప్పియుంటిని. వాటిలో కొంత అచ్చతెలుగు కనుపడునని పండితు లభిప్రాయపడి యుండిరి. అట్టిపాటలను కొన్నింటి నిచట మచ్చు కుదాహరించెదను.

నా గు ల పా ట

1. నాగా దిగురా నాయనా దిగురా
కోమలి పుట్టలో కోడెనాగన్నా
యేపాకు మిరియాలు తీపయ్యాయ్యంగల్లో
తీపై పె కారణంబు దాటనాగన్నా
నాగన్న దిగురా నా తండ్రి దిగురా.
2. కంటిలో నల్లన్న కనిగుడ్డు మెర్రన్న
కలిచి విషంపోసి మరిచిపండావు
నాగాదిగురా నాయనా దిగురా.
3. శుక్రవారంనాడు సూర్యగ్యానంబట్టె
అమ్మనూ మాని మరిగావు సుందరి నాగ
నాగా దిగురా నాయనా దిగురా.
4. నిండు పున్నమి దినము పండువెన్నెల్లో
చంద్రగ్యానంపట్టె మరునాడు
యిల్లాలు ముగ్గాగొట మల్లెలో జల్లించి
కాలాలు ఆడబోయె కోడి నాగన్న
నాగా దిగురా నాయనా దిగురా.
5. నాగల్లు పంచమీనాడు నరూలు అందారువచ్చి
అమ్మా పుటాకాడికి వెళ్లి మేకూపూజాచేసి కొలిశేరు
సందరినాగా
నాగా దిగురా నా తండ్రి దిగురా.

2. శ్రావణ మంగళవారపు పాట

ఏడు యింద్రగణములు ఒక అక్షరము

ఈశ్వర పుత్రునకు గజావతారునకు
పార్వతీ తనయునకు భక్తితోను
వాకుశుద్ధి నిచ్చు వైభోగ రామునకు
శారదాంబకు నేను సన్నుతింతు.

3. శ్రావణశుక్రవారపు పాట

కైలాస గిరిలోను కల్పవృక్షముక్రింద
ప్రమథాది గణములు కొలువగాను
పార్వతీ పరమేశులు బాగుగా కూర్చుండ
పరమేశు నడిగెనే పార్వతపుడు
ఏ వ్రతము సంపదలు ఎలమితోడుత నిచ్చు
ఏ వ్రతము కామితార్థము లొసంగు
ఏ వ్రతము పుత్రపౌత్రాభివృద్ధి నొసంగు
అనుచును పార్వతి అడిగె హరుని
కుండిన అనియేటి పట్నంబు లోపల
చారుమతి అనియేటి చాన కలదు
అత్తమామలసేవ అతిభక్తితో చేసి
పతిభక్తి కలిగుండు భాగ్యశాలి.

3. కుచ్చెల కథ

రత్నాల మొలనూళ్ల రవణి యందెలు మ్రోయ
రవికుల రామన్న జోజో
పచ్చల వుంగరాలు బలుపులు మెరయగా
భరతు రక్షించంగ జోజో.

4. కుచ్చెల కథ

వీణాస్వరముకన్న తీరైన కంఠము — లవ కుమారా
బుడమ పండ్లకన్నా తీరైన బుగ్గలు — లవ కుమారా
దొండ పండ్లకన్నా తీరైన పెదవులు — లవ కుమారా
శంఖావర్తముకన్న తీరైన నీ చెవులు — లవ కుమారా
నిండుచంద్రునికన్న తీరైన వదనము — లవ కుమారా

5. సీతాకల్యాణము

పచ్చలు కెంపులు పరగనీలములు
హెచ్చయిన వజ్రాలు ఎలమి సంధించి

ఆణిముత్యపుకుచ్చు లమర సందులను
రాణింపుగా గూర్చి నాణెంబు గాను
బిరబిరా మామిడి చిగురుతోఁ గూర్చి
మురపున తోరణంబులను గట్టుచును
గోవజవ్వాదిని గోడలకు పూసి
వించి కర్పూర పట్టెలను బెట్టి

6. లక్ష్మణదేవర నవ్వు

వెన్నెల బైలనే వేలసంఖ్యలను
గద్దెలు పెట్టించి కరణాకరుల్లు
అఖిలాండకోటి బ్రహ్మాండనాయకులు
కోసలేంద్రులంత కొలువుకూర్చుండి

7. మోచేతి పెద్దమ్మ నోముపాట

మోచేతి పెద్దమ్మ పట్టేటి వేళ
మొగ్గల్లు తామరలు పూసేటి వేళ
బీరాయి పూవుల్లు పూసేటి వేళ
బిందెలతో ఉదకమ్ము తెచ్చేటి వేళ
కాకరా పూవుల్లు పూసేటి వేళ
కడవలతో ఉదకమ్ము తెచ్చేటి వేళ
గుమ్మడాలు పువ్వుల్లు పూసేటి వేళ
గుండెలతో ఉదకమ్ము తెచ్చేటి వేళ

8. అక్కలపాట

మనమాడి పాడంగ మనకాము వెలసె

9. వరసపాట

అత్తగారివమ్మ ఆరడి సేయకమ్మ
వత్తులు వత్తకమ్మ వత్తిగి యుండవమ్మ.

10. పిల్లలను ఆడించు పాటలు

దాగుడు మూత దండాకోరు
పిల్లీ వచ్చె ఎలుక బాదు
ఎక్కడి దొంగ లక్కడె.

ఋగ్వేదమునందున్న నాల్గుగణములే-
అగ్ని మీళే పురో హితం

50. పైన వ్రాయబడిన పాటలు సులభముగా అర్థవ వేసికొనుటకు వీలుగనే యున్నవి. వీరిపాటలయందు ఫణతి నేర్పరచుటకు అక్షరములను హ్రస్వములుగ గాని, దీర్ఘములుగగాని జేసి, కొన్ని యక్షరములను ద్విత్వములను జేసియో, లుప్తపరచియో చెవుల కింపుగ నుండునట్లుచేసి సంస్కృతపదములనే సామాన్య వాడుకభాషలో వ్రాసి యున్నవేగాని అనుకున్నంత అచ్చ తెనుగుమాటలు కనిపించుటలేదు.

51. రాజగోపాలరావుగారు వ్రాయుటలో మనకు వాడుకగా అనేక శతాబ్దములనుండియు వాడుకలోనికి వచ్చిన కొన్ని సామెతలు చూపులకు వచనములుగా కనబడుచున్నను అవియు కొంత ప్రాసతో కూడుకొని నియమబద్ధములై యేర్పడినట్లుగనే కనుపించుచున్నవి. అందులో కొన్నిటి నిచట ఉదాహరించెదను.

1. వరుసగాని దాని వరుసలాడేవు
   పాపిష్టి నీశిరస్సు భగ్నమైపోను
2. తెల్లన్న తెల్లన్న తెల్లన్నయేమి
   వరుసతప్పినవాని వలికి తెల్లన్న
3. కుడుములా పిండని గుద్దుకోకండి
   ఇరుగు పొరుగుల్లార యిది మంగ్గండి
4. చవితి చవితంటేను సంబరాల్పడితి
   నా సవితి గాదమ్మ నాగుల్లచవితి
5. బాపనారక్కలకు యేమేమి సొమ్ము
   అడుగడుగు స్నానాలు తడిబట్టలు
6. కోమటారక్కలకు యేమేమి సొమ్ము
   వడ్లగింజసొమ్ము వళ్ళంతదుమ్ము